
'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 | వెల: ₹ 5.50 | సంపుటి: 15 | సంచిక: 353

బుధవారం 15-3-2023


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



చీరకట్టులో వరల్డ్ టూర్..
9 గజాల నౌవారీ చీరలో బైక్‌పై 40 దేశాలు చుట్టి రానున్న రమాబాయి. - 11లో




నాలుగోరోజూ నష్టాలే..
5నెలల కనిష్టానికి నిఫ్టీ.. 58వేల దిగువకు సెన్సెక్స్. - 13లో




పార్లమెంట్‌లో గందరగోళం
బ్రిటన్‌లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై పార్లమెంట్ ఉభయ సభలు వరుసగా రెండో రోజు కూడా స్తంభించాయి.
- వివరాలు 6లో▶



అమెరికా డ్రోన్‌ను ఢీకొట్టిన..
నల్ల సముద్రంపై అంతర్జాతీయ ఎయిర్ స్పేస్‌లో అమెరికా నిఘా డ్రోన్‌ను రష్యాకు చెందిన ఎస్‌యూ–27 ఫైటర్ జెట్ ఢీకొట్టింది.
- వివరాలు 6లో▶



ఇమ్రాన్ నివాసం వద్ద ఉద్రిక్తత
తోషాఖానా కేసులో ఇమ్రాన్ ఖాన్‌ను అరెస్ట్ చేయడానికి ఆయన ఇంటికి చేరుకున్న పోలీసులపై ఇమ్రాన్ మద్దతుదారుల రాళ్లదాడి.
- వివరాలు 6లో▶



ఏనుగమ్మ.. ఏనుగు...
మనుషులకు– ఏనుగులకు మధ్య ఘర్షణ ఎందుకు? దేశంలో గజరాజుల సంరక్షణకు ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి? ప్రత్యేక కథనం..
- వివరాలు 6లో▶

న్యూస్‌రీల్

'మార్గదర్శి'పై ఈడీ విచారణ చేపట్టాలి




మార్గదర్శి చిట్స్‌కు సంబంధించి గతంలో రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ తనకిచ్చిన సమాచారాన్ని సీబీడీకి పంపుతున్నానని.. ఆ వివరాలను 'ఈడీ'కి పంపి విచారణ చేపట్టాలని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ కోరారు. రామోజీరావు తప్పుచేశాడని తాను నిరూపిస్తానని.. చేసిన తప్పు ఒప్పుకునే ధైర్యం రామోజీకి ఉందా? అని ప్రశ్నించారు.
- వివరాలు 10లో▶

రూ. 300 కోట్ల ప్రాజెక్టుకు రూ. 3,500 కోట్లా..



మంచిప్ప ప్రాజెక్టులో కేవలం కమీషన్లు దండుకునేందుకే సీఎం కేసీఆర్ 3.5 టీఎంసీలకు సామర్థ్యం పెంచారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రూ.3,500 కోట్లు వెచ్చించి దోపిడీ చేసేందుకే డిజైన్లు మార్చారని ఆయన విమర్శించారు.
- వివరాలు 14లో▶

నోట్ల రద్దు అట్టర్ ఫ్లాప్: హరీశ్‌రావు



పెద్ద నోట్ల రద్దు అట్టర్ ఫ్లాప్ అయిందని... ఈ నిర్ణయం వల్ల దేశానికి రూ. 5 లక్షల కోట్ల నష్టం వాటిల్లిందని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. పెద్ద నోట్ల రద్దు, దాని పర్యవసానాలపై ప్రధాని మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.
- వివరాలు 14లో▶

లీక్.. షేక్!

ప్రకంపనలు సృష్టిస్తున్న పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ల లీక్ వ్యవహారం

తీగ లాగుతుంటే కదులుతున్న డొంక | లోతైన దర్యాప్తునకు 'సిట్' ఏర్పాటు..

- అన్ని పరీక్షలకూ అంటుకుంటున్న మకిలి!
- గ్రూప్–1 పరీక్ష లీక్‌పైనా అనుమానాలు
- అదనపు పోలీస్ కమిషనర్ ఏఆర్ శ్రీనివాస్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు
- ప్రభుత్వంపై విపక్ష పార్టీల మండిపాటు
- సర్వీస్ కమిషన్ కార్యాలయ ముట్టడికి విద్యార్థులు, నిరుద్యోగుల యత్నం
- లీకులపై సుదీర్ఘంగా సమావేశమై చర్చించిన కమిషన్
- భవిష్యత్ పరిణామాలపై నిరుద్యోగుల్లో ఆందోళన



మంగళవారం టీఎస్‌పీఎస్సీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, నిరుద్యోగులు

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారం దుమారం రేపుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. దీనికి సంబంధించి మంగళవారం పలు కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. లీకేజీపై లోతైన దర్యాప్తు కోసం కేసును నగర అదనపు పోలీస్ కమిషనర్ ఏఆర్ శ్రీనివాస్ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) అప్పగించారు. శ్రీనివాస్ వెంటనే బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి కేసుకు సంబంధించిన రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు పేపర్ల లీక్‌పై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ స్పందించారు. దీనిపై రెండురోజుల్లో నివేదిక ఇవ్వాలని టీఎస్‌పీఎస్సీని ఆదేశించడం ద్వారా ఈ విషయాన్ని తాను కూడా సీరియస్‌గా తీసుకుంటున్నాననే సంకేతాలిచ్చారు. ఇంకోవైపు విపక్ష కాంగ్రెస్, బీజేపీలు రాష్ట్ర ప్రభుత్వంపై, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌పై తీవ్ర స్థాయిలో ఆరోపణలు గుప్పించడంతో లీకేజీ వ్యవహారం రాజకీయ రంగును పులుముకుంది. టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్ని పరీక్షల పేపర్లు లీకయ్యాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వ్యాఖ్యానించారు. గ్రూప్–1 పేపర్ సైతం లీకయ్యిందనే అనుమానాలు
మిగతా 2వ పేజీలో ▶

48 గంటల్లో నివేదిక ఇవ్వండి



- టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రశ్న పత్రాల లీకేజీ వ్యవహారంపై గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనపై 48 గంటల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శిని ఆదేశించారు. - 2లో

పరీక్షల నిర్వహణ యథాతథం..



- షెడ్యూల్ ప్రకారమే అర్హత పరీక్షలు నిర్వహించేందుకు టీఎస్‌పీఎస్సీ సిద్ధమే: చైర్మన్ జనార్దన్‌రెడ్డి
- కేవలం ఏఈ ప్రశ్నపత్రమే లీకైనట్లు స్పష్టమైన ఆధారాలున్నాయి - 3లో

గ్రూప్–1లో 'ప్రావీణ్యం'!



- 150కి 103 మార్కులు సాధించిన ప్రవీణ్
- ఆఫీసుకు ఒక్కరోజు కూడా సెలవు పెట్టని 'లీకువీరుడు'
- ఆ పరీక్ష పేపర్‌నూ తస్కరించాడా? అనే అనుమానాలు
- ఓఎంఆర్ షీట్ సరిగ్గా నింపలేక పోవడంతో డిస్క్వాలిఫై
- గురుకుల పరీక్ష పేపర్ల అంశంపైనా అనేక సందేహాలు
- ప్రత్యేక దర్యాప్తు బృందానికి కేసు బదిలీ - 2లో

నిఘా లేదు.. సర్వర్ లేదు!

- కీలకమైన టీఎస్‌పీఎస్సీలో 'సెక్యూరిటీ'లోపాలు
- డేటా రక్షణ వ్యవస్థ లేదని వెల్లడి
- ప్రశ్నపత్రాలు పెన్‌డ్రైవ్‌లో సేవ్ చేసుకున్న ప్రవీణ్

- వివరాలు 2లో▶

తేనె పూసిన కత్తులు!

- వలపు వలలో చిక్కితే అంతే సంగతులు
- అన్ని రంగాలకూ విస్తరిస్తున్న హనీ ట్రాప్‌ల ముప్పు
- గతంలో రక్షణ రంగానికే పరిమితమైన హనీ ట్రాప్‌లు
- ఇప్పుడు తమకు కావాల్సిన పని చేయించుకునేందుకూ వలలు
- సోషల్ ప్రొఫైలింగ్ ద్వారా బలహీనతలు గుర్తిస్తున్న కి'లేడీ'లు
- టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఉదంతంలోనూ హనీ ట్రాప్!
- ముందే గుర్తించవచ్చంటున్న సైబర్ క్రైమ్ నిపుణులు



- వివరాలు 2లో▶

నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు

గ్రూప్స్ లీకేజీ నేపథ్యంలో అప్రమత్తం.. అణువణువు పరిశీలించాలని ఆదేశాలు
అనుమానాస్పద కదలికలపై ఆరా.. ఉన్నతాధికారులతో నవీన్ మిత్తల్ ప్రత్యేక టెలి కాన్ఫరెన్స్

సాక్షి, హైదరాబాద్: గ్రూప్స్ పేపర్ లీకేజీ నేపథ్యంలో ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా చూడాలని ప్రభుత్వం ఆదేశించింది. గత కొన్ని నెలలుగా ఇంటర్ బోర్డులో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఈసారి పరీక్షలపై అప్రమత్తత అవసరమని ఇంటెలిజెన్స్ వర్గాలు సూచించినట్టు తెలిసింది. దీంతో పరీక్షల నిర్వహణపై బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్ మంగళవారం సాయంత్రం ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. అన్ని జిల్లాల కలెక్టర్లకు అవసరమైన సూచనలు చేశారు. ఇంటర్ బోర్డ్‌కు ప్రత్యామ్నాయ వ్యవస్థ నడుస్తోందని కొన్ని నెలల క్రితం ఇంటర్ బోర్డ్ కార్యదర్శి మిత్తల్ సందేహం వెలిబుచ్చారు. డేటా ట్యాంపరింగ్ జరిగిందని పోలీసులకు బోర్డ్ గతంలో ఫిర్యాదు చేసింది. ప్రైవేటు ఇంటర్ కాలేజీలతో బోర్డ్‌లోని కొంత మంది అధికారులే కలిసి పనిచేస్తున్నారనే అనుమానాలతో కొంతమందిని కీలకమైన స్థానాల నుంచి తప్పించారు. ఈ ఏడాది నుంచి ఆన్‌లైన్ మూల్యాంకన చేపట్టాలని నిర్ణయించడం, దీన్ని కొంతమంది ఆక్షేపిస్తూ వివాదాస్పదం చేసే ప్రయత్నాలు చోటుచేసుకున్నాయి. ఇవన్నీ పరీక్షల నిర్వహణలో అప్రమత్తతను సూచిస్తున్నాయి.

పేపర్ల పంపిణీ దగ్గర్నుంచి...
డేటా చోరీ వ్యవహారం తెరమీదకొచ్చిన తర్వాత ఇంటర్ బోర్డ్‌లో ప్రతీ వ్యవహారంలోనూ ఆచితూచి అడుగులేస్తున్నారు. కీలకమైన అంశాలపై చర్చించేందుకు ముఖ్యులను మాత్రమే
మిగతా 3వ పేజీలో ▶

సమస్యలుంటే కాల్ చేయండి
ఇంటర్ విద్యార్థులకు బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్ సూచన

అందుబాటులో 040-24601010, 040-24655027 ఫోన్ నంబర్లు - 3లో



ధరణిపై పోరు ఇక 'ఉధృతం'

క్షేత్రస్థాయిలో భూరక్షక్‌లను సిద్ధం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ
నాలుగు జిల్లాల కార్యకర్తలకు గాంధీభవన్‌లో పూర్తయిన శిక్షణ
రైతు పేరిట ప్రత్యేకకార్డు జారీ.. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా గ్రామ అదాలత్‌లు

సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్‌పై పోరాటాన్ని ఉధృతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతోంది. 'మన భూమి–మన హక్కు' పేరిట రైతులకు ప్రత్యేకంగా ధరణి కార్డులు జారీ చేస్తూ తాము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామంటూ హామీ ఇస్తోంది. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే ప్రయత్నాలను ముమ్మరం చేసింది. ధరణి సమస్యలపై గ్రామస్థాయిలో అదాలత్‌లు నిర్వహించేందుకు పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'భూరక్షక్'లకు మంగళవారం గాంధీభవన్‌లో శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. జనగామ, హనుమకొండ, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల కార్యకర్తలు ఈ శిక్షణకు హాజరయ్యారు. దీనికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, సీనియర్ నేతలు హర్కర వేణుగోపాల్, అద్దంకి దయాకర్, సామా రామ్మోహన్‌రెడ్డి తదితరులు హాజరు కాగా, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ, సీనియర్ నాయకురాలు వరలక్ష్మి, సి.శ్రీనివాస్‌లతోపాటు సాంకేతిక, న్యాయనిపుణులు భూరక్షక్‌లకు శిక్షణనిచ్చారు.

14 అంశాలతో వివరాల సేకరణ: శిక్షణలో భాగంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధానాన్ని భూరక్షక్‌లకు వివరించారు. ఇందుకోసం యాప్‌ను ఉపయోగించే విధానం గురించి అవగాహన కల్పించారు. ధరణి పోర్టల్ ద్వారా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల సమస్యలు, 14 అంశాలతో కూడిన వివరాలను ఆ యాప్‌లో నమోదు చేయాలని భూరక్షక్‌లకు సూచించారు. ఈ మేరకు ప్రత్యేక కార్డులు యాప్‌లోనే రూపొందుతాయని, వీటిని రైతులకు అందజేయడంతో సమస్య నమోదు ప్రక్రియ పూర్తవుతుందని వెల్లడించారు. శిక్షణ అనంతరం డాక్టర్ నీలిమ మాట్లాడుతూ త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాల భూరక్షక్‌లకు శిక్షణనిస్తామని, అన్ని గ్రామాల్లో ధరణి అదాలత్‌లు నిర్వహించేందుకు షెడ్యూల్‌ను కూడా త్వరలోనే ఖరారు చేస్తామని వెల్లడించారు.


ఇదండీ సంగతి



ఏ దేశంలో ఉన్నాయని ఎలా చెప్పగలుగుతాం సార్! అన్ని దేశాల నుంచి మనకు 'ఫండ్స్' వస్తున్నప్పుడు!!

నిత్యావసర మార్కెట్లోకి మార్క్‌ఫెడ్!

- డ్రైఫ్రూట్స్, పప్పులు, బియ్యం విక్రయాలు
- తాగునీటి ట్రీట్మెంట్ ప్లాంట్ల ఏర్పాటుపై దృష్టి
- నాలుగు జిల్లాల్లో వాణిజ్య సముదాయాలు
- ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటు
- రాష్ట్ర మార్క్‌ఫెడ్ సూత్రప్రాయ నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: అప్పుల్లో కూరుకుపోయిన మార్క్‌ఫెడ్ నిత్యావసర సరుకుల మార్కెట్లోకి అడుగుపెట్టాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. తద్వారా ఉనికిని కాపాడుకోవాలని, సంస్థను లాభాల బాట పట్టించాలని యోచిస్తోంది. అందుకు సంబంధించి పలు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వ ఆమోదానికి పంపించింది. అలాగే ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చేందుకు వీలుగా పలు కమిటీలను ఏర్పాటు చేసింది.

ఆదాయం తగ్గి.. నష్టాలు పెరిగి..

వాస్తవానికి మార్క్‌ఫెడ్ రైతుల నుంచి మొక్కజొన్న, కంది, పెసర, శనగ తదితర పంటలను కొనుగోలు చేస్తుంది. మద్దతు ధరకు వాటిని కొనుగోలు చేయడం ద్వారా కమీషన్ వస్తుంది. అలాగే యూరియా, డీఏపీ వంటి ఎరువులనూ రైతులకు విక్రయిస్తుంది. ఇలా రెండు మార్గాల్లో వచ్చే కమీషనే దీనికి ప్రధాన ఆదాయ వనరు. అయితే కొన్నేళ్లుగా పంటలు మద్దతు ధర కంటే ఎక్కువే పలుకుతుండటంతో మార్క్‌ఫెడ్‌కు ప్రధాన పంటలను కొనే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో ఆదాయ వనరులు తగ్గాయి. మరోవైపు గతంలో కొనుగోలు చేసిన మొక్కజొన్న వంటి పంటలను తిరిగి మార్కెట్లో తక్కువ ధరకు అమ్మడంతో నష్టాలు
మిగతా 5వ పేజీలో ▶

ఆఖరి ఆయకట్టు అంతేనా?

ఎండుతున్న సాగర్ ఆయ'కట్'

- పాలేరుకు ఇన్‌ఫ్లో తగ్గడంతో దిగువకు అందని నీరు
- అధికారుల ప్రణాళికా లోపంతో రైతులకు ఇక్కట్లు
- ఆందోళనకు దిగుతున్న రైతాంగం



ఖమ్మం జిల్లా తల్లాడ మండలం రేజర్లలో సాగర్ నీరందక ఎండిపోయిన వరి పొలం

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: నాగార్జునసాగర్ చివరి ఆయకట్టు ఎండిపోతోంది. జలవనరుల శాఖ అధికారుల ప్రణాళికా లోపంతో ఆఖరి ఆయకట్టుకు నీరు చేరక సత్తుపల్లి, వైరా, మధిర ప్రాంతాల్లో వరి, మొక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయి. ఇంకో నెలన్నరలో పంటలు చేతికి రావాల్సి ఉన్న వేళ ఈ పరిస్థితితో రైతుల్లో ఆందోళన నెలకొంది.

సాగర్ జలాలు వస్తాయని..
ఖమ్మం జిల్లాలో 2,54,270 ఎకరాల సాగర్ ఆయకట్టు ఉంది. ఈ ఆయకట్టు పరిధిలో యాసంగిలో 2,23,545 ఎకరాల సాగుకు 33.61 టీఎంసీల నీరు అవసరమని అధికారులు లెక్కలు వేశారు. గత ఏడాది డిసెంబర్ 15నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 14 వరకు మొత్తం 29.067 టీఎంసీల నీటిని వారబందీ విధానంలో విడుదలకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇక ఐడీసీ స్కీమ్స్ కింద 1.880 టీఎంసీలు, భక్తరామదాసు, వైరా ప్రాజెక్టు నుంచి 2.663 టీఎంసీల నీరు అందుబాటులో ఉంటుందని భావించారు. కానీ ఇటీవల పాలేరుకు ఇన్‌ఫ్లో భారీగా తగ్గడంతో చివరి ఆయకట్టు భూములకు సరిగ్గా నీరు అందక పంటలు ఎండిపోతుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. బోనకల్ బ్రాంచి కెనాల్, సిరిపురం మేజర్ కాల్వ పరిధిలో ఈ పరిస్థితి తీవ్రంగా ఉంది.

నీటి కోసం ఎదురుచూపులు..
పాలేరు జలాశయంలో నీరు లేకపోవడంతో దిగువకు నీటి విడుదల సాఫీగా సాగడం లేదు. తల్లాడ మండలం సిరిపురం మేజర్ కాల్వ పరిధి
మిగతా 5వ పేజీలో ▶

ప్రణాళికా లోపం..
ఏప్రిల్ వరకు నీటి సరఫరా ఉంటుందని అధికారులు ప్రకటించడంతో రైతులు పంటల సాగు చేపట్టారు. కానీ నాగార్జునసాగర్ ప్రాజెక్టు అధికారుల ప్రణాళికా లోపంతో ఫిబ్రవరిలోనే నీటి కటకట ఏర్పడింది. అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తే చివరి ఆయకట్టుకు కూడా కొంత మేర నీరు అందేది. ప్రస్తుతం పాలేరుకు ఇన్‌ఫ్లో తగ్గగా.. ఇటీవల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జలవనరుల సలహా మండలి సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. ఆ మేరకు ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో 5వేల క్యూసెక్కులను పాలేరు రిజర్వాయర్‌కు విడుదల చేస్తామని ఉన్నతాధికారులు హామీ ఇచ్చినా పూర్తిగా నెరవేరలేదు. ఒకటి, రెండు రోజులకే ఇన్‌ఫ్లో తగ్గడంతో పాలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం మళ్లీ 16 అడుగులకు చేరింది.

26న మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ బహిరంగ సభ

భారీగా పార్టీలోకి చేరికలు..
ఎన్సీపీ నేతలతో కేసీఆర్ మంతనాలు



సాక్షి, హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్)లోకి మహారాష్ట్రకి చెందిన వివిధ పార్టీల నేతల వలసలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 26న మహారాష్ట్రలోని కాందార్ లోహాలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఇప్పటికే నాందేడ్‌లో భారీ బహిరంగ సభ జరిపిన బీఆర్‌ఎస్ పార్టీకి ఇది మహారాష్ట్రలో రెండో సభ కానుంది. మంగళవారం ఆ రాష్ట్రానికి చెందిన మహారాష్ట్ర నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)కి చెందిన పలువురు సీనియర్లు ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరేందుకు ముందుకు వచ్చారు. మహారాష్ట్ర సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే, ఎన్సీపీ కిసాన్ సెల్ అధ్యక్షుడు శంకరన్న ధోంగే, మాజీ ఎమ్మెల్యే నాగనాథ్ గిసేవాడ్ (ఈయన భోకర్ నియోజకవర్గం నుంచి మాజీ సీఎం అశోక్ చౌహాన్ మీద కేవలం వెయ్యి ఓట్ల తేడాతో ఓడిపోయారు), ఎన్సీపీ నాందేడ్ జిల్లా అధ్యక్షుడు దత్తా పవార్, మహారాష్ట్ర ఎన్సీపీ యూత్ సెక్రటరీ శివరాజ్ ధోంగే, ఎన్సీపీ నాందేడ్ అధ్యక్షుడు శివదాస్ ధర్మపురికర్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు మనోహర్ పాటిల్ భోసికర్, ఎన్సీపీ అధికార ప్రతినిధి డాక్టర్ సునీల్ పాటిల్, లోహ ప్రాంత అధ్యక్షుడు సుభాష్ వాకోరే, కాందార్ అధ్యక్షుడు దత్తా కరమాంగే, జిల్లా పరిషత్ సభ్యులు అడ్వొకేట్ విజయ్ ధోండగే, ఎన్సీపీ యూత్ ప్రెసిడెంట్ హన్మంత్ కళ్యాంకర్, ప్రవీణ్ జాతేవాడ్, సంతోష్ వార్కాడ్, స్వాప్నిల్ ఖీరే తదితరులు హైదరాబాద్‌లో కేసీఆర్‌తో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే, నాందేడ్ ఇన్‌చార్జి జీవన్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

క్లుప్తంగా...

'ఉపాధి' రద్దు దిశగా కేంద్రం అడుగులు: ఎర్రబెల్లి



సాక్షి, హైదరాబాద్: ఉపాధి హామీ విషయంలో కేంద్రం అనుసరిస్తున్న వైఖరి వల్ల కూలీలకు పని దొరకని పరిస్థితి ఏర్పడుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దుయ్యబట్టారు. ఈ పథకాన్ని క్రమేణా రద్దు చేసే దిశగా కేంద్రంలోని బీజేపీ సర్కార్ అడుగులు వేస్తోందని ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇప్పటికే పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల్లో ఉపాధి హామీని రద్దు చేసిందని, ఇతర రాష్ట్రాల్లోనూ అనేక ఆంక్షలతో దీనిని కొనసాగిస్తోందని పేర్కొన్నారు. లోక్‌సభలో బీఆర్‌ఎస్ ఎంపీలు రంజిత్‌రెడ్డి, మాలోత్ కవిత అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి చెప్పిన సమాధానంపై తీవ్రంగా స్పందించారు. 'గత రెండేళ్లలో కేంద్రం బడ్జెట్లోనే రూ.55 వేల కోట్లు కోత విధించింది. ఒకవైపు పనిదినాలు తగ్గిపోతున్నాయి. మరోవైపు పని దినాల ద్వారా వచ్చే మెటీరియల్ కాంపోనెంట్ కూడా తరిగిపోతుంది. దీంతో రాష్ట్రాల్లో, దేశంలో అభివృద్ధి కుంటుపడుతోంది'అని మంత్రి పేర్కొన్నారు.

భవిష్యత్తు అంతా బీఆర్‌ఎస్‌దే..

మంగళవారం పాలకుర్తి నియోజకవర్గంలోని దేవరుప్పుల మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు రెడ్డిరాజుల నరసయ్య, రెడ్డిరాజుల సోమయ్య మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ బీజేపీతో ఒరిగేదేమీ లేదని, కాంగ్రెస్ పార్టీ ఖతమయ్యే దిశలో ఉందని, భవిష్యత్తు అంతా బీఆర్‌ఎస్‌దేనని అన్నారు. మన గ్రామాలు దేశంలోనే అగ్రగామిగా నిలిచి, అనేక ర్యాంకులు, అవార్డులు, రివార్డులు రావడంలోనూ డీపీవోల కృషి మరువలేమన్నారు. మంగళవారం డీపీవోల సంఘం డైరీని మంత్రి ఆవిష్కరించారు.

'అంధకారంలో లక్షలాదిమంది భవిత'

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీతో లక్షలాది మంది నిరుద్యోగుల భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిపోయిందని జాతీయ మానవ హక్కుల సంఘం సభ్యుడు గన్నారపు శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. అమరవీరుల త్యాగాలతో తెచ్చుకున్న బంగారు తెలంగాణలో ఇలాంటి సంఘటనలు జరగడం దారుణమని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రశ్నపత్రం లీకులకు ప్రధాన కారకుడైన నిందితుడు ప్రవీణ్, ఇతరులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పెరిగిన పీజీ మెడికల్ నీట్ కటాఫ్

సాక్షి, హైదరాబాద్: పీజీ మెడికల్ నీట్ ఫలితాలు మంగళవారం విడుదల అయ్యాయి. దేశవ్యాప్తంగా దాదాపు 2.08 లక్షల మంది పరీక్ష రాయగా, తెలంగాణలో దాదాపు 7 వేల మంది హాజరైనట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు వెల్లడించాయి. ఈసారి పరీక్ష పేపర్ సులువుగా వచ్చినందున గతం కంటే ఎక్కువ మంది అర్హత పొందారని చెబుతున్నారు. గతేడాది (2022–23) నీట్ పీజీ మొత్తం 800 మార్కులు కాగా, జనరల్/ఈడబ్ల్యూఎస్ కేటగిరీలో కటాఫ్ మార్కులు 275. జనరల్ దివ్యాంగులకు 260 కటాఫ్, ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు 245 కటాఫ్‌గా నిర్ణయించారు. కాగా, ఈసారి జనరల్/ఈడబ్ల్యూఎస్‌లో కటాఫ్ మార్క్ 291 కాగా జనరల్ దివ్యాంగుల్లో 274, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కేటగిరీలో 257 కటాఫ్‌గా నిలిచింది. దేశవ్యాప్తంగా 65 వేలు ఎండీ, ఎంఎస్ సీట్లు, 10 వేలు డీఎన్‌బీ సీట్లు ఉండగా. తెలంగాణలో దాదాపు 2,700 వరకు పీజీ మెడికల్ సీట్లున్నాయి. దేశవ్యాప్తంగా లక్ష ర్యాంకు వచ్చిన వారికి కూడా సీటు వస్తుందని కాళోజీ వర్గాలు వెల్లడించాయి. కాగా, పీజీ మెడికల్ కౌన్సిలింగ్ జూలై నెలలో ప్రారంభం కానుంది. ఆగస్టులో తరగతులు మొదలవుతాయని కాళోజీ వర్గాలు వెల్లడించాయి.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి
టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై బండి సంజయ్ డిమాండ్ –14లో..

లీక్.. షేక్!

▶ మొదటి పేజీ తరువాయి

వ్యక్తమవుతుండటం గమనార్హం. ఇక టీపీసీసీ చీఫ్ రేవంత్ ప్రభుత్వ తీరును తప్పుబడుతూ విమర్శనాస్త్రాలు సంధించారు. టీఎస్‌పీఎస్సీని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చబట్టే అవకతవకలు జరుగుతున్నాయంటూ ధ్వజమెత్తారు. ఇదిలావుండగా.. పలు రాజకీయ పార్టీల కార్యకర్తలు, విద్యార్థులు, నిరుద్యోగులు మంగళవారం టీఎస్‌పీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. ఒకదశలో టీఎస్‌పీఎస్సీ బోర్డును పెకిలించేందుకు ప్రయత్నించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు జోక్యం చేసుకోవడంతో పరిస్థితి సద్దుమణిగింది. తాజా పరిణామాల నేపథ్యంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ కూడా కదిలింది. పేపర్ లీకేజీ ఘటనపై ప్రత్యేకంగా మూడు గంటలకుపైగా సమావేశమై చర్చించింది. ఇంటి దొంగలే గొంతు కోశారంటూ కమిషన్ చైర్మన్ బి.జనార్దన్‌రెడ్డి వ్యాఖ్యానించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే పలు టీఎస్‌పీఎస్సీ పరీక్షలు రాసిన, ఇతర పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల్లో మాత్రం.. ఈ పేపర్ లీకేజీ వ్యవహారం ఎంత దూరం వెళుతుందో, ఎలాంటి వాస్తవాలు బయటకు వస్తాయో, ఏయే పరీక్షలు రద్దవుతాయో, కమిషన్ ఏం నిర్ణయాలు తీసుకుంటుందో, తమ భవిష్యత్తు ఏమవుతుందోననే ఆందోళన వ్యక్తమవుతోంది.

తేనె పూసిన కత్తులు!

వలపు వలలో చిక్కితే అంతే సంగతులు

గతంలో రక్షణ రంగానికే పరిమితమైన హనీ ట్రాప్‌లు

అన్ని రంగాలకూ విస్తరిస్తున్న హనీ ట్రాప్‌ల ముప్పు

సోషల్ ప్రొఫైలింగ్ ద్వారా బలహీనతలు గుర్తిస్తున్న కి'లేడీ'లు

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఉదంతంలోనూ హనీ ట్రాప్!

ముందే గుర్తించవచ్చంటున్న సైబర్ క్రైమ్ నిపుణులు



హనీట్రాప్ (వలపు వల). ఎదుటి వారిని తమ వైపు ఆకర్షింపజేసుకుని, తమకు కావాల్సిన పని చేయించుకునేందుకు యువతులు/యువతుల పేరిట కేటుగాళ్లు వాడుతున్న అస్త్రం. గతంలో దేశ సరిహద్దుల రక్షణలో ఉండే కీలక అధికారులను లొంగ తీసుకునేందుకు శత్రుదేశాల గూఢచారులు ఈ విధమైన వల విసిరేవారు. ఇప్పుడిది అన్నిరకాల పనులకూ విస్తరిస్తోంది. తాజాగా టీఎస్‌పీఎస్సీ టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ పేపర్ లీకేజీ ఉదంతంలో కూడా ఇదే తరహాలో టీఎస్‌పీఎస్సీ సిబ్బందిని ట్రాప్ చేసినట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే ఈ విధమైన వలపు వలలను ముందుగానే గుర్తించవచ్చని, తగిన జాగ్రత్తలు పాటిస్తే చిక్కుల్లో పడకుండా తప్పించుకోవచ్చని సైబర్ భద్రత నిపుణులు చెబుతున్నారు. నిత్యం సోషల్ మీడియా అకౌంట్లు వాడుతున్న ప్రతి ఒక్కరూ సోషల్ ప్రొఫైలింగ్‌కు గురికాకుండా జాగ్రత్త పడాలని హెచ్చరిస్తున్నారు.


ఇటీవల జరిగిన కొన్ని హనీ ట్రాప్‌లు

భారతీయురాలి పేరిట పాక్ నుంచి వాడుతున్న ఓ ఫేస్‌బుక్ అకౌంట్‌తో.. సరిహద్దుల్లో సున్నితమైన ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న భారత సైన్యంలోని 60 మంది జవాన్లు టచ్‌లో ఉన్నట్టు మిలటరీ ఇంటెలిజెన్స్ గుర్తించింది.

పాకిస్తాన్ ఐఎస్ఐ ఏజెంట్ల హనీ ట్రాప్‌లో చిక్కుకుని క్షిపణుల తయారీకి సంబంధించిన కీలక సమాచారాన్ని చేరవేశాడన్న ఆరోపణలపై డీఆర్‌డీఎల్ కాంట్రాక్టు ఉద్యోగి దుక్క మల్లికార్జున్ రెడ్డిని 2022 జూన్‌లో రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు.

పాకిస్తాన్ ఏజెంట్ల హనీ ట్రాప్‌లో చిక్కి భారత నౌకాదళ సమాచారాన్ని పాకిస్తాన్‌కు చేరవేస్తున్న 13 మంది ఇండియన్ నేవీ అధికారులను ఏపీ ఇంటెలిజెన్స్, నేవీ ఇంటెలిజెన్స్ అధికారులు సంయుక్త ఆపరేషన్‌లో పట్టుకున్నారు. వీరందరినీ అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

హనీ ట్రాప్‌లు.. ఎన్నో రకాలు



సోషల్ మీడియా ఆధారిత ట్రాప్‌లు: అందమైన యువతుల ఫొటోలు, పేర్లతో ఫేక్ ప్రొఫైల్స్ క్రియేట్ చేసి వాటిని సోషల్ మీడియా ఖాతాల్లో ఉంచడం ద్వారా పలువురిని ట్రాప్ చేస్తున్నారు.



ఆన్‌లైన్ వీఓఐపీ కాల్స్ (ఇంటర్నెట్ కాల్స్)తో వల: వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రొటోకాల్ (వీఓఐపీ) టెక్నాలజీ ఆధారిత కాల్స్ చేసి హనీ ట్రాప్‌కు పాల్పడతారు. తర్వాత వాట్సాప్, ఇతర యాప్స్ ద్వారా వ్యక్తిగత, వృత్తిపరమైన సమాచారం సేకరిస్తారు.

ఇన్‌స్టంట్ మెసేజ్ ప్లాట్‌ఫాంల ద్వారా: ఆన్‌లైన్‌లో రియల్ టైం టెక్స్ట్ చాటింగ్ యాప్‌ల ద్వారా మెసేజ్‌లు పెడుతూ పరిచయం పెంచుకుని సైబర్ నేరగాళ్లు వలపు వలలోకి దించుతారు.



అశ్లీల వెబ్‌సైట్‌ల ఆధారిత హనీ ట్రాప్‌లు: అశ్లీల వెబ్‌సైట్లు, అశ్లీల వీడియోలు, ఫొటోల లింక్‌లు పంపి, వాటి ద్వారా ఎదుటి వారిని లోబరుచుకుంటారు.

ఈ మెయిల్‌లో లింక్‌ల ద్వారా..: ఈ మెయిల్స్‌లో లింక్‌లు పంపుతారు. క్రమంగా పరిచయం పెంచుకుని కావాల్సిన కీలక సమాచారాన్ని సేకరిస్తారు.

డేటింగ్ యాప్‌లతో: డేటింగ్ యాప్‌లలో నగ్న వీడియో కాల్స్, ఫొటోలు పంపి ఆకర్షిస్తారు. ఎదుటి వారి నగ్న వీడియోలు, ఫొటోలు సేకరించి ఆ తర్వాత బ్లాక్ మెయిల్ చేస్తారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- అపరిచితుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు అంగీకరించవద్దు.
- పనిచేసే కార్యాలయం వివరాలు, వృత్తి పరమైన అంశాలు సోషల్ మీడియా ఖాతాల్లో పంచుకోవద్దు.
- మిలటరీ, పోలీస్, ఇతర కీలక ఉద్యోగాల్లో ఉండేవారు వారి వృత్తిపరమైన సమాచారం, ఫొటోలు సోషల్ మీడియా ఖాతాల్లో పెట్టకపోవడమే ఉత్తమం.
- సోషల్ మీడియా ఖాతాల్లో వచ్చే పోర్న్ వీడియో లింకులను ఓపెన్ చేయవద్దు.

సోషల్ ప్రొఫైలింగ్ అంటే ఏమిటి?

సైబర్ నేరగాళ్లు, తమకు అనుకూలంగా ఇతరులను మార్చుకోవాలనుకునే వారు సోషల్ ప్రొఫైలింగ్ ద్వారా టార్గెట్స్‌ను ఎంచుకుంటున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ట్విట్టర్ వంటి సోషల్ మీడియా ఖాతాలను విరివిగా వాడేవారికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు, కుటుంబ, వృత్తి సంబంధిత వివరాలను వీరు సేకరిస్తారు. వాటి ద్వారా ఎదుటివారి బలహీనతలపై ఒక అంచనాకు వస్తారు. దాని ఆధారంగా వలపు వలలోకి లాగుతారు.

అలా అడిగితే అనుమానించాల్సిందే



హనీ ట్రాప్‌ల ముప్పు పెరుగుతోంది. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు అంగీకరించవద్దు. మన వ్యక్తిగత, వృత్తిపరమైన సున్నిత సమాచారం అడుగుతున్నారంటే అనుమానించాలి. వెంటనే అలాంటి సోషల్ మీడియా ఖాతాలు బ్లాక్ చేయాలి. వారిని అన్‌ఫ్రెండ్ చేయాలి. అవసరమైతే పోలీసుల్ని సంప్రదించాలి.

– పాటిబండ్ల ప్రసాద్, సైబర్ ఇంటెలిజెన్స్ నిపుణుడు, ఢిల్లీ

48 గంటల్లో నివేదిక ఇవ్వండి

టీఎస్‌పీఎస్సీ కార్యదర్శికి లేఖ రాసిన గవర్నర్ కార్యాలయం



సాక్షి హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన నియామక పరీక్షల ప్రశ్న పత్రాల లీకేజీ వ్యవహారంపై రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనపై 48 గంటల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ మేరకు గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ ఆదేశాల మేరకు రాజ్‌భవన్ కార్యాలయం మంగళవారం టీఎస్‌పీఎస్సీ కార్యదర్శికి లేఖ రాసింది. లేఖలో సమగ్ర విచారణకు ఆదేశించి, లీకేజీపై వివరణాత్మక నివేదికను కోరింది. అభ్యర్థుల భవిష్యత్తును కాపాడేందుకు ఇటువంటి దురదృష్టకర ఘటనలు పునరావృతం కాకుండా దిద్దుబాటు చర్యలను తీసుకోవాలని, లీకేజీ బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

నిఘా లేదు.. సర్వర్ లేదు!

కీలకమైన టీఎస్‌పీఎస్సీలో 'సెక్యూరిటీ' లోపాలు

- డేటా రక్షణ వ్యవస్థ లేదని వెల్లడి
- ప్రశ్నపత్రాలు పెన్‌డ్రైవ్‌లో సేవ్ చేసుకున్న ప్రవీణ్
- కాన్ఫిడెన్షియల్ సెక్షన్ ఉన్న రెండో అంతస్తులో ఒక్క కెమెరా లేని వైనం
- సర్వర్ ఆధారిత నెట్‌వర్క్ కూడా లేదు



సాక్షి, హైదరాబాద్: అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్), ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ పరీక్ష పత్రాల లీకేజ్ వ్యవహారాన్ని దర్యాప్తు చేస్తున్న పోలీసులు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)లో ఉన్న అనేక సెక్యూరిటీ లోపాలను గుర్తించారు. దీనిపై ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించాలని నిర్ణయించారు. పరీక్ష పేపర్లను దొంగిలించిన టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వ్యక్తిగత సహాయకుడు పి.ప్రవీణ్ కుమార్ వాటిని తన పెన్‌డ్రైవ్‌లో సేవ్ చేసుకున్నాడు. అందరికీ దాని యాక్సెస్ లేకుండా చేయడానికి డేటా లాక్ చేసి ఉంచాడు. దీన్నిబట్టి చూస్తే టీఎస్‌పీఎస్సీ తన డేటా రక్షణ కోసం ఈ మాత్రం చర్యలు కూడా తీసుకోలేదని స్పష్టమవుతోంది. కార్యాలయంలో నిఘా వ్యవస్థ, కంప్యూటర్లకు సర్వర్ లేకపోవడం విస్మయపరుస్తోంది.

గేటు వద్దనే యాక్సెస్ కంట్రోల్..

టీఎస్‌పీఎస్సీలోనికి వెళ్లే వారిని కేవలం గేటు వద్ద, ఆ తర్వాత గ్రౌండ్ ఫ్లోర్‌లోనే ఆపి ప్రశ్నించే అవకాశం ఉంది. ఈ రెండు ప్రాంతాలు దాటి ముందుకు వెళ్లిన వ్యక్తి.. ఎక్కడకు వెళ్తున్నాడు? ఎవరిని కలుస్తున్నాడు? తదితరాలు పరిశీలించే అవకాశం కమిషన్‌లో లేదని పోలీసులు గుర్తించారు. కమిషన్ ప్రాంగణంలోని అనేక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఉన్నా వాటిలో కొన్ని సరిగ్గా పని చేయట్లేదు. పరీక్ష పత్రాలు ఉండే కాన్ఫిడెన్షియల్ సెక్షన్ రెండో అంతస్తులో ఉంది. అయితే అక్కడ ఒక్క కెమెరా కూడా లేదు. దీంతో సెక్షన్‌లోకి ఎవరు వచ్చారు? ఎందుకు వచ్చారు? ఎవరిని కలిసారు? అనేది సాంకేతికంగా గుర్తించే అవకాశం లేకుండా పోయింది.

సర్వర్ లేకపోవడంతో నిఘా కరువు...

లక్షల మంది జీవితాలను ప్రభావితం చేసే పరీక్షలు నిర్వహించే టీఎస్‌పీఎస్సీలో దాదాపు 130 వరకు కంప్యూటర్లు ఉన్నాయి. వీటికి ఇంటర్‌నెట్ కనెక్షన్‌తో పాటు పెన్‌డ్రైవ్ యాక్సెస్ కూడా ఉంది. సాధారణంగా ఇలాంటి విభాగాల్లో కంప్యూటర్లను ల్యాన్ ద్వారా కనెక్ట్ చేయరు. పెన్‌డ్రైవ్ యాక్సెస్ కూడా ఇవ్వకుండా సర్వర్ ఏర్పాటు చేసుకుని దాని ఆధారంగానే నెట్‌వర్క్ నిర్వహిస్తారు. ఇలా చేస్తే ఎవరు ఏ కంప్యూటర్ ద్వారా ఎలాంటి పనులు చేస్తున్నారు అనేది తేలిగ్గా గుర్తించవచ్చు. కమిషన్‌లో ఇలాంటి వ్యవస్థ లేకపోవడం లీకు వీరులకు కలిసి వచ్చింది. మరోపక్క సైబర్ దాడులు, కంప్యూటర్ సేఫ్టీ, పాస్‌వర్డ్స్, యూజర్ ఐడీల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. ఇలా ఏ అంశం పైనా సిబ్బందికి కనీస అవగాహన కూడా లేకపోవడం గమనార్హం.

సైబర్ ఆడిటింగ్ ఉన్నట్లా..? లేనట్లా..?

టీఎస్‌పీఎస్సీ లాంటి కీలక సంస్థలకు అనునిత్యం సైబర్ ఆడిట్ నిర్వహించాల్సిన అవసరం ఉంది. సాధారణంగా తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్ (టీఎస్‌టీఎస్) ఆధీనంలోని నిపుణులు క్రమం తప్పకుండా దీన్ని నిర్వహించాలి. అక్కడి కంప్యూటర్లు, సర్వర్లు, ఫైర్ వాల్స్ తదితరాలను పరీక్షించి సమకాలీన సైబర్ దాడులు తట్టుకోవడానికి అవి సిద్ధంగా ఉన్నాయా? లేదా అన్నది తేల్చి నివేదిక ఇవ్వడంతో పాటు అవసరమైన సిఫారసులు కూడా చేయాల్సి ఉంది. అయితే ఈ ఆడిట్ జరుగుతోందా? సిఫారసులు చేస్తున్నారా? చేస్తే కమిషన్ పట్టించుకుంటోందా? తదితర అంశాలు జవాబులేని ప్రశ్నలుగానే మిగిలిపోయాయి. ఫోరెన్సిక్ నివేదిక వస్తేనే లీకేజీలపై స్పష్టత వచ్చే పరిస్థితి నెలకొంది.

టీఎస్‌పీఎస్సీ కార్యాలయం ముట్టడికి యత్నం

- పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన
- ఉద్యోగ నోటిఫికేషన్ల పరీక్షపత్రాల లీకేజీపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్



టీఎస్‌పీఎస్సీ కార్యాలయ బోర్డును ధ్వంసం చేస్తున్న బీజేవైఎం కార్యకర్తలు

గన్‌ఫౌండ్రీ/చిక్కడపల్లి: పలు ఉద్యోగ నోటిఫికేషన్లకు సంబంధించిన పరీక్షపత్రాల లీకేజీని నిరసిస్తూ పలు విద్యార్థి సంఘాలు మంగళవారం నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించాయి. మంగళవారం కార్యాలయం వద్ద బీజేవైఎం, తెలంగాణ విద్యార్థి జనసమితి, ఎస్ఎస్‌యూఐకి చెందిన విద్యార్థులతోపాటు బీఎస్పీ కార్యకర్తలు ఆందోళనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య కొద్దిసేపు తోపులాట జరిగింది. బీజేవైఎం కార్యకర్తలు టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీజేవైఎం కార్యకర్తలు గేట్లపైకి ఎక్కి టీఎస్‌పీఎస్సీ కార్యాలయం బోర్డును ధ్వంసం చేశారు. పరిస్థితి ఉద్రిక్తతంగా మారుతుండటంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాశ్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వ పెద్దల కనుసన్నల్లోనే ప్రశ్నపత్రాల లీకేజీ జరిగిందని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగాలపై ఎన్నో ఆశలు పెట్టుకున్న నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్రప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, కార్యదర్శుల నిర్లక్ష్యంతోనే లీకేజీలు జరుగుతున్నాయని తెలంగాణ విద్యార్థి జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ వినోద్‌కుమార్ ఆరోపించారు. తక్షణమే టీఎస్‌పీఎస్సీ చైర్మన్, కార్యదర్శులను తొలగించాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ ఘటనకు సంబంధించి 9 మంది బీజేవైఎం కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు.

కదం తొక్కిన నిరుద్యోగ అభ్యర్థులు

ఇటీవల టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పరీక్షల నిర్వహణ లీకేజీ వ్యవహారంపై నిరుద్యోగులు ఆందోళనకు దిగారు. మంగళవారం చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షల కోసం చదువుతున్న వందలాది మంది అభ్యర్థులు నినాదాలు చేస్తూ లైబ్రరీ ఎదుట రోడ్డుపై బైఠాయించారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వరకు వెళ్లి దాదాపు గంటన్నరపాటు బైఠాయించారు. వారికి టీజేఎస్ అధినేత ప్రొఫెసర్ కోదండరామ్ సంఘీభావం ప్రకటించారు. టీఎస్‌పీఎస్సీ పరీక్షలన్నీ రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

సత్వరమే ఉద్యోగ నియామకాలు

పెండింగ్ అంశాలను పరిష్కరించి నోటిఫికేషన్లు ఇవ్వాలి: సీఎస్ శాంతికుమారి



సాక్షి, హైదరాబాద్: వివిధ శాఖల ఉద్యోగ నియామకాల పురోగతిని తెలిపేందుకు ప్రత్యేకంగా డ్యాష్ బోర్డును ఏర్పాటు చేసి నిరంతరం సమీక్షించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. సర్వీసు అంశాలు, రోస్టర్ పాయింట్లు, రిజర్వేషన్లకు సంబంధించిన పలు శాఖలలో పెండింగ్ అంశాలను తక్షణమే పరిష్కరించి ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్లు జారీ చేయాలని ఆదేశించారు. ఉద్యోగ నియామకాలపై బీఆర్‌కేఆర్ భవన్‌లో మంగళవారం ఆమె ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా 17,516 పోస్టులకు నోటిఫికేషన్ జారీ కాగా, ఇప్పటికే ప్రాథమిక పరీక్షలు పూర్తి చేశామని, ఏప్రిల్‌లో రాత పరీక్షలు పూర్తి చేసి సెప్టెంబర్‌లోగా నియామకాలు జరుపుతామని సీఎస్ పేర్కొన్నారు. రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా 10 వేల పోస్టులకు సెప్టెంబర్‌లోగా నియామక ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఈ భేటీలో జీఏడీ కార్యదర్శి శేషాద్రి, ఆర్థిక శాఖ కార్యదర్శులు శ్రీదేవి, రోనాల్డ్ రోస్, టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్, టీఎస్ఎల్‌పీఆర్‌బీ చైర్మన్ శ్రీనివాసరావు, వర్సిటీ కామన్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి పాల్గొన్నారు.

గ్రూప్‌–1లో 'ప్రావీణ్యం'!

150కి 103 మార్కులు సాధించిన ప్రవీణ్

- ఆఫీసుకు ఒక్కరోజు కూడా సెలవు పెట్టని 'లీకువీరుడు'
- ఆ పరీక్ష పేపర్‌నూ తస్కరించాడా? అనే అనుమానాలు
- ఓఎంఆర్ షీట్ సరిగ్గా నింపలేకపోవడంతో డిస్‌క్వాలిఫై



నిందితులను కోర్టులో హాజరుపరచడానికి తీసుకొస్తున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) పరీక్షలకు సంబంధించిన పేపర్ల లీకేజీ అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ నేపథ్యంలోనే లీకేజీ వ్యవహారంలో సూత్రధారులు, పాత్రధారులు, గతంలో జరిగిన ఉదంతాల నిగ్గు తేల్చేందుకు కేసును ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) నగర పోలీసులు బదిలీ చేశారు. అదనపు సీపీ (నేరాలు) ఏఆర్ శ్రీనివాస్ నేతృత్వంలో ఈ కేసు దర్యాప్తు జరగనుంది. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏఏ పరీక్షల పేపర్లు లీక్ అయ్యాయి? గతంలోనూ ఇలా జరిగాయా? తదితర అంశాలపై సిట్ లోతైన దర్యాప్తు జరపనుంది. మరోవైపు ప్రశ్నపత్రాల లీక్ కేసులో తొమ్మిది మంది నిందితులకు నాంపల్లి కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు రేణుకను చంచల్‌గూడ మహిళ జైలుకు మిగతా ఎనిమిది మందిని చర్లపల్లి జైలుకు తరలించారు. పోలీసులు మంగళవారం జ్యుడీషియల్ రిమాండ్‌కు (చంచల్‌గూడ జైలుకు) తరలించారు. వీరిని తమ కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు వీలుగా పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించారు. ఇలావుండగా ఈ కేసులో నిందితుడు గత అక్టోబర్‌లో గ్రూప్‌–1 పరీక్ష రాయడం, 150కి ఏకంగా 103 మార్కులు సాధించడం అనుమానాలకు తావిస్తోంది.

ప్రవీణ్ ఓఎంఆర్ షీట్ వైరల్

టీఎస్‌పీఎస్సీలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ హోదాలో కమిషన్ కార్యదర్శికి వ్యక్తిగత సహాయకుడిగా పని చేస్తున్న పులిదిండి ప్రవీణ్ కుమార్ గతేడాది అక్టోబర్‌లో జరిగిన గ్రూప్‌–1 పరీక్ష రాశాడు. కానీ పరీక్షకు ప్రిపేర్ కావడానికి కనీసం ఒక్కరోజు కూడా సెలవు పెట్టలేదు. అయినా మొత్తం 150 మార్కులకు గాను ఏకంగా 103 సాధించాడు. దీంతో ఆ పేపర్‌ను కూడా తస్కరించాడా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఓఎంఆర్ షీట్‌ను నింపడంలో చేసిన పొరపాటు కారణంగా ప్రవీణ్ డిస్‌క్వాలిఫై అయ్యాడు. టీఎస్‌పీఎస్సీ నిబంధనల ప్రకారం ఓఎంఆర్ షీట్‌లోని ప్రతి అంశాన్నీ పక్కాగా నింపాల్సి ఉంటుంది. దీని పైభాగంలో హాల్ టిక్కెట్ నంబర్‌తో పాటు టెస్ట్ బుక్‌లెట్ నంబర్, వెన్యూ కోడ్‌లను తొలుత అంకెల్లో నింపి, వాటి కింద ఓఎంఆర్ విభాగంలో సున్నాలు చుడుతూ పూరించాలి. అంకెల్ని సక్రమంగా వేసిన ప్రవీణ్‌కుమార్ సున్నాలు చుట్టడంలో మాత్రం పొరపడ్డాడు. టెస్ట్ బుక్‌లెట్ నంబర్‌కు అంకెల్లో '459244'గా వేసిన ఇతను సున్నాల దగ్గరకు వచ్చేసరికి '4599244'అని రీడ్ అయ్యేలా పూరించాడు. దీంతో అతను ఆ పరీక్షలో డిస్‌క్వాలిఫై అయ్యాడని అధికారులు చెప్తున్నారు. ఈ ఓఎంఆర్ షీట్ మంగళవారం బయటకు వచ్చి సోషల్ మీడియాలో వైరల్ అయింది.

పది రోజుల కస్టడీ కోరనున్న పోలీసులు

ఈ కేసులో నిందితులు ప్రవీణ్, రాజశేఖర్, రేణుక, లవడ్యావత్ డాక్యా సహా మొత్తం తొమ్మిది మందినీ తదుపరి విచారణ నిమిత్తం పది రోజుల కస్టడీకి ఇవ్వాలని పోలీసులు పిటిషన్ వేయనున్నారు. నిందితులను ప్రశ్నించడంతోపాటు స్వాధీనం చేసుకున్న కంప్యూటర్లు, ల్యాప్‌టాప్, పెన్‌డ్రైవ్‌ల పరిశీలన, ఫోరెన్సిక్ నివేదిక అందాకే లీకేజీలపై స్పష్టత వస్తుందని పోలీసులు భావిస్తున్నారు.

తల్లి, సోదరుడి ఆర్థిక ఇబ్బందులతో..

పోలీసులు కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో కీలకాంశాలు పొందుపరిచారు. రేణుక సోదరుడు రాజేశ్వర్ నాయక్ గతంలో వ్యాపారం చేసి నష్టపోయాడు. ఆమె తల్లికి కూడా ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే రేణుక తనకు పరిచయస్తుడైన ప్రవీణ్‌ను ట్రాప్ చేసి, పరీక్ష పేపర్లు బయటకు తీసుకువస్తానని, వాటిని అమ్మి ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడదామని చెప్పింది. పేపర్లు చేజిక్కిన తర్వాత భర్త లవడ్యావత్ డాక్యా, రాజేశ్వర్‌లతో కలిసి ప్రధానంగా తమ సామాజిక వర్గం వారికే విక్రయించాలని నిర్ణయించుకుంది. నీలేష్, గోపాల్‌లకు అమ్మడానికి సిద్ధమై ఒక్కొక్కరి నుంచి రూ.20 లక్షల చొప్పున డిమాండ్ చేసింది. అయితే వాళ్లు రూ.10 లక్షల చొప్పున ఇవ్వడానికి అంగీకరించారు. ఈ మేరకు వారి నుంచి తీసుకున్న రూ.15 లక్షల్లో రూ.10 లక్షలు ప్రవీణ్‌కు ఇచ్చింది.

48 మందితో అసభ్య చాటింగ్.. ఫొటోల షేరింగ్

కమిషన్ నిర్వహించే పరీక్షలు రాయడానికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు దాన్ని ఆన్‌లైన్‌లో నింపే క్రమంలో పొరపాట్లు చేస్తుంటారు. మరికొన్ని సందర్భాల్లో కమిషన్ నిర్లక్ష్యం వల్ల తప్పులు దొర్లుతూ ఉంటాయి. వీటిని సరి చేసుకోవడానికి అనేక మంది అభ్యర్థులు, అభ్యర్థినులు టీఎస్‌పీఎస్సీకి వస్తుంటారు. ఇలా వచ్చిన వారిలో యువతులు, మహిళలకు సహాయపడే ప్రవీణ్.. ఆపై వారిని ట్రాప్ చేసి లోబర్చుకునేవాడని తెలుస్తోంది. దాదాపు 48 మందితో అభ్యంతరకరంగా, అసభ్యంగా చాటింగ్ చేయడం, ఫొటోలు షేర్ చేసుకోవడం చేశాడని ప్రవీణ్ ఫోన్‌ను విశ్లేషించిన సైబర్ నిపుణులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రేణుక కూడా ప్రవీణ్‌కు గురుకుల పరీక్షల నేపథ్యంలో పరిచయమైంది. 2018లో గురుకులాల్లో హిందీ టీచర్ పోస్టుకు ఆమె దరఖాస్తు చేసుకుంది. కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తడంతో కమిషన్‌కు వచ్చిన ఈమెకు ప్రవీణ్‌తో పరిచయం ఏర్పడింది. పరీక్ష సమస్య పరిష్కారం కాగా.. పరిచయం కాస్తా సన్నిహిత సంబంధం వరకు వెళ్లింది. వీళ్లు కొన్ని వ్యక్తిగత ఫొటోలను కూడా షేర్ చేసుకున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో అప్పట్లో రేణుక గురుకుల పరీక్షలో క్వాలిఫై కావడంలోనూ లీకేజీ వ్యవహారం ఉందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వరుస సెలవులు.. మరిన్ని అనుమానాలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని బుద్దారం గురుకుల పాఠశాలలో 2018 నుంచి పనిచేస్తున్న రేణుక..ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు మొత్తం 11 సెలవులు తీసుకుంది. టీఎస్‌పీఎస్సీ ఏఈ పరీక్ష ఈ నెల 5న జరగగా.. నాలుగో తేదీన సెలవు పెట్టినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఐదో తేదీ ఆదివారం కాగా.. బంధువులు చనిపోయారని ఈ నెల 10 నుంచి ఇప్పటివరకు సెలవులో ఉన్నట్లు ఆమె సహోపాధ్యాయులు తెలిపారు. మరోవైపు గ్రూప్‌–1 పరీక్ష గత ఏడాది అక్టోబర్ 16న జరగగా.. నవంబర్‌లో 12 రోజులు మాత్రమే పాఠశాలకు హాజరయ్యింది. 14 రోజులు మెడికల్ లీవ్ పెట్టినట్లు సిబ్బంది తెలిపారు. ఇప్పుడు, అప్పుడు పరీక్షల తర్వాత వరుస సెలవులు పెట్టిన క్రమంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



మంగళవారం రాజ్‌భవన్ వెలుపల విద్యార్థి సంఘాల నినాదాలు

వర్సిటీ కామన్ రిక్రూట్‌మెంట్ బిల్లును ఆమోదించాలి

రాజ్‌భవన్ వద్ద తీవ్ర ఉద్రిక్తత.. గెల్లు శ్రీనివాస్ సహా పలువురి అరెస్టు

పంజగుట్ట (హైదరాబాద్): యూనివర్సిటీ కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లును గవర్నర్ వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్వీ, బీఆర్‌ఎస్ అనుబంధ విద్యార్థి సంఘాలు మంగళవారం రాజ్‌భవన్ ముట్టడికి యత్నించారు. మెడలో నల్ల జెండాలు కట్టుకుని నిరసన తెలుపుతూ ఒక్కసారిగా పెద్దెత్తున యువకులు రాజ్‌భవన్‌కు వచ్చి గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రెండ్రోజుల కిందట నగర మేయర్ గవర్నర్‌ను కలిసేందుకు వచ్చిన సమయంలో అపాయింట్‌మెంట్ లేదంటూ లోనికి వెళ్లకుండా అడ్డంగా వేసిన బారికేడ్లను బీఆర్‌ఎస్వీ నాయకులు తోసుకుంటూ లోనికి వెళ్లేందుకు యత్నించారు. అప్పటికే భారీగా మోహరించిన పోలీసులు వారిని అడ్డుకోవడంతో అక్కడే కొద్దిసేపు బైటాయించారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని పలు పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ గవర్నర్ తీరు వల్ల వేలాదిమంది నిరుద్యోగులు రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. యూనివర్సిటీ కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లును రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి గవర్నర్‌కు పంపి 5 నెలలవుతున్నా ఇప్పటివరకు ఆమోదించకపోవడం దారుణమన్నారు. గవర్నర్ తీరుతో 3 వేల ప్రొఫెసర్ పోస్టులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

పరీక్షల నిర్వహణ యథాతథం

- షెడ్యూల్ ప్రకారం అర్హత పరీక్షలు నిర్వహించేందుకు టీఎస్‌పీఎస్సీ సిద్ధమే
- కేవలం ఏఈ ప్రశ్నపత్రమే లీకైనట్లు స్పష్టమైన ఆధారాలున్నాయి
- దీంతో ఏఈ పరీక్షపై నిపుణులతో చర్చిస్తున్నాం... నేడు నిర్ణయం తీసుకుంటాం
- అతిత్వరలో టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పరీక్షలు
- ఇప్పటికే తయారు చేసిన ప్రశ్నపత్రాలు తిరిగి రూపొందిస్తున్నాం
- నిరుద్యోగులు సోషల్ మీడియా ప్రచారాలను నమ్మి సమయం వృథా చేసుకోవద్దు
- మీడియా సమావేశంలో టీఎస్‌పీఎస్సీ చైర్మన్ బి. జనార్దన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్దేశించిన తేదీల్లోనే అర్హత పరీక్షలు నిర్వహించేందుకు కృతనిశ్చయంతో ఉన్నాం. కష్టపడి ఉద్యోగాలు సాధించాలన్న తపనతో లక్షలాది మంది నిరుద్యోగులు సిద్ధమవుతున్నారు. వారికి ఏమాత్రం అన్యాయం జరగకూడదనేదే మా లక్ష్యం. వాస్తవ పరిస్థితులకు భిన్నంగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలు జరుగుతున్నాయి. తొందరపడి వాటిని నమ్మి అభ్యర్థులు సమయాన్ని వృథా చేసుకోవద్దు' అని టీఎస్‌పీఎస్సీ చైర్మన్ బి.జనార్దన్‌రెడ్డి స్పష్టం చేశారు. గత 4–5 రోజుల పరిణామాల దృష్ట్యా ఆయన మంగళవారం టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో కమిషన్ సభ్యులు, కార్యదర్శితో కలసి మీడియా సమావేశం నిర్వహించారు. ప్రశ్నపత్రాల లీకేజీ, పరీక్షల రద్దు, ఇతరత్రా అంశాలపై పలు ప్రచారాల నేపథ్యంలో అభ్యర్థులకు స్పష్టత ఇచ్చేందుకే ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

17 వేల పోస్టులు... 26 ప్రకటనలు...

'వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల భర్తీ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీకి అప్పగించింది. 17,134 కొలువులకు సంబంధించి ఏడాది కాలంలో 26 ప్రకటనలు జారీ చేశాం. ఇందులో 6 రకాల అర్హత పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాం. గత ఏడేళ్లలో 35 వేల ఉద్యోగాల భర్తీ జరిగితే కేవలం ఏడాదిలోనే 17 వేల కొలువులకు ప్రకటనలు జారీ చేశాం. మరో 10 వేల ఉద్యోగాల భర్తీకి త్వరలో ప్రకటనలు జారీ చేయనున్నాం. టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసిన క్రమంలో అంతర్గత సమాచారం అందింది. దీంతో వెంటనే ఆ రెండు పరీక్షల నిర్వహణను వాయిదా వేశాం. వివిధ ఇంజనీరింగ్ విభాగాల్లో అసిస్టెంట్ ఇంజనీర్, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్, టెక్నికల్ ఆఫీసర్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి ఈ నెల 5న నిర్వహించిన అర్హత పరీక్ష ప్రశ్నపత్రం లీకైందని గుర్తించాం. ఇది ఎందరికి చేరింది... ఏయే సమాచారం ఎవరెవరికి చేరిందనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. సాంకేతికత ఆధారంగా లీకేజీని గుర్తించేందుకు ఫోరెన్సిక్, సైబర్ భద్రతా విభాగాలు ప్రయత్నిస్తున్నాయి. దీనిపై మరింత స్పష్టత రావాల్సి ఉంది. అసిస్టెంట్ ఇంజనీర్ పరీక్షపై బుధవారం మళ్లీ సమీక్షించాక నిర్ణయాన్ని ప్రకటిస్తాం' అని జనార్దన్‌రెడ్డి వివరించారు.

కార్యాలయానికి కొత్త సాంకేతికత...

ప్రస్తుతం టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో సాంకేతికతను పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్నాం. కంప్యూటర్ల మార్పుతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా కొత్తగా తయారు చేసేందుకు చర్యలు మొదలుపెట్టాం. అతిత్వరలో ఈ ప్రక్రియ పూర్తవుతుంది. మరోవైపు టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ అర్హత పరీక్షల ప్రశ్నపత్రాలను తిరిగి రూపొందించాలని నిర్ణయించాం. అతిత్వరలోనే ఈ ప్రక్రియ పూర్తి చేసి పరీక్షలు నిర్వహిస్తాం. ఏప్రిల్ 4న నిర్వహించే హార్టికల్చర్ ఆఫీసర్ పరీక్ష నుంచి అన్ని రకాల పరీక్షలను నిర్దేశించిన తేదీల్లోనే నిర్వహిస్తాం. అభ్యర్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదు. అత్యంత పారదర్శకతతో అర్హతలున్న వారిని ఎంపిక చేయడయే మా పని' అని జనార్దన్‌రెడ్డి తెలిపారు.

నమ్మించి గొంతు కోసినట్లుగా...

'ఒక కార్యాలయం అన్నాక ఎంతో మంది ఉద్యోగులుంటారు. ప్రతి సమాచారాన్ని గోప్యంగా ఉంచేందుకే ప్రయత్నిస్తాం. అదే సమయంలో సహోద్యోగులకు వివిధ బాధ్యతలు అప్పగించి కార్యక్రమాలను సజావుగా సాగేలా చూస్తాం. ప్రవీణ్‌కుమార్ ఇక్కడ ఏళ్లుగా పనిచేస్తున్నాడు. రాజశేఖర్ రెడ్డి ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఏడేళ్లుగా పనిచేస్తున్నాడు. ప్రతి ఉద్యోగి ఎలాంటివాడు? అతని నేపథ్యం ఏమిటని ఆరాతీసే పరిస్థితి ఉండదు. కార్యాలయంలో పనిచేసే వ్యక్తి.. ఏళ్లుగా నమ్మకంతో ఉన్నందున వివిధ బాధ్యతలు అప్పగించాం. రాజశేఖర్‌రెడ్డి నెట్‌వర్క్ విభాగంలో పనిచేస్తున్నాడు. ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే నమ్మించి గొంతుకోసిన చందంగా ఉంది. ప్రవీణ్ శాఖాపరంగా అనుమతి తీసుకొని గ్రూప్‌–1 ప్రిలిమినరీ పరీక్ష రాశాడు. 103 మార్కులు వచ్చినట్లు తెలిసింది. కానీ పేపర్ కోడ్ సరిగ్గా వేయలేదని అనర్హుడైనట్లు సమాచారం. అయితే గ్రూప్‌–1 ప్రిలిమినరీ అర్హుల్లో అత్యధిక మార్కులు 103 కంటే ఎక్కువ. ప్రిలిమినరీ పరీక్షలో ర్యాంకులను పరిగణనలోకి తీసుకోం. దీంతో ఎక్కడా మార్కులు వెల్లడించలేదు. అభ్యర్థులకు మాత్రం వారి మార్కులు చూసుకొనే వెసులుబాటు కల్పిస్తూ ఓఎంఆర్ పత్రాలను స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాం. ఈ పరీక్ష లీకేజీపై ఇప్పటివరకు ఎలాంటి ఆధారాల్లేవు. సామాజిక మాధ్యమాల్లో అనవసర రాద్ధాంతాన్ని పరిగణించొద్దు. ఒక్క అభ్యర్థికి కూడా అన్యాయం జరగదు. వాస్తవ పరిస్థితులను కనిపెట్టేందుకు దర్యాప్తు కొనసాగుతోంది. దర్యాప్తులో తేలిన అంశాల ప్రకారం చర్యలుంటాయి' అని జనార్దన్‌రెడ్డి స్పష్టం చేశారు.

పాలమూరులో ప్రకంపనలు

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీలో జిల్లా వాసులు

- 9 మందిలో ఆరుగురు ఇక్కడివాళ్లే..



బుద్ధారం గురుకుల పాఠశాల భవనం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/గండేడ్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ రాష్ట్రవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. తొమ్మిది మంది నిందితుల్లో ఆరుగురు ఉమ్మడి పాలమూరుకు చెందిన వారే ఉండడం హాట్‌టాపిక్‌గా మారింది. ఈ వ్యవహారం మహబూబ్‌నగర్‌తో పాటు గండేడ్ మండలంలోని మన్సూర్‌పల్లి, పంచాంగల్ తండాలు, వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం చుట్టూ తిరుగుతోంది. ఈ బాగోతంలో వీరితో పాటు ఇంకెవరైనా ఉన్నారా?.. అనే కోణంలో పోలీసులు జల్లెడ పడుతున్నారు.

రేణుక, డాక్యా ఇక్కడి వారే..

పేపర్ల లీకేజీకి పాల్పడింది కమిషన్ కార్యదర్శికి వ్యక్తిగత సహాయకుడిగా పనిచేస్తున్న ప్రవీణ్ కాగా.. నిందితుల జాబితాలో రేణుక, లవుడ్యావత్ డాక్యా దంపతులు ఉన్నారు. రేణుకది మన్సూర్‌పల్లి తండా కాగా.. డాక్యాది అదే మండలంలోని పంచాంగల్ తండా. డాక్యా బీటెక్ పూర్తయిన తర్వాత 15 ఏళ్లుగా టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. వికారాబాద్ జిల్లా ధారూర్ మండలంలో నాలుగేళ్ల పాటు టీఏగా విధులు నిర్వర్తించాడు. ప్రస్తుతం వికారాబాద్ జిల్లా కుల్కచర్లలో పనిచేస్తున్నాడు. రేణుకకు 2018లో వనపర్తి గురుకుల పాఠశాలలో హిందీ పండిట్ ఉద్యోగం రావడంతో మూడేళ్ల క్రితం మహబూబ్‌నగర్‌కు మకాం మార్చాడు. ప్రస్తుతం రేణుక బుద్ధారం గురుకుల పాఠశాలలో పనిచేస్తోంది.

అంతా బంధువులు, సన్నిహితులే: ప్రవీణ్ ద్వారా పేపర్లు సంపాదించిన రేణుక మొదట తన తమ్ముడు రాజేశ్వర్‌కు సమాచారమిచ్చింది. ఇతను మహబూబ్‌నగర్‌లోనే ఉంటున్నాడు. రాజేశ్వర్ తన పెద్దనాయన చంద్రానాయక్ కొడుకు శ్రీనివాస్ (బీటెక్)కు సమాచారం ఇచ్చాడు. అతడికి 2020లో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. ప్రస్తుతం మేడ్చల్‌లో పనిచేస్తున్నాడు. ఎస్సై ఉద్యోగానికి ప్రిపేర్ అవుతున్నాడు. దీంతో తనకు ప్రశ్నపత్రం వద్దని.. తనకు సన్నిహితులైన మన్సూర్‌పల్లి తండాకు చెందిన కేతావత్ నీలేశ్ నాయక్, అతడి తమ్ముడు రాజేంద్రనాయక్, వికారాబాద్ జిల్లా దుగ్యాల మండలం లగచర్ల తండాకు చెందిన పత్లావత్ గోపాల్‌నాయక్‌తో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. రేణుక, డాక్యా దంపతులు ఒప్పందం కుదుర్చుకున్న వారిని వెంటబెట్టుకుని పంచాంగల్ తండాలోని ఇంటికి వచ్చినట్లు సమాచారం. అక్కడే వారితో రెండు రోజుల పాటు చదివించి.. పరీక్ష రోజు సరూర్‌నగర్‌లోని పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లారు. ఈ పరీక్షను రేణుక తమ్ముడు రాజేశ్వర్ కూడా రాశాడా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సమస్యలుంటే కాల్ చేయండి

- ఇంటర్ విద్యార్థులకు బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్ సూచన
- అందుబాటులో 040– 24601010, 040– 24655027 నంబర్లు
- నేటి నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు
- ఉదయం 9 దాటితే అనుమతి 'నో'



సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ పరీక్షల నేపథ్యంలో రాష్ట్రస్థాయిలో ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేసినట్టు ఇంటర్ బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్ తెలిపారు. విద్యార్థులకు ఏ ఇబ్బంది తలెత్తినా 040– 24601010, 040– 24655027 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుంచి మొదలయ్యే పరీక్షల ఏర్పాట్లపై మిత్తల్ మంగళవారం మీడియా సమావేశంలో వివరించారు. ఇంటర్ బోర్డ్ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్లు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ పనిచేస్తాయని తెలిపారు. ఇవే కాకుండా ప్రతీ జిల్లాలోనూ ప్రత్యేక నంబర్లు అందుబాటులోకి తెచ్చామన్నారు. కాలేజీలతో ప్రమేయం లేకుండా విద్యార్థులే ఇంటర్ బోర్డ్ వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించామన్నారు. మంగళవారం మధ్యాహ్నం వరకూ 50 వేల మంది విద్యార్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపారు. ఉదయం 9 దాటితే పరీక్ష హాలులోకి అనుమతించబోమని చెప్పారు. విద్యార్థులు ఎక్కడా నేలపై కూర్చొని పరీక్ష రాసే విధానం ఉండకూడదని అధికారులను ఆదేశించారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 9,47,699 మంది పరీక్షలు రాస్తున్నారని, వీరిలో 4,82,677 మంది ఫస్టియర్, 4,65,022 మంది సెకెండీయర్ ఉన్నట్టు చెప్పారు. 75 ఫ్లైయింగ్ స్క్వాడ్స్ పనిచేస్తాయన్నారు.

డిజిటల్ మూల్యాంకనం

ఈ ఏడాది 35 లక్షల ప్రశ్నాపత్రాలకు ఆన్‌లైన్‌లో మూల్యాంకన చేపట్టాలని నిర్ణయించామని మిత్తల్ తెలిపారు. ఇందుకు సంబంధించి రెండోసారి పిలిచిన టెండర్లకు రెండు కంపెనీలు ముందుకొచ్చాయని, వాటి అర్హతలను పరిశీలిస్తున్నామని తెలిపారు. టెన్త్ పరీక్షలు పూర్తయ్యేనాటికే ఇంటర్ కాలేజీల అఫ్లియేషన్ ప్రక్రియ ముగించాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. అఫ్లియేషన్ లేకపోతే పరీక్షకు బోర్డ్ అనుమతించదనే విషయమై విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఈసారి ముందే అంగీకారం తీసుకునే వీలుందన్నారు. ఇంటర్ ప్రవేశాలను ఆన్‌లైన్ ద్వారా చేపట్టే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు.

నిఘా నీడలో ఇంటర్ పరీక్షలు

▶ మొదటి పేజీ తరువాయి

అనుమతిస్తున్నారు. బోర్డ్‌లోని కొందరి సెల్‌ఫోన్లపైనా నిఘా పెట్టినట్టు తెలిసింది. ప్రస్తుత పరీక్షల నిర్వాహకులే లక్ష్యంగా బోర్డ్ లోని వ్యక్తులు, ప్రైవేటు కాలేజీలు, మరికొంత మంది కలిసి పరీక్షల్లో అవాంతరాలు సృష్టించే వీలుందనే అనుమానాలు ఉన్నత వర్గాల్లోనూ ఉన్నాయి. దీంతో పరీక్ష పేపర్లు పంపే విషయంలో జాగ్రత్తగా ఉండాలని, అన్ని పరీక్ష కేంద్రాల్లో విధిగా సీసీ కెమెరాల ముందే ప్రశ్నపత్రాలు ఓపెన్ చేయాలని ఆదేశాలిచ్చారు. అదే విధంగా జవాబు పత్రాలు సురక్షితంగా చేరే వరకూ పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. పరీక్షలపై అసత్య ప్రచారం చేసేందుకు కొంతమంది సామాజిక మాధ్యమాలను వాడుకునే అవకాశముందని, ఈ అంశాలపైనా దృష్టి పెట్టాలని ఆదేశించారు.

వైద్య పరికరాల పరిశ్రమకు ఊతమివ్వండి

- వైద్య పరికరాలు, డయాగ్నొస్టిక్స్‌పై జీఎస్టీని తగ్గించాలి
- హైదరాబాద్‌లో డివైజెస్ పార్క్ ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నాం
- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు రాష్ట్ర మంత్రి కేటీఆర్ లేఖ



సాక్షి, హైదరాబాద్: వైద్య పరికరాల మార్కెట్‌లో ప్రపంచంలోనే టాప్‌–20లో భారత్ నాలుగో స్థానంలో ఉందని, ఈ పరిశ్రమకు మరింత ఊతమివ్వాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కె. తారక రామారావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు లేఖ రాశారు. ఈ సందర్భంగా దేశంలో వైద్య పరికరాల పరిశ్రమను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. గత ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో బయో ఆసియా 20వ వార్షికోత్సవ ఎడిషన్‌ను విజయవంతంగా నిర్వహించిన విషయాన్ని తెలియజేశారు. ఇందులో భాగంగా వైద్య పరికరాల అంశంపై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వివిధ కంపెనీల సీఈవోలు, వైద్యరంగ నిపుణులు, అసోసియేషన్ ప్రతినిధులు లేవనెత్తిన అంశాలను లేఖలో ఆయన కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. జీఎస్టీ కారణంగా వైద్య పరికరాల పరిశ్రమ ఎదుర్కొంటున్న పరిణామాలు, ప్రత్యామ్నాయ దిగుమతి విధానాలు, మేక్ ఇన్ ఇండియాపై విలోమ సుంకం ప్రభావం, మౌలిక సదుపాయాలు, ముడిసరుకు లభ్యత మొదలైన అంశాలను ఆయన కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం కస్టమ్ డ్యూటీతోపాటు వైద్య పరికరాల విడిభాగాలపై జీఎస్టీ కూడా పరికరాల కంటే ఎక్కువ రేటుతో వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, దేశంలోని వైద్య పరికరాల ధరలపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. ప్రజలకు తక్కువ ధరకే వైద్యం అందించాలన్న దేశ మౌలిక లక్ష్యానికి భిన్నంగా ఇది ఉందన్నారు. 'వైద్య పరికరాలు విలాసవంతమైన వస్తువులు కావు. ఆరోగ్య సంరక్షణను అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి పరికరాలు, డయాగ్నొస్టిక్స్ కీలకమని గుర్తించాలి. వైద్య పరికరాలు, డయాగ్నస్టిక్స్‌పై ప్రస్తుతం విధిస్తున్న 18% జీఎస్టీని తగ్గించాలి. వైద్య పరికరాలపై 12%, డయాగ్నొస్టిక్స్‌పై 5 శాతం మేరకు జీఎస్టీని తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నా' అని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్లు, ఇతర ఎలక్ట్రానిక్ భాగాలు, ఎల్ఈడీ మానిటర్లు, ప్యానెల్ డిస్‌ప్లే యూనిట్లు, బ్యాటరీ, సెమీకండక్టర్లు, మెకాట్రానిక్స్ మొదలైన వైద్య పరికరాల విడిభాగాల తయారీలో దేశీయ పరిశ్రమలను ప్రోత్సహించడానికి తీసుకోవలసిన చర్యలను వివరించారు. దీన్ని ప్రోత్సహించేందుకు హైదరాబాద్‌లో అధునాతన పరికరాలు యంత్రాలతో మెడికల్ ఇమేజింగ్ హబ్‌ను, మెడికల్ డివైజెస్ పార్క్‌ను కేంద్రం భాగస్వామ్యంతో ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు కేటీఆర్ తెలిపారు.

సాక్షి

బుధవారం, మార్చి, 15

ప్రపంచానికి పెద్దన్న కావాలని...

కొన్నిసార్లు మౌనం, మరికొన్నిసార్లు మాటలు కీలకం. బాహ్య అర్థానికి మించిన సందేశాన్ని అవి బట్వాడా చేయగలవు. సోమవారం నాటి చైనా వార్షిక పార్లమెంటరీ సమావేశంలో ఆ దేశాధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ముగింపు ప్రసంగంలోని మాటలు అలాంటివే. ఆయన ఇచ్చిన సందేశం ఒకటే – చైనా ఈజ్ బ్యాక్! కనీవినీ ఎరుగని రీతిలో మూడోసారి మరో అయిదేళ్ళ పాటు చైనా దేశాధ్యక్ష పీఠాధిష్ఠితుడైన షీ మాటలు జోరుగా సాగాయి. చైనా భద్రత, అభివృద్ధి, సార్వభౌమాధికారాల్ని పరిరక్షించేలా సైన్యాన్ని 'గ్రేట్ వాల్ ఆఫ్ స్టీల్'లా తయారుచేస్తామని చెబుతూ, ప్రపంచ పాలనలో బీజింగ్ 'క్రియాశీలక పాత్ర పోషిస్తుంద'ని ప్రకటించారు. సంఖ్యాపరంగా ప్రపంచంలో అతి పెద్దదైనా ఏటా ఒకసారి, రెండువారాలే అంతా కలిసే చైనా పార్లమెంట్‌లో 3 వేల మంది సభ్యుల్లో ఉత్సాహం నింపారు. మరోపక్క బద్ధశత్రువులైన సౌదీ అరేబియా– ఇరాన్‌ల మధ్య ఒప్పందం కుదిర్చి, ఊహించని దౌత్యవిజయం సాధించారు. ఈ మాటలు, చేతలు చూస్తే షీ తనను తాను ప్రపంచ రాజనీతిజ్ఞుడిగా చిత్రించుకొంటున్నారన్న మాట. విశ్వవేదికకు చైనాయే సారథి అని చెబుతున్నారన్న మాట.

గత కొన్ని తరాల్లో షీ లాంటి నేత చైనాలో కనిపించరు. నిజానికి, చైనా ప్రభుత్వ పాలనా వ్యవస్థలో అధ్యక్షుడి పనులు లాంఛనప్రాయమే. కానీ, 69 ఏళ్ళ షీ అధికారమంతా ఇటు కమ్యూనిస్ట్ పార్టీ జనరల్ సెక్రటరీగా, అటు కేంద్ర మిలిటరీ కమిషన్ (సీఎంసీ) ఛైర్మన్ హోదాల ద్వారా సంక్రమించినవే. గత అక్టోబర్‌లో పార్టీ మహాసభలో ఆయనకు ఆ రెండు హోదాలూ దక్కాయి. దేశంలోకెల్లా అత్యంత శక్తిమంతమైన ఏడుగురు సభ్యుల పొలిట్‌బ్యూరో స్థాయీ సంఘంలో మొత్తం తన విధేయులతో నింపేశారు. అప్పుడే దేశాధ్యక్షుడిగా మూడోసారి ఆయన బాధ్యతలు చేపడతారని ఊహించారు. మావో లాంటి నేతలు సైతం పదవిలో రెండుసార్లే ఉండగా, ఆ ఆంక్షను 2018లో మార్చివేసిన షీ ఆ దిగ్గజాలను అధిగమించేశారు. జీరోకోవిడ్ విధానం నుంచి దేశం బయట కొస్తున్న వేళ, షీ తన పాలనాధికారాన్ని పటిష్ఠం చేసుకుంటున్నారు. బలోపేతుడైన తన సారథ్యంలో పార్టీలో అధికార కేంద్రీకరణ అనేక సమస్యలకు పరిష్కారమని భావిస్తున్నారు. అందుకే, రాగల కొన్నేళ్ళలో చైనా దశ, దిశను తెలిపే సందర్భమని తాజా వార్షిక పార్లమెంటరీ సమావేశం (నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్), చైనీస్ పీపుల్స్ పొలిటికల్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ (సీపీపీసీసీ)లను అంతా ఆసక్తిగా చూశారు.

అక్కడే షీ తనకు దీర్ఘకాలిక మిత్రుడూ, కమ్యూనిస్ట్ పార్టీలో రెండో అతిపెద్ద స్థానంలో ఉన్న లీ చియాంగ్‌ను కొత్త ప్రీమియర్‌గా కూర్చోబెట్టారు. జీరో–కోవిడ్ అంటూ మూడేళ్ళ పాటు ప్రపంచానికి దూరంగా గడిపిన చైనా దౌత్యవేత్తలతో పాటు షీ ఇక సరిహద్దులు దాటి, అంతర్జాతీయ సదస్సులకు హాజరయ్యేందుకు సిద్ధమవుతున్నారు. వరుస పర్యటనలతో వివిధ దేశాలతో సంబంధాలను పెంచుకోవాలని చూస్తున్నారు. అదే సమయంలో మరో అగ్రరాజ్యం అమెరికాతో మాటలకు దూరం జరుగుతున్నారు. చైనా రక్షణశాఖ కొత్త మంత్రిగా లీ షాంగ్‌ఫూను నియమించడం ఒక రకంగా అలాంటి పనే. నిజానికి, రష్యా రక్షణ రంగంతో అంటకాగుతున్నారంటూ 2018 నుంచి సదరు లీ మీద అమెరికా ఆంక్షలు పెట్టింది. తీరా ఇప్పుడు అదే వ్యక్తిని రక్షణ మంత్రిని చేయడంతో – అమెరికా, చైనాల మధ్య సైనిక చర్చలు మరింత కష్టమవుతాయి. గత ఆగస్ట్‌లో అమెరికా స్పీకర్ నాన్సీ పెలోసీ తైవాన్ సందర్శన నుంచి– ఇరు దేశాల మధ్య సైనిక చర్చలు నిలిచిపోయాయి.

అయితే రష్యాతో అనుబంధాన్ని కాపాడుకోవడమే షీ లక్ష్యం. మాస్కోకు మిత్రుడైన లీ నియామకంతో ఆ మాట చెప్పకనే చెప్పారు. రష్యా – ఉక్రెయిన్‌ల యుద్ధంలో తటస్థంగా ఉన్నామని డ్రాగన్ పైకి చెబుతోంది. కానీ, ఆంతరంగికంగా రష్యాకు చైనాధిపతి మద్దతు బహిరంగ రహస్యమే. గత నెలలోనే చైనా అగ్ర దౌత్యవేత్త వాంగ్ యీ మాస్కో వెళ్ళి పుతిన్‌ను కలిసి, చైనా – రష్యాల అనుబంధాన్ని 'ఏ మూడో పార్టీ శాసించలేదు' అనడమే అందుకు సాక్ష్యం. ఇప్పుడిక షీ స్వయంగా రష్యా వెళ్ళి పుతిన్‌ను కలవనున్నారు. అమెరికా ప్రపంచ పెద్దన్న పాత్రకు అడ్డుకట్ట వేసి, ఆ స్థానాన్ని దక్కించుకోవాలన్న డ్రాగన్ వ్యూహం అనూహ్యమేమీ కాదు. సోవియట్ యూనియన్ పతనానంతరం మూడు దశాబ్దాలకు మళ్ళీ స్పష్టంగా ముందుకొచ్చిన ద్విధ్రువ ప్రపంచపు ఉద్రిక్తతలూ అనివార్యమే. భౌగోళిక రాజకీయాల్లోని ఈ మార్పుల్ని పొరుగున్న భారత్ గమనించాలి. స్వీయ భద్రత చూసుకోవాలి.

ప్రపంచంలోని రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను ముందుకు నడుపుతున్న షీ సైతం అభివృద్ధికి పునాది భద్రత అనీ, సౌభాగ్యం వెల్లివిరియాలంటే స్థిరత్వం ఉండాలనీ ప్రస్తావించారు. ఆ స్ఫూర్తితో భౌగోళిక ప్రాబల్య విస్తరణ, తైవాన్, భారత్ ప్రాదేశిక వివాదాల లాంటివాటి జోలికి పోకుండా, సౌదీ అరేబియా – ఇరాన్ ఒప్పందం లాంటి అనూహ్య దౌత్య విజయాలతో విశ్వవేదికపై డ్రాగన్ తన ఇమేజ్‌ను పెంచుకుంటే మంచిదే. కానీ, ఎగిరే బెలూన్ల గూఢచర్యం లాంటివి మానాలి. షింజియాంగ్, హాంగ్‌కాంగ్ లాంటి చోట్ల మానవ హక్కులపై పాశ్చాత్య దేశాల ఆందోళనల్ని పోగొట్టాలి. సరిహద్దు తగాదాల కన్నా ఆర్థిక పురోగతికి ప్రాధాన్యమిస్తూ, చైనా అడుగు ముందుకేస్తేనే అది ఆశిస్తున్న ప్రాబల్య పాత్ర సాధ్యమేమో! ఆర్థికంగా పోటీ ఉండవచ్చేమో కానీ, సరిహద్దు ఘర్షణలతో ఎవరికీ సౌభాగ్యం సాధ్యం కాదు. పదేళ్ళ క్రితం అవినీతిపై పోరు అంటూ ముందుకు దూసుకొచ్చి, పెరిగిన నిరుద్యోగ రేటు, తగ్గిన కొనుగోళ్లతో అస్తుబిస్తవుతూ, ఇప్పటికే జనంలో ప్రతిష్ఠ దెబ్బతిన్న షీ జిన్‌పింగ్‌కు తన లక్ష్యంతో పాటు ఆ సంగతి తెలియదనుకోలేం!

స్వీయ దిద్దుబాటుపైనే జాతి భవిష్యత్తు!

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

బ్రిటిష్ పాలనకు ముందు భారతదేశ జనాభాలో 70 శాతం మంది విద్యావంతులేనని మోహన్ భాగవత్ పేర్కొన్నారు. 70 శాతం మంది విద్యావంతులని ప్రకటించడం అంటే సంస్కృతం బోధించే బ్రాహ్మణీయ గురుకులాల్లో శూద్రులు, దళితులు చదువుకునేవారనే అర్థం వస్తోంది. భారతదేశంలో అన్ని కులాలు, వృత్తులకు చెందిన పిల్లలకు బోధించిన బ్రాహ్మణ లేదా హిందూ సంస్థలు ఉండేవా? నేడు దేశంలో ప్రధాన ఓటర్లుగా ఉంటున్న శూద్రులు, ఓబీసీలు, దళితులు, ఆదివాసీ ప్రజారాసులకు అవాస్తవ గాథలను వల్లించడం ద్వారా జాతీయవాదాన్ని స్థాపించలేరు. గత తప్పిదాలను ఆమోదించడం ద్వారానే జాతీయ స్ఫూర్తిని ప్రజల్లో నింపవచ్చు. అసత్యాలతో కాకుండా నిజాయితీ, స్వీయ దిద్దుబాటుపైనే జాతి భవిష్యత్తును నిర్మించవచ్చు.

ఆరెస్సెస్ సర్‌సంచాలక్ మోహన్ భాగవత్ కొంతకాలంగా అసాధారణ ప్రకటనలు చేస్తున్నారు. దేవుడు కులాన్ని సృష్టించలేదనీ, పండిట్లు (పూజారులు) కులాన్ని సృష్టించారనీ అన్నారు. శాస్త్రాలు మౌఖికంగా బదిలీ అయినంతకాలం బాగుండేవనీ, వాటిని ఎప్పుడైతే రాయడం జరిగిందో తప్పుడు విషయాలు పొందుపరుస్తూ వచ్చారని కూడా అన్నారు. ఈ రెండు ప్రకటనలు కాస్త సంస్కరణ తత్వంతో ఉన్నాయి.

'2023 మార్చి 5న మోహన్ భాగవత్ బ్రిటిష్ పాలనకు ముందు భారతదేశ జనాభాలో 70 శాతం విద్యావంతులేనని పేర్కొన్నారు. అప్పట్లో దేశంలో నిరుద్యోగమనేది లేదని కూడా చెప్పారు'. ఆయన ఈ ప్రకటనకు మీడియా విస్తృత ప్రచారం కల్పించింది.

సావిత్రీబాయి పూలే జయంతి నేపథ్యంలో 2023 మార్చి 7న 'పుణేకర్ న్యూస్'లో కేమిల్ పార్థే 1824లో బాంబేలో మొట్టమొదటి బాలికా పాఠశాలను ప్రారంభించిన అమెరికన్ మిషనరీ మహిళ సింథియా ఫరార్ గురించి ఒక ఆసక్తికరమైన కథనం రాశారు. పుణేలో బాలికల పాఠశాలను ప్రారంభించడానికి మహాత్మా జ్యోతిరావు పూలేకు ఫరార్ ఆదర్శంగా నిలిచారు. ఈ పాఠశాలలోనే సావిత్రీ బాయి, ఫాతిమా బాలికలకు పాఠాలు చెప్పేవారు. జాతీయవాద దృష్టితో భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రీ బాయిని దేశం పరిగణిస్తోంది. నిజానికి సింథియా ఫరార్‌ను మొదటి మహిళా టీచర్‌గా భావించాలి. సింథియా పెళ్లి చేసుకోలేదు. భారతదేశంలో బాలికా విద్య కోసం తన జీవితాంతం కృషి చేశారు. అహ్మద్‌నగర్‌లో 1862లో మరణించారు. ''ముంబై, అహ్మద్‌నగర్‌లలో అనేక బాలికా పాఠశాలలు, బాలికల బోర్డింగ్ స్కూల్స్‌ను ప్రారంభించిన ఘనత సింథియా ఫరార్‌దే'' అంటారు పార్థే. చరిత్రలో ఏ కాలంలోనైనా భారత్‌లో హిందూ బ్రాహ్మణ మిషనరీలు అలాంటి బాలికా పాఠశాలలను ప్రారంభించడం జరిగిందా?

70 శాతం మంది భారతీయులంటే, అందులో శూద్రులు, గ్రామాల, పట్టణాల చివర నివసిస్తున్న దళితులకు విద్యాహక్కు ఉండాలి. బ్రిటిష్ పూర్వ భారతదేశం అంటే మొఘలాయి పాలన గురించి ఆయన మాట్లాడుతున్నారని అర్థం. ముస్లిం పాలనాకాలంలో 70 శాతం మంది భారతీయులు చదువుకున్నవారేనన్న అర్థాన్ని ఇస్తోంది మోహన్ భాగవత్ ప్రకటన. అదే నిజమైతే, ముస్లింల పాలన ఎందుకు చెడ్డది? మొఘలుల పాలనాకాలంలో భారత్‌లో 70 శాతం మంది ముస్లింలు లేరు. ముస్లిం పాలకులు శూద్రులను, దళితులను విద్యావంతుల్ని చేశాక కూడా వాళ్లు ఇటీవలి కాలం వరకూ నిరక్షరాస్యులుగానే ఎందుకు ఉండిపోయినట్లు?

మోహన్ భాగవత్ ప్రకటన సాధారణంగా ఆరెస్సెస్ వాస్తవికతను ప్రతిబింబిస్తుంది. కులం, మహిళల అసమానత్వం అనేవి సంస్కృత శాస్త్రాల్లోకి తదనంతర రచయితలు ప్రవేశపెట్టారని ఆరెస్సెస్ చెబుతున్నట్టయితే– ఆరెస్సెస్/బీజేపీ ప్రభుత్వం ఒక సమీక్షా కమిటీని ఏర్పర్చి శాస్త్రాల్లో కులం, మహిళల అసమానత్వం గురించిన ప్రస్తావనలను తొలగించవచ్చు. శాస్త్రాలు, పురాణాల్లో దేవతలకు కూడా కులం అంటగట్టేశారు. ఉదాహరణకు రాముడిని క్షత్రియుడిగా, కృష్ణుడిని యాదవుడిగా పేర్కొంటారు. శూద్ర, చండాల వంటి కుల బృందాలను అత్యంత హీనంగా శాస్త్రాలు పేర్కొన్నాయి. అదే బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్య సామాజిక వర్గాలను అత్యంత గౌరవనీయమైన రీతిలో పేర్కొన్నారు. పైగా శూద్రులు, చండాలురు వీరిని సేవించాలన్నారు. శాస్త్రాల్లో అలాంటి భాషను మార్చడాన్ని ఎవరూ ఆపరు.



హిందువులుగా తమను పరిగణించుకునే అన్ని వృత్తి బృందాలకు అర్చక విద్య పొందే హక్కును కల్పించాలి. 'దేవుడు కులాన్ని సృష్టించలేదు' అని ఆరెస్సెస్ అధినేతగా భాగవత్ చెబుతున్నందున ఇది అవసరమైన చర్యే. ఆధ్యాత్మిక విద్యలో సమాన అవకాశాలపైన ఆధ్యాత్మిక సమానత్వం ఆధారపడి ఉంటుంది. హిందూ పిల్లలందరికీ హిందూ ఆధ్యాత్మిక విద్యను ఆరెస్సెస్, బీజేపీ కూటమి ప్రారంభించవచ్చు. ఇటీవలి కాలం వరకూ హిందూ ఆధ్యాత్మిక గ్రంథాలను చదివే హక్కు శూద్రులకు, దళితులకు ఉండేది కాదని తెలిసిన విషయమే. ఈ పుస్తకాల్లోనే వీరి జీవితాన్ని పశువులతో సమానంగా చిత్రించారు. 'రామచరిత్ మానస్'లో అలాంటి భాష గురించి ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో జరిగిన చర్చ అందరికీ తెలిసిందే.

ఆరెస్సెస్, బీజేపీ పాలిస్తున్నప్పుడు అన్ని రంగాల్లో సమానమైన వాతావరణంలో విద్యా హక్కుకు హామీ ఉండేలా చూడాలి. భారతీయ వృత్తిజీవులందరి హుందాతనాన్ని నిలబెట్టేలా పాఠ్యప్రణాళిక ఉండాలి. ఏ కాలంలో, ఏ సమాజమైనా వ్యవసాయం, పశుపోషణ, చేతి వృత్తులు లేకుండా మనుగడ సాగించలేదు. కానీ రుగ్వేదం నుంచి రామాయణ, మహాభారతాల వరకు ఈ వృత్తులను దైవికం కానివిగా చూశాయి. అందువల్ల అవి శూద్ర లేదా చండాలమైనవి. కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో చదువుకుంటున్న ఆధునిక యువత ఇలాంటి భాషను ఆమోదించలేదు. కాబట్టి మార్పు అవసరం.

బ్రిటిష్ పూర్వ భారతదేశంలో 70 శాతం మంది విద్యావంతులని ప్రకటించడం అంటే సంస్కృతం బోధించే బ్రాహ్మణీయ గురుకులాల్లో శూద్రులు, దళితులు, మహిళలు చక్కగా చదువుకునే వారనే అర్థం వస్తోంది. దీనికి రుజువు ఉందా? ప్రాచీన, మధ్య యుగాల్లో అంటే బ్రిటిష్ వారు అడుగుపెట్టేంతవరకూ విద్యావిధానం నుంచి శూద్రులు, దళితులు, మహిళలను దూరం పెట్టాలని శాస్త్రాలే స్వయంగా చెబుతున్నప్పుడు బ్రిటిష్ పూర్వ భారతదేశంలో 70 శాతం మంది భారతీయులు చదువుకున్నారని మోహన్ భాగవత్ అనడంలో అర్థం ఉందా?

భారతదేశంలో అన్ని కులాలు, సామాజిక బృందాల పిల్లలకు సూత్రరీత్యా విద్యను అందించేందుకు ఆమోదించిన మొట్టమొదటి పాఠశాలను విలియం కేరీ అనే బ్రిటిష్ మిషనరీ 1817లో కలకత్తాలో రాజా రామ్‌మోహన్ రాయ్ సహకారంతో ప్రారంభించారు. అందుబాటులో ఉన్న సమాచారం మేరకు మొట్టమొదటి బాలికల పాఠశాలను 1824లో బాంబేలో అమెరికన్ మరాఠీ మిషన్ ప్రారంభించింది. ఆ మిషన్ తరపున భారత్ వచ్చిన సింథియా ఫరార్ అన్ని కులాల మహిళలకు, పిల్లలకు బోధించడానికి తన జీవితాన్ని అంకితం చేశారు.

ముస్లిం పాలనా కాలంలో కానీ, అంతకుముందు కానీ భారతదేశంలో అన్ని కులాలు, వృత్తులకు చెందిన పిల్లలకు బోధించిన బ్రాహ్మణ లేదా హిందూ సంస్థలు ఉండేవా? అలాంటి విద్యాసంస్థలు లేకుండా దేశంలోని 70 శాతం మంది పిల్లలకు ఎవరు విద్య నేర్పారు? ఏ రాజరిక ప్రభుత్వమూ పాఠశాలలను నడపలేదు. బ్రాహ్మణులు (ప్రధానంగా బ్రాహ్మణులు, క్షత్రియ విద్యావంతులు) ఆ పని చేసి ఉండాల్సింది. కానీ దానికి శాస్త్రాలు వారిని అనుమతించలేదు.

మొఘలుల కాలంలో కూడా పర్షియా భాషలో అన్ని కులాల కోసం పాఠశాలలను ఏర్పర్చలేదు. సార్వత్రిక విద్యకు వ్యతిరేకులైన బ్రాహ్మణ పండితుల సూచన ప్రకారమే అక్బర్‌తో సహా మొఘల్ పాలకులు నడుచుకున్నారు. మొఘలుల పాలనాకాలంలో విషాదకరమైన విషయం ఏమిటంటే – ఇస్లాంలోకి మతం మార్చుకున్న కింది కులాల వారికి ఉన్నత కులాల ముల్లాలు, పఠాన్లు లేదా మొఘల్ జాతి వారు విద్య నేర్పలేదు. నేడు దళిత అక్షరాస్యత కంటే కిందికులాలకు చెందిన ముస్లింల నిరక్షరాస్యత ఎక్కువగా ఉండటానికి ఇదే కారణం.

70 శాతం అక్షరాస్యత గణాంకాలకు ఆరెస్సెస్ అధినేతకు ఆధారం ఏమిటి? నేడు దేశంలో ప్రధాన ఓటర్లుగా ఉంటున్న శూద్రులు, ఓబీసీలు, దళితులు, ఆదివాసీ ప్రజారాసులకు అవాస్తవ గాథలను వల్లించడం ద్వారా జాతీయవాదాన్ని స్థాపించలేరు. గతంలోని తప్పిదాలను ఆమోదించడం ద్వారానే జాతీయ స్ఫూర్తిని ప్రజల్లో నింపవచ్చు. అసత్యాలతో కాకుండా నిజాయితీ, స్వీయ దిద్దుబాటుపైనే జాతి భవిష్యత్తును నిర్మించవచ్చు.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

చివరి వరకూ!



పీటీఐ హిందీ వార్తా సంస్థ 'భాష' వ్యవస్థాపకులు వేద్ ప్రతాప్ వైదిక్ (79) మరి లేరు! సార్క్ దేశాల ప్రజలకు నిజమైన స్నేహితుడిగా ఉన్న వేద్ ప్రతాప్ భాషా రాజకీయాలపై అనేక వ్యాసాలు రాశారు. ఈ రోజు కూడా హిందీ వార్తాపత్రికల్లో ఆయన కాలమ్ వచ్చింది!

– షీలా భట్, కాలమిస్ట్

కరెన్సీ షాక్



ఏడాదికి రూ.4 లక్షల జీతం వచ్చే పశ్చిమ బెంగాల్ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ మాజీ ఉద్యోగి, టీఎంసీ నేత అయిన శాంతనూ బెనర్జీ నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రూ.350 కోట్ల ఆస్తిని స్వాధీనం చేసుకుంది. ఈడీని ద్వేషించడానికి అధికార పార్టీకి తగిన కారణమే!

– రిషీ బాగ్రీ, ట్యాక్స్ పేయర్

వెనకొచ్చిన కొమ్ములు



హిందువులు తమ దేశంలో రెండవ శ్రేణి పౌరులుగా ఎందుకు మిగిలిపోయారనే దానికి అనేక కారణాలు ఉన్నాయి. ఒక కారణం: వక్ఫ్ చట్టం. తమిళనాడులోని 1500 ఏళ్ల నాటి ఒక దేవాలయం ఉన్న ప్రదేశం ఇస్లాంకు చెందిన భూమి అని వక్ఫ్ ఎలా తీర్మానిస్తుంది? ఇస్లాం వయసే 1300 ఏళ్లు కదా!

– ఆనంద్ రంగనాథన్, రచయిత

విలువైన కాలం



ప్రశ్నోత్తరాల సమయమైనా లేకుండానే లోక్‌సభ మళ్లీ వాయిదా పడింది! సభ నిర్వహణలో ప్రతి నిమిషానికీ అయ్యే ఖర్చు రూ.2.5 లక్షలు. ఇదంతా పన్ను చెల్లింపుదారుల డబ్బే. స్పీకర్ మౌనంగా ఉండటానికి బదులు ఏమైనా పరిష్కారం వెదకాల్సింది.

– రాజ్‌దీప్ సర్దేశాయ్, జర్నలిస్టు

మహానుభావులు



యూఎస్‌లో మార్చి 14 'పై' డే. గణితంలో 'పై' విలువ 3.14 (3/14) కావడం వల్ల. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ (1879) జయంతి : కార్ల్‌మార్క్స్ (1883), స్టీఫెన్ హాకింగ్ (2018) వర్ధంతి కూడా ఇదే.

– రాజీవ్ చంద్రశేఖర్, కేంద్రమంత్రి

సారాంశం

సరికొండ చలపతి

...అంతా కిల్'బిల్'పాండేలే!

కాళిదాసు కవిత్వం కొంత, మన పైత్యం కొంత అన్న సామెత ఉంది. మనం చెప్పిన దానికి కాసింత కాళిదాసు లాంటి పెద్దవాళ్ల పేరు జోడించి వారి అకౌంట్‌లో వేయడం జరుగుతుంటుంది. తద్వారా చెప్పిన దానికి మరింత ప్రాచుర్యం వస్తుందని..

అలాంటిదే ఒకటి చూద్దాం..

అనగనగా ఆ కాలంలో ఓ ఆకతాయి యువకుడు ఉండేవాడు. ఆ ఆకతాయి వీధిలో వెళ్తున్న ఓ అమ్మాయిని చూసి రావే.. రావే అని కామెంట్ చేశాడు.. ఆ అమ్మాయికి ఒళ్లు మండి న్యాయాధికారికి ఫిర్యాదు చేసింది. ఇప్పటిలా ఎంపీలకైనా సమన్లు జారీ చేసి 'ముద్దు ముచ్చట్ల'కు జవాబు చెప్పండి అని ఆదేశించే మహిళా కమిషన్లు అప్పట్లో లేవు. ఎమ్మెల్యేలు వేధిస్తున్నారని ప్రెస్ మీట్లు పెట్టి చెప్పడానికి మీడియా కూడా లేదు. పైగా ధైర్యం ఉన్న ఇప్పటి 'నవ్య' తరం కూడా కాదు. ఆడియో, వీడియోలు షేర్ చెయ్యడానికి సోషల్ మీడియా కూడా లేదు. అప్పట్లో న్యాయాధికారి, ఆపై మహారాజు గారే యాక్షన్ తీసుకోవాలి. న్యాయాధికారి విషయాన్ని సీరియస్‌గానే తీసుకుని విచారణకు రమ్మని ఆకతాయిని ఆదేశించాడు.

ఇది తెలిసిన ఆకతాయి తండ్రి కంగారు పడిపోయాడు. ఇంట్లోనే ఆకతాయికి దేహశుద్ధి చేశాడు. కానీ, రాజదండన నుంచి ఎలా తప్పించడమో పాలు పోలేదు. ఆయనకు తెలిసిన కవి ఒకరు రాజు గారి ఆస్థానంలో ఉన్నారు. కవి గారి దగ్గరికి వెళ్లి గోడు వెళ్లబోసుకున్నాడు. కవి సాంతం విని, కొడుకును దార్లో పెట్టుకుంటానని తండ్రి వద్ద గట్టిగా మాట తీసుకుని ఓ ఐడియా చెప్పాడు. ''నేను ఓ శ్లోకం చెబుతా, న్యాయవిచారణ సమయంలో మీ కొడుకును చెప్పమను..'' అంటూ, దానితో పాటు ముందుగా బాధితురాలైన అమ్మాయి ఇంటికి వెళ్లి క్షమాపణ చెప్పండి అని సలహా ఇచ్చాడు. తండ్రి ఆయన చెప్పినట్టుగా చేసి ఆకతాయితో శ్లోకం బట్టీ పట్టించాడు. న్యాయవిచారణ జరుగుతున్నపుడు.. 'నేను రావే రావే అని ఊరికే అనలేదు, నేను అప్పుడు చదివిన శ్లోకంలో భాగమే అది..' అని కవి చెప్పిన శ్లోకం చదివాడు.

గేహే గేహే జంగమా హేమవల్లీ
వల్లాం వల్లాం పారణశ్చంద్రబింబః
బింబే బింబే కోకిలా మంజురావః
రావే రావే జాయతే పంచబాణః

(ప్రతి ఇంట్లోనూ ఒక కదిలే బంగారు తీగ ఉంది. ప్రతి తీగలోనూ ఒక పూర్ణ చంద్రబింబం ఉంది. ప్రతీ చంద్ర బింబంలోనూ ఒక కోకిల స్వరం ఉంది. ఆ ప్రతీ ధ్వనిలోనూ మన్మథుడు ఉన్నాడు.)

ఈ శ్లోకం చదువుతుండగా ఆమెకు రావే రావే అని మాత్రమే వినిపించిందని వివరణ ఇచ్చాడు. అంతకు ముందే ఇంటికి వెళ్లి క్షమాపణ చెప్పిన కారణంగా ఆ అమ్మాయి కూడా మరింత రెట్టించ లేదు.

ఇప్పటి 'నవ్య 'తరంలాగా.. ''మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే తాట తీస్తా, కిరోసిన్ పోసి నిప్పంటిస్తా...'' అని ఘాటుగా హెచ్చరించలేదు గానీ బుద్ధిగా ఉండమని సూచించింది.

కథ కంచికి వెళ్లింది. అందరూ ఇంటికి వెళ్లారు.

ఈ శ్లోకం రాసిచ్చిన కవి 'కాళిదాసే' అని ప్రచారం.

....

ఇది కాళిదాసు కవిత్వమా, ఎవరిదైనా పైత్యమా అన్న విషయం వదిలేస్తే.. ఆ కాలం నుంచీ అమ్మాయిలంటే చులకనగా చూసే ఆకతాయిలున్నారు, విచారణలున్నాయి, క్షమాపణలున్నాయి. ఇప్పటికీ పరిస్థితేం పెద్దగా మారలేదు. మెడికోలైనా, ఎమ్మెల్యేలైనా, ఎంపీలైనా.. ఎవరయినా అంతే.

....

పైన చెప్పుకున్న దానికి.. కింద మనం మాట్లాడుకోబోయే విషయానికి క్లోజ్ రిలేషన్ ఉందా.. బాదరాయణ సంబంధమేనా..? మీరే తేల్చుకోండి.

ఈ నెలలోనే మహిళా దినోత్సవం వచ్చింది. మళ్లీ మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రస్తావనా వచ్చింది. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో మహిళా సాధికారత కోసం ఢిల్లీలో దీక్ష...దీని వెనుక వేరే కారణాలున్నాయని విమర్శలున్నాయనుకోండి. కాసింత చర్చయితే అయ్యింది.

మహిళా రిజర్వేషన్ బిల్లు ఆశలు సాకారమైతే, వారి సాధికారతవైపు సమాజం అడుగులు వేస్తే... మహిళలపై వివక్ష తగ్గితే.. గౌరవం పెరిగితే పైన చెప్పుకున్న సంఘటనలు లాంటివి తగ్గుముఖం పట్టే అవకాశం ఉందన్న ఆశలు కనిపించాయి. కానీ, ప్రతి మహిళా దినోత్సవం రోజు అన్ని పార్టీలు, సంఘాలు, ప్రముఖులు మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రస్తావించడం. కుదిరితే కాసిన్ని దీక్షలు.. ఆ తర్వాత మరిచి పోవడం.. అంతే, ఒకటి కాదు రెండు కాదు 26 ఏళ్లుగా ఇదే తంతు.



....

..ఎందుకంటే పైన మనం చెప్పుకున్న కామెంట్లూ, కథలూ కంచికిపోలే.. మన మధ్యే ఉన్నాయి. ఇవి ఆకతాయిల మాటలు కాదు.. మీరే చూడండి.

– ఓ రోజు మహిళా బిల్లుపై సీరియస్ చర్చ జరుగుతోంది. సమర్థించే వారు గొంతు చించుకుంటున్నారు. ఇంతలో పార్లమెంట్ బయట తిరుగుతున్న ఎంపీని 'మహిళా రిజర్వేషన్ బిల్లుపై మీ అభిప్రాయం ఏమిటి..' అని మీడియా అడిగితే ఆయన సమాధానం... 'మా ఆవిడ చేస్తున్న షాపింగ్ బిల్లు మీద తప్ప నాకే బిల్లుపై ఆసక్తి, ధ్యాసా లేవు..' అని

– ఆ తర్వాత ఓ రోజు..'మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్‌కు ఏం తెస్తుంది..? బ్యూటీపార్లర్‌లకు వెళ్లే బాబ్డ్ హెయిర్ మహిళలనా...' మహిళా బిల్లుపై లాలూప్రసాద్ రియాక్షన్.

చట్టసభల్లో కూర్చుని మన రాత రాసే నేతల ధోరణి ఇలా ఉంటే.. బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో ఓ టీవీ చానల్ కామన్ పీపుల్‌తో పిచ్చాపాటిగా మాట్లాడింది.. వినండి.

– పార్లమెంట్‌లో అంత చర్చ జరుగుతోందిగా, ఈ బిల్లుపై మీ అభిప్రాయం ఏమిటని అడిగితే.. వారిలో కొందరి సమాధానాలు ఇవీ.

– 'అవునవును నేను కూడా విన్నాను. మా ఆవిడ కూడా అడిగింది. మరీ రచ్చ బాగా చేస్తున్నారు.. బిల్లు ఎక్కువ అయ్యిందా అని..' (జోక్ ?)

– 'నాకు బిల్ క్లింటన్ మాత్రమే తెలుసు ఈ బిల్ గురించి ఐడియా లేదు..' (లైట్?)

– ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఎప్పుడొస్తుంది..?

'వారికి అధికారం వచ్చేసిందిగా.. క్రెడిట్ కార్డ్‌ల రాకతో' (వెటకారం?)

– ఉమెన్ రిజర్వేషన్ వస్తుందా..?

'లాలూ రైల్వే కోచ్‌లలో మహిళలకు కొన్ని కేటాయించాడుగా..'(సరదా?)

– చట్టసభల్లో మహిళల కోటా గురించి చెప్పండి.

'ఇప్పుడు ఇంట్లో అంతా వారి పెత్తనం.. ఇక రెండు సభల్లో వారిదే పెత్తనం అవుతుంది. దేశాన్ని వారే నడుపుతారు..' (తేలిక భావం?)

బిల్లు తేవాల్సిన చట్టసభల్లో నాయకులకూ, బయట సాధారణ ప్రజలకూ ఒకే రకమైన భావజాలం ఉన్నాక, 26 ఏళ్లే కాదు ఎన్నేళ్లయినా అలాగే ఉంటుంది. మహిళా దినోత్సవం రోజో, ఎన్నికల మేనిఫెస్టోల్లోనో, ఖాళీ దొరికినప్పుడు మాట్లాడుకోవడానికో ఓ సబ్జెక్ట్ అవుతుంది.

....

'రాజ్యసభ నుంచి లోక్ సభకు నడిచి వెళ్లడానికి ఐదు నిమిషాలు పడుతుంది. కానీ, రిజర్వేషన్ బిల్లుకు మాత్రం ఇన్నేళ్లయినా (రాజ్యసభ ఆమోదించిన 2010 నుంచి) లోక్ సభకు చేరనే లేదు..'

– ఇది బృందా కారత్ ఆవేదన.

పైన చెప్పుకున్నట్టుగా మన పరిస్థితి ఇలాగే ఉంటే, ఎన్నాళ్లయినా బిల్లు లోక్‌సభ వైపు నడుస్తూనే ఉంటుంది.

మనమే కాదు.. అంతటా అంతే

ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం తాజా నివేదిక చూడండి

- ప్రపంచవ్యాప్తంగా మంత్రి పదవుల్లో ఉన్న మహిళలు 22.8 శాతమే. కేవలం 13 దేశాల్లోని కేబినెట్లలో మాత్రమే 50%, ఆపైన మహిళా మంత్రులు ఉన్నారు.
- మహిళలు మంత్రులుగా ఉన్నా వారికి కేటాయిస్తున్న శాఖల ప్రాధాన్యత తక్కువే.
- ప్రజలు నేరుగా ఎన్నుకునే దిగువ సభల్లో (లోక్‌సభ తరహాలో) మహిళా పార్లమెంటేరియన్లు 26.5 శాతమే. అయితే ఇది 1995లో 11%గానే ఉండగా ప్రస్తుతం కొంత మెరుగుపడింది.
- దిగువ సభలో 50%, అంతకన్నా ఎక్కువ మంది ఎంపీలున్న దేశాలు ఆరు మాత్రమే. రువాండాలో 61%, క్యూబాలో 53%, నికరాగ్వాలో 52%, మెక్సికో, న్యూజిలాండ్, యూఏఈలలో 50% మహిళా ఎంపీలున్నారు. ఈ ఆరింటితోపాటు మరో 17 దేశాల్లో 40% పైన మహిళా ఎంపీలు ఉన్నారు. 22 దేశాల్లో మహిళా ఎంపీలు 10% కన్నా తక్కువే.

కలసి ఉంటే కలదు సుఖం

పాండవులతో యుద్ధం వద్దని ధృతరాష్ట్రుడు ఎంత చెప్పినా దుర్యోధనుడు వినలేదు. తనకు తోడుగా దుశ్శాసనుడు, కర్ణుడు ఉండగా యుద్ధంలో పాండవులను వధించటం సులువైన పని అని ప్రగల్భాలు పలికాడు. ఆ సమయంలో విదురుడు కల్పించుకొని జ్ఞాతి వైరం అనర్థ హేతువనీ, సంధి శ్రేయస్కరమనీ చెబుతాడు. తన మాటలకు బలం చేకూర్చటానికి పెద్దలు చెప్పగా తాను విన్న కథనొక దానిని జోడించి చెబుతాడు. ఆ కథ వ్యాసభారతం ఉద్యోగ పర్వంలో ఉన్నది.

వేటగాడొకడు పక్షులను పట్టుకోవటానికి నేల మీద వలను వేసి ఉంచాడు. ఒకటిగా కలిసి తిరిగే రెండు పక్షులు ఆ వలలో పడి చిక్కుకొన్నవి. అపుడా పక్షులు ఆ వలను ఎత్తుకొని ఆకాశానికి ఎగిరిపోయాయి. వేటగాడు నిరాశ చెందక ఆ పక్షులు ఆకాశంలో ఎటుపోతే అతడు కూడా అటే భూమి మీద పరిగెత్తుతూ పోతున్నాడు. ఇది చూచిన ఒక మునీశ్వరుడు అతడిని, 'ఆకాశంలో ఎగిరే పక్షులను భూమి మీద అనుసరిస్తూ పోయే నీకు వాటిని చేజిక్కించుకొనటం సాధ్యమేనా?' అని అడిగాడు. అందుకు వేటగాడు, 'ఆ రెండు పక్షులు కలిసి ఉన్నాయి కాబట్టి వలను ఎత్తుకొని పోగలుగుతున్నాయి. ఎప్పుడైతే అవి కలహించుకొంటాయో అప్పుడు ఆ వల కిందపడి అవి నా చేతికి చిక్కుతాయి' అని చెప్పాడు. అతడు అలా అన్న కొద్ది సేపటికే ఆ రెండు పక్షులకు చావు రాసి పెట్టి ఉండటం చేత వాటి బుద్ధి వక్రించి పరస్పరం కలహించుకొని కిందపడ్డాయి. వెంటనే వేటగాడు వాటి వద్దకు వెళ్ళి వాటిని బంధించాడు.



ఈ కథ చెప్పి విదురుడు, ''ఆ విధంగానే కుటుంబంలోని వారు ధనం కోసం పరస్పరం కలహించుకొని, ఆ పక్షుల మాదిరిగా శత్రువుల బారిన పడతారు. ఒక చోట కూర్చొని భోజనం చెయ్యటం, ప్రేమతో ఒకరినొకరు పలకరించుకొనటం, ఒకరి కష్ట సుఖాలు మరొకరు పంచుకోవటం, ఎల్లవేళలా కలిసిమెలిసి ఉండటం – ఇవి బంధువులు, సోదరులు మరువకుండా చేయవలసిన పనులు. అలా కాకుండా తమలో తాము విరోధించడం తగని పని. అప్పుడప్పుడు పెద్దలను కలుసుకొంటూ వారు చెప్పే హితవచనాలను ఆచరణలో పెడుతూ ఉండే పరిశుద్ధ హృదయులు, సింహ రక్షితమైన వనం వలె ఇతరుల ఆక్రమణకు గురి కారు. శత్రువులు అట్టి వారి వద్దకు రావటానికి ధైర్యం చెయ్యరు. ఒక కుటుంబం వారు పరస్పరం కలహించుకొని విడివిడిగా ఉంటే అసమర్థులవుతారు. కలిసి ఒకటిగా ఉన్నప్పుడు బలపరాక్రమవంతులై సుఖపడతారు'' అని హితవు చెబుతాడు.

విదురుడు చెప్పిన ఈ హిత వచనాలు త్రికాల సత్యాలు గదా!

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: బ.అష్టమి ప.3.19 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: మూల రా.3.19 వరకు, తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: ప.12.09 నుండి 1.40 వరకు, తిరిగి రా.1.46 నుండి 3.19 వరకు, దుర్ముహూర్తం: ప.11.44 నుండి 12.34 వరకు, అమృతఘడియలు: రా.9.13 నుండి 10.44 ; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 6.13, సూర్యాస్తమయం: 6.06.

● అంజన్న సన్నిధిలో కవిత



కవితను ఆశీర్వదిస్తున్న అర్చకులు

కొండగట్టు (చొప్పదండి): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ముందస్తు ఎలాంటి సమాచారం లేకుండానే వేకువజామున సుమారు ఐదున్నర గంటల సమయంలో ఆలయానికి చేరుకున్న కవితకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. ఆమె గోత్రనామాలపై ప్రత్యేక పూజలు చేశారు. తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

● 'నవమి' వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



ఉత్సవ వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తదితరులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఈ నెల 30, 31 తేదీల్లో జరగనున్న శ్రీరామనవమి, పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవ వాల్‌పోస్టర్లను దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. అంతకుముందు అర్చకులు మంత్రి దంపతులకు వేదాశీర్వచనం చేయగా, ఈవో రమాదేవి స్వామివారి ప్రసాదం, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఉత్సవ ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు పొడిచేటి సీతారామానుజాచార్యులు, సీసీ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

● మిర్చి.. ఆల్ టైం రికార్డ్



గరిష్ట ధర దక్కించుకున్న రైతును సత్కరిస్తున్న మార్కెట్ చైర్‌పర్సన్ శ్వేత

కేసముద్రం/ఖమ్మం వ్యవసాయం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధర రికార్డు స్థాయిలో క్వింటాకు రూ.22,151 పలికింది. మార్కెట్‌కు మంగళవారం 1,083 బస్తాల మిర్చి అమ్మకానికి రాగా.. గరిష్ట ధర రూ.22,151, కనిష్ట ధర రూ.18,687 పలికింది. మిర్చి తాలు రకం గరిష్ట ధర రూ.13,811, కనిష్ట ధర రూ.13,302 పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. కాగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం తేజా రకం మిర్చి క్వింటాకు రూ.21,800 ధర పలికింది.

భారీగా పెరిగిన కరోనా కేసులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కరోనా కేసుల సంఖ్య భారీగా పెరిగింది. మంగళవారం 5,254 మందికి నిర్వహించిన కరోనా నిర్ధారణ పరీక్షల్లో 52 మందికి కోవిడ్ పాజిటివ్‌గా తేలింది. దీంతో రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన కేసుల సంఖ్య 8.42 లక్షలకు చేరినట్లు ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు వెల్లడించారు.

నేడు ఢిల్లీకి ఎమ్మెల్సీ కవిత

సాక్షి, హైదరాబాద్: భారత్ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బుధవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లు అనే అంశంపై ఢిల్లీలోని మెరిడియన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె పాల్గొననున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో పలు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు, పౌర సమాజం, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొననున్నారు.

24 గంటలూ ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలు

- ఏ వేళలోనైనా హెల్ప్‌లైన్లు
- వడదెబ్బల నివారణకు ఎప్పుడైనా సిద్ధం
- నేరుగా బాధితుల వద్దకు వెళ్లేలా ఆదేశాలు
- అన్ని అంగన్‌వాడీలు, పీహెచ్‌సీల్లో అందుబాటులో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు
- కార్యాచరణ ప్రణాళిక ప్రకటించిన ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు



సాక్షి, హైదరాబాద్: ఎండల నుంచి ప్రజలను రక్షించేందుకు వైద్య ఆరోగ్యశాఖ కార్యాచరణ ప్రణాళిక ప్రకటించింది. ఈ మేరకు ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు మంగళవారం మార్గదర్శకాలు జారీచేశారు. ఎండ తీవ్రత మార్చి నుంచి జూన్ మధ్య ఉంటుందని, కొన్ని సందర్భాల్లో జూలై వరకు కూడా ఉండొచ్చని ఆయన పేర్కొన్నారు. ఈక్రమంలో జిల్లాల్లో 24 గంటలూ పనిచేసేలా హెల్ప్‌లైన్లను ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు. జిల్లా నిఘా అధికారి నోడల్ ఆఫీసర్‌గా ఉంటారన్నారు. వడదెబ్బ తదితర ఆరోగ్య సమస్యలకు ఎవరైనా గురైతే వారిని కాపాడేందుకు జిల్లా, డివిజనల్ స్థాయిల్లో 24 గంటలూ పనిచేసే ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అన్ని జిల్లాల వైద్య ఆరోగ్య అధికారులు వడదెబ్బ కేసులు/మరణాలు, తీసుకున్న నివారణ చర్యలపై రోజువారీ నివేదికను తనకు పంపాలని కోరారు. ప్రతీ రోజూ నీటి క్లోరినేషన్‌ను పీహెచ్‌సీ వైద్యాధికారులు తనిఖీ చేయాలని కోరారు.

మార్గదర్శకాలివీ...



- అన్ని పీహెచ్‌సీలు, ఉప ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలి.
- ఎండదెబ్బకు అందించాల్సిన ప్రాథమిక చికిత్సపై వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వాలి.
- అన్ని ఆసుపత్రుల్లోనూ అత్యవసర ఔషధాలను తగినంత సంఖ్యలో నిల్వ ఉంచాలి.
- సీరియస్ కేసులేవైనా వస్తే వెంటనే సమీపంలోని ఆసుపత్రులకు తరలించాలి.
- శిశువులు, పిల్లలు, గర్భిణీ స్త్రీలు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఆయా వర్గాలకు చెందినవారు ఎండకు దూరంగా ఉండాలి.
- ఆరు బయట పనిచేసే కార్మికులు మధ్యాహ్నం 12 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య ఎండలో పనిచేయకూడదు. పని ప్రదేశంలో వారికి ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా సురక్షితమైన తాగునీటిని అందించాలి. పని చేసే ప్రదేశానికి సమీపంలోని కమ్యూనిటీ హాల్స్‌లో అవసరమైన షెల్టర్లను ఏర్పాటు చేయాలి.
- పట్టణ ప్రాంతాలు, మునిసిపాలిటీలలో స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతృత్వ సంస్థలు 'చలివేంద్రం' ద్వారా సురక్షితమైన మంచినీటి సరఫరా అందజేయాలి. ● నీటి పైపులైన్‌లు లీకేజీ కాకుండా చర్యలు తీసుకోవాలి.
- పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, జిల్లా ఆసుపత్రులు, మెడికల్ కాలేజీల్లో ఎండ వేడిమి నుంచి ప్రజలను కాపాడేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలి.
- ఆసుపత్రుల్లో బాధితులకు వడదెబ్బ పాలైన వారి కోసం ప్రత్యేకంగా పడకలను సిద్ధం చేయాలి.
- ప్రజలు దాహం వేయకపోయినా, వీలైనంత వరకు తగినంత నీరు తాగాలి. ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ (ఓఆర్‌ఎస్) వాడాలి. నిమ్మరసం, మజ్జిగ లేదా లస్సీ, పండ్ల రసాలు వంటి వాటిని తీసుకోవాలి. బయటకు వెళ్లినప్పుడు నీటిని తీసుకెళ్లాలి. ● పుచ్చకాయ, నారింజ, ద్రాక్ష, పైనాపిల్, దోసకాయ వంటి పండ్లు, కూరగాయలను తినాలి.
- సన్నని వదులుగా ఉండే కాటన్ వస్త్రాలను ధరించడం మంచిది
- ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ, టవల్ వంటి వాటిని ఉపయోగించాలి.
- పగటిపూట కిటికీలు, కర్టెన్లను మూసి ఉంచాలి.
- వేసవి ఎక్కువగా ఉండే సమయంలో వంట చేయడం మానుకోండి. వంట ప్రదేశాన్ని తగినంతగా వెంటిలేట్ చేయడానికి తలుపులు, కిటికీలను తెరవండి. ● ఆల్కహాల్, టీ, కాఫీ, శీతల పానీయాలు లేదా పెద్ద మొత్తంలో చక్కెరతో కూడిన పానీయాలను తాగకూడదు.

నిత్యావసర మార్కెట్లోకి మార్క్‌ఫెడ్!

▶ మొదటి పేజీ తరువాయి

మూటగట్టుకోవాల్సి వచ్చింది. దీనికితోడు 2014 నుంచి ఇప్పటివరకు దాదాపు రూ.2 వేల కోట్లకు పైగా అప్పులు పేరుకుపోయాయి. దీంతో సంస్థ మనుగడకే ప్రమాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఎలాగైనా లాభాలబాట పట్టాలని సంస్థ భావిస్తోంది.

మార్క్‌ఫెడ్ ప్రతిపాదనల్లోని ముఖ్యాంశాలు..

- వంట నూనెలు, అన్ని రకాల బియ్యం, డ్రైఫ్రూట్స్, పప్పులు, గోధుమ పిండి, పాల ఉత్పత్తులు సహా అన్ని రకాల నిత్యావసరాలను ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, కాలేజీలు, మహిళా శిశుసంక్షేమ, క్రీడ, వైద్య ఆరోగ్య, జైళ్లకు సరఫరా (నాణ్యమైన నిత్యావసరాలను టెండర్ల ద్వారా సేకరించి విక్రయించడం ద్వారా రెండు శాతం కమీషన్ పొందాలని మార్క్‌ఫెడ్ యోచన)
- చిన్న, మధ్యస్థాయి శుద్ధి కర్మాగారాల ఏర్పాటు. ప్రధానంగా పసుపు, పప్పు నూర్పిడి, చిల్లీ శుద్ధి ప్లాంట్లు. ● పురుగుమందులు, విత్తనాలు, ఇతర వ్యవసాయ ఇన్‌పుట్స్ విక్రయాలు.
- పైలట్ ప్రాజెక్టుగా ఒకట్రెండు జిల్లాల్లో సేకరణ.
- వర్మీ కంపోస్టు విక్రయించడం ద్వారా సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. ● సేంద్రియ తేనె, మామిడి పండ్ల విక్రయంపై దృష్టి.
- పసుపు, మిరప పొడర్‌ను వినియోగదారులకు అందజేయడం. ● కేంద్రం ప్రవేశపెట్టిన శ్రీ అన్న పథకం సాయంతో మిల్లెట్ల మార్కెటింగ్.
- ఖమ్మం, కరీంనగర్, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)తో మార్క్‌ఫెడ్ స్థలాల్లో వాణిజ్య సముదాయాల నిర్మాణం.
- ఆదిలాబాద్‌లో 10 వేల మెట్రిక్ టన్నులు, నిర్మల్‌లో 20 వేల మెట్రిక్ టన్నులు, కొత్తగూడెం జిల్లాలో 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల గోదాముల నిర్మాణం.
- బ్యాంకు రుణాలతో మిర్యాలగూడ, నిర్మల్‌లలో రైస్ ఫోర్టిఫికేషన్ ప్రాజెక్టులు, తాగునీటి ట్రీట్మెంట్ ప్లాంట్ల ఏర్పాటు.

వీ6, వెలుగు మీడియా సంస్థలపై బీఆర్‌ఎస్ బహిష్కరణ వేటు

- మీడియా సమావేశాలకు ఈ సంస్థలను అనుమతించకూడదని నిర్ణయం
- బీఆర్‌ఎస్ నిర్ణయంపై మండిపడ్డ పాత్రికేయ సంఘాలు

సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) నిర్వహించే మీడియా సమావేశాలకు వీ6 చానల్, వెలుగు దినపత్రికలను అనుమతించకూడదని ఆ పార్టీ నిర్ణయించింది. తెలంగాణ భవన్‌లో ఇటీవల పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారక రామారావు నిర్వహించిన మీడియా సమావేశంలోనే ఈ రెండింటిపై నిషేధాజ్ఞలు పాటించాలని భావిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. తదనుగుణంగా వీ6, వెలుగు పత్రికలను తమ పార్టీ బహిష్కరించడంతోపాటుగా ఈ సంస్థలు నిర్వహించే చర్చలతో సహా, ఎలాంటి కార్యక్రమాల్లోనూ పార్టీ ప్రతినిధులెవరూ పాల్గొనకూడదని మంగళవారం బీఆర్‌ఎస్ ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ రెండు మీడియాలు తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తూ, బీజేపీకి కొమ్ముకాస్తున్నందునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

బహిష్కరణ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి

బీఆర్‌ఎస్ సమావేశాలకు వీ6 న్యూస్ చానల్, వెలుగు దినపత్రికలను బహిష్కరించాలని ఆపార్టీ తీసుకున్న నిర్ణయం పూర్తిగా అప్రజాస్వామికమైనదని తెలంగాణ జర్నలిస్టుల అధ్యయన వేదిక అభిప్రాయపడింది. మీడియాపై బీఆర్‌ఎస్ కక్ష సాధింపు చర్యలకు దిగడం హేయమైన చర్యగా వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.వేణుగోపాల్ రెడ్డి, సాధిక్ పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నిర్ణయాన్ని టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సోమయ్య, బసవ పున్నయ్య ఖండించారు.

అవి అరుదైనవి... విలువైనవే

ఆదిమానవుల రాతి చిత్రాలపై రాష్ట్ర వారసత్వ శాఖ ప్రకటన

- సాక్షి కథనంతో కదిలిన శాఖ అధికారులు



రాతి చిత్రాలను పరిశీలిస్తున్న రాములునాయక్ బృందం

సాక్షి, హైదరాబాద్: గుండ్లపోచంపల్లి సమీపంలో మల్లన్న గుట్టమీద ఉన్న ఆదిమానవుల కాలం నాటి రాతి చిత్రాలు అరుదైనవి, అత్యంత విలువైనవిగా రాష్ట్ర వారసత్వ శాఖ (పురావస్తు శాఖ) గుర్తించింది. వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఉందని, వెంచర్ల కోసం రియల్ వ్యాపారులు ఆ ప్రాంతాన్ని చదును చేస్తుండటంతో ఈ రాతి చిత్రాలున్న గుట్ట ప్రమాదంలో పడిందని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాములు నాయక్ వెల్లడించారు. గుండ్లపోచంపల్లి గుట్టల్లో ఉన్న రాతి చిత్రాల తావులను రియల్ వెంచర్ల విస్తరణతో ధ్వంసమవుతున్న తీరును వివరిస్తూ ''చరిత్రను చెరిపేస్తున్నారు'' శీర్షికతో మంగళవారం 'సాక్షి' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన తెలంగాణ వారసత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాములు నాయక్ ఆ శాఖ అధికారులు భానుమూర్తి, సైదులు, సతీశ్‌లతో కలిసి మంగళవారం మధ్యాహ్నం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ నాలుగు ప్రాంతాల్లో ఆదిమానవుల చిత్రాలున్నట్టు గుర్తించామని, మూడు తావులను పరిశీలించామని, రెండు చోట్ల చిత్రాలున్నాయని రాములు నాయక్ 'సాక్షి'తో చెప్పారు. ఆ నాలుగు రాక్ పెయింటింగ్ షెల్టర్లను కాపాడేందుకు ఆదేశాలు ఇవ్వాల్సిందిగా కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్టు వివరించారు.

వెంటనే పరిరక్షించాలి: కొత్త తెలంగాణ చరిత్ర బృందం

ఆ అరుదైన రాతి చిత్రాలను వెంటనే పరిరక్షించని పక్షంలో ధ్వంసమయ్యే ప్రమాదముందని కొత్త తెలంగాణ చరిత్ర బృందం ఆందోళన వ్యక్తం చేసింది. ఆ బృందం సభ్యులు వేముగంటి మురళి, భద్ర గిరీశ్, డా.మండల స్వామి, మనోజ్‌లతో కూడిన బృందం వాటిని పరిశీలించింది. తెలంగాణ ప్రాంతంలో ఏనుగుల మనుగడ ఉండేదనటానికి సాక్ష్యంగా అక్కడ ఏనుగు చిత్రముందని, విచిత్రమైన ఆకృతుల్లో ఉన్న జంతువుల చిత్రాలున్నాయని, 10 వేల ఏళ్ల నుంచి 4 వేల ఏళ్ల క్రితం వరకు వివిధ కాలాల్లో బొమ్మలు గీసిన జాడలున్నాయని తెలిపారు. భవిష్యత్తులో కొత్త అధ్యయనాలకు ఇవి దోహదపడే అవకాశం ఉన్నందున వాటిని పరిరక్షించాలని కోరారు.

ఆఖరి ఆయకట్టు అంతేనా?

▶ మొదటి పేజీ తరువాయి

తల్లాడ, రేజర్ల, కొత్త వెంకటగిరి గ్రామాల ఆయకట్టుకు సాగర్ జలాలు అందక రైతులు ఈనెల 11న ఆందోళనకు దిగారు. అలాగే, బోనకల్ బ్రాంచి కెనాల్ పరిధిలోని 500 ఎకరాల మేర పంట దెబ్బతిన్నది.

పరిహారం అందించాల్సిందే...



బోనకల్ మండలం ఆళ్లపాడుకు చెందిన రైతు బొమ్మగాని సాంబయ్య ఐదెకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న సాగు చేశాడు. ఆయన భార్య పుస్తెలతాడు తాకట్టు పెట్టి రూ.2 లక్షల మేర పెట్టుబడి పెట్టాడు. కంకిదశలో ఉండగా సాగర్ జలాలు అందక పంట ఎండిపోయింది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ఆళ్లపాడు మైనర్‌కు నీరు విడుదల చేయలేదని.. ఎండిపోయిన మొక్కజొన్న పంట సర్వే చేయించి పరిహారం అందించాలని సాంబయ్య కోరుతున్నాడు.

ఏప్రిల్ వరకు నీరందిస్తామని ఫిబ్రవరిలోనే చేతులెత్తేశారు..



తల్లాడ మండలం గాంధీనగర్ తండాకు చెందిన భూక్యా లక్ష్మి యాసంగిలో రెండున్నర ఎకరాలు రూ.50వేలకు కౌలుకు తీసుకుంది. తెలగవరం సబ్ మైనర్, సిరిపురం ఎన్నెస్పీ మేజర్ కాల్వ కింద రేజర్లలో 75 రోజుల క్రితం వరి నాట్లు వేయగా, నెల రోజులుగా నీరు రావడం లేదు. దీంతో వరి మొత్తం ఎండిపోగా.. వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న లక్ష్మి, ఆమె భర్త తమను ఆదుకునే వారెవరని ప్రశ్నిస్తున్నారు. ఏప్రిల్ వరకు నీరందిస్తామన్న అధికారులు ఫిబ్రవరిలోనే ఇవ్వకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

క్లుప్తంగా...

అమెరికా డ్రోన్‌ను ఢీకొట్టిన రష్యా యుద్ధ విమానం

కీవ్: రష్యా యుద్ధ విమానం నల్ల సముద్రంపై అమెరికా నిఘా డ్రోన్‌ను ఢీకొట్టింది. మంగళవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. దీంతో అమెరికా సైన్యం తమ డ్రోన్‌ను కిందకు దించింది. తమ హెచ్చరికలను లెక్కచేయకుండా ఉక్రెయిన్‌పై దండయాత్ర కొనసాగిస్తున్న రష్యాపై అమెరికా ఇప్పటికే ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అమెరికా–రష్యా మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా డ్రోన్‌ను రష్యా ఫైటర్ జెట్ ఢీకొట్టడం సంచలనాత్మకంగా మారింది. తాజా సంఘటన గురించి అమెరికా జాతీయ భద్రతా సలహాదారు అధ్యక్షుడు జో బైడెన్‌కు తెలియజేశారు. నల్ల సముద్రంపై అంతర్జాతీయ ఎయిర్ స్పేస్‌లో రష్యాకు చెందిన రెండు ఎస్‌యూ–27 ఫైటర్ జెట్లు ఎలాంటి రక్షణ లేకుండా విన్యాసాలు చేపట్టాయని, అందులో ఒక విమానం అమెరికాకు చెందిన ఎంక్యూ–9 డ్రోన్‌ను ఢీకొట్టిందని యూఎస్ యూరోపియన్ కమాండ్ ఒక ప్రకటనలో వెల్లడించింది.

రైల్లో ప్రయాణికురాలిపై... టీటీఈ మూత్ర విసర్జన

లక్నో/న్యూఢిల్లీ: ప్రయాణికుల మూత్ర విసర్జన ఘటనలు విమానాలను దాటుకుని రైళ్లకూ పాకుతున్నాయి. మార్చి 13న కోల్‌కతా–అమృత్‌సర్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికురాలిపై ఓ ప్రబుద్ధుడు మూత్ర విసర్జన చేశాడు! అతను రైల్వే టీటీఈగా పని చేస్తుండటం విశేషం! బాధితురాలు బిహార్‌లోని కియుల్ నుంచి పంజాబ్‌లోని అమృత్‌సర్‌కు భర్తతో కలిసి వెళ్తోంది. అర్ధరాత్రి వేళ పై బెర్త్‌లో ఉన్న మున్నా కుమార్ ఆమె తలపై మూత్రం పోశాడు. భర్త ఫిర్యాదు మేరకు మున్నాను అరెస్ట్ చేసి జ్యుడీసియల్ కస్టడీకి తరలించారు. దీన్ని తీవ్రంగా తీసుకున్న రైల్వే శాఖ అతన్ని సస్పెండ్ చేసింది. అతను మద్యం మత్తులోనే ఈ పని చేసినట్టు ఒక పోలీసు ఉన్నతాధికారి చెప్పారు.

తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసిన... ఇమ్రాన్ అరెస్టు యత్నం

లాహోర్: తోషాఖానా కేసులో పాకిస్తాన్ పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను అరెస్ట్ చేయడానికి మంగళవారం పోలీసులు విఫలయత్నం చేశారు. ఈ సందర్భంగా లాహోర్‌లోని నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఇమ్రాన్ మద్దతుదారులు వేలాదిగా బైఠాయించి రాళ్లు రువ్వడంతో పోలీసులు గాయపడ్డారు. ఆందోళనకారులపైకి టియర్ గ్యాస్, వాటర్ కెనన్‌లు ప్రయోగించారు. ''నన్ను అరెస్ట్ చేస్తే ప్రశాంతంగా ఉండొచ్చనుకుంటున్నారు. అది తప్పని నిరూపిస్తాం'' అని ఇమ్రాన్ అన్నారు.

ఏనుగమ్మా ఏనుగు

ఏనుగుకి, మనిషికి మధ్య ఉండే భావోద్వేగ బంధం ప్రపంచాన్ని కదిలించింది. విశ్వవేదికపై ఏనుగు ఘీంకారం ఆస్కార్ కుంభస్థలాన్ని కొట్టింది. డాక్యుమెంటరీలు తీసే వారికి ఎలిఫెంట్ విస్పరర్స్ వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చింది. మనిషికి, జంతువుకి, ప్రకృతికి మధ్య ఉండే గాఢానుబంధం మరోసారి చర్చకు వచ్చింది. మన దేశంలో ఏనుగుల పరిస్థితి ఏమిటి? ఏనుగుల సంరక్షణ ఏ విధంగా ఉంది?

ఏనుగంటే మనకి ఒక జంతువు కాదు. అంతకంటే ఎక్కువే. గణనాథుడి మారురూపంగా గజరాజుల్ని పూజిస్తాం.. ఏనుగమ్మా ఏనుగు మా ఊరొచ్చింది ఏనుగు మంచినీళ్లు తాగింది ఏనుగూ అంటూ ఏనుగు మనకెంత ముఖ్యమైనదో చిన్నప్పట్నుంచి ఉగ్గుపాలతో నేర్పిస్తాం. చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకు ఏనుగుని చూడడమంటే అదొక సంబ్రమం. కానీ ఏనుగుల్ని కాపాడుకోవడంలో మనం అంతగా శ్రద్ధ కనబరచడం లేదనే చెప్పాలి. ఏనుగు దంతాల కోసం వాటిని వేటాడడం, ఏనుగుల ఆవాసాలైనా కారిడార్లను ఆక్రమించుకోవడం, ఏనుగుల కారిడార్లలోనే వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణం వంటి చర్యలతో ఏనుగుల సంరక్షణ ప్రశ్నార్థకంగా మారింది.


సంరక్షణకి ఏం చేస్తున్నాం?

జీవవైవిధ్యానికి అత్యంత కీలకమైన ఏనుగుల్ని కాపాడుకోవడానికి 1992లో ఏర్పాటు చేసిన ఎలిఫెంట్ రిజర్వ్ ప్రాజెక్టు 30 ఏళ్లవుతున్నప్పటికీ అతీగతీ లేకుండా ఉంది. ఏనుగుల్ని కాపాడుకోవడానికి మనకి ప్రత్యేకంగా చట్టాలేమీ లేవు. వన్యప్రాణుల సంరక్షణ చట్టం పరిధిలోకే ఏనుగులూ వస్తాయి. దీంతో ఏనుగులు ఆవాసం ఉండే కారిడార్లు, వాటి సంరక్షణకు ఏర్పాటు చేసిన రిజర్వ్‌ల నిర్వహణలన్నీ తూతూ మంత్రంగా జరిపిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణలో ఏనుగులెంత కీలకమో గ్రహించిన కేంద్రం 2010లో ఏనుగుని జాతీయ వారసత్వ జంతువుగా గుర్తించింది. ఏనుగుల సంరక్షణ విధానాలను సమీక్షించడానికి ఎలిఫెంట్ టాస్క్ ఫోర్స్ (ఈటీఎఫ్)ని ఏర్పాటు చేసింది. వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని మార్చాలని, ఏనుగుల సంరక్షణ కోసం జాతీయ ఏనుగుల పరిరక్షణ అథారిటీని ఏర్పాటు చేయాలని సిఫారసు చేసింది. అయితే నిధుల కొరతతో ఆ చర్యలేవీ కేంద్రం తీసుకోలేదు. ప్రతీ ఏడాది ఏనుగుల సంరక్షణ కోసం రూ.30–35 కోట్ల నిధుల్ని మాత్రమే కేటాయిస్తున్నారు. 2020లో వన్యప్రాణుల సంరక్షణ చట్టంలో ఏనుగుల రిజర్వ్‌లను చేరుస్తూ సవరణలు చేశారు. 2022, ఆగస్టు 2న సవరణ బిల్లుని లోక్‌సభ ఆమోదించింది. అంతకు మించి ఏనుగుల రక్షణకు ప్రత్యేకంగా చర్యలేవీ తీసుకోలేదు..

ఏనుగులు, మనుషులకి మధ్య ఘర్షణ



ఏనుగులకి, మనుషులకి మధ్య నిత్యం ఒక ఘర్షణ నెలకొని ఉంటుంది. మనిషి ఎప్పుడైతే అడవుల్ని కూడా ఆక్రమించడం మొదలుపెట్టాడో ఏనుగులు గుంపులు గుంపులుగా పంట పొలాలపైకి పడడం, రైతుల్ని తమ కాళ్ల కింద పడి తొక్కేసి ప్రాణాలు తీయడం వంటివి చేస్తున్నాయి. దీంతో రైతులు ఏనుగుల బారి నుంచి పంటల్ని కాపాడడానికి విద్యుత్ కంచెలు, కందకాలు ఏర్పాటు వంటివి చేయడంతో అవి చనిపోతున్నాయి. ఇక ఏనుగు దంతాలకు అంతర్జాతీయ మార్కెట్‌లో భారీగా డిమాండ్ ఉండడంతో వాటిని అక్రమంగా వేటాడుతున్న వారూ ఉన్నారు. ఏనుగుల కారిడార్లలో రైల్వే ట్రాక్‌లు ఉండడంతో అవి బలైపోతున్నాయి. 1987–2017 మధ్య కాలంలో రైల్వే ట్రాక్‌ల కింద పడి 265 ఏనుగులు మరణించాయి. ఏనుగులు జరిపే దాడుల్లో ఏడాదికి సగటున 500మంది ప్రాణాలు కోల్పోతూ ఉంటే, ప్రజల చేతుల్లో ఏడాదికి సగటున 100 గజరాజులు మరణిస్తున్నాయి. ఏనుగుల్ని మరింత సంరక్షించాలంటే, అవి ప్రజలు, పంట పొలాల జోలికి రాకుండా ఉండాలంటే ఏనుగులుండే కారిడార్లను పటిష్టపరచాల్సి ఉంది. దేశంలో 110 ఏనుగు కారిడార్లు ఉన్నప్పటికీ 70% మాత్రమే వినియోగంలో ఉన్నాయి. 29% కారిడార్లు ఆక్రమణకి లోనయ్యాయి. 66% కారిడార్లలో జాతీయ రహదారుల వెంబడి వెళుతున్నాయి. 22 కారిడార్లలో రైల్వే లైన్లు ఉన్నాయి. ఏనుగుల తినే తిండి ఎక్కువ కావడంతో అవి ప్రతీ రోజూ చాలా దూరం ప్రయాణిస్తూ ఉంటాయి. అవి సంచరించే మార్గాల్లో జాతీయ రహదారులు, రైల్వే ట్రాక్‌లు, మైనింగ్ తవ్వకాలు, కాలువలు, ఫెన్సింగ్‌లు ఉండడం వాటికి దుర్భరంగా మారింది. రైళ్లు, వాహనాల కింద పడి ప్రమాదవశాత్తూ మరణిస్తున్నాయి. అందుకే ఏనుగులు సంచరించే కారిడార్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జంతు ప్రేమికులు చెబుతున్నారు. ఇప్పుడు కొత్తగా నిర్మిస్తున్న జాతీయ రహదారుల్లో ఏనుగుల సంచారం కోసమే ప్రత్యేకంగా వంతెనలు నిర్మించడం విశేషంగా చెప్పుకోవాలి



29,964 2017లో ఏనుగుల గణన జరిగినప్పుడు మన దేశంలో ఉన్న ఏనుగులు.

ఆసియాలో ఉన్న ఏనుగుల్లో మన దేశంలోనే ఉన్నవి **60%**


32 ఏనుగుల సంరక్షణ కోసం ఉన్న రిజర్వ్‌ల సంఖ్య


14 రాష్ట్రాల్లో ఏనుగుల రిజర్వ్‌లు 7,775 చదరపు కిలో మీటర్ల ప్రాంతంలో విస్తరించి ఉన్నాయి


50 మైళ్లు ఆహారం కోసం ఏనుగులు రోజుకి ప్రయాణించే దూరం

ఆసియా ఏనుగులు 7 నుంచి 10 అడుగుల ఎత్తు, 2 వేల నుంచి 5 వేల కేజీల వరకు బరువు ఉంటాయి

సాక్షి, నేషనల్ డెస్క్







'భోపాల్' బాధితులకు... అదనపు పరిహారం కుదరదు

కేంద్రం విజ్ఞప్తిని తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: 30 ఏళ్ల క్రితం దేశాన్ని కుదిపేసిన భోపాల్ గ్యాస్ దుర్ఘటన ఉదంతంలో బాధితులకు అదనంగా రూ.7,844 కోట్ల నష్టపరిహారం అందేలా ఆదేశాలు ఇవ్వాలన్న కేంద్రం విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. మూడువేలకుపైగా మరణాలు, విష వాయువు విడుదలతో పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిన ఈ ఘటనకు ప్రధాన కారకనన యూనియన్ కార్బైడ్ కార్పొరేషన్ (యూసీసీ) కొత్త యాజమాన్యం నుంచి ఈ అదనపు నష్టపరిహారం ఇప్పించాలని కేంద్రం పిటిషన్‌లో కోరింది. జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం ఈ పిటిషన్‌ను కొట్టేసింది.

తీవ్ర బాధ్యతారాహిత్యం

బాధితులకు కేంద్ర ప్రభుత్వం కనీసం బీమా రక్షణ కల్పించకపోవడం తీవ్ర బాధ్యతారాహిత్యమని కోర్టు విమర్శించింది. ''ప్రజా సంక్షేమం ప్రభుత్వ కనీస విధి అని గతంలో సమీక్ష సందర్భంగానే నాటి ధర్మాసనం సూచించింది. ఆ బాధ్యతను విస్మరించిన కేంద్రం ఇప్పుడు మరింత నష్టపరిహారం కోరజాలదు. బాధితులకు నష్టపరిహారంపై రెండు దశాబ్దాల క్రితమే సెటిల్మెంట్ జరిగింది. ఇప్పుడొచ్చి ఆ అంశాన్ని లేవనెత్తడంలో హేతుబద్ధత లేదు. 'బాధితులకు అందాల్సిన మొత్తాల్లో ఇంకా ఏవైనా పెండింగ్‌లో ఉంటే వాటిని ఆర్‌బీఐ వద్ద ఉంచిన రూ.50 కోట్ల నుంచి సర్దుబాటు చేయండి' అని కేంద్రాన్ని ఆదేశించింది.

విష వాయువు విలయం...

1984 డిసెంబర్ రెండో తేదీ రాత్రి భోపాల్‌లో యూనియన్ కార్బైడ్ కర్మాగారం నుంచి లీకైన మిథెల్ ఐసోసైనేట్ విషవాయువు పీల్చి 3,000 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. 1 లక్షల మందికిపైగా తీవ్ర అనారోగ్యం బారినపడ్డారు. 1989లో 47 కోట్ల డాలర్లు నష్టపరిహారంగా యూసీసీ యాజమాన్యం చెల్లించింది. 1989లో 47 కోట్ల డాలర్లు అంటే ఆనాటి డాలర్ రూపాయి మారకం విలువతో పోలిస్తే రూ.715 కోట్లుకాగా, ప్రస్తుతం ఆ మొత్తం రూ.3,870 కోట్లకు సమానం.

కేంద్రం, న్యాయవ్యవస్థ మధ్య సమన్వయం ఉంది: రిజిజు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం, న్యాయవ్యవస్థ ఒక బృందంలా కలిసి పని చేస్తున్నాయని కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. అయితే దేశంలో కొందరు మహా నటులు రెంటింటి మధ్య విభేదాలున్నాయని చిత్రీకరించడానికి ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. లోక్‌మత్ జాతీయ సదస్సులో మంగళవారం పాల్గొన్న కిరణ్ రిజిజు ప్రతిపక్ష నేతల్ని వేధించడానికి కేంద్ర దర్యాప్తు సంస్థల్ని ప్రయోగిస్తోందన్న ఆరోపణల్ని కొట్టి పారేశారు. బీజేపీ పార్టీ అవినీతిని సహించదని, అందుకే విపక్షకి తావే ఉండదన్నారు. అవినీతి పట్ల రాజీపడే ప్రసక్తే లేకపోవడం మోదీ ప్రభుత్వ విధానమని గుర్తు చేశారు. కేంద్రానికి, న్యాయవ్యవస్థకి మధ్య అద్భుతమైన సమన్వయం ఉందని, అయినా కొందరు పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారని రిజిజు నిందించారు.

ఆస్కార్ విజేతలకు పార్లమెంట్ జేజేలు

మీ ఖాతాలో వేసుకోకండి • బీజేపీ, మోదీలపై ఖర్గే చెణుకులు



న్యూఢిల్లీ: విశ్వ వేదికపై తెలుగు బావుటా ఎగరేసిన ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని నాటు నాటు పాట, ది ఎలిఫెంట్ విస్పరర్స్ డాక్యుమెంటరీ ఆస్కార్ అవార్డులు సాధించినందుకు పార్లమెంట్ జేజేలు పలికింది. భారతీయ సినిమా ఖ్యాతికి ఈ విజయాలు మరింతగా వన్నెతెచ్చాయంటూ మంగళవారం రాజ్యసభలో చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ ప్రస్తుతించారు. ''ది ఎలిఫెంట్ విస్పరర్స్ డాక్యుమెంటరీ ఇద్దరు మహిళల ఉత్కృష్ట పనితనాన్ని ఎలుగెత్తి చాటింది. భారతీయ మహిళలకు అంతర్జాతీయంగా దక్కిన అపురూప గౌరవమిది'' అని రాజ్యసభ నాయకుడు, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ప్రశంసించారు. ఆర్‌ఆర్‌ఆర్ రచయిత వి.వి జయేంద్రప్రసాద్ రాజ్యసభ సభ్యుడేనని గుర్తు చేశారు.

సభలో నవ్వులు పూయించిన ఖర్గే

రెండు దక్షిణాది సినిమాలు ఆస్కార్ దక్కడం గర్వించాల్సిన గొప్ప విషయమని రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే అన్నారు. ఈ సందర్భంగా బీజేపీనుద్దేశిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు సభలో నవ్వులు పూయించాయి. 'అధికార పార్టీని నేను కోరేదొక్కటే. ఈ రెండు సినిమాలకు దర్శకత్వం వహించింది, పాట రాసింది మేమేనంటూ మోదీజీ గానీ, బీజేపీ సర్కార్ గానీ ఆస్కార్ ఘనతను తమ ఖాతాలో వేసుకోవద్దు. ఇది దేశం సాధించిన ఘనత' అన్నారు. దాంతో సభ్యులు బిగ్గరగా నవ్వేశారు. ఆస్కార్ గెలిచిన దేశ ప్రతినిధుల గురించి పార్లమెంట్‌లో చర్చించడం ఆనందంగా ఉందని మాజీ నటి, ఎస్పీ ఎంపీ జయా బచ్చన్ అన్నారు.

10 కోట్ల ఏళ్లనాటి నత్త



పసుపు రంగులో కనిపిస్తున్నది 9.9 కోట్ల ఏళ్ల నాటి ఒక చెట్టు జిగురు ముద్ద. లోపల కన్పిస్తున్న జిగురు ముద్దగా మారుతుండగా చిక్కుకున్న ఓ నత్త. అది శిలాజంగా మారి ఇన్నేళ్లుగా ఇలా భద్రంగా ఉండిపోయింది.

రెండో రోజూ అదే తీరు

పార్లమెంట్‌లో కొనసాగిన గందరగోళం

- రాహుల్ వ్యాఖ్యలపై క్షమాపణలకు బీజేపీ పట్టు
- అదానీపై జేపీసీ ఏర్పాటు చేయాల్సిందేనన్న విపక్షాలు
- ఉభయ సభలు వాయిదా

న్యూఢిల్లీ: భారత్‌లో ప్రజాస్వామ్యం గురించి బ్రిటన్‌లో కాంగ్రెస్ నేత రాహుల్ నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై పార్లమెంట్ ఉభయ సభలు వరుసగా రెండో రోజు మంగళవారం సైతం స్తంభించాయి. రాహుల్ క్షమాపణకు అధికార బీజేపీ సభ్యులు పట్టుబట్టగా, అదానీ వ్యవహారంపై తక్షణమే జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని విపక్ష సభ్యులు మరోసారి డిమాండ్ చేశారు. వాగ్వాదాలు, నినాదాల నడుమ లోక్‌సభ, రాజ్యసభ బుధవారానికి వాయిదా పడ్డాయి.

మరి ప్రధాని మాట్లాడిందేమిటి?

ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే రాహుల్ వెంటనే క్షమాపణ చెప్పాలంటూ బీజేపీ సభ్యులు నినాదాలకు దిగారు. ప్రధాని మోదీ కూడా విదేశాల్లో దేశ ప్రతిష్టను దిగజార్చేలా మోదీ మాట్లాడారని విపక్ష సభ్యులు ఎదురు దాడికి దిగారు. విదేశీ పర్యటనల్లో చేసిన ఆయన వ్యాఖ్యలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శించారు. కొందరు వెల్‌లోకి దూసుకొచ్చారు. అదానీ అంశంపై జేపీసీ ఏర్పాటు చేయాలప్రశ్నోత్తరాలు ప్రారంభించేందుకు స్పీకర్ ఓం బిర్లా ప్రయత్నించారు. నినాదాలాపాలని విజ్ఞప్తి చేశారు. ప్రశ్నోత్తరాల తర్వాత మాట్లాడేందుకు అవకాశం ఇస్తానన్నా విపక్ష సభ్యులు వినకపోవడతో మధ్యాహ్నం 2 గంటల దాకా సభను వాయిదా వేశారు. మళ్లీ ప్రారంభమైన తర్వాత గందరగోళం మధ్యే స్టాండింగ్ కమిటీ నివేదికలను ప్రభుత్వం సభకు సమర్పించింది.

పార్లమెంట్‌ను అగౌరవపర్చారు

రాజ్యసభలోనూ ముందుగా కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ రాహుల్ అంశాన్ని లేవనెత్తారు. దేశ ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలన్నారు. కాంగ్రెస్, విపక్ష సభ్యులు ఎదురుదాడికి దిగారు. నినాదాలు, అరుపులు కేకలతో గందరగోళం నెలకొనడంతో సభను మధ్యాహ్నం 2 గంటల వరకూ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ వాయిదా వేశారు. మళ్లీ ప్రారంభమైన తర్వాత కూడా పరిస్థితిలో మార్పు రాలేదు. రాహుల్ గాంధీ పార్లమెంట్‌కు వచ్చి, క్షమాపణ చెప్పాల్సిందేనని పీయూష్ గోయెల్ పట్టుబట్టారు. రాహుల్‌తో క్షమాపణ చెప్పించాలని కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్ అన్నారు. ప్రతిష్టంభనను తొలగించడానికి అన్ని పార్టీల సభాపక్ష నేతలతో సమావేశం అవుతానని చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ చెప్పారు. సభ అదుపులోకి రాకపోవడంతో బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అదానీపై చర్చించాలంటూ కె.కేశవరావు (బీఆర్‌ఎస్), సంజయ్ సింగ్ (ఆప్) ఇచ్చిన నోటీసులను ధన్‌ఖడ్ తిరస్కరించారు.



ప్రభుత్వ తీరును ఎండగడదాం...

కాంగ్రెస్, డీఎంకే, సీపీఎం, జేడీయూ, ఆర్జేడీ, ఎన్సీపీ, సమాజ్‌వాదీ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ, సీపీఐ, జేఎంఎం, ఎండీఎంకే, నేషనల్ కాన్ఫరెన్స్, కేరళ కాంగ్రెస్ తదితర 16 పార్టీల నేతలు మంగళవారం ఉదయం కాంగ్రెస్ ఎంపీ మల్లికార్జున ఖర్గే చాంబర్‌లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అదానీ వ్యవహారంపై ప్రభుత్వ తీరును పార్లమెంట్‌లో ఎండగట్టాలని నిర్ణయించుకున్నారు. అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అదానీ గ్రూప్‌ను కాపాడేందుకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విపక్ష ఎంపీలు ధ్వజమెత్తారు. ఈ సమావేశానికి తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరు కాలేదు. పార్లమెంట్ ప్రాంగణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆ పార్టీ సీనియర్ నేత సోనియా గాంధీ ఇతర నాయకులతో సమావేశమ్యారు. రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై పార్లమెంట్ ఉభయ సభల్లో బీజేపీ సభ్యులు ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో పార్టీ పరంగా అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు.

నక్సల్స్ హింస 77% తగ్గుముఖం: కేంద్రం

న్యూఢిల్లీ: ''దేశంలో గత 12 ఏళ్లలో నక్సల్స్ హింస 77% మేర తగ్గింది. మరణాలు, సంబంధిత ఘటనలు 90% మేర పడిపోయాయి'' అని కేంద్రం తెలిపింది. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ మంగళవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ''2010లో దేశవ్యాప్తంగా 96 జిల్లాల్లోని 465 పోలీస్‌స్టేషన్లలో మావోయిస్టుల హింసాత్మక ఘటనలు నమోదు కాగా, 2022లో 45 జిల్లాలు, 176 పోలీస్‌స్టేషన్లకు పరిమితమయ్యాయి. జార్ఖండ్‌లో మావోయిస్టుల హింసాత్మక ఘటనలు 82% తగ్గాయి. 2010లో నక్సల్స్ దాడుల్లో 1,005 మంది భద్రతా సిబ్బంది, పౌరులు చనిపోగా 2022లో ఇది 98కు తగ్గింది'' అన్నారు.

పర్యాటకానికి దారులు తెరిచిన చైనా

హాంకాంగ్: దాదాపు మూడేళ్ల తర్వాత చైనా పర్యాటకులకు ద్వారాలు తెరుస్తోంది. కరోనా మహమ్మారితో దెబ్బతిన్న పర్యాటక, ఆర్థిక రంగాల ఊతానికి బుధవారం అన్ని రకాల వీసాలను జారీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆ దేశ దౌత్య కార్యాలయాల వెబ్‌సైట్లలో నోటిఫికేషన్‌ను ఉంచింది. పర్యాటకులను వీసాల్లేకుండానే హైనాన్ ద్వీపంలోకి, షాంఘై నౌకాశ్రయంలోకి వచ్చే క్రూయిజ్ షిప్‌లనూ అనుమతిస్తామంది. విదేశీయులు 2020 మార్చి 28కి ముందు పొందిన వీసాలు కూడా చెల్లుబాటవుతాయని వివరించింది. విదేశీయులు హాంకాంగ్, మకావోల మీదుగా వీసా అవసరం లేకుండానే గ్వాంగ్‌డాంగ్‌లోకి ప్రవేశించవచ్చని పేర్కొంది.

రాహుల్ బాధ్యతగా మాట్లాడాలి: ఆరెస్సెస్

సమల్ఖా (హరియాణా): కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మరింత బాధ్యతాయుతంగా మాట్లాడాలని ఆరెస్సెస్ పేర్కొంది. ప్రజల్లో ఆరెస్సెస్‌కు లభిస్తున్న వాస్తవిక ఆదరణను గమనించాలని సంస్థ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబలే అన్నారు. హరియాణాలోని సమల్ఖాలో ఆరెస్సెస్ అఖిల భారతీయ ప్రతినిధి సభ సమావేశాల జరుగుతున్నాయి. సమావేశాల చివరి రోజైన మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశాన్ని జైలులా మార్చిన వారికి ప్రజాస్వామ్యంపై మాట్లాడే హక్కు లేదన్నారు. కేవలం ఇద్దరు స్త్రీ, పురుషుల మధ్య జరిగేదే వివాహమని, స్వలింగ వివాహాలపై కేంద్రం వైఖరిని సమర్థిస్తున్నామన్నారు. ముస్లిం మేధావులు, ఆధ్యాత్మిక నేతల ఆహ్వానం మేరకే సంఘ్ నేతలు వారితో చర్చలు జరుపుతున్నారని వివరించారు.

మోదీకి 'ఆప్' భయం: కేజ్రీవాల్

భోపాల్: బీజేపీకి కంచుకోట అయిన గుజరాత్‌లోనూ ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ 13 శాతం ఓట్లు సాధించడంతో ప్రధాని మోదీకి 'ఆప్' భయం పట్టుకుందని ఆ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. మధ్యప్రదేశ్ విస్తరించే వ్యూహంలో భాగంగా ఆప్ మంగళవారం భోపాల్‌లో భారీ ర్యాలీ జరిపింది. అందులో కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్ ప్రసంగించారు. 'పులికి తన స్థావరంలోనే సవాలు విసిరాం. లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆప్‌తో ఇబ్బందులు తప్పవని మోదీ భయపడుతున్నారు' అని కేజ్రీవాల్ అన్నారు. 'కాంగ్రెస్, బీజేపీల పాలనతో విసిగిన మధ్యప్రదేశ్ ప్రజలకు ఆప్ ఆశాకిరణమన్నారు.

అదానీకి దోచిపెట్టడమే విదేశాంగ విధానమా?

మోదీపై మరోసారి రాహుల్ ధ్వజం

న్యూఢిల్లీ: పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీని కుబేరుడిని చేయడమే మోదీ ప్రభుత్వ విదేశాంగ విధానామా? అని కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ వీడియో విడుదల చేశారు. నరేంద్ర మోదీ గత తొమ్మిదేళ్లుగా దేశాన్ని భ్రమల్లోనే ఉంచుతున్నారని, తప్పుదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రపంచంలో మోదీ ఎక్కడికెళ్లినా అదానీని సైతం వెంట తీసుకెళ్లారని గుర్తుచేశారు.


ప్రతిష్టంభనకు ప్రభుత్వమే కారణం: జైరాం

పార్లమెంట్‌లో ప్రతిష్టంభనకు ముమ్మాటికీ మోదీ ప్రభుత్వమే కారణమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ట్విట్టర్‌లో ధ్వజమెత్తారు. కీలకమైన అంశాలపై ప్రజల దృష్టిని మళ్లించడం ప్రధాని మోదీకి, ఆయన సహచరులకు ఒక అలవాటుగా మారిందన్నారు. రాహుల్ విమర్శలను కేంద్ర మంత్రి, బీజేపీ నేత గిరిరాజ్ సింగ్ ఖండించారు. కాంగ్రెస్ హయాంలోనే అదానీ వ్యాపారావేత్తగా ఎదిగారన్నారు. ''గుజరాత్ కాంగ్రెస్ సీఎం చిమన్‌భాయ్ పటేల్ తనకు మొదటి బ్రేక్, రాజీవ్ గాంధీ రెండో బ్రేక్ ఇచ్చారని అదానీ స్వయంగా చెప్పారు. ప్రధాని మోదీని దూషించడమే ప్రతిపక్షాల ఉద్దేశం. అంబానీ–అదానీ సాకులే. యూపీఏ ప్రభుత్వ పదేళ్ల పాలన వివాదాలమయం. మోదీ సర్కారు వచ్చాకే అభివృద్ధి జరుగుతోంది'' అన్నారు.

ప్రమాదంలో భావప్రకటనా స్వేచ్ఛ: ఖర్గే

మాట్లాడే స్వాతంత్ర్యం, నిజాలు రాసే స్వేచ్ఛ ప్రమాదంలో చిక్కుకున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం లోక్‌మత్ జాతీయ సదస్సులో ఆందోళన వ్యక్తం చేశారు. పాలకులు మీడియాను అణచివేస్తున్నారని ఆరోపించారు. ఓ వర్గం మీడియా వారికి లొంగిపోయిందని ఆక్షేపించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంబ్రిడ్జి అరుపులు, లండన్ అబద్ధాలు ఆపాలని సదస్సులో పాల్గొన్న కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ హితవు పలికారు. విపక్ష నేతలను వేధించేందుకే దర్యాప్తు సంస్థలను కేంద్రం ప్రయోగిస్తోందని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ధ్వజమెత్తారు.

ఆస్ట్రేలియాకు అమెరికా సబ్‌మెరైన్లు



ఆకస్ సదస్సులో అల్బనీస్, బైడెన్, సునాక్

వాషింగ్టన్: ఆసియా పసిఫిక్ ప్రాంతంలో చైనా దూకుడుకు కళ్లెం వేసేందుకు అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియాల 'ఆకస్' కూటమి మరో అడుగు ముందుకేసింది. ఆసియా పసిఫిక్ ప్రాంత స్వేచ్ఛా, సంరక్షణ కోసం అణు జలాంతర్గాముల ప్రాజెక్ట్‌పై ఏకాభిప్రాయానికి వచ్చినట్లు ఈ మూడు దేశాలు ప్రకటించాయి. ఇందుకు సోమవారం అమెరికాలోని శాన్ డీగోలో జరిగిన ఒక కార్యక్రమం వేదికైంది. ఈ కార్యక్రమంలో అమెరికా అధ్యక్షుడు బైడెన్, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బనీస్ పాల్గొన్నారు. ఆకస్ ఒప్పందంలో అంతర్భాగమైన అణు జలాంతర్గామి ప్రాజెక్టులో భాగంగా ఆస్ట్రేలియాకు అమెరికా 2030దశకం తొలినాళ్లలో దశలవారీగా మూడు అణుఇంధనంతో పనిచేసే జలాంతర్గాములను అందించనుంది. 'వచ్చే ఐదేళ్లలో అమెరికా జలాంతర్గాముల నిర్మాణ సామర్థ్యం పెంపు, వర్జీనియా శ్రేణి సబ్‌మెరైన్ల నిర్వహణ కోసం మొత్తంగా 460 కోట్ల డాలర్లు వినియోగిస్తాం. 'వర్జీనియా' జలాంతర్గాములతో దశాబ్దకాలం ముందుగానే ఆస్ట్రేలియా జలాంతర సామర్థ్యం ద్విగుణీకృతం అవుతోంది' అని సునాక్, అల్బనీస్‌ల సమక్షంలో బైడెన్ ప్రకటించారు. 'బ్రిటన్ జలాంతర్గామి టెక్నాలజీ, అమెరికా సాంకేతికతల మేలిమి కలయికగా అణుఇంధనంతో నడిచే సంప్రదాయక ఆయుధాలు అమర్చిన జలాంతర్గామి తయారుకాబోతోంది' అని బైడెన్ చెప్పారు. మూడు దేశాల మైత్రిలో కొత్త అధ్యాయం మొదలైందని ఈ సందర్భంగా అల్బనీస్ వ్యాఖ్యానించారు. హిందూ మహాసముద్రం, పశ్చిమ, మధ్య పసిఫిక్ సముద్రం, దక్షిణ చైనా సముద్రాలు ఉన్న ఇండో–పసిఫిక్ ప్రాంతం భౌగోళికంగా, అంతర్జాతీయ జలరవాణాకు కీలకమైన ప్రాంతం. దక్షిణ చైనా సముద్ర జలాలపై హక్కులు తనకే చెందుతాయని చైనా వాదిస్తుండటంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం తెల్సిందే.



డ్రోన్ తరహాలో కనువిందు చేస్తున్న ఈ ఎయిర్‌క్రాఫ్ట్‌ను అమెరికాకు చెందిన లిఫ్ట్ అనే సంస్థ రూపొందించింది. మంగళవారం జపాన్‌లో తీసిందీ ఫొటో.

సాక్షి
హైదరాబాద్
బుధవారం । 15 । మార్చి । 2023

శివారు గ్రామాలపై ఎస్‌ఓటీ నిఘా

గ్రామీణ ప్రాంతాలపై సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్స్ టీం (ఎస్‌ఓటీ) పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. స్థానిక యువతతో నిరంతరం సత్సంబంధాలతో ఇన్‌ఫార్మర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. -8లో



దళితులపై బీజేపీ సర్కార్ దాడి

బీజేపీ తొమ్మిదేళ్ల పాలనలో ప్రధాని నరేంద్ర మోదీ దళిత, గిరిజన, మహిళా, మైనార్టీలపై ముప్పేట దాడి కొనసాగిస్తున్నారని డీఎస్ఎంఎం జాతీయ కార్యదర్శి బి.వి.రాఘవులు ధ్వజమెత్తారు. -8లో

ఎండ.. రండా

సాక్షి, సిటీబ్యూరో: పగటిపూట ఎండలు, రాత్రి వేళ చలి వణికిస్తోంది. సిటీలో మంగళవారం గరిష్టంగా 34.6.. కనిష్టంగా 19.1 డిగ్రీలుగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరోవైపు రాష్ట్రంలో ద్రోణి ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. సరిహద్దు జిల్లాల్లో నేటినుంచి వరుసగా నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందనే అధికారుల హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్రానికి ఎల్లో అలర్ట్ జారీ చేశారు.


నాంపల్లిలోని టీఎస్‌పీఎస్సీ కార్యాలయం వద్ద ఆందోళన

అట్టుడికిన సిటీ

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై ఉద్యోగార్థుల ఆగ్రహ జ్వాలలతో నగరం మంగళవారం అట్టుడికింది. టీఎస్‌పీఎస్సీ భవనం ముట్టడి, ఉస్మానియా యూనివర్సిటీ, చిక్కడపల్లి, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల్లోని రోడ్లపై రాస్తారోకోలు, బైఠాయింపులతో ఆందోళనకు దిగారు. మరోవైపు యూనివర్సిటీ కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు బిల్లును గవర్నర్ వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేస్తూ చలో రాజ్‌భవన్ ముట్టడికి బీఆర్‌ఎస్‌వీ, బీఆర్‌ఎస్ అనుబంధ విద్యార్థి సంఘాలు యత్నించడంతో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. – సాక్షి, సిటీబ్యూరో


చిక్కడపల్లిలో మాట్లాడుతున్న కోదండరాం


ఉస్మానియా వర్సిటీలో..


రాజ్‌భవన్ ముట్టడికి యత్నం

న్యూస్‌రీల్

అరుదైన వ్యాధుల నివారణపై అవగాహన

లక్డీకాపూల్: అరుదైన వ్యాధుల నివారణ కోసం జాతీయ విధానం ఉందనే విషయంలో తొలి అడుగు వేసినట్లు ఆర్గనైజేషన్ ఫర్ రేర్ డిసీజెస్ ఇండియా (ఓఆర్‌డీఐ) కో ఫౌండర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రసన్న కుమార్ షిరోల్ అన్నారు. మంగళవారం ప్రపంచ రేర్ డిసీజ్ డే సందర్భంగా అవగాహన కల్పించేందుకు 7కే వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'రేస్ ఫర్ 7' ప్రపంచంలో అతి పెద్ద మల్టీ సిటీ కార్యక్రమాలలో ఒకటన్నారు. దీనిద్వారా అత్యంత అరుదైన వ్యాధుల (రేర్ డిసీజెస్) పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. రేర్ డిసీజెస్‌కు సమగ్ర చికిత్స, స్థానికంగా ఔషధాల అభివృద్ధి, బీమా కవరేజీ మొదలైన సవాళ్లను కూడా పరిష్కరించుకోవాల్సి ఉందన్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతులు కలపడానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ హెడ్ డాక్టర్ అశ్విన్ దలాల్, సౌత్ ఆసియా ఐక్యూవీఐఏ వైస్ ప్రెసిడెంట్, జనరల్ మేనేజర్ అమిత్ ముకిమ్ తదితరులు పాల్గొన్నారు.

మీరాలం ఫిల్టర్‌లో పడి కార్మికుడి మృతి


మృతదేహం కోసం గాలిస్తున్న పోలీసులు

బహదూర్‌పురా: మీరాలం వాటర్ ఫిల్టర్‌లో పడి ఫిల్టర్ కార్మికుడు మృతి చెందిన ఘటన కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బుచ్చయ్య చెప్పిన వివరాల ప్రకారం.. మీరాలం ఫిల్టర్‌లో అన్నెల బాబురావు (33) గత పదేళ్లుగా ఫిల్టర్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం ఫిల్టర్ బెడ్ నీటిలో ఆలం కలుపుతుండగా.. ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. రాము అనే మరో కార్మికుడు వెంటనే అధికారులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న కాలాపత్తర్ పోలీసులు ఫైరింజన్లతో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఫిల్టర్‌లో వ్యక్తి చనిపోవడంతో నీటి సరఫరా చేయాలా? లేదా? అనే మీమాంసలో జలమండలి అధికారులు ఉన్నారు.

వ్యవసాయ ఉన్నత విద్యపై జాతీయ సదస్సు



సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని ఐసీఏఆర్–నార్మ్‌లో మంగళవారం వ్యవసాయ ఉన్నత విద్య కోసం పరిశ్రమలు– ప్రభుత్వ సంబంధాలపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును జాతీయ అగ్రికల్చర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌సీ అగర్వాల్ ప్రారంభించి మాట్లాడారు. జ్ఞానాన్ని పంచుకోవడం, కార్యాచరణ, అవగాహన ఒప్పందాలను అమలు చేయడం, వ్యవసాయ పాఠ్యాంశాలను పునర్నిర్మించడంలో ప్రాజెక్ట్ ప్రాముఖ్యతలపై వివరించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, పరిశ్రమ, ప్రభుత్వ ప్రతినిధులు, వీసీలు తదితరులు పాల్గొన్నారు.

బెస్టాఫ్ లక్

ఇంటర్ పరీక్షలు నేటి నుంచే..



- అరగంట ముందే కేంద్రానికి చేరుకోవాలి
- ఉదయం 8.45 గంటల తర్వాత నో ఎంట్రీ
- సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లకు అనుమతిలేదు

గ్రేటర్ పరిధిలో ఇలా..

పరీక్ష రాయనున్న విద్యార్థులు	4,17,740
ప్రథమ సంవత్సరం	2,19,790
ద్వితీయ సంవత్సరం	1,97,950
పరీక్ష కేంద్రాలు	548
చీఫ్ సూపరింటెండెంట్లు	548
డిపార్ట్‌మెంట్ అధికారులు	548
ఫ్లయింగ్ స్క్వాడ్‌లు	12
సిట్టింగ్ స్క్వాడ్‌లు	12
హైపవర్ కమిటీలు	03

సాక్షి, సిటీబ్యూరో: ఇంటర్ పరీక్షలు నేటినుంచి ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు అర గంట ముందుగానే చేరుకునేలా ప్రణాళిక రూపొందించుకోవాలి. పరీక్ష కేంద్రంలోకి 8.30 గంటల నుంచే అనుమతించనున్నారు. పరీక్ష ప్రారంభానికి కనీసం 15 నిమిషాల ముందు హాల్‌లో తమకు కేటాయించిన సీట్లను కూర్చోవాల్సి ఉంటుంది. పరీక్ష కేంద్రానికి 8.45 తర్వాత చేరుకున్న అభ్యర్థులను హాల్లోకి అనుమతించవద్దని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఆదేశించారు. సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లకు అనుమతి లేదు. ఎవరైనా వాటిని తీసుకొస్తే స్వాధీనం చేసుకుంటారు.

వసతుల ఏర్పాటు...

విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు రాసేలా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని తాగునీటి సౌకర్యంతో పాటు ప్రాథమిక చికిత్స కోసం ఆరోగ్య సిబ్బంది ఏర్పాటు చేశారు. పరీక్ష సమయాలకు అనుగుణంగా అన్ని రూట్లలో ఆర్టీసీ బస్సులు నడిపించనున్నారు. కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసి వేయనున్నారు. పరీక్ష కేంద్రాలలో సీసీ కెమెరాల మధ్యన ప్రశ్నపత్రాల బండిల్స్ తెరిచేలా చర్యలు చేపట్టారు. విద్యార్థులు హాల్ టికెట్‌ను జాగ్రత్తగా పరిశీలించుకోవాలి. ఏదైనా తేడా ఉంటే ముందస్తుగా కళాశాల ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లి సరిదిద్దుకోవాల్సి ఉంటుంది.

ప్రైవేటు కేంద్రాలపై నిఘా

ప్రైవేటు విద్యా సంస్థల్లోని పరీక్ష కేంద్రాలపై గట్టి నిఘా పెట్టారు. అదనంగా అధికారులను నియమించారు. ప్రతి గదిలో నిఘా నేత్రం ఉండేవిధంగా చర్యలు చేపట్టారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ జరగకుండా చర్యలు తీసుకోనున్నారు. గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.





సిటీ బస్సుల్లో వెసులుబాటు

సాక్షి, సిటీబ్యూరో /అఫ్జల్‌గంజ్: ఇంటర్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీ వెసులుబాటు కల్పించింది.రూట్ పాస్‌పై కాలేజీకి రాకపోకలు సాగించేవారు బుధవారం నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలకు (తాము రెగ్యులర్‌గా ప్రయాణం చేసే రూట్ కాకపోయినా) అదే పాస్‌పై హాజరుకావచ్చు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు ఈ వెసులుబాటు కల్పించినట్లు ఆర్టీసీ సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ వెంకన్న, రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీధర్ తెలిపారు. ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకు ఉదయం 9 గంటల నుంచి పరీక్షలు రాసి తిరిగి ఇళ్లకు చేరుకొనే వరకు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ రూట్ పాస్‌ను, హాల్ టికెట్‌ను కండక్టర్‌కు చూపించాల్సి ఉంటుంది. ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో ఈ వెసులుబాటు వర్తించదు. ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో కాంబినేషన్ టికెట్‌లను అనుమతిస్తారు. పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు వీలుగా బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే.. ఒంటిపూట బడులను దృష్టిలో ఉంచుకొని బుధవారం నుంచి మధ్యాహ్నం పిల్లలు ఇళ్లకు చేరుకునేందుకు వీలుగా వివిధ రూట్‌లలో ట్రిప్పుల సంఖ్యను కూడా పెంచినట్లు ఆర్ఎం వెంకన్న తెలిపారు.


బోర్డు ఎన్నికలు జరిగేనా?

- ఒకవైపు కోర్టుల్లో కేసులు
- మరోవైపు నామినేటెడ్ సభ్యుల లాబీయింగ్
- ఎన్నికలు వాయిదా అంటూ వదంతులు
- చర్చనీయాంశంగా కంటోన్మెంట్ వ్యవహారం

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎన్నికలు జరిగేనా? అన్నది సర్వత్రా ఆసక్తికరంగా మారింది. సికింద్రాబాద్ సహా దేశ వ్యాప్తంగా 57 కంటోన్మెంట్‌లలో ప్రజాప్రతినిధుల ఎన్నిక కోసం ఏప్రిల్ 30న ఎన్నికలు నిర్వహించనున్నట్లు గత నెల 17న కేంద్రం గెజిట్ విడుదల చేసింది. తదనుగుణంగా పూర్తి స్థాయి ఎన్నికల షెడ్యూల్ కూడా జారీ చేసిన బోర్డు అధికారులు, నూతన ఓటరు నమోదు ప్రక్రియ కూడా చేపట్టారు. రెండు మూడు రోజుల్లోనే తుది జాబితా ప్రకటనతో పాటు ఈ నెలాఖరులో అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే బోర్డు ఎన్నికలు వాయిదా పడినట్లు మంగళవారం వదంతి కంటోన్మెంట్ వ్యాప్తంగా వ్యాపించింది. బోర్డు ఎన్నికలు ఆపాలంటూ తెలంగాణ హైకోర్టులో సుమారు 25కు పైగా రిట్‌లు దాఖలు కావడంతో కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందా అంటూ పలువురు ఆరా తీయడం మొదలుపెట్టారు. ఓసారి ఎన్నికల ప్రక్రియ మొదలయ్యాక నిలిపివేసేందుకు ఆస్కారం లేదంటూ గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలు ఉన్నాయి. ప్రత్యేక పరిస్థితుల్లో ఎన్నికలను తాత్కాలికంగా వాయిదా వేయడం లేదా, నోటిఫికేషన్‌ను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉందని తెలుస్తోంది. ఈ మేరకు దేశవ్యాప్తంగా పలు కంటోన్మెంట్‌లకు చెందిన సివిలియన్ నామినేటెడ్ సభ్యులు లాబీయింగ్ బలంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరి ప్రయత్నాలు ఫలిస్తే రక్షణ శాఖ ఎన్నికలపై వెనక్కి తగ్గే అవకాశమూ లేకపోలేదని రక్షణ శాఖ వర్గాల సమాచారం.

నిబంధనలేం చెబుతున్నాయి?

- ది కంటోన్మెంట్ యాక్ట్ 2006, సెక్షన్ 15 ప్రకారం జారీ చేసిన ఎన్నికల నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకునే అవకాశం లేదు. అయితే.. ది కంటోన్మెంట్ ఎలక్టోరల్ రూల్స్ 2007, సెక్షన్ 20లో పేర్కొన్న మేరకు.. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఎన్నికల తేదీని గరిష్టంగా 40 రోజుల పాటు వాయిదా వేసే అవకాశం ఉంది.
- జాతీయ విపత్తు సంభవించినప్పుడు, అహింస చెలరేగినప్పుడు, లోక్‌సభ, అసెంబ్లీ, సమీప మున్సిపాలిటీ ఎన్నికల తేదీ అడ్డంకిగా మారినప్పుడు మాత్రమే ఈ సెక్షన్‌ను వినియోగించాల్సి ఉంటుంది.
- ది కంటోన్మెంట్స్ యాక్ట్ సెక్షన్ 2006, సెక్షన్ 15 ప్రకారం వెలువరించిన నోటిఫికేషన్‌లో మార్పులు, చేర్పులు, పూర్తిగా ఉపసంహరించుకునే వెసులుబాటు కేంద్రానికి ఉంది. ఈ వెసులుబాటుతోనే కంటోన్మెంట్ ఎన్నికల నోటిఫికేషన్ ఉపసంహరించుకునే అవకాశమున్నట్లు తెలుస్తోంది.
- ఎన్నికల నోటిఫికేషన్ పూర్తిగా ఉపసంహరించుకోని పక్షంలో కేవలం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను మినహాయించే అవకాశం కూడా ఉందని సమాచారం.



తాగునీటికి నో ఫికర్

వేసవి కార్యాచరణ ప్రకటించిన జలమండలి ఎండీ





సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుత వేసవిలో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఢోకా ఉండబోదని జలమండలి ఎండీ దానకిశోర్ తెలిపారు. మంగళవారం ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో వేసవి కార్యాచరణ, రెవెన్యూ, ట్రాన్స్‌మిషన్, ఓఅండ్ఎం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జలమండలి ప్రస్తుతం రోజూ 565 మిలియన్ గ్యాలన్ల నీటిని సరఫరా చేస్తోందన్నారు. మరో 42 మిలియన్ గ్యాలన్ల నీటి సరఫరాకు ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. నగరంతో పాటు ఓఆర్ఆర్ లోపలి గ్రామాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మే నెలాఖరు నాటికి మొత్తం 42 ఎంజీడీల నీరు అదనంగా సరఫరా అవుతుందన్నారు. ఇందులో నగర పరిధిలో 22 ఎంజీడీలు, ఓఆర్ఆర్ లోపలి గ్రామాలకు 20 ఎంజీడీల నీరు కేటాయించనున్నట్లు వెల్లడించారు. ఈ నెలలో అదనంగా 22 ఎంజీడీల నీరు సరఫరా చేస్తున్నామన్నారు. ఇందులో ఇప్పటికే 14 ఎంజీడీలు ఇస్తుండగా.. నెలాఖరుకు మరో 8 ఎంజీడీల నీరు సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ లో 12, మేలో 8 ఎంజీడీల నీరు అదనంగా సరఫరా చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు.

ఓఆర్ఆర్ ప్రాజెక్టు కు 50 ఎంజీడీలు..

జూన్ నాటికి ఓఆర్ఆర్ ఫేజ్–2 ప్రాజెక్టు పూర్తి చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఓఆర్ ఆర్ పరిధిలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలకు ఇప్పటికే 20 ఎంజీడీల నీరు ఇస్తుండగా.. అవసరాన్ని బట్టి మరో 30 ఎంజీడీల నీరు సరఫరా చేస్తామన్నారు. ప్రాజెక్టు పూర్తయ్యే నాటికి ఈ ప్రాంత ప్రజలకు మొత్తం 50 ఎంజీడీల నీరు సరఫరా అవుతుందని పేర్కొన్నారు.

అదనంగా ట్యాంకర్లు, ట్రిప్పులు...

అవసరమైన చోట్ల అదనంగా ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ఎండీ ఆమోదం తెలిపారు. నగర వ్యాప్తంగా ప్రస్తుతం 74 ఫిల్లింగ్ స్టేషన్లు ఉండగా.. అదనంగా మరో 3 స్టేషన్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా అవసరం మేరకు ట్యాంకర్లు, ట్రిప్పుల సంఖ్యను పెంచుకోవాలని సూచించారు. వాటర్ లీకేజీలు, సీవరేజి ఓవర్‌ఫ్లోలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చూడాలన్నారు. రంజాన్ మాసం దృష్ట్యా అవసరమైన చోట్ల మసీదులకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు. సమీక్ష సమావేశంలో ఈఎన్సీ, ఆపరేషన్స్ డైరెక్టర్–1 అజ్మీరా కృష్ణ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ రవి కుమార్, ఆపరేషన్స్ డైరెక్టర్– 2 స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏమైందో ఏమో?

హోటల్ గదిలో యువతీయువకుల ఆత్మహత్య

ఖైరతాబాద్: భార్యా భర్తలమని చెప్పి హోటల్ గదిలో దిగిన ఇద్దరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన గోసుల హేమంబదరెడ్డి (37), బి.ప్రసన్న లక్ష్మి(27) ఇద్దరు స్నేహితులు. వీరు ఈ నెల 10న శుక్రవారం టెలిఫోన్ భవన్ రోడ్డులోని హోటల్ అలేఖ్యలో రెండో అంతస్తులో దిగారు. సోమవారం రాత్రి హోటల్ సిబ్బంది వారికి ఫోన్ చేసి చెక్‌ఔట్ చేస్తున్నారా..ఉంటున్నారా అని ఆరా తీయగా కిందకు వస్తామని చెప్పారు. కానీ వారు ఎంతసేపటికీ రాకపోవడంతో మంగళవారం ఉదయం మరోసారి వారికి ఫోన్ చేశారు. లిఫ్ట్ చేయకపోవడంతో హోటల్ సిబ్బంది డూప్లికేట్ కీ సాయంతో గదిని ఓపెన్ చేసి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకొని హేమంబదరెడ్డి, బెడ్‌పై అచేతనంగా పడిన స్థితిలో ప్రసన్న లక్ష్మి కన్పించారు. వెంటనే సైఫాబాద్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ సత్తయ్య నేతృత్వంలో ఎస్ఐ సూరజ్ కేసు నమోదుచేసుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. ఆత్మహత్యకు కారణాలు, ప్రసన్న లక్ష్మిది కూడా ఆత్మహత్యేనా అన్న విషయాలు తెలియాల్సి ఉంది. సీసీ కెమెరా పరిశీలించగా సోమవారం అర్ధరాత్రి 11 గంటల ప్రాంతంలో ప్రసన్న లక్ష్మి సూట్‌కేస్‌తో లిఫ్ట్ వరకు వచ్చి తిరిగి మరలా గదిలోకి వెళ్లినట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



హార్ట్‌ను తట్టిన ఆర్ట్



ప్రకృతి రమణీయతను కళ్లకు కట్టారు. పల్లెసీమలను కుంచె నుంచి ముంచెత్తారు. చిత్రకారులు దృశ్య మాలికలను గుదిగుచ్చారు. చూపరుల కళ్లను మురిపించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం సాలార్‌జంగ్ మ్యూజియం, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ, తెలంగాణ ఆర్టిస్ట్ ఫోరం సంయుక్తాధ్వర్యంలో ఆర్ట్ ఆఫ్ ద హార్ట్ ఏర్పాటు చేసిన ప్రత్యేక పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్సీ సురభి వాణీదేవి ప్రారంభించారు. ఇక్కడ 140 విభిన్నమైన చిత్రాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సాలార్‌జంగ్ మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ ఎ.నాగేందర్ రెడ్డి, సీఐఎస్ఎఫ్ డీఐజీ శ్యామల, జేఎన్ఏఎఫ్‌యూ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కవిత, ఇంటాక్ కన్వీనర్ అనురాధ రెడ్డి, ఆర్గనైజింగ్ అధ్యక్షులు రమణా రెడ్డి, అనిత, మ్యూజియం కీపర్లు నరేందర్, డాక్టర్ కుసుమం, చింతమల శ్రీనివాస్ పాల్గొన్నారు. – బహదూర్‌పురా






ఎమ్మెల్సీ సురభి వాణీదేవి తదితరులు

శివారు గ్రామాలపై ఎస్‌ఓటీ నిఘా

- సైబరాబాద్‌లో 250 మంది ఎస్‌ఓటీ పోలీసులు
- స్థానిక యువకులతో ఇన్‌ఫార్మర్ వ్యవస్థ
- నిరంతరం టచ్‌లో ఉంటూ సమాచార సేకరణ
- ప్రతి చిన్న నేరం రిపోర్ట్ అయ్యేలా చర్యలు
- రిసార్టులు, ఫామ్‌హౌస్‌లలో ఆకస్మిక తనిఖీలు

సాక్షి, సిటీబ్యూరో: గ్రామీణ ప్రాంతాలపై సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్స్ టీం (ఎస్‌ఓటీ) పోలీసులు ప్రత్యేక దృష్టిసారించారు. స్థానిక యువతతో నిరంతరం సత్సంబంధాలు నెరపుతూ.. గ్రామాల్లో జరిగే ప్రతి చిన్న నేరం పోలీసుల దృష్టికి వచ్చేలా పటిష్టమైన ఇన్‌ఫార్మర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో ఇప్పటివరకు మాదక ద్రవ్యాలు, మానవ అక్రమ రవాణా వంటి వ్యవస్థీకృత నేరాలతో పాటు రేషన్ బియ్యం అక్రమ తరలింపు, గ్యాస్ దందా, కల్తీ ఆహార ఉత్పత్తులు, భూ తగాదాలు వంటి అన్ని రకాల నేరాలపై ఫోకస్ పెట్టారు.

- గతంలో సైబరాబాద్ అంతటికీ ఒకటే ఎస్‌ఓటీ జోన్ ఉండేది. ఇటీవల శాంతి భద్రతల విభాగంలో పునర్ వ్యవస్థీకరణలో భాగంగా బాలానగర్, మాదాపూర్‌లను రెండు ఎస్‌ఓటీ జోన్లుగా విభజించారు. డీసీపీలను సైతం నియమించారు. మాదాపూర్, రాజేంద్రనగర్, బాలానగర్, శంషాబాద్, మేడ్చల్ ఐదు జోన్లలో కలిపి ఎస్‌ఓటీలో మొత్తం 250 మంది సిబ్బంది ఉంటారు. ప్రతి పోలీసు స్టేషన్‌లో ఇద్దరు ఎస్‌ఓటీ కానిస్టేబుల్స్‌ను నియమించారు. స్థానిక యువతతో నిరంతరం సత్సంబంధాలు నెరపుతూ.. నేర సమాచారాన్ని సేకరిస్తున్నామని బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.
- సాధారణంగా గ్రామీణ ప్రాంతాలలో జరిగే చిన్న చిన్న నేరాలు పోలీసు స్టేషన్ వరకు రానివ్వరు. గ్రామ పెద్దలు, స్థానిక నేతలే మధ్యవర్తిత్వం వహించి రాజీ చేస్తుంటారు. అయితే ప్రస్తుతం గ్రామాలకు సైతం ఎస్‌ఓటీ సేవలు విస్తరించడంతో ప్రతి చిన్న నేరం కూడా పోలీసుల దృష్టికి వస్తుంది. ప్రతివారం సైబరాబాద్ పరిధిలోని రిసార్టులు, ఫామ్‌హౌస్‌లు, పబ్‌లలో ఆకస్మిక దాడులు చేసి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తున్నారు. ఆయా ఆస్తులను సీజ్ చేస్తున్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లు లేకుండానే..

గ్రామాలు, శివారు ప్రాంతాలలో చాలా వరకు చిన్న కంపెనీలు ట్రేడ్ లైసెన్స్ లేకుండానే ఇష్టానుసారంగా వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. దీంతో ప్రభుత్వానికి నష్టం జరుగుతుంది. స్థానిక పోలీసులకు సైతం వీటిపై అవగాహన ఉండదు. ఇటీవల రూ.4 లక్షలు విలువ చేసే వీడ్ ఆయిల్‌ను సైబరాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు.

గౌడలకు అన్ని పార్టీలూ సీట్లు కేటాయించాలి

సుల్తాన్‌బజార్: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో 40 లక్షల జనాభా ఉన్న గౌడ కులస్తులకు అన్ని రాజకీయ పార్టీలు 15 ఎమ్మెల్యే, 3 ఎంపీ సీట్లను కేటాయించాలని, డబ్బు ఉన్న వాళ్లకే టికెట్లు ఇస్తే సహించబోమని తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ ఎం.అశోక్ గౌడ్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో గ్రామ గ్రామానికి వెళ్లి గౌడ కులస్తులను చైతన్యపరుస్తామన్నారు. తమకు ప్రాధాన్యం ఇచ్చే పార్టీలకు మాత్రమే పూర్తి మద్దతు ఇస్తామన్నారు. గౌడ్ కార్పొరేషన్‌ను ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ నేతలతో కలిసి ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో కేవలం రెండు సామాజిక వర్గాలకు చెందిన వారికే పదవులు దక్కుతున్నాయన్నారు. మన పొరుగు రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల మంత్రులు 50 శాతం ఉన్నారని గుర్తుచేశారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు బాలరాజు గౌడ్, అనురాధ గౌడ్, మమత గౌడ్, శోభ గౌడ్, పద్మ గౌడ్, విజయ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ గౌడ్

నగరంలో నేడు

- ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం శోభకృత ఉగాది వేడుకల్లో భాగంగా నాంపల్లి తెలుగు విశ్వవిద్యాలయంలో సాయంత్రం 4.30 గంటలకు ఉగాది శోభ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసింది.
- ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఉదయం 10.45 గంటలకు స్కిల్ ల్యాబ్ ప్రారంభోత్సవం జరుగుతుంది.
- డాక్టర్ డి.రామానాయుడు విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ 26వ సదస్సు ఉదయం 10 గంటలకు జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీఐలో జరుగుతుంది.

ఆస్తికోసం హత్యాయత్నం

- బావమరిదిపై బావ కత్తితో దాడి
- బజార్‌ఘాట్‌లో ఉద్రిక్తత


బాధితుడు అక్బరుద్దీన్

నాంపల్లి: ఆస్తి తగాదాలో బావమరిదిపై బావ కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన నాంపల్లి పోలీసు స్టేషన్ పరిధిలోని బజార్‌ఘాట్‌లో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..బజార్‌ఘాట్‌లో నివాసం ఉండే గౌసుద్దీన్ కుమారుడు అక్బరుద్దీన్ (45)కు అతని బావమరిది (సోదరి భర్త) అల్తాఫ్‌తో గత కొంతకాలంగా ఆస్తి విషయమై వివాదం నడుస్తోంది. ఈ విషయమై మాట్లాడేందుకు అల్తాఫ్ మంగళవారం అక్బరుద్దీన్ ఇంటికి వచ్చాడు. ఆస్తి కోసం ఇరువురు గొడవ పడ్డారు. ఇరువురి మధ్య వాగ్వివాదం జరిగి తీవ్రమైన ఘర్షణకు దారితీసింది. దీంతో కోపోద్రిక్తుడైన అల్తాఫ్ తన వెంట తెచ్చుకున్న కత్తితో అకర్బుద్దీన్‌పై విచక్షణారహితంగా దాడి చేసి అక్కడి నుంచి పారిపోయాడు. అక్బరుద్దీన్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అనంతరం అల్తాఫ్ అతడి కుమారులు అస్రార్ అహ్మద్, అబ్రార్ అహ్మద్‌లపై నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనను చంపే ప్రయత్నం చేశారని, వారి నుండి నాకు ప్రాణ రక్షణ కల్పించాలని కోరారు. ఫిర్యాదు చేసిన సమయంలో క్షతగాత్రుడు తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో బంధువులు తిరిగి ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్సలు అందించారు.

హవాలా నగదును తరలిస్తున్న వ్యక్తి అరెస్టు


సుల్తాన్‌బజార్: అక్రమంగా రూ.20 లక్షల హవాలా నగదును రవాణా చేస్తున్న ఓ వ్యక్తిని మంగళవారం సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుని వద్ద రూ.20 లక్షలు స్వాధీం చేసుకున్నారు. సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ బాలగంగిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..గచ్చిబౌలి టీఎన్జీఓస్ కాలనీకి చెందిన ఆదిత్య పట్టేవార్ (30) ప్రైవేటు ఉద్యోగి. సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ లిమిట్స్‌లో రూ.20 లక్షల నగదు బ్యాగ్‌తో వెళ్తుండగా అనుమానాస్పదంగా కన్పించడంతో పోలీసులు పట్టుకుని విచారించారు. అది హవాలా డబ్బుగా గుర్తించారు. ఈ సొమ్మును కోఠిలోని 94 బస్టాప్ వద్ద ఓ దుకాణంలో డెలివరీ చేసేందుకు వెళ్తున్నానని ఒప్పుకున్నాడు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు నగదును స్వాధీనం చేసుకున్నారు.

అసభ్యంగా సైగ చేశారంటూ విద్యార్థిని ఫిర్యాదు

గచ్చిబౌలి: గుర్తు తెలియని ఓ బీజేపీ నాయకుడు అసభ్యంగా సైగ చేశారని హెచ్‌సీయూ విద్యార్థిని కృపా మేరియా జార్జ్ గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని జాకీర్ హుస్సేన్ ఆడిటోరియంలో విద్యార్థులతో మాజీ ఎంపీ సుబ్రహ్మణ్య స్వామి ఇంటరాక్షన్ సెషన్‌కు హాజరయ్యారు. స్వామి వెళుతుండగా హెచ్‌సీయూలోని ఓ వర్గానికి చెందిని విద్యార్థులు బీజేపీ, ఏబీవీపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ క్రమంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి చేతితో అసభ్యంగా సైగ చేశారని మేరియా ఫిర్యాదు చేసింది. సైగ చేసిన వ్యక్తి కర్ణాటకకు చెందిన ఎమ్మెల్సీ అని విద్యార్థులు అంటున్నారు. ఉన్నతాధికారులతో చర్చిస్తున్నామని, కేసు నమోదు చేస్తామని సీఐ సురేష్ తెలిపారు.

బాలుడి అదృశ్యం

స్నేహితురాలే కిడ్నాప్ చేసిందని తల్లిదండ్రుల ఫిర్యాదు



మియాపూర్: ఓ బాలుడు అదృశ్యం అయిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ దశరథ్ తెలిపిన వివరాల ప్రకారం తాండూర్‌కు చెందిన దాసరి మల్లేష్, భార్య గంగమ్మ, కుమారుడు సాయితో కలిసి మియాపూర్‌లో ఉంటున్నారు. మల్లేష్ కూలీ పని చేస్తుండగా..గంగమ్మ చెత్త ఏరుకుంటూ ఉంటుంది.ఈ క్రమంలో మంజీర పైప్‌లైన్ సమీపంలో మంగళవారం ఉదయం గంగమ్మ స్నేహితురాలు వాణితో కలిసి చెత్త ఏరుకుని అనంతరం పైపులైన్ రోడ్డు ప్రాంతంలో స్క్రాప్ షాప్‌కు వెళ్లారు. అనంతరం వారిద్దరు కల్లు తాగారు. కుమారుడు సాయితో కలిసి వినాయక్ నగర్ రోడ్డు పక్కన నిద్రపోయారు. తరువాత గంగమ్మ కొద్దిసేపటికి నిద్రలేచి చూడగా కుమారుడు సాయి, స్నేహితురాలు వాణి కనిపించలేదు. చుట్టు పక్కల ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. తన కుమారుడిని వాణి తీసుకువెళ్లిందని మియాపూర్ పోలీస్ స్టేషన్లో తండ్రి మల్లేష్ సాయంత్రం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, ఈ మార్గంలో సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

దళితులపై బీజేపీ సర్కార్ ముప్పేట దాడి

డీఎస్ఎంఎం జాతీయ కార్యదర్శి బీవీ రాఘవులు


మహాధర్నాలో మాట్లాడుతున్న బీవీ రాఘవులు

కవాడిగూడ: బీజేపీ తొమ్మిదేళ్ల పాలనలో ప్రధాని నరేంద్ర మోదీ దళిత, గిరిజన, మహిళా, మైనార్టీలపై ముప్పేట దాడి కొనసాగిస్తున్నారని దళిత్ శోషణ్ ముక్తి మంచ్(డీఎస్ఎంఎం) జాతీయ కార్యదర్శి బి.వి.రాఘవులు ధ్వజమెత్తారు. దళితులపై 2014లో 40,072 దాడులు జరిగితే 2021 సంవత్సరం నాటికి 50,900 సంఘటనలు పెరిగాయని మండిపడ్డారు. సామాజిక ప్రజా సంఘాలు, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, ఇతర కుల సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద దళితులపై దాడులను నిరసిస్తు మహా ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా బి.వి.రాఘవులు హాజరై మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ కనుసన్నుల్లోనే ప్రధాని నరేంద్రమోదీ పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. మతోన్మాద శక్తులు విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజల మధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయకుండా పాలకులు నీతి అయోగ్, ప్రణాళిక సంఘం పేరిట సబ్ ప్లాన్ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైల్యాబ్ ఆరోపించారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాన్‌వెస్లీ, ఆర్.వెంకటరాములు, ధర్మానాయక్, ఆశయ్య, స్వామి, రమేష్, అంజన్న, శ్యామూల్, మాణిక్యం, గోపి, లక్ష్మీదేవి, రాధిక, కావ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

'వెల్‌నెస్ కేంద్రం'లో మందుల అక్రమదందా

విచారణ జరపాలని ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈఓకు సీపీఎం లేఖ

ముషీరాబాద్: ఖైరతాబాద్ వెల్‌నెస్ కేంద్రంలో మెడిసిన్స్ అక్రమ దందాపై విచారణ జరపాలని సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈఓకు లేఖ రాశారు. ఖైరతాబాద్ వెల్‌నెస్ కేంద్రంలో పేషెంట్స్‌కు అవసరం లేకపోయినా 15 నుంచి 20 రకాల మెడిసిన్స్ రాస్తూ సరఫరా చేస్తున్నారని, నిజంగా రోగులు ఈ మందులు వాడితే అనారోగ్యం పాలవ్వడం ఖాయమని ఆందోళన వ్యక్తం చేశారు. రోగుల పేరిట దొంగదారిలో మందులు పొంది..అక్కడ పనిచేసే కొందరు బయట దుకాణాల్లో అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఫార్మా డిస్ట్రిబూషన్ కంపెనీల లాభాల కోసం అధిక మొత్తంలో మెడిసిన్స్‌ను ఇండెంట్ పెట్టి తెప్పిస్తున్నారని, వాటిని పేషెంట్స్ పేరుతో పెద్ద మొత్తంలో ప్రిస్క్రిప్షన్స్ రాయించి బయట అమ్ముకుంటున్నారన్నారు. ఒక ఫార్మా డిస్ట్రిబ్యూషన్ కంపెనీ వెల్‌నెస్ కేంద్రాల్లోని ఫార్మసిస్టులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి ఏ మందులు ఎంత మొత్తంలో ఇండెంట్ పెట్టాలో ఆదేశాలు జారీ చేస్తోందని శ్రీనివాస్ ఆరోపించారు. కేంద్రాల ఇన్‌చార్జిల నిర్లక్ష్యం కారణంగా డయాలసిస్ పేషెంట్స్ కోసం ఇటీవల ప్రత్యేకంగా ఇండెంట్ పెట్టి తెప్పించిన మూడు లక్షల రూపాయల విలువైన మెడిసిన్స్ కాలం చెల్లిపోయి వృథా అయ్యాయని అన్నారు. హైదరాబాద్ వెల్‌నెస్ కేంద్రంలో ఇన్‌చార్జిలు, డాక్టర్లతో సహా అందరూ ఔట్‌సోర్సింగ్ సిబ్బందే అని, ఒక్క ప్రభుత్వ డాక్టర్‌ను కూడా నియమించకపోవడం చాలా బాధాకరమన్నారు. టెస్టుల కోసం ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లకుండా ఖైరతాబాద్ వెల్‌నెస్ కేంద్రంలోనే తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ డాక్టర్లను వెల్‌నెస్ కేంద్రాలకు ఇన్‌చార్జిలుగా నియమించాలని, దందాలు జరుపుతున్న ఉద్యోగులను తక్షణమే తొలగించాలని ఎం.శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

రూ.50 కోట్లతో అభివృద్ధి పనులు!

- సీఎంఓ ఆదేశాలతో మేడ్చల్ జిల్లా ఎమ్మెల్యేల ప్రతిపాదనలు
- నూతన కలెక్టరేట్ ప్రారంభ సభలో సీఎం ఇచ్చిన హామీ ఫలితం

సాక్షి, మేడ్చల్ జిల్లా: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు హామీల పంట పండుతోంది. గతేడాది ఆగస్టు 17వ తేదీన జిల్లా నూతన సమీకృత కలెక్టర్ కార్యాలయం ప్రారంభోత్సవ సభలో సీఎం కేసీఆర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలకు ఇచ్చిన హామీలకు ఎట్టకేలకు మోక్షం లభిస్తోంది. ఆ సభలో ఎమ్మెల్యేలకు ప్రతీ ఏటా విడుదల చేస్తున్న రూ.5 కోట్ల నియోజకవర్గం అభివృద్ధి నిధులు (సీడీపీ) కాకుండా అదనంగా మరో రూ.10 కోట్ల చొప్పున మొత్తంగా జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు రూ.50 కోట్లు మంజూరు చేస్తామని సీఎం ప్రకటించారు. దాదాపు ఆరు నెలల తర్వాత.. సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎట్టకేలకు సీఎంఓ నుంచి సీఎం హామీలో భాగంగా ప్రత్యేక నిధులకు సంబంధించి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపాదనలు నివేదించాలని ఎమ్మెల్యేలకు ఆదేశాలు అందాయి. దీంతో జిల్లాకు చెందిన మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సీహెచ్ మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో సహా జిల్లాలో కొంత భాగాన్ని కలిగి ఉన్న శేరిలింగపల్లి, ఎల్బీనగర్ ఎమ్మెల్యేలకు కూడా తమ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రతిపాదనలను అధికార యంత్రాంగం ద్వారా ప్రభుత్వానికి నివేదించారు. ఐదుగురు ఎమ్మెల్యేలు రూ.10 కోట్ల చొప్పున మొత్తంగా రూ.50 కోట్లతో తమ నియోజకవర్గాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించి బీటీ, సీసీ, మట్టి రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు, అండర్, సైడ్ డ్రైనేజీలు, ప్రహరీల నిర్మాణంతో సహా పలు కార్యక్రమాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఎమ్మెల్యేల ప్రతిపాదనలకు ఈ ఆర్థిక సంవత్సరంలోని నిధులను కేటాయించనుండటంతో.. ఏప్రిల్ కల్లా విడుదల కావొచ్చని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో.. ఈ అభివృద్ధి పనులను ఎన్నికల తాయిలాలుగా ఎమ్మెల్యేలు వినియోగించుకునే అవకాశం లేకపోలేదన్న అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.



ఫుడ్ 'సేఫ్టీ' ఎక్కడ?

- ప్రకటనలకే పరిమితమైన కల్తీల కట్టడి
- తరచూ ఆస్పత్రుల పాలవుతున్న ప్రజలు
- అయినా పట్టింపులేని జీహెచ్ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: నాలుగు రోజుల క్రితం దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ రెస్టారెంట్‌లో పెట్టిన చికెన్ బిర్యానీలో బొద్దింకలు. రెండు నెలల క్రితం బంజారాహిల్స్‌లోని ఓ హోటల్ నుంచి స్విగ్గీ ద్వారా అందిన రొయ్యల పలావులో బొద్దింకలు. గత శనివారం ఏఎస్‌రావు నగర్‌లో స్ట్రీట్‌ఫుడ్ సెంటర్లో ఆహారం తిన్న ఆరుగురు ఆస్పత్రిపాలు. ఏఎస్‌రావు నగర్‌లోనే ఈ నెల 1న కుళ్లిపోయిన నూర్జహాన్ బిర్యానీ సరఫరా. నగరంలో ఆహార కల్తీకి కొన్ని మచ్చుతునకలు. ఇవి సైతం ట్విట్టర్ ద్వారా జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేసినవి. ఎన్నో ప్రాంతాల్లో ఎంతో కల్తీ జరుగుతున్నా, ప్రజలు అనారోగ్యం పాలవుతున్నా అన్నింటిపైనా ఫిర్యాదులు ఉండటం లేదు. అడపాదడపా కొందరైనా ఫిర్యాదు చేసినా, సంబంధిత ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ తనిఖీ చేస్తారనో, లేక చేసి శాంపిల్స్ పరీక్షలకు పంపించారనో రొటీన్ సమాధానం. అంతకుమించి అపరిశుభ్ర వాతావరణంలో హోటళ్లు, రెస్టారెంట్లు నిర్వహిస్తున్నవారిపై జీహెచ్ఎంసీ చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నా పట్టించుకుంటున్న వారే లేకుండా పోయారు.

ప్రజారోగ్యానికి ముప్పు..

- గతంలో కోటి జనాభా ఉన్న నగరానికి కేవలం ముగ్గురు ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్లు మాత్రమే ఉన్నారని, సరైన తనిఖీలు చేయలేకపోతున్నామని జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు పేర్కొనేవారు. ప్రస్తుతం వారి సంఖ్య దాదాపు 25కు పెరిగింది. అంతేకాదు.. ఆహారకల్తీని వెంటనే పరీక్షించేందుకు ఓ మొబైల్ వాహనం సైతం ఉందని, అక్కడికక్కడే పరీక్షలు చేస్తామని దాదాపు నాలుగు నెలల క్రితం మేయర్ ఘనంగా ప్రకటించారు.
- ప్రస్తుతం ఆ వాహనం పని చేస్తోందో లేదో తెలియదు. ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్లు సైతం తనిఖీలు చేస్తున్నారో లేదో సంబంధిత ఉన్నతాధికారులకే తెలియాలి. ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ల సంఖ్య పెరగడంతో కల్తీ, అపరిశుభ్రత వంటివి తగ్గుతాయని ఎవరైనా భావిస్తారు. కానీ జీహెచ్ఎంసీలో మాత్రం ఆఫీసర్లు పెరిగారు. కల్తీ కూడా పెరిగింది. సంబంధిత ఉన్నతాధికారులు, యంత్రాంగం, పాలకమండలి ఏంచేస్తుందో వారికే తెలియాలి.
- ఈ నేపథ్యంలో అపరిశుభ్ర వాతావరణంలో తయారు చేస్తున్న వంటలతో, కల్తీ జరుగుతున్న ఆహారంతో ఆస్పత్రుల పాలవుతున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. తనిఖీలు పెరిగినట్లు జీహెచ్ఎంసీ పేర్కొంటున్నప్పటికీ, గుర్తించిన కల్తీదారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వెల్లడించడం లేదు.

నిబంధనలకు నీళ్లు..

- ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ (ఎఫ్ఎస్ఎస్ఏ) యాక్ట్ మేరకు, అన్ని ఆహార విక్రయ కేంద్రాలు, ఉత్పత్తి కేంద్రాల వివరాలు జీహెచ్ఎంసీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండాలి. తరచూ తనిఖీలు నిర్వహిస్తూ, కల్తీకి ఆస్కారమున్న, పరిసరాలు పరిశుభ్రంగా లేని ప్రాంతాల్లో తగిన చర్యలు తీసుకోవాలి. దాన్ని అమలు చేయడంపై జీహెచ్ఎంసీ దృష్టి సారించలేదు. ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్లు పెరిగినా తనిఖీలు లేవు. ఫిర్యాదులొస్తే హోటళ్ల యాజమాన్యాలతో సెటిల్మెంట్లు చేసుకుంటున్నారు తప్ప చర్యలు తీసుకోవడం లేరని కొందరు కార్పొరేటర్లు పేర్కొన్నారు.

‘కేవీఆర్’ది ప్రత్యేక ముద్ర



మాజీ మంత్రి కె. విజయరామారావు భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ

విజయరామారావు (ఫైల్)

- ఉమ్మడి ఖైరతాబాద్ అభివృద్ధికి విశేష కృషి
- విజయరామారావు సేవలను గుర్తు చేసుకుంటున్న ప్రజలు

బంజారాహిల్స్: సీబీఐ మాజీ డైరెక్టర్, మాజీ మంత్రి, ఉమ్మడి ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే దివంగత కె. విజయరామారావు (కేవీఆర్) నియోజక అభివృద్ధికి విశేష కృషి చేసి ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. 1999లో తొలిసారిగా టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయనను కేబినెట్ మంత్రి పదవి వరించింది. ప్రస్తుతం ఉన్న ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ప్రాంతాలతో పాటు జూబ్లీహిల్స్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, అల్వాల్ ప్రాంతాలన్నీ కలిసి ఖైరతాబాద్ నియోజకవర్గం కింద ఉండేవి.

కాంగ్రెస్ దిగ్గజంపై నెగ్గి...

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అతిపెద్ద నియోజకవర్గంగా సుమారు 12లక్షలకు పైగా ఓటర్లతో ఈ నియోజకవర్గం ఉండేది. అప్పటికే హైదరాబాద్ నగరంలో తిరుగులేని నేతగా ఉన్న కాంగ్రెస్ దిగ్గజం పీజేఆర్ మీద పోటీ చేసి విజయం సాధించారు. ఎన్నికల సమయంలో ప్రచారంలో గుర్తించిన, అందిన ఫిర్యాదులను దృష్టిలో పెట్టుకుని నియోజకవర్గంలోని 200 పైగా బస్తీల్లో కనీస సౌకర్యాలపై దృష్టి పెట్టారు. తాగునీటి లైన్లు, రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టారు. దీంతో పాటు ట్రాఫిక్‌సమస్యలు పరిష్కరించేందుకు పలు ప్రధాన రోడ్లను విస్తరణ చేయించిన ఘనత విజయరామారావుకే దక్కింది.

- దీంతో పాటు పేదలు నివాసం ఉంటున్న బస్తీలలో ప్రభుత్వ పాఠశాలల నిర్మాణాన్ని చేపట్టారు. నియోజకవర్గంలోనే అతిపెద్దదైన ఫిలింనగర్ రౌండ్ టేబుల్‌ప్రభుత్వ పాఠశాలతోపాటు 20కి పైగా సర్కారు బడులు, అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హాళ్లను నిర్మించి జనంలో తమదైన ముద్ర వేశారు.
- ఇప్పుడున్న కేబీఆర్ పార్కుతోపాటు కృష్ణకాంత్ పార్కు, జలగం వెంగళరావు పార్కు, ఎన్టీఆర్ గార్డెన్స్, నెక్లెస్ రోడ్డు ఆయన హయాంలోనే రూపుదిద్దుకున్నాయి. ప్రజల సమస్యలు తెలుసుకొనేందుకు ఆ ప్రజలు తన ఇంటి వద్దకు రాకుండా తానే ప్రజల వద్దకు వెళ్లేవాడు. ఆయన ఇళ్లు చాలా మందికి తెలియదంటే ఆశ్చర్యం లేదు.

రౌడీలకు హడల్..

ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఖరీదైన బస్తీలు, కాలనీలను ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకునేందుకు రౌడీలు తిష్టవేసేవారు. ఎన్నికల ప్రచారంలో ఎక్కువ శాతం రౌడీల దౌర్జన్యాలపై ఫిర్యాదులు అందుకున్న విజయరామారావు వారిని కట్టడి చేసేందుకు చర్యలు చేపట్టారు. గతంలో పోలీసుశాఖలో ఉన్నతాధికారిగా పని చేసిన అనుభవంతో రౌడీలపై ఉక్కుపాదం మోపారు. పేరుమోసిన రౌడీషీటర్లను ఆయన హయాంలో తడీపార్ (నగర బహిష్కరణ) చేయించారు.

పైరవీలు, పోస్టింగ్స్‌లకు నో...

ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేస్తున్న సమయంలో తన వద్దకు పోలీసు, ఇతర శాఖల పైరవీలు, పోస్టింగ్‌లూ అంటూ వచ్చేవారిని కేవీఆర్ నిర్ద్వంద్వంగా తిరస్కరించేవారు. అలాంటి పనులు తనవద్దకు తీసుకు రావద్దని ముఖం మీదే చెప్పేవారని పలువురు నాయకులు గుర్తు చేసుకుంటారు. ఎన్నికల్లో మద్యం, డబ్బు పంపిణీని పూర్తిగా వ్యతిరేకించే విజయరామారావు ఆ విధానాన్ని ఆచరించి చూపారని ఆయన అభిమానులు చెప్తుంటారు. పోలీసులకు ఫోన్లు చేయడం, ప్రభుత్వ అధికారులకు ఫోన్లు చేయడం లాంటి పనులు ఏనాడు చేయలేదని వారు పేర్కొన్నారు.

ముక్కుసూటి తత్వానికి నిదర్శనం..

ఓట్ల కోసం ఎన్ని హామీలైనా గుప్పించడం, ఎన్ని తప్పులు చేసినా వెనకేసుకుని రావడం ప్రస్తుతం రాజకీయాలలో సర్వసాధారణం. అయితే విజయరామారావు మాత్రం ముక్కుసూటిగా వ్యవహరిస్తూ తప్పును తప్పు అని ధైర్యంగా చెప్పేవారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు హుస్సేన్‌సాగర్ పరీవాహక ప్రాంతంలో కొన్ని ఇళ్లలోకి వరదనీరు వచ్చింది. అక్కడకు వెళ్లిన ఎమ్మెల్యే విజయరామారావును స్థానికులు తమకు సాయం చేయాలని డిమాండ్ చేయడంతో పాటు ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ దబాయించారు. అయితే చెరువులో ఇళ్లు కట్టుకోవడం తప్పని, ప్రభుత్వం ఏం చేస్తుందని వారినే ప్రశ్నించారు. ఇలా అయితే ఎన్నికల్లో ఓట్లు ఎలా వేస్తారంటూ సన్నిహితులు అన్నా వినలేదు,. వాస్తవాన్ని చెప్పకుండా మోసం చేయడం తన నైజం కాదంటూ అక్కడినుంచి వెళ్లిపోయాడు.

నివాళులర్పించిన విష్ణువర్ధన్ రెడ్డి

రహమత్‌నగర్: మాజీ మంత్రి విజయరామారావు పార్థివ దేహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు ఖదీర్, హుడా మాజీ మెంబర్ జాకబ్, టీడీపీ సీనియర్ నాయకుడు జోసఫ్ తదితరులు మంగళవారం విజయరామారావు నివాసానికి వెళ్లి నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు.



క్లుప్తంగా

ఆర్ఆర్ఆర్‌కు ఆస్కార్ గర్వకారణం

లిబర్టీ: ఆర్ఆర్ఎస్ చిత్రం ఆస్కార్ అవార్డు కైవసం చేసుకొని తెలుగు సినిమా సత్తాను ప్రపంచానికి చాటడంతో పాటు దేశ గౌరవాన్ని పెంచిందని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ, ఆర్ఆర్ఆర్ చిత్రంలోని నాటు నాటు పాటకు ఆస్కార్ పురస్కారం రావడం తెలుగు వారికే కాకుండా భారతీయులందరికీ గర్వకారణమన్నారు. రాజమౌళి దర్శకత్వంలో చంద్రబోస్ రాసిన పాటకు ఎంఎం కీరవాణి సంగీతం సమకూర్చగా, జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్ తమ డ్యాన్స్‌తో జీవంపోశారని కొనియాడారు.

మాలమహానాడు జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షుడిగా ప్రసాద్



నియామక పత్రం అందిస్తున్న చెన్నయ్య

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ డివిజన్ మాలమహానాడు అధ్యక్షుడిగా మారేడు ప్రసాద్ నియమితులయ్యారు. మాల మహానాడు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య నియామక పత్రం అందజేశారు. ఫిలింనగర్ రోడ్ నంబర్ 9కి చెందిన మారేడు ప్రసాద్ కొంత కాలంగా మాలమహానాడు భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తూ బలోపేతం చేస్తుండటంతో గుర్తింపుగా ఈ పదవిని కట్టబెట్టారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, పీవీ రావు ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని ఈ సందర్భంగా ప్రసాద్ తెలిపారు. తనపై నమ్మకంతో పదవిని అప్పగించినందుకు డివిజన్ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

నవ సమాజ నిర్మాణానికి తోడ్పాటు అందించాలి

లిబర్టీ: దోపిడీ, అసమానతలు లేని నవ సమాజ నిర్మాణానికి సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు తోడ్పాటు అందించాలని దళిత హక్కుల పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు ఎం.మార్టిన్ విజ్ఞప్తి చేశారు. కారల్ మార్క్స్ వర్ధంతి సందర్భంగా సమితి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పెట్టుబడిదారుల శ్రమ దోపిడీ నుంచి పేదలను, శ్రామికులను విముక్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు పెట్టుబడిదారి వ్యవస్థ, శ్రమ దోపిడీ వంటి అనేక అంశాలను మార్క్స్ తాను రాసిన పెట్టుబడి గ్రంథంలో పేర్కొన్నారని, నేటి సమాజానికి ఈ గ్రంథం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సమావేశంలో బందయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి దానం సాయం



బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందిస్తున్న బీఆర్ఎస్ నేతలు

బంజారాహిల్స్: ఫిలింనగర్ జైల్‌సింగ్ నగర్‌లో ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమై రోడ్డున పడ్డ కుటుంబానికి ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అండగా నిలిచారు. బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులతో పాటు రూ. 15 వేల నగదు, ఇంటి నిర్మాణం కోసం రేకులు, పైపులను మంగళవారం అందించారు. డివిజన్ బీఆర్ఎస్ నేతలు మామిడి నర్సింగ్‌రావు, స్థానిక నేతలు బాధితుల ఇంటికి వెళ్లి ఈ సామగ్రిని అందించారు. గృహలక్ష్మి పథకం కింద ఇల్లు నిర్మాణం కోసం రూ. 3 లక్షలు మంజూరు చేస్తామని నాగేందర్ హామీ ఇచ్చారని బాధితులకు నాయకులు తెలిపారు. ప్రభుత్వం నుంచి పొందేందుకు అర్హత గల అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

లిబర్టీ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీల పట్ల అనుసరిస్తున్న వివక్షను విడనాడి చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించే బిల్లును పార్లమెంట్ ఉభయసభల్లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు డి.కుమారస్వామి డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 ఏళ్లు గడిచినా బీసీల పట్ల తీవ్రమైన నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. మంగళవారం బీసీ దళ్ కార్యాలయంలో అత్యవసరంగా ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వెంటనే జోక్యం చేసుకొని చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ప్రస్తుత పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మహిళా విభాగం అధ్యక్షురాలు గంగవరం పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



పట్టాలతో సందడి చేస్తున్న చిన్నారులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని ది ప్రీమియా అకాడమీలో కిండర్‌గార్టెన్ గ్రాడ్యుయేషన్ డేతోపాటు స్కూల్ వార్షికోత్సవం ఉత్సాహంగా జరిగాయి. ప్రీప్రైమరీ విభాగ విద్యార్థులు 2022–23 విద్యాసంవత్సరానికిగాను పట్టాలను అందుకొని ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ది ప్రీమియా అకాడమీ ఫౌండర్, ఎండీ సింధూరి రెడ్డి, ప్రిన్సిపాల్ తృప్తిరావు మాట్లాడుతూ, అత్యుత్తమ విద్యకు, అంకితభావానికి తాము కట్టుబడి ఉన్నామని అన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేత

ఖైరతాబాద్: ఇంటర్, పదో తరగతి పరీక్షల నేపథ్యంలో ఖైరతాబాద్ డివిజన్ రాజ్‌నగర్‌లో పరీక్షలకు శిక్షణ తీసుకుంటున్న 120 మంది విద్యార్థులకు మంగళవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ విజయారెడ్డి పరీక్ష ప్యాడ్లు, పెన్నులు ఉచితంగా అందజేశారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని పరీక్ష బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అకాడమీ డైరెక్టర్ విష్ణు గౌడ్, జాయింట్ డైరెక్టర్ మహేష్ గౌడ్, అధ్యాపకులు అనికేత్ అరుణ్, నాయకులు సతీష్, సంతోష్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్, టెన్త్ విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు అందజేస్తున్న విజయారెడ్డి

రేషన్ బియ్యాన్ని బ్లాక్‌లో అమ్మితే క్రిమినల్ చర్యలు



డీలర్‌తో మాట్లాడుతున్న సీఎన్ రెడ్డి

రహమత్‌నగర్: రేషన్ బియ్యాన్ని నల్ల బజారుకు తరలిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ జిల్లా సివిల్ సప్లయి విజిలెన్స్ కమిటీ సభ్యుడు, రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎస్ రెడ్డి హెచ్చరించారు. సోషల్ ఆడిట్‌లో భాగంగా మంగళవారం సివిల్ సప్లయి అధికారి బహ్మారావు, ఎన్‌రోల్‌మెంట్ తహసీల్దార్ కృష్ణవేణిలతో కలిసి రహమత్‌నగర్, కార్మికనగర్‌ల్లోని రేషన్ షాపులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొంత మంది రేషన్ డీలర్లు బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటున్నారని తమకు ఫిర్యాదులు అందుతున్నాయని, అలాంటి వారు తమ పద్ధతి మార్చుకోవాలన్నారు. లబ్ధిదారులకు ఎండ తగలకుండా రేషన్ షాపుల ముందు నీడ నిచ్చే ఏర్పాటు చేయాలని సూచించారు. సీనియర్ ఇన్‌స్పెక్టర్ విక్రమ్ కుమార్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు రవిశంకర్, షేక్ చోటు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంపై అవగాహన కలిగి ఉండాలి

వెంగళరావునగర్: ప్రతి మహిళా భారతీయ ఆయుర్వేద వైద్యంపై అవగాహన కలిగి ఉండాలని ఆయుర్వేద వైద్య నిపుణులు, సీనియర్ వైద్యులు సూచించారు. విశ్వ ఆయుర్వేదిక్ పరిషత్ మహిళా ప్రకోష్ట, ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం మహిళా దినోత్సవాన్ని ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్య నిపుణులు మాట్లాడుతూ, వివిధ కారణాల వల్ల పట్టణ ప్రాంత మహిళలే తరచూ అనారోగ్యానికి గురవుతుంటారన్నారు. కుటుంబ, ఆర్థిక, సామాజిక, శారీరక సమస్యల వల్ల నిరంతరం ఒత్తిడికి గురి కావడం అనేక రోగాలకు దారి తీస్తోందన్నారు. ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే తక్షణమే వైద్యులను సంప్రదించి తగిన సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనసూయ, ఆయుర్వేద వైద్య విభాగం రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్లు డాక్టర్ సుధ, డాక్టర్ విజయలక్ష్మిలతో పాటుగా ప్రోగ్రాం నిర్వాహకులు డాక్టర్ పెనుబాల యశోద, రిటైర్డ్ రీసెర్చ్ ఆఫీసర్ డాక్టర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.



సీనియర్ వైద్య నిపుణురాలిని సన్మానిస్తున్న డాక్టర్ యశోద తదితరులు

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

వెంగళరావునగర్: ప్రభుత్వ స్థలాలను ఆక్రమించే వారిపై కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని ఖైరతాబాద్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌రాజ్ అన్నారు. ఎర్రగడ్డ డివిజన్ సారథీనగర్‌లోని ప్రభుత్వ స్థలంలో ఇటీవల నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని మంగళవారం రెవెన్యూ అధికారులు తమ సిబ్బందితో కూల్చివేయించారు. ఈ సందర్భంగా కిరణ్‌రాజ్ మాట్లాడుతూ, సారథీనగర్‌లోని ప్రభుత్వ స్థలంలో గతంలో నిర్మాణం చేపట్టగా అడ్డుకొని పనులు నిలిపివేయించామన్నారు. అయినప్పటికీ వినకుండా మళ్లీ నిర్మాణం చేపట్టడంతో కూల్చివేశామన్నారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్ఐ హెచ్చరించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు



వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ హుండీని మంగళవారం లెక్కించారు. 98 రోజులకు మొత్తం రూ.17,73,490 ఆదాయం సమకూరింది. ఆలయ ఈఓ లావణ్య, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన హుండీ లెక్కింపులో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో ‘సంక్షేమ’ వెలుగులు



చెక్కులు అందుకున్న వారితో ఎమ్మెల్యే గోపీనాథ్ తదితరులు

రహమత్‌నగర్: సీఎం కేసీఆర్ ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నాయని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శ్రీరాంనగర్‌లోమంగళవారం 49 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణాలో మాత్రమే పేద ఆడపడుచుల వివాహానికి షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకాల ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారని చెప్పారు. స్పెషల్ ఆర్ఐ కిరణ్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మన్సూర్, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, సుబ్బరాజు, మాజీ డివిజన్ అధ్యక్షుడు కొండాపురం నాగరాజు, నజీర్, ధనూజ, షరీఫ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

భర్త అదృశ్యమయ్యాడని భార్య ఫిర్యాదు

బంజారాహిల్స్: తన భర్త అదృశ్యమయ్యాడని ఓ నవ వధువు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడ బస్తీలో నివసించే సోను(24) ప్రైవేట్ ఉద్యోగి కాగా, భార్య షేక్ రోషణి(24) ఈవెంట్ మేనేజర్‌గా పని చేస్తోంది. ఈ నెల 5న ఆఫీసుకు వెళ్లిన సోను ఇంటికి తిరిగి రాలేదు. దీంతో రోషణి అతనికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఇదిలా ఉండగా, ఈ ఏడాది జనవరిలో తమకు పెళ్లైందని, నెల రోజులుగా తమ మధ్య గొడవలు జరుగుతున్నాయని, ఈ కారణంగా తన భర్తకు గుంటూరు జిల్లా మాచర్లలో నివసించే తల్లిదండ్రులు రెండో పెళ్లి చేయాలని చూస్తున్నారంటూ ఆమె బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. తాను అన్ని ప్రాంతాల్లో వెదికానని, తన భర్త జాడ తెలియరాలేదని, తన అత్తమామల వద్దే భర్త ఉండి ఉంటాడంటూ ఆమె అనుమానం వ్యక్తం చేసింది. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగి డ్రైవింగ్ చేసిన ఐదుగురికి జైలు

బంజారాహిల్స్: అతిగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డ ఐదుగురికి మేజిస్ట్రేట్ జైలు శిక్ష, జరిమానా విధించారు. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు ఇటీవల నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 22 మంది వాహనదారులు చిక్కారు. వీరిని పోలీసులు మంగళవారం నాంపల్లిలోని 4వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. వీరిలో ఎస్సార్‌నగర్‌కు చెందిన జి. కుమారస్వామికి పది రోజుల జైలుతోపాటు రూ. 2100ల జరిమానా, లక్ష్మణ్‌కు ఏడు రోజుల జైలు, రూ.2100ల జరిమానా, దాస్ ఆశిష్‌కు నాలుగు రోజుల జైలు, రూ. 3300ల జరిమానా, సికింద్రాబాద్‌కు చెందిన సనాతన మాలిక్‌కు మూడు రోజుల జైలు, కృష్ణానగర్‌కు చెందిన ఎస్.మల్లికార్జున రావుకు రెండు రోజుల జైలు శిక్ష విధించారు. కూకట్‌పల్లికి చెందిన ఎస్.గణేశ్ డ్రైవింగ్ లైసెన్స్‌ను మూడు నెలలపాటు రద్దు చేశారు. మొత్తం 22 మందిలో 16 మందికి జరిమానాలు, ఐదుగురికి జైలు, ఒకరి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు.

ఏడుగురు వ్యాపారులపై కేసులు నమోదు

బంజారాహిల్స్: రోడ్ల పక్కన బండ్లు ఏర్పాటుచేసి వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కల్గిస్తున్న ఏడుగురు చిరువ్యాపారులపై బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12లోని లోటస్ పాండ్‌ను ఆనుకొని దామేశ్వర్‌కుమార్ ఫ్రూట్ జూస్ షాపు, ఆనంద్ అనే వ్యక్తి ఆనంద్ టీ పాయింట్, శ్రీనివాస్ అనే వ్యక్తి కేసీఎస్ ఫుడ్ సెంటర్, మోహన్ అనే వ్యక్తి మోహన్ చైనీస్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, కృష్ణ అనే వ్యక్తి కృష్ణ రోటీస్ అండ్ చికెన్ షాప్, వీఎస్ ధనరాజన్ శ్రీను అనే వ్యక్తి శ్రీను హోటల్స్, కృష్ణ అనే వ్యక్తి కృష్ణ టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నారు. వీరి వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఫిర్యాదులు అందడంతో బంజారాహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ రాకేష్‌రెడ్డి సిబ్బందితో కలిసి దాడులు చేశారు. టేబుళ్లు, టీస్టాళ్లు, గ్యాస్ సిలిండర్లు, కుర్చీలు, జ్యూసర్ మిక్సర్లు సీజ్ చేశారు. వీరందరిపై ట్రాఫిక్ ఎస్ఐ ఇచ్చిన ఫిర్యాదుతో బంజారాహిల్స్ పోలీసులు ఐపీసీ సెక్షన్ 341, 285, రెడ్ విత్ 34 సెక్షన్ 21/76 అండ్ 39 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

సీబీఐ విచారణకు ఎంపీ అవినాశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్‌: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ మాజీ మంత్రి వైఎస్‌ వివేకానందరెడ్డి కేసు దర్యాప్తులో భాగంగా వైఎస్సార్‌సీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డి మంగళవారం సీబీఐ విచారణకు హాజరయ్యారు. ఈ మేరకు మంగళవారం ఉదయం 10.45 గంటలకు సీబీఐ కార్యాలయం లోపలికి వెళ్లిన ఎంపీ అవినాశ్‌రెడ్డి మధ్యాహ్నం 3.30 గంటలకు బయటికి వచ్చారు. సీబీఐ ఎస్పీ రాంసింగ్‌ నేతృత్వంలోని సీబీఐ అధికారుల బృందం ఎంపీని నాలుగు గంటలపాటు ప్రశ్నించింది. న్యాయవాది నాగార్జున సమక్షంలోనే సీబీఐ అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది.

ఆధ్యాత్మిక ప్రవచన చక్రవర్తి సముద్రాల మృతి



సముద్రాల లక్ష్మణయ్య

తిరుపతి కల్చరల్‌: సాహిత్య నిధిని పంచిన ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త, గ్రంథ పరిష్కర్త, ఆధ్యాత్మిక చక్రవర్తి మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య (84) తుది శ్వాస విడిచారు. అనారోగ్యంతో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. సముద్రాల లక్ష్మణయ్య 1939 జూన్‌ 8న ఏర్పేడు మండలం కాట్రకాయలగుంట గ్రామంలో జన్మించారు. టీటీడీ ప్రాచ్యకళాశాలలో అధ్యాపకుడిగా, ధర్మప్రచార పరిషత్‌ కార్యదర్శిగా, పురాణ ఇతిహాసాల ప్రాజెక్టు ప్రత్యేకాధికారిగా విశేష సేవలందించారు. టీటీడీ ప్రచురణలకు సంపాదకుడిగా, భగవద్గీత ప్రాజెక్టు ప్రత్యేకాధికారిగా పని చేశారు. శ్రీమలయాళ యతీంద్ర ఉపదేశామృతం, శ్రీమలయాళస్వామి జీవిత చరిత్ర, రఘువంశం, దశకుమార శతకం, అమరవాణి యోగవాసిష్టము వంటి అనేక గ్రంథాలు రచించారు. రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం నుంచి వాచస్పతి, మహామహోపాధ్యాయ బిరుదలను అందుకున్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు సముద్రాల లక్ష్మణయ్య అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

‘మార్గదర్శి’పై ఈడీ విచారణ చేపట్టాలి

మార్గదర్శి చిట్స్‌కు, రామోజీకి సంబంధంలేదని గతంలో రాజాజీ అనే వ్యక్తి పిటిషన్‌

- ఇప్పుడు చిట్స్‌కు రామోజీయే చైర్మన్‌ అంటూ తెలంగాణ హైకోర్టులో అదే వ్యక్తి పిటిషన్‌
- వ్యవస్థలను రామోజీ ఎలా మోసం చేస్తున్నారో చెప్పటానికి ఇది చాలు
- ఆయన తప్పులకు ఫోర్‌మన్లను బలిచేయటం సిగ్గుచేటు
- రామోజీరావు ఏమైనా చట్టానికి అతీతుడా?
- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌

సాక్షి, రాజమహేంద్రవరం: మార్గదర్శి చిట్స్‌కు సంబంధించి గతంలో రిజిస్ట్రార్‌ ఆఫ్‌ కంపెనీస్‌ తనకిచ్చిన సమాచారాన్ని సీఐడీ అధికారులకు పంపుతున్నానని.. ఆ వివరాలను ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టరేట్‌)కు పంపి విచారణ చేపట్టాలని తాను కోరుతున్నట్లు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌ కుమార్‌ తెలిపారు. రాజమహేంద్రవరంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ చిట్‌ఫండ్‌ 14(2) యాక్ట్‌ ప్రకారం చిట్‌ఫండ్స్‌ ద్వారా సేకరించిన మొత్తాన్ని బ్యాంకులో డిపాజిట్‌ చేయాల్సి ఉన్నా.. మార్గదర్శిలో అలా జరగడం లేదని.. మ్యూచువల్‌ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టారని, ఇతర వ్యాపారాలకూ వినియోగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈనాడు పత్రిక సైతం చిట్‌ఫండ్స్‌ డబ్బుతోనే నడుస్తోందన్నారు.



ఇది వ్యవస్థలను తప్పుదోవ పట్టించడం కాదా?

ఇక మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు, రామోజీరావుకు సంబంధం ఏమిటని ప్రశ్నిస్తూ తనపై వేసిన రూ.50 లక్షల పరువునష్టం దావాకు సంబంధించిన అఫిడవిట్లో సంతకం చేసిన రాజాజీ.. ఇప్పుడు అదే చిట్‌ఫండ్స్‌కు చైర్మన్‌ రామోజీయేనని తెలంగాణ హైకోర్టులో తాజాగా వేసిన అఫిడవిట్లో పేర్కొన్నారని.. ఇది వ్యవస్థలను తప్పుదోవ పట్టించడం కాదా? అని ఉండవల్లి ప్రశ్నించారు. రామోజీరావు తప్పుచేశాడని తాను నిరూపిస్తానని.. ఆధారాలతో సహా చర్చకు వస్తా, చేసిన తప్పు ఒప్పుకునే ధైర్యం రామోజీకి ఉందా? అని ప్రశ్నించారు. ఇదే ప్రశ్న తాను 17 ఏళ్లుగా అడుగుతున్నా ఇప్పటిదాకా స్పందించలేదని ఉండవల్లి ఎద్దేవాచేశారు. నిజానికి.. మార్గదర్శి ఫైనాన్స్‌ షేర్‌పై తాను కేసు పెట్టే సమయానికి కంపెనీ రూ.1,360 కోట్ల నష్టాల్లో ఉందని, రామోజీ ఒక సెలబ్రిటీ కాబట్టి ఇప్పటివరకు ఆయనపై చర్యలు తీసుకోలేదన్నారు.

తప్పు రామోజీది.. బాధ్యులు ఫోర్‌మెన్లా?

మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో అవకతవకలపై ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని.. అధికారులకు సంస్థ ఎలాంటి పత్రాలూ ఇవ్వడం లేదని ఉండవల్లి ఆరోపించారు. చిట్‌ఫండ్స్‌లో రామోజీరావు తప్పులు చేస్తే.. వాటికి మార్గదర్శి బ్రాంచుల్లో పనిచేసే ఫోర్‌మన్లను బాధ్యుల్ని చేసి ఆయన తప్పించుకుంటున్నారన్నారు. తాను తప్పుచేశానని ఏనాడు రామోజీ ఒప్పుకోలేదని, ఎన్ని కేసులు వేసినా తాను ట్రయల్‌ కోర్టుకు వచ్చిన దాఖలాల్లేవన్నారు. రామోజీ ఏమైనా చట్టానికి అతీతుడా? అని ఉండవల్లి ప్రశ్నించారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌పై ఎవరు ఫిర్యాదు చేశారని కొందరు విలేకరులు సీఐడీ అధికారులను ప్రశ్నిస్తున్నారని.. అలాగే, రామోజీరావును ఇబ్బంది పెట్టేందుకే ప్రభుత్వం మార్గదర్శి వ్యవహారాన్ని రచ్చచేస్తోందని ఆరోపిస్తున్నారని.. అలా అనుకుంటే తాము తప్పుచేయలేదని రామోజీ ఎందుకు చెప్పడంలేదని ఉండవల్లి సూటిగా ప్రశ్నించారు.

జూలై నుంచి విశాఖ వేదికగా పాలన

మంత్రివర్గ సమావేశంలో ప్రస్తావించిన సీఎం జగన్‌



సాక్షి, అమరావతి: పరిపాలనా రాజధాని విశాఖ నుంచే త్వరలో పాలన సాగిస్తామని ఢిల్లీలో గ్లోబల్‌ ఇన్వెస్టర్స్‌ మీట్‌ సన్నాహక సదస్సులో సీఎం వైఎస్‌ జగన్‌ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇటీవల విశాఖలో నిర్వహించిన గ్లోబల్‌ ఇన్వెస్టర్స్‌ సదస్సులోనూ ఇదే అంశాన్ని పునరుద్ఘాటించారు. తాజాగా మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలోనూ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్‌ ప్రస్తావించినట్లు తెలిసింది. జూలై నుంచి విశాఖ నుంచే పరిపాలన సాగిస్తానని సీఎం వైఎస్‌ జగన్‌ స్పష్టం చేసినట్లు సమాచారం. వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో సీఎం జగన్‌ అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం సమావేశంలో అజెండా అంశాలపై చర్చ ముగిశాక అధికారులు నిష్క్రమించారు. ఈ సందర్భంగా సమకాలీన రాజకీయ పరిస్థితులపై మంత్రులతో సీఎం జగన్‌ చర్చించారు. ఎమ్మెల్యేల కోటాలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో సంఖ్యా బలం లేకపోయినా టీడీపీ అభ్యర్థిని బరిలోకి దించడాన్ని సీఎం జగన్‌ ప్రస్తావించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలంతా ఓటు హక్కును వినియోగించుకుని నిబంధనల మేరకు తమకు నిర్దేశించిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేసేలా చూడాల్సిన బాధ్యత మంత్రులదేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో గత 45 నెలలుగా జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు చాటిచెప్పాలని మంత్రులకు సీఎం జగన్‌ దిశా నిర్దేశం చేశారు.

మరో అంతర్జాతీయ సదస్సుకు విశాఖ ఆతిథ్యం

ఈ నెల 28 నుంచి 30 వరకు జీ–20 సదస్సు

మహారాణిపేట (విశాఖ దక్షిణ): ఈ నెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జీ–20 సదస్సులో భాగంగా రెండో మౌలిక సదుపాయాల కార్యవర్గ సమావేశాలకు ఆతిథ్యం ఇవ్వడానికి విశాఖపట్నం నగరం సిద్ధంగా ఉందని విశాఖ జిల్లా కలెక్టర్‌ డాక్టర్‌ ఎ.మల్లికార్జున చెప్పారు. ఇటీవల విశాఖలో గ్లోబల్‌ ఇన్వెస్టర్స్‌ సమ్మిట్‌–2023 విజయవంతంగా నిర్వహించామన్నారు. జీ–20 సదస్సులో భాగంగా రెండో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ సమావేశంలో రేపటి ఫైనాన్సింగ్‌ సిటీలు అన్న అంశంపై చర్చ జరుగుతుందని తెలిపారు. 40 దేశాల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటారని చెప్పారు.

ఈ నెల 28న ప్రతినిధుల ప్రణాళిక చర్చలు ఉంటాయని, అదేరోజు అతిథులకు డిన్నర్‌ ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారని ఆయన చెప్పారు.

ఏపీకి వర్ష సూచన

నేటి నుంచి 4 రోజుల పాటు పలుచోట్ల వానలు



సాక్షి, విశాఖపట్నం/గుంటూరు రూరల్‌: ఏపీలో బుధవారం నుంచే వర్షాలు మొదలు కానున్నాయి. భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ముందుగా అంచనా వేసినట్టుగా ఈ నెల 16 నుంచి కాకుండా ఒకరోజు ముందుగానే వానలు కురవనున్నాయి. జార్ఖండ్‌ నుంచి ఛత్తీస్‌గఢ్‌ మీదుగా తెలంగాణ వరకు ఒక ద్రోణి కొనసాగుతోంది. దీని ఫలితంగా కోస్తాంధ్ర, రాయలసీమల్లో బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు వర్షాలకు ఆస్కారం ఉంది. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరుగాను, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని మంగళవారం రాత్రి విడుదల చేసిన బులెటిన్‌లో ఐఎండీ వెల్లడించింది. 17, 18, 19 తేదీల్లో శ్రీకాకుళం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, తూర్పు గోదావరి, అంబేడ్కర్‌ కోనసీమ, ఏలూరు, ఎన్టీఆర్‌, కృష్ణా, బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, కర్నూలు, వైఎస్సార్‌, తిరుపతి జిల్లాల్లో పలుచోట్ల వర్షాలకు ఆస్కారం ఉందని వివరించింది. అలాగే ఎన్టీఆర్‌, కృష్ణా, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో పాటు కొన్నిచోట్ల పిడుగులు కూడా పడవచ్చని వెల్లడించింది. మరోవైపు రాష్ట్రంలో మంగళవారం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పలుచోట్ల 40 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఈసారి అసెంబ్లీలో అడుగు పెట్టేలా మా ప్రణాళిక

బాబు సమర్థుడు

- జనసేన వార్షికోత్సవ సభలో పొత్తులపై పవన్‌కళ్యాణ్‌ నర్మగర్భ వ్యాఖ్యలు



సాక్షి, అమరావతి: ‘జనసేన పార్టీ దమ్ముంటే 175 స్థానాల్లో పోటీ చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు అంటున్నారు. వైఎస్సార్‌సీపీ ఒకటి జరగకూడదని కోరుకుంటోంది. కానీ అదే జరుగుతుంది. ఈసారి ఎన్నికల్లో జనసేన బలిపశువు కాబోదు. ఈ ఎన్నికల్లో మా ఓటును వృథా కానివ్వం. ఈసారి అసెంబ్లీలో అడుగు పెట్టేలా మా ప్రణాళిక ఉంటుంది. పవన్‌కళ్యాణ్‌తో సహా నిలబడ్డ వారందరూ గెలిచే తీరాలి. జనసేన సత్తా చాటుతాం’అని ఆ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌ నర్మగర్భ వ్యాఖ్యలు చేస్తూ పొత్తులపై స్పష్టత ఇచ్చారు. జనసేన పార్టీ పదవ వార్షికోత్సవం సందర్భంగా మచిలీపట్నంలో మంగళవారం రాత్రి బాగా పొద్దుపోయాక ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ‘తెలుగుదేశం పార్టీతో పొత్తు ఉండాలా లేదా.. అన్న దానిపై ఇంత వరకు మాట్లాడలేదు. మీకు చేతులెత్తి మొక్కుతున్నా. నమ్మండి’అని వ్యాఖ్యానించారు. అదే సమయంలో చంద్రబాబు అంటే తనకు గౌరవం ఉందని, ముఖ్యమంత్రిగా ఆయన సమర్థుడు అంటూ కొనియాడారు. ‘మీరు పెట్టరు, నన్ను తిననివ్వరు. తెలంగాణలో పోటీ చేస్తానంటే కొంత మంది బీజేపీ నాయకులు నువ్వు ఆంధ్రావాడివి అనడం బాధేసింది. ఆంధ్రా వాళ్ల ఓటు కావాలి కానీ, ఆంధ్రవాళ్లు పోటీ చేయకూడదంటే ఎలా’అని ప్రశ్నించారు. తాను బీజేపీతో పొత్తు పెట్టుకున్నప్పుడు అనుకున్న ప్లాన్‌ అమలు చేసి ఉంటే ఇప్పుడు తెలుగుదేశం అవసరం లేని స్థాయికి ఎదిగే వాళ్లమని వ్యాఖ్యానించారు.

24 వరకు అసెంబ్లీ

16న బడ్జెట్‌.. బీఏసీ భేటీలో నిర్ణయం



సాక్షి, అమరావతి: ఏపీ అసెంబ్లీ బడ్జెట్‌ సమావేశాలు ఈ నెల 24 వరకు నిర్వహించాలని బిజినెస్‌ అడ్వయిజరీ కమిటీ (బీఏసీ) సమావేశం మంగళవారం నిర్ణయించింది. ఈ దఫా తొమ్మిది రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరగనుండగా.. ఈ నెల 16న శాసనసభలో బడ్జెట్‌ ప్రవేశపెట్టనున్నారు. అసెంబ్లీ ప్రాంగణంలోని స్పీకర్‌ కార్యాలయంలో స్పీకర్‌ తమ్మినేని సీతారాం అధ్యక్షతన బీఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎం వైఎస్‌ జగన్‌, చీఫ్‌విప్‌ ముదునూరి ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు. 20 అంశాలపై చర్చించాలని టీడీఎల్పీ ఉపనేత అచ్చెన్నాయుడు ఈ సందర్భంగా కోరారు. సీఎం జగన్‌ వెంటనే జోక్యం చేసుకుని ఏ అంశంపై అయినా చర్చించేందుకు తాము సిద్ధమని, సభా సమయాన్ని బట్టి చర్చిద్దామని స్పష్టంచేశారు. కాగా, 15న గవర్నర్‌ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం, చర్చ జరగనుంది. 16న 2023–24 వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌ ప్రవేశపెడతారు. 17, 18, 19, 20 తేదీల్లో బడ్జెట్‌పై చర్చిస్తారు. ఉగాది పురస్కరించుకుని 21, 22 తేదీల్లో శాసనసభ సమావేశాలకు సెలవు. 23న ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ. 24న ద్రవ్య వినిమయ బిల్లుకు ఆమోదం తెలిపాక అదే రోజు శాసనసభ సమావేశాలు ముగుస్తాయి.

ఆర్‌ఆర్‌ఆర్‌ బృందానికి ఏపీ కేబినెట్‌ అభినందనలు

సాక్షి, అమరావతి: అంతర్జాతీయంగా ఉర్రూతలూగించిన నాటు...నాటు పాట ద్వారా ఆస్కార్‌ అవార్డు సాధించిన ‘‘ఆర్‌ఆర్‌ఆర్‌’’చిత్ర యూనిట్‌ను ఏపీ మంత్రివర్గం అభినందించింది. సంగీత దర్శకుడు కీరవాణి, గీత రచయిత చంద్రబోస్‌, దర్శకుడు రాజమౌళి, హీరోలు జూనియర్‌ ఎన్టీఆర్‌, రామ్‌చరణ్‌, నృత్య దర్శకుడు ప్రేమ్‌ రక్షిత్‌, గాయకులు రాహుల్‌ సిప్లిగంజ్‌, కాలభైరవ బృందానికి కేబినెట్‌ అభినందనలు తెలియచేసింది.

నగర వార్తలు

‘ముస్లింలపై ప్రభుత్వం వివక్ష’



సాక్షి,సిటీబ్యూరో: వారం రోజుల్లో రంజాన్‌ నెల ప్రారంభమతున్న విషయం తెలిసినా ప్రభుత్వం ఇప్పటికీ ఎలాంటి ఏర్పాట్లు ప్రారంభించలేదని ముస్లింలపై ప్రభుత్వం వివక్ష చూపుతుందని మజ్లిస్‌ ఏ ఇన్కిలాబ్‌ ఏ–మిల్లత్‌ పార్టీ జాతీయ అధ్యక్షుడు మౌలానా సయ్యద్‌ హమీద్‌ హుస్సేన్‌ షుత్తారీ ఆరోపించారు. డబీర్‌పురాలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రంజాన్‌ ఏర్పాట్లపై మైనార్టీ సంక్షేమ శాఖ సమీక్ష సమావేశం ఏటా పదిహేను రోజుల ముందు నిర్వహిస్తుందని గుర్తు చేశారు. ప్రభుత్వం రంజాన్‌ ఏర్పాట్లపై జీహెచ్‌ఎంసీ, విద్యుత్‌, వాటర్‌వర్క్స్‌ తదితర శాఖలకు మసీదులకు వచ్చే వారికి అసౌకర్యాలు కలుగకుండా తగిన చర్యలు చేపట్టాలని పలు సూచనలు జారీ చేస్తుంది. కానీ ఇప్పటి ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదన్నారు. మరోవైపు మసీదుల మరమ్మతులకు రాష్ట్ర వక్ఫ్‌ బోర్డు నిధులు కూడా కేటాయిస్తుందని, ఇప్పటికీ నిధులు కూడా కేటాయింపు జరగలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రంజాన్‌ ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు.

రేపు యూఎస్‌ఏ, కెనడా అడ్మిషన్‌ డే



లక్డీకాపూల్‌: యునైటెడ్‌ స్టేట్స్‌ ఆఫ్‌ అమెరికా, కెనడా దేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించి స్థిర పడాలనుకునే విద్యార్థుల కోసం ఈ నెల 16న యూని ఎక్స్‌ పర్ట్స్‌ ఆధ్వర్యంలో యూఎస్‌ఏ, కెనడా అడ్మిషన్‌ డే నిర్వహిస్తున్నట్లు సంస్థ హెడ్‌ ఉమా తెలిపారు మంగళవారం సోమాజిగూడ లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ అడ్మిషన్‌ డే లో యుఎస్‌ఏ, కెనడా దేశాలకు చెందిన 25కు పైగా యూనివర్సిటీలు పాల్గొంటున్నాయన్నారు. వీసా రిక్రూట్‌మెంట్‌, అడ్మిషన్‌, స్కాలర్‌షిప్‌ ఆప్షన్స్‌, లాంగర్‌ స్టడీ బ్యాక్‌ తదితర అంశాలను నేరుగా యూనివర్సిటీ ప్రతినిధులతో మాట్లాడి తెలుసుకోవచ్చన్నారు. ఇంటర్‌, డిగ్రీ, బీ.టెక్‌ విద్యార్థులు పాల్గొనవచ్చని ఉమా తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణలో ట్రాఫిక్‌ పోలీసుల పాత్ర కీలకం

రాచకొండ సీపీ డి.ఎస్‌ చౌహాన్‌



మాట్లాడుతున్న డి.ఎస్‌ చౌహాన్‌

సాక్షి,సిటీబ్యూరో: శాంతి భద్రతల పరిరక్షణలో ట్రాఫిక్‌ విభాగం పాత్ర కీలకమని రాచకొండ సీపీ డి.ఎస్‌ చౌహాన్‌ పేర్కొన్నారు. కమిషనరేట్‌ పరిధిలో ట్రాఫిక్‌ అధికారులతో మంగళవారం ఆయన నేరేడ్‌మెట్‌లోని కమిషనర్‌ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పట్టణాలు, నగరాల్లో సామాన్య ప్రజలకు ఎక్కువగా కనిపించేది, అందుబాటులో ఉంటూ తక్షణమే స్పందించడం ట్రాఫిక్‌ పోలీసులకే సాధ్యమన్నారు. సివిల్‌ పోలీసులతో సమన్వయంతో పని చేస్తూ, నేర నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. ఎండా, వాన, చలిని సైతం లెక్క చేయకుండా రోడ్ల మీద విధులు నిర్వర్తించే ట్రాఫిక్‌ పోలీసుల వల్లే నగరాల్లో నేరాలు, రోడ్డు ప్రమాదాలు అదుపులో ఉన్నాయన్నారు. మూల మలుపులు, జంక్షన్ల వద్ద అమలు చేసిన కొత్త విధానాల వల్ల రాచకొండ కమిషనరేట్‌ పరిధిలో ట్రాఫిక్‌ ఇబ్బందులు తగ్గుముఖం పట్టాయని గుర్తు చేశారు. రోడ్డు ప్రమాదాల సమయంలో ట్రాఫిక్‌ సిబ్బంది వీలైనంత త్వరగా స్పందించి క్షతగాత్రులకు సహాయం చేయాలని, ప్రథమ చికిత్స శిక్షణ పొందాలని సూచించారు. సాధారణ ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ విధులు నిర్వర్తించాలన్నారు. ఈ సమావేశంలో రాచకొండ జాయింట్‌ కమిషనర్‌ సత్యనారాయణ, డీసీపీలు అభిషేక్‌ మహంతి, శ్రీనివాస్‌, శ్రీబాల దేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కళాకారులకు ప్రభుత్వం పెద్దపీట



మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర ప్రభుత్వం జానపద కళలను గుర్తించి వాటికి పునర్వైభవం తీసుకువస్తుందని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో నటరాజ్‌ అకాడమీ, మాంగళ్యం ఫౌండేషన్ల ఆధ్వర్యంలో సకల కళల జానపద ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రాల్లో అనేక కళారూపాలు విస్మరణకు గురయ్యాయని కళలు, కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. అనంతరం పలువురు కళాకారులను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు వివిధ జానపద కళారూపాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు గణేష్‌ గుప్తా, ఎస్‌.ఆర్‌.ఐ శరత్‌చంద్రారెడ్డి, నటరాజ్‌ అకాడమీ వ్యవస్థాపకులు నల్లా గిరి పాల్గొన్నారు.

సికింద్రాబాద్‌లో అదృశ్యం.. లింగంపల్లిలో ప్రత్యక్షం

చిన్నారి కిడ్నాప్‌ వ్యవహారం సుఖాంతం

సికింద్రాబాద్‌: సికింద్రాబాద్‌ రైల్వేస్టేషన్‌లో సోమవారం అర్ధరాత్రి జరిగిన చిన్నారి కిడ్నాప్‌ వ్యవహారం సుఖాంతమైంది. సికింద్రాబాద్‌ జీఆర్‌పీ పోలీసుల కథనం ప్రకారం.. నెల్లూరు జిల్లా బైరారం గ్రామానికి చెందిన జీ.రత్తయ్య సంగారెడ్డి జిల్లా చింతలపల్లి గ్రామంలో తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఏడాది క్రితమే రత్తయ్య భార్య చనిపోయింది. ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారులిద్దరినీ హాస్టల్‌లో చేర్పించిన రత్తయ్య ఐదేళ్ల కుమార్తెను తన వద్ద పెట్టుకున్నాడు. సోమవారం సొంతూరికి వెళ్లేందుకు రాత్రి 8గంటల ప్రాంతంలో సికింద్రాబాద్‌ రైల్వేస్టేషన్‌ చేరుకున్న ఆయన ఉదయం బయలుదేరాల్సిన రైలుకోసం 1వ నెంబర్‌ ప్లాట్‌ఫాంపై కుమార్తెతో కలిసి నిద్రపోయాడు. అర్ధరాత్రి మెలుకువ వచ్చి చూసేసరికి తన పక్కనే పడుకున్న కుమార్తె కనిపించలేదు. వెంటనే రత్తయ్య జీఆర్‌పీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్పందించిన పోలీసులు జీఆర్‌పీ డీఎస్‌పీ ఏ.నర్సయ్య, ఇన్‌స్పెక్టర్‌ ఎం.శ్రీను నేతృత్వంలో దర్యాప్తు ప్రారంభించి ఒక వ్యక్తి బాలికను తీసుకువెళ్లినట్టు సీసీ కెమెరా ఫుటేజీల ద్వారా గుర్తించారు. మంగళవారం లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో ఒంటరిగా ఒక బాలిక ఉన్నట్టు గుర్తించిన ఒక యువకుడు అక్కడి రైల్వే పోలీసులకు అప్పగించాడు. దీంతో బాలిక కిడ్నాప్‌ వ్యవహారం సుఖాంతం అయింది. ఇదిలా ఉండగా సికింద్రాబాద్‌ రైల్వేస్టేషన్‌ నుంచి బాలికను కిడ్నాప్‌ చేసిన వ్యక్తిని గుర్తించేందుకు రైల్వేపోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్‌ఎస్‌ఆర్‌ రేట్లు పెంచాలి

లక్డీకాపూల్‌ : డిస్కంలకు మొత్తం ఒకే ధర ఉండేలా చూడాలని టీఎస్‌ఎస్‌పీడీసీఎల్‌జేఏసీ కాంట్రాక్టర్‌ అసోసియేషన్‌ చైర్మన్‌ భాస్కర్‌ డిమాండ్‌ చేశారు. మంగళవారం మింట్‌ కాంపౌండ్‌లోని అంబేడ్కర్‌ స్ఫూర్తి భవనంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. విద్యుత్‌ సంస్థలో వివిధ పనులు చేపట్టే గుత్తేదారులకు ఏటా పెంచే స్టాండర్డ్‌ షెడ్యూల్‌ ఆఫ్‌ రేట్స్‌ (ఎస్‌ఎస్‌ఆర్‌)ను ఈ ఏడాది 30 శాతం పెంచాలన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి విద్యుత్‌ రంగంతో ప్రత్యేక గుర్తింపు ఉందని ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తమకు విశ్వసనీయత ఉందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యుత్‌ సంస్థలో కాంట్రాక్టులకు ఎస్‌ఎస్‌ఆర్‌ ధరలు పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌. రాజు.. విమల బాయి రాజుమహారాజు , మహిపాల్‌ రెడ్డి గోవర్ధన్‌ రెడ్డి, స్వామి, చారి పాల్గొన్నారు.

విజయరామారావు సేవలు అమోఘం

సాక్షి,సిటీబ్యూరో: సీబీఐ మాజీ డైరెక్టర్‌, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వంలో మంత్రిగా సేవలందించిన విజయరామారావు మృతి పట్ల నగరంలోని దక్కన్‌ హెరిటేజ్‌ అకాడమీ సంతాపం తెలిపింది. సీబీఐలో పనిచేస్తున్న సమయంలో విజయరామారావు విశేష సేవలందించారని, ప్రముఖ గూఢచారి కేసులను దర్యాప్తు చేసి ఛేదించిన ఘనత ఆయనకు దక్కిందని దక్కన్‌ హెరిటేజ్‌ అకాడమీ చైర్మన్‌ వేద కుమార్‌ మణికొండ తెలిపారు. పదవీ విరమణ చేసిన తర్వాత రాజకీయాల్లో సంస్కరణలు తీసుకురావడానికి రాజకీయ ప్రవేశం చేశారని కొనియాడారు. తన లక్ష్యానికి అనుగుణంగా మంచి నాయకుడిగా గుర్తింపు పొంది సమాజానికి, యువతకు చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు.

ఎండోస్కొపీ చికిత్సల్లో పురోగతి



సాక్షి, సిటీబ్యూరో: గతంతో పోలిస్తే అత్యాధునిక విధానాల ద్వారా వ్యాధుల గుర్తింపు మరింతగా పెరిగిందని గ్యాస్ట్రో ఎంటరాలజీ నిపుణులు, డాక్టర్‌ గురు ఎన్‌ రెడ్డి అన్నారు. గచ్చిబౌలిలోని కాంటినెంటల్‌ ఆసుపత్రికి చెందిన గ్యాస్ట్రో ఎంటరాలజీ–కాలేయ వ్యాధుల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అడ్వాన్స్‌డ్‌ లుమినల్‌ జిఐ వర్క్‌షాప్‌లో ఆయన కీలకోపన్యాసం చేశారు. మోటరైజ్డ్‌ ఎంట్రోస్కోపీ ప్రయోజనాలను వెల్లడిస్తూ, అత్యాధునిక పద్ధతుల ద్వారా రోగి–సంరక్షణ చికిత్సా విధానాలను మెరుగుపరుస్తున్న వైనాన్ని వివరించారు. ఈ వర్క్‌షాప్‌కు గ్యాస్ట్రో ఎంటరాలజీ కన్సల్టెంట్‌ డాక్టర్‌ రఘురామ్‌ కొణాల ప్రోగ్రామ్‌ డైరెక్టర్‌గా విశాఖపట్నంకు చెందిన కిమ్స్‌ ఐకాన్‌ ఆసుపత్రి ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ గ్యాస్ట్రోఎంటరాలజీ క్లినికల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ చలపతిరావు ఆచంట చీఫ్‌ ఫ్యాకల్టీగా వ్యవహరించారు.

రైల్వే కాంట్రాక్టర్ల సమస్యలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్తా

ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌

అడ్డగుట్ట: రైల్వే కాంట్రాక్టర్ల సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ పేర్కొన్నారు. ఇండియన్‌ రైల్వే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ ప్రొవైడర్స్‌ అసోసియేషన్‌(ఇరిపా) దక్షిణ మధ్య రైల్వే 6వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం సికింద్రాబాద్‌ నిర్వహించారు. ఈ వేడకలకు హాజరైన ఆయన మాట్లాడారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ డెవలప్‌మెంట్‌లో రైల్వే కాంట్రాక్టర్ల కృషి ఎనలేనిదని నిరంతరం తమ వంతు ప్రయత్నం చేస్తూ దేశంలో మౌలిక సదుపాయాల నిర్మాణానికి తోడ్పాడుతున్నారన్నారు. కేవలం రైల్వే బోర్డు వరకే వెళ్తున్న ఇరిపా సమస్యలను కేంద్రంలోని సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. టీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టర్లు, ఉద్యోగులకు జీతభత్యాలు చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తుండటంతో అనేక మంది కాంట్రాక్టర్లు రోడ్డున పడుతున్నారని ఆరోపించారు. అనంతరం ఇరిపా అధ్యక్షుడు రాధాకృష్ణ మాట్లాడుతూ.. తమ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో కొంతకాలంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కష్టసమయాల్లో అసోసియేషన్‌ సభ్యులను ఆదుకునేందుకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ చాడ సురేష్‌ రెడ్డి, సురేందర్‌ రావు, అఫ్సర్‌ రియాజ్‌, ఆనంద్‌ రావు, ఎల్‌ఎస్‌. రెడ్డి, అంజనేయులు, పీవీజీఎస్‌. రెడ్డి పాల్గొన్నారు.

‘బూర్గుల’ బహుభాషావేత్త




చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: మహా మహులైన పెద్దలను స్మరించుకుంటే చరిత్రను స్మరించుకున్నట్టేనని రాష్ట్ర టూరిజం కార్పొరేషన్‌ చైర్మన్‌ ఉప్పల శ్రీనివాస్‌ గుప్తా పేర్కొన్నారు. నాగోలులోని ఉప్పల శ్రీనివాస్‌ గుప్తా క్యాంప్‌ కార్యాలయంలో ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన బూర్గుల రామకృష్ణారావు జయంతిలో ఆయన పాల్గొని బూర్గుల చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం శ్రీనివాస్‌ గుప్తా మాట్లాడుతూ.. నిజాం పాలన నుంచి విముక్తి లభించాక హైదరాబాద్‌ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన ఎన్నో అద్భుత సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. అప్పటి వరకు ఉర్దూ మాధ్యమంలోనే బోధన జరుగుతున్న తరుణంలో తెలుగుతో పాటు ఇతర భాషలు కూడా చదువుకునేలా ఆయన సంస్కరించారు. ప్రముఖ సాహితీవేత్త అమ్మంగి వేణుగోపాల్‌ మాట్లాడుతూ.. బూర్గుల పరిపాలనా దక్షతను వివరిస్తూ ఆయన గొప్ప కవి, బహుభాషా ప్రవీణతను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆకృతి సుధాకర్‌, బుర్రా మోహనకృష్ణ, జ్యోతి పాల్గొన్నారు.


కేవీ రాజగోపాల్‌ సేవలు చిరస్మరణీయం

పీఆర్‌ఎస్‌ఐ ఆధ్వర్యంలో ఘన నివాళి



సాక్షి, సిటీబ్యూరో: భారతీయ రైల్వే సర్వీస్‌ మాజీ అధికారి, కేవీ రాజగోపాల్‌ (97) మృతిపట్ల పబ్లిక్‌ రిలేషన్స్‌ సొసైటీ ఆఫ్‌ ఇండియా (పీఆర్‌ఎస్‌ఐ) నివాళులు అర్పించింది. ఇటీవల బెంగళూరులో ఆయన కన్నుమూశారు. పీఆర్‌ఎస్‌ఐ హైదరాబాద్‌ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సంతాప సభలో పీఆర్‌ఎస్‌ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్‌ అజిత్‌ పాఠక్‌ మాట్లాడారు. రాజగోపాల్‌ మృతితో రైల్వే, ప్రజా సంబంధాల విభాగం, క్రీడా రంగంలో గొప్ప వ్యక్తిని కోల్పోయినట్లు తెలిపారు. పీఆర్‌ఎస్‌ఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ చైర్మన్‌గా అందించిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాజగోపాల్‌ పరిపూర్ణమైన వ్యక్తి, గొప్ప మానవతావాది అని తన కంటూ ఒక సముచిత స్థానాన్ని ఏర్పరచుకున్నారని కొనియాడారు. సీనియర్‌ ప్రజాసంబంధాల అధికారి ఎస్‌సీఆర్‌ షకీల్‌ అహ్మద్‌, దక్షిణమధ్య రైల్వే ప్రజా సంబంధాల అధికారి రాజేష్‌ కళ్యాణ్‌, రాజగోపాల్‌ కుమార్తె ప్రియా శ్రీనివాసన్‌, పీఆర్‌ఎస్‌ఐ హైదరాబాద్‌ చాప్టర్‌ ఛైర్మన్‌ డాక్టర్‌ ఎస్‌.రాము, తదితరులు ప్రసంగించారు.





రమాబాయి లత్‌పతే

రమాబాయి లత్‌పతే

9 గజాల మహారాష్ట్ర నౌవారి చీరలో 40 దేశాలు బైక్ మీద చుట్టి రావడానికి మార్చి 8న గేట్ వే ఆఫ్ ఇండియా నుంచి బయలుదేరింది. 365 రోజుల పాటు ప్రయాణం సాగించి వచ్చే ఏడాది మార్చి 8కి ముంబై చేరుకుంది. 'భారత్ కీ బేటీ' ఏదైనా చేయగలదని నరేంద్ర మోదీ అన్న మాటలే తననీ సాహసయాత్రకు పురిగొల్పాయని చెబుతోంది.



● భారత్ కీ బేటీ

చీర కట్టులో బైక్‌పై వరల్డ్ టూర్

బైక్ యాత్రలు చేసిన మహిళలు చాలా మందే ఉన్నారు. కాని చీర మీద బైక్ నడుపుతూ ప్రపంచ దేశాలు చుట్టి రావాలనే కోరిక మాత్రం రమాబాయి లత్‌పతేకే వచ్చింది.

పుణెకు చెందిన రమాబాయి అంట్రప్రెన్యూర్. కాని బైక్ మీద విహారాలు ఆమెకు ఇష్టం. ఆ విహారాల కోసమే ప్రత్యేకమైన బైక్ ఏర్పాటు చేసుకుంది. ఇటీవల 'జి20' సమ్మిట్‌లో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ 'భారతీయ స్త్రీలు అద్భుతమైన విజయాలు సాధిస్తున్నారు' అని చేసిన వ్యాఖ్య రమాబాయి లత్‌పతేను ఇన్‌స్పైర్ చేసింది. 'నా డిక్షనరీలో భయం అనే మాటకు విలువ లేదు. బాల్యం నుంచి నేను చాలా ధైర్యంగా నా జీవితంలో ముందుకు సాగాను. ఆ ధైర్యంతోనే ప్రపంచ యాత్ర చేయాలనిపించింది. అయితే ఆ యాత్రలో ఏ దేశంలో అడుగు పెట్టినా నేను 'భారత్ కీ బేటీ' అనిపించుకోవాలంటే మన సాంస్కృతిక చిహ్నమైన చీరలో ఉండటం అవసరం అని భావించాను. మహారాష్ట్ర స్త్రీలు ధరించే 9 గజాల నౌవారి చీర చాలా ప్రసిద్ధం. ఆ చీరలతోనే నా యాత్ర మొత్తం చేస్తాను' అంది రమాబాయి లత్‌పతే.

మొదలైన యాత్ర

సాధారణ జనం, మీడియా ఉత్సుకతతో చూస్తుండగా ముంబైలోని గేట్ వే ఆఫ్ ఇండియా నుంచి మార్చి 8న రమాబాయి లత్‌పతే యాత్ర మొదలైంది. ఈ యాత్ర గురించి, అందునా మహారాష్ట్ర సంస్కృతి ప్రాముఖ్యం ఉండటం గురించి తెలుసుకున్న ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఆమె యాత్రను ప్రోత్సహిస్తూ శుభాకాంక్షలు తెలియచేశారు. 'నా మొత్తం యాత్రకు కోటి రూపాయలు అవుతుంది. ఇందుకోసం నాకున్న నగలు, నా ఎస్.యు.వి అమ్మేశాను. కొంత లోటు ఏర్పడింది. నా యాత్రను ప్రోత్సహించేందుకు మనిషికి 1 రూపాయి చొప్పున చందా ఇవ్వాలని అప్పీలు చేశాను. అలా కొంత సాయం వచ్చింది. మంచి పని మొదలెడితే సాయం అదే అందుతుంది' అంది రమాబాయి లత్‌పతే.

కఠినమైన యాత్ర

రమాబాయి లత్‌పతే మొత్తం 80 వేల కిలోమీటర్లు ఈ యాత్రలో తన బైక్ మీద తిరగనుంది. నలభై దేశాల వాతావరణాన్ని తట్టుకోవాలి. అతి శీతల, అత్యల్ప ఉష్ణోగ్రతలు భరించాలి. భద్రత ఒక సమస్య. అలాగే ఆహారం కూడా. 'అయినా నేను వెనుకాడను' అని బయలుదేరింది రమాబాయి. ముంబై నుంచి ఆమె ఢిల్లీకి చేరుకున్నాక అక్కడి నుంచి విమానం ద్వారా ఆమె బైక్‌తో పాటుగా ఆస్ట్రేలియా చేరుకుంటుంది. ఆస్ట్రేలియాలో పెర్త్ నుంచి సిడ్నీ వరకు 1600 కిలోమీటర్లు బైక్ మీద ప్రయాణిస్తుంది. కాని ఆ దారిలో జనావాసాలు పెద్దగా ఉండవు. వాతావరణం కూడా కఠినంగా ఉంటుంది. దారి మధ్యలో ఆమె టెంట్ వేసుకుని విడిది చేయక తప్పదు. ఆ ఛాలెంజ్‌ను రమాబాయి పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆస్ట్రేలియా నుంచి ఆక్‌లాండ్ (న్యూజిలాండ్)కు, అక్కడి నుంచి శాంటియాగో (చిలీ), ఆ తర్వాత బొగోటా (కొలంబియా), ఆ తర్వాత అమెరికా అక్కడి నుంచి కెనడాలకు బైక్ మీదే ఆమె ప్రయాణం సాగుతుంది. ఆపై సముద్ర మార్గంలో బైక్‌ను లండన్‌కు చేరవేసి అక్కడి నుంచి తిరిగి బైక్ మీద పోలాండ్, రోమ్, ఫ్రాన్స్, స్పెయిన్, పోర్చుగల్, మొరాకో, టునీషియా, జోర్డాన్... ఇలా ప్రయాణించి మళ్లీ సముద్రం మీదుగా సౌదీ చేరుకుని ఆ ఎడారి దేశాలన్నీ చుట్టి గుజరాత్‌లో ప్రవేశించి వచ్చే ఏడాది మార్చి 8కి గేట్ వే ఆఫ్ ఇండియా చేరుకుంటుంది. ఈ మొత్తం యాత్రలో మిగిలిన దేశాలతోపాటు జి 20 నుంచి 12 దేశాలు ఉంటాయి.

ప్రయాణాలు చేయండి

'స్త్రీలు నాలుగు గోడల మధ్య ఉండటం వల్ల ప్రపంచం ఏమీ తెలియదు. ప్రయాణాలకు భయపడాల్సింది లేదు. వీలైనన్ని ప్రయాణాలు చేసి లోకం ఎంత విశాలమో తెలుసుకోండి' అంటోంది రమాబాయి.

యూత్ పల్స్

'పలుకే బంగారమాయెనా!' అన్నట్టు నేటి యువతరం తమ సమయంలో అత్యధిక భాగం చాటింగ్‌లోనే గడిపేస్తున్నారు. రాను రాను చాటింగ్‌కు పదాలను ఏరుకోవడం కూడా తక్కువైపోతోంది. పదాల స్థానంలో జిఫ్‌లొచ్చాయి. అంటే విజువల్ లాంగ్వేజ్ అన్నమాట.



మోర్ కనెక్టివిటీ... మోర్ క్రియేటివిటీ

మనలోని భావాలకు పదాలు అద్దం పడతాయి. ఇప్పుడా పదాలకు 'జిఫ్'లు ప్రత్యామ్నాయంగా మారాయి. అవే మౌనంగా మాట్లాడుతున్నాయి. డిజిటల్ చిట్-చాటింగ్‌లో జిఫ్(జెఫ్,గిఫ్... మొదలైన ఉచ్చారణలు కూడా ఉన్నాయి) ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. భాషా పరిమితులు, స్పీడ్ రెస్పాన్స్ సంగతి పక్కనపెడితే తమను తాము బెటర్‌గా ఎక్స్‌ప్రెస్ చేసుకోవడానికి యువతరం ఉపయోగిస్తున్న డిజిటల్ టూల్స్‌లో 'జిఫ్'లు ఒకటి.

'జిఫ్' ప్లాట్‌ఫామ్ 'టెనర్' నిర్వహించిన సర్వే ప్రకారం యూత్‌లో ఎక్కువ మంది విజువల్ ఎక్స్‌ప్రెషన్స్‌ను ఇష్టపడుతున్నారు. ఏ రకరమైన 'జిఫ్'లను యూత్ ఇష్టపడుతున్నారు? అనే కోణంలో 'టెనర్' ఎప్పటికప్పుడు సర్వే చేస్తుంటుంది. ఆహ్లాదం, విషాదంలాంటి భావోద్వేగాల నుంచి దినచర్యకు సంబంధించిన భోజనం, మార్నింగ్‌వాక్, వ్యాయామం....మొదలైన వాటికి సంబంధించి కొత్త 'జిఫ్'లను అందుబాటులోకి తీసుకువస్తుంటుంది.

'జిఫ్'లలో కొందరు యూజర్‌లు తమ ఫేస్‌ను పాపులర్ క్యారెక్టర్‌లకు ఉపయోగించి ఆనందిస్తుంటారు.

'న్యూ ఫామ్ ఆఫ్ ఎక్స్‌ప్రెషన్'గా పిలవబడుతున్నప్పటికీ జిఫ్ (గ్రాఫిక్స్ ఇంటర్‌ఛేంజ్ ఫార్మాట్) నిన్నా మొన్నటిదేమీ కాదు. అమెరికాకు చెందిన ఆన్‌లైన్ సర్వీస్ ప్రొవైడర్ 'కంప్యూసర్వ్' బృందం ఈ బిట్ మ్యాప్ ఇమేజ్ ఫార్మాట్‌ను అప్పుడెప్పుడో డెవలప్ చేసింది.

అయితే ఇది కాలంతో పాటు కొత్త అడుగులు వేసుకుంటూ రావడం వల్ల నిత్యనూతనంగా ఉంటుంది.

విజువల్ లాంగ్వేజ్‌పై యూత్ క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకొని గురుగ్రామ్‌కు చెందిన యువబృందం 'బాబుల్ కీబోర్డ్' యాప్‌ను లాంచ్ చేసింది. దీనికి యువతరం నుంచి అనూహ్యమైన స్పందన లభించింది.

'బాబుల్'లో సైనింగ్ అప్ అయిన తరువాత, యూజర్‌కు సంబంధించిన సెల్ఫీని బాబుల్స్ ఫేస్ రికగ్నిజేషన్ టెక్నాలజీ కార్టూన్ బాబుల్ హెడ్‌గా మారుస్తుంది. యూజర్‌లు 'బాబుల్'లో మెసేజ్ టైప్ చేస్తే చాలు దీనికి దగ్గరగా ఉండే 'జిఫ్'లు కుడివైపు ప్రత్యక్షమవుతాయి.

ఎలెక్స్ చాంగ్ ప్రారంభించిన 'జిపీ' వెబ్‌సైట్ తక్కువ సమయంలోనే యువతకు దగ్గరైంది. 'జిఫ్'లకు సంబంధించిన ఈ మేకింగ్, షేరింగ్ ప్లాట్‌ఫామ్ 'జిపీ కామ్' పేరుతో సెకండ్ అప్లికేషన్‌ను కూడా లాంచ్ చేసింది. 'జిపీ' తరువాత ఇన్‌స్టాగ్రామ్ బృందంలో భాగమైపోయింది.

'బాబుల్', 'జిపీ'లు మాత్రమే కాదు రకరకాల సంభాషణలకు సరిపోయేలా, రకరకాల జిఫ్‌లను పెద్ద సంఖ్యలో తీసుకురావడానికి టెక్ కంపెనీలు కసరత్తులు చేస్తున్నాయి. యూజర్‌లు తమ కామెంట్స్‌కు 'జిఫ్' జతచేసే 'జిఫ్స్ ఫర్ కామెంట్' ఫీచర్‌ను ఫేస్‌బుక్ తీసుకువచ్చింది.

మిలీనియల్స్‌ను దృష్టిలో పెట్టుకొని కామెంట్స్‌కు 'జిఫ్'లను జత చేసే ఫీచర్ తీసుకువచ్చింది ట్విట్టర్. 'జిఫ్' అన్వేషకుల కోసం గూగుల్ కొత్త టూల్స్ తీసుకువచ్చింది. వీటి ద్వారా సెలబ్రిటీల నుంచి మొదలు ఫిక్షనల్ క్యారెక్టర్స్ వరకు, ఎమోషన్ రియాక్షన్‌కు సంబంధించి ఎన్నో రకాల 'జిఫ్'లు యూజర్‌లకు అందుబాటులోకి వచ్చాయి. విజువల్ లాంగ్వేజ్ విషయంలోనే కాదు ఇమెయిల్స్‌ను ఆసక్తికరంగా మార్చడంలోనూ యానిమేటెడ్ జిఫ్స్‌ను ఉపయోగిస్తున్నారు. తమ ఉత్పత్తులకు సంబంధించిన ప్రచారం యువత దృష్టిలో పడేలా 'జిఫ్'ను ఉపయోగించుకుంటున్నాయి చిన్న బడ్జెట్ కంపెనీలు.

కమ్యూనికేషన్‌కు సంబంధించి 'జిఫ్'లను ఉపయోగించడం ఒక కోణం అయితే, మ్యూజిక్‌కు జిఫ్‌లను జత చేయడం మరో కోణం. అమెరికన్ మల్టీ మీడియా ఇన్‌స్టంట్ ప్లాట్‌ఫామ్ 'స్నాప్‌చాట్'లో మ్యూజిక్ జిఫ్‌లు మంచి ఆదరణ పొందాయి.

'హౌ డూ ఐ మేక్ జిఫ్స్?' అనే ప్రశ్నకు 'నేను ఉన్నాను' అంటూ ఎన్నో యాప్‌లు ముందుకు వస్తాయి. 'ఎన్ని ఉన్నాయి?' అనే ప్రశ్న కంటే 'ఎలా ఉపయోగిస్తున్నారు?' అనే ప్రశ్న ముందుకు వచ్చినప్పుడు సంతృప్తికరమైన సమాధానం లభిస్తుంది. 'మోర్ కంఫర్టబుల్' 'మోర్ కనెక్టివిటీ' వరుసలో 'మోర్ క్రియేటివిటీ' కూడా వచ్చి చేరుతుంది.

ఇంట్లోనే పెడిక్యూర్

బ్యూటిప్స్

అందమైన పాదాల కోసం పార్లర్‌కు వెళ్లలేని వారు ఇంట్లో దొరికే వస్తువులతోనే పెడిక్యూర్ చేసుకోవచ్చు.

గోరువెచ్చని నీటిలో కొంచెం ఉప్పు, హైడ్రోజెన్ పెరాక్సైడ్ లేదా డెటాల్, షాంపూ వేసి, అందులో కనీసం ఇరవై నిమిషాలపాటు పాదాలను ఉంచాలి. తరవాత ప్యూమిక్ స్టోన్ లేదా స్క్రబ్బింగ్ స్టోన్ లేదా బ్రష్‌తో మెల్లగా రుద్దాలి. ఇలా చేయటం వల్ల పాదాల మీద ఉన్న మృతకణాలు తొలగిపోతాయి.

ఆ తరవాత ఒక నిమ్మచెక్క తీసుకుని, దానిమీద కొద్దిగా గ్లిజరిన్ వేసి పాదాలను బాగా రుద్దాక, ఆలివ్ ఆయిల్‌తో కాళ్లకు, పాదాలకు మసాజ్ చేయాలి.

ముల్తానీ మట్టిలో రోజ్‌వాటర్ కలిపి పాదాలకు పూతలా పూసి, పావు గంట తరవాత కడిగి మాయిశ్చరైజర్ రాయాలి. వారానికి మూడు సార్లు ఇలా చేస్తుండటం వల్ల చర్మం మీద మృతకణాలు తొలగిపోయి, మృదువుగా మారతాయి. రోజ్ వాటర్, గ్లిజరిన్ సమపాళ్లలో తీసుకుని పాదాలకు మసాజ్ చేయాలి. మరునాడు గోరువెచ్చటి నీళ్లలో షాంపూ కలిపి కడిగితే, పాదాల మీద మురికి తొలగిపోయి పాదాలు, కాళ్లు మృదువుగా అవుతాయి



హస్త కళాకారులకు ఈ-మార్కెట్

సాధారణంగా చేతివృత్తుల వారు, హస్త కళాకారులు తమ వ్యాపారాన్ని సాంకేతిక పరంగా విస్తరించుకోవడానికి దృష్టి పెట్టరు. ఇక కొండకోనలు, గ్రామీణ కళాకారుల సంగతైతే చెప్పనే అక్కర్లేదు. ఈ విషయాన్ని గమనించిన దివ్యామల్లిక్ కళాకారుల కోసం టైపోఫ్ అనే టెక్ ప్లాట్‌ఫారమ్‌ను ప్రారంభించింది. దీని ద్వారా వ్యాపారంలో ఎక్కువ మంది గ్రామీణ మహిళలు వారి బాధ్యతను వారే తీసుకునేలా సాధికారత కల్పిస్తోంది.

భువనేశ్వర్‌లో ఉంటున్న దివ్య అక్కడే రెండేళ్ల క్రితం ఈ టెక్ సంస్థను ప్రారంభించింది. సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్న దివ్య ఈ రంగంలో ఉన్న కష్టాలను అర్థం చేసుకోవడమూ కష్టమే అంటూ తను చేస్తున్న పనిని వివరిస్తుంది.

"2021, ఫిబ్రవరిలో టైపోఫ్ అనే సంస్థను ప్రారంభించాం. నిజానికి ఈ ప్రాంతం లో చాలా మంది కళాకారులు ఉన్నారు. కానీ, వారి వ్యాపారాన్ని విస్తరించుకోవడం ఎలాగో వారికి తెలియదు. ఇక సాంకేతిక పరిజ్ఞానం నామమాత్రమే. ఇలాంటి చోట మా ప్లాట్‌ఫారమ్ ద్వారా అడుగుపెట్టి వారికి సహాయం చేయగలను అనుకున్నాను.



మొదట 40 మందితోనే ...

ముందు మా ప్లాట్‌ఫారమ్ ద్వారా బొమ్మలు, చిత్రకళ, ఇతర గృహోపకరణాలు చేసే కళాకారులను ఒకే వేదిక మీదకు తీసుకువచ్చే ప్రయత్నం చేశాను. కళలను గౌరవించే వ్యక్తిగా, కళాకారులందరినీ కలుసుకునే ప్రయత్నంలో చాలా వెతికాను. మొదట్లో 40 మంది కళాకారులు సంతకం చేయడంతో నమ్మకం వచ్చేసింది. ఆ తర్వాత ఈ మార్కెట్‌లో అపారమైన మార్కెట్ విస్తృతి ఉందని కళాకారులు మెల్ల మెల్లగా గుర్తిస్తున్నారని అర్థమైంది. ఇప్పుడు పదివేల మంది కళాకారులు సాంకేతికంగా మార్కెట్ అవకాశాలు అందుకుంటున్నారు. ఇది నాకు మంచి గుర్తింపు తేవడమే కాదు, దాదాపు పది వేల మందికి వ్యాపారశక్తి కేంద్రంగా మారింది. వారిలో అట్టడుగు స్థాయిలో మార్పు తీసుకురావడానికి ఉపయోగపడటం చాలా ఆనందంగా ఉంది. ఈ కృషికి టెక్నాలజీ సంస్థల నుంచి అవార్డులూ అందుతున్నాయి.

దూరదృష్టి

ఎవరైనా సరే జీవితంలో ఏ సమయంలోనైనా ఏదైనా నేర్చుకోవచ్చు. ఈ విషయాన్ని ముందు అందరం అర్థం చేసుకోవాలి. దీనిని మన చుట్టూ ఉన్నవారికి చెప్పాలి. సాధారణంగా మన చుట్టూ ఉన్న వాళ్లే మనకు కొన్ని పరిధులను గీస్తుంటారు. దానికి లోబడే జీవించాలనుకుంటారు. దీనివల్ల చాలా మంది నిరాశకు గురవుతుంటారు. ఈ టెక్నాలజీ ఉపయోగం వల్ల ఎవరు ఎక్కడ నుండైనా, ఎప్పుడైనా తమ మార్కెట్‌ను ప్రారంభించుకోవచ్చు. వారి అభిరుచికి, వయస్సుతో కూడా సంబంధం లేదు. వారి వ్యాపార నమూనా ఏమిటో, వారి దూరదృష్టి స్పష్టంగా ఉంటే చాలు కళ ఎంతదూరమైనా వెళుతుంది. చిన్న లక్ష్యాలైనా సరే గొప్పగా విస్తరిస్తాయి.

మనలో చాలా మంది సరైన సలహాదారులు లేకుండానే ఎదుగుతుంటారు. కానీ, ఇప్పుడు ఈ ఎదుగుదల దేశ సరిహద్దులను దాటుతోంది'' అని ఆనందంగా తెలియజేసే దివ్యమల్లిక్ స్థానికంగానే కాదు దేశవ్యాప్త గ్రామీణకళాకారులను ఒకే వేదిక మీదకు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది.

పరీక్ష తప్పే విద్యార్థులుంటారు, పరీక్షలను తప్పించుకోవడానికి... స్కూలు తప్పించుకునే వాళ్లూ ఉంటారు. ఎన్ని పరీక్షలనైనా తప్పించుకోవచ్చు. కానీ... జీవితం పెట్టే పరీక్ష!!! తప్పించుకోవడం ఎవరి తరమూ కాదు. మాధవిలాగ ప్రతి ఒక్కరూ... తప్పనిసరిగా రాయాల్సిందే. ఉత్తీర్ణత సాధించి తీరాల్సిందే.



మహిళలకు శిక్షణనిస్తూ...



మాధవి

● సక్సెస్

జీవిత చక్రం

ఆంధ్రప్రదేశ్, నెల్లూరు జిల్లా, కావలి పట్టణం. పట్టణానికి ఎక్కువ నగరానికి తక్కువ. అరకొర చదువులకు కూడా ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. కానీ జీవితంలో ఎదగాలంటే అవి సరిపోవనుకుంది పొన్నగంటి మాధవి. తనకు తానే ఉపాధి అయింది. బతుకు చక్రాన్ని గాడిలో పెట్టుకుంది. టైలరింగ్ మెషీన్ చక్రం విజయవంతంగా తిరిగింది. తన జీవితాన్ని నిలబెట్టుకుని అంతటితో సంతృప్తి చెంది ఉంటే ఆమె గురించి చెప్పుకోవడానికి పెద్దగా ఏమీ ఉండకపోయేది. వెయ్యి మంది మహిళలకు ఆసరాగా నిలిచిన మాధవి తన ప్రస్థానాన్ని 'సాక్షి'తో పంచుకుంది.

''నేను పుట్టింది కావలిలోనే. నాకు ఏడేళ్ల వయసులో హైదరాబాద్‌కి మారిపోయాం. నాన్న హైదరాబాద్‌లో ఎలక్ట్రికల్ షాప్ నడిపేవాడు. పెళ్లితో మళ్లీ కావలికి వచ్చాను. పెళ్లయిన నాలుగేళ్లకే కుటుంబ భారాన్ని మోయాల్సి వచ్చింది. ఇద్దరు పిల్లలు, అత్తగారు, నేను. ఇంటర్‌తో ఆగిపోయిన నా చదువుకి ఎంతటి ఉద్యోగాలు వస్తాయి? అయితే మా కావలిలో దుస్తుల దుకాణాలు లెక్కలేనన్ని ఉంటాయి. నాలుగైదు నెలలు ఉద్యోగం చేశాను. ఆ తర్వాత కంప్యూటర్స్‌లో ట్యాలీ నేర్చుకుని క్లాత్ ఏజెన్సీలకు అకౌంటెంట్‌గా నాలుగేళ్లు చేశాను. ఇలా సాగుతున్న నా జీవితానికి టర్నింగ్ పాయింట్ మా పాప రూపంలో వచ్చింది.

నాడా ఉందని గుర్రం

పెళ్లికి ముందు హైదరాబాద్‌లో ఉన్నప్పుడు మా కాలనీలో టైలరింగ్ నేర్చుకుంటున్న మహిళలు క్లాత్ కట్ చేయడం, కుట్టడం చూసి నేను ఇంట్లో చేత్తో ప్రాక్టీస్ చేసేదాన్ని. ఆ తర్వాత ఇంట్లో ఒక స్టూడెంట్ చాలా బాగుందని మెషీన్ కావాలని అడిగాను. 'నాడా దొరికిందని గుర్రాన్ని కొనడం అంటే ఇదే'నని నవ్వుతూనే కొనిచ్చాడు నాన్న. అప్పుడు సరదాగా కుట్టిన అనుభవం ఉంది. ఆ అనుభవంతో మా పాపకి నేనే స్వయంగా గౌన్‌లు కుట్టేదాన్ని. ఆ గౌన్‌లను స్కూల్ టీచర్‌లు మెచ్చుకుని, నా గురించి వాకబు చేశారు. దాంతో నాకు ధైర్యం వచ్చింది. మగ్గం వర్క్,శారీ రోలింగ్, బంజారా మిర్రర్ వర్క్ నేర్చుకున్నాను. నాకు వచ్చిన పెయింటింగ్‌కి ప్రాక్టీస్‌తో మెరుగులు దిద్దుకున్నాను. పూర్తి స్థాయిలో టైలరింగ్ యూనిట్ పెట్టాను. ఈ రంగంలో మా పనే మాకు పబ్లిసిటీ. మన చేతిలో నైపుణ్యం ఉంటే ఆర్డర్‌లు వాటంతట అవే వస్తాయి. ఇంటి ఖర్చులకు పోగా మిగులు డబ్బు కనిపించడం మొదలైంది. ఇంట్లో ఉండి పని చేసుకునే మహిళలకు పీస్ వర్కులు ఇస్తూ యూనిట్‌ని విస్తరించగలిగాను. నా కష్టానికి ఫలితం దక్కింది. అబ్బాయి బీటెక్ చేసి బెంగళూరులో క్యాప్‌జెమినీలో ఉద్యోగం చేస్తున్నాడు, పాప బీటెక్ చేస్తోంది. నాకోసం కష్టపడ్డానింతవరకు, ఇక నాలాంటి వాళ్ల కోసం పని చేద్దాం అనిపించింది.

ఈ రంగంలో మా పనే మాకు పబ్లిసిటీ. మన చేతిలో నైపుణ్యం ఉంటే ఆర్డర్‌లు వాటంతట అవే వస్తాయి.

డబ్బున్న వాళ్లకు కాదు!

టైలరింగ్‌లో మూడు నెలల ఉచిత శిక్షణకు మహిళలను ఎంపిక చేసుకునేటప్పుడు వాళ్ల ఆదాయస్థితిని కచ్చితంగా పట్టించుకుంటాను. భర్త ప్రభుత్వ ఉద్యోగి, వ్యాపారాల్లో బాగా గడిస్తున్న వాళ్లకు ఉచిత శిక్షణ అవసరంలేదనేది నా అభిప్రాయం. మగవాళ్ల దగ్గర ట్రైనింగ్ అంటే... అందరూ ఒకలా ఉండరు, కొంతమంది ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెడతారని చాలామంది చెప్తుంటారు. చాలామంది మహిళలు ట్రైనింగ్ మధ్యలో ఆపేయడానికి ఇలాంటి పైకి చెప్పుకోలేని కారణాలెన్నో. నా దగ్గర పని నేర్చుకుంటున్నప్పుడు చాలామంది వాళ్ల ఇంటి విషయాలు కూడా నాతో పంచుకుంటారు. ఆ మాటల్లో వాళ్ల ఆర్థిక పరిస్థితి అర్థమవుతుంది. అలాంటి వాళ్లకు మాత్రం శిక్షణ పూర్తయిన తర్వాత మెషీన్‌లు ఉచితంగా ఇప్పించే ప్రయత్నం చేస్తున్నాను. నా దగ్గర శిక్షణ తీసుకున్న వెయ్యిమందిలో మెషీన్‌లు అందుకున్న వాళ్లు రెండు వందలకు పైగా ఉన్నారు. అమెరికాలో ఉండే తెలుగువాళ్లు కొంత మంది 'చేతన ఫౌండేషన్' ద్వారా అవసరమైన వారికి సహాయం చేస్తుంటారు. మాకు పెద్ద మొత్తంలో మెషీన్‌లు ఇచ్చింది వాళ్లే. ఇక స్థానికులు కొంతమంది తమ పిల్లల పుట్టినరోజు సందర్భంగా, పెద్ద వాళ్ల గుర్తుగా ఒకటి-రెండు మెషీన్‌లు ఇస్తుంటారు. నాకు వచ్చిన పనిని నలుగురికి నేర్పించాలనే సంకల్పం ఇలా మరింత శక్తిమంతంగా ముందుకుపోతోంది. మహిళలు ఇంట్లో ఉండి పిల్లలను చూసుకుంటూ రోజుకు కనీసంగా ఆరు వందలు సంపాదించుకుంటున్నారు'' అని తన విజయగాథను వివరించారు పొన్నగంటి మాధవి.

– వాకా మంజులారెడ్డి

పురస్కారం

విజ్ఞానజ్యోతి

చిన్నప్పుడు రసాయనశాస్త్ర పుస్తకాన్ని బొమ్మల పుస్తకంలా ఇష్టంగా చదువుకునేది జ్యోతిర్మయి. ఆ ఇష్టమే రసాయనశాస్త్రంలో తనకంటూ గుర్తింపు తెచ్చింది. ఎన్నో అవార్డ్‌లు స్వీకరించేలా చేసింది. తాజాగా ప్రతిష్ఠాత్మకమైన ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ ప్యూర్ అండ్ అప్లైడ్ కెమిస్ట్రీ (ఐయుపీఏసీ-యూఎస్) అవార్డ్‌కు ఎంపికైంది. ఈ అవార్డ్‌కు ఎంపికైన తొలి భారతీయ మహిళగా జ్యోతిర్మయి మొహంతీ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది....

చాలామంది పిల్లలకు లెక్కలు ఎలాగో రసాయనశాస్త్రం అలా. అయితే జ్యోతిర్మయి విషయం వేరు. స్కూల్లో టీచర్, ఇంట్లో నాన్న వల్ల రసాయనశాస్త్రంపై ఆసక్తి పెరిగింది. నాన్న వైకుంఠనాథ్ పిల్లల డాక్టర్. రసాయన శాస్త్రం విషయాలను పాఠంలా కాకుండా ఆట, కథలా ఆసక్తికరంగా చెప్పేవాడు.



జ్యోతిర్మయి మొహంతీ

ముంబై యూనివర్శిటీలో పీహెచ్‌డీ చేసిన జ్యోతిర్మయి భాభా ఆటమిక్ రిసెర్చ్ సెంటర్ (బార్క్)లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించింది. సింథటిక్ మైక్రోసైకిల్స్ నుంచి ఫొటో కెమికల్ ప్రాసెస్ వరకు ఎన్నో విషయాల మీద, ఎన్నో అంతర్జాతీయ జర్నల్స్‌లో పరిశోధనాత్మక వ్యాసాలు రాసింది. సైంటిఫిక్ అండ్ టెక్నికల్ ఎక్సలెన్స్ అవార్డ్, ది కెమికల్ సొసైటీ ఆఫ్ జపాన్ అవార్డ్‌లాంటి ఎన్నో అవార్డ్‌లు అందుకుంది. గత సంవత్సరం రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ (యూకే) అవార్డ్ అందుకుంది.

101 సంవత్సరాల చరిత్ర ఉన్న 'ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ ప్యూర్ అండ్ అప్లైడ్ కెమిస్ట్రీ' అవార్డ్‌కు ఎంపికైన సందర్భంగా తన పుట్టిన ఊరు కటక్, మెట్టిన ఊరు (భర్త రష్మీ రంజన్ మొహంతీ, సైంటిస్ట్) తితిరలోని సామాన్య ప్రజల నుంచి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ వరకు జ్యోతిర్మయి మొహంతీని ప్రశంసించారు. శాస్త్రరంగంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నారు.



క్వార్టర్ ఫైనల్లో మనిక-సత్యన్ జోడీ పరాజయం

ప్రపంచ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) సింగపూర్ స్మాష్ టోర్నీలో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో మనిక బత్రా-సత్యన్ జ్ఞానశేఖరన్ (భారత్) జోడీ 9-11, 9-11, 11-8, 11-5, 7-11తో హినా హయాటా-టొమొకాజు హరిమోటో (జపాన్) ద్వయం చేతిలో ఓడిపోయింది. మహిళల డబుల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్లో మనిక బత్రా-అర్చన కామత్ (భారత్) జోడీ 2-11, 6-11, 15-13, 12-10, 6-11తో మెంగ్ చెన్-యిది వాంగ్ (చైనా) ద్వయం చేతిలో పరాజయం పాలైంది.



వన్డే సిరీస్‌కు శ్రేయస్ అయ్యర్ దూరం

ఆస్ట్రేలియా జట్టుతో ఈనెల 17న మొదలుకానున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు భారత బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ వెన్ను నొప్పితో దూరమయ్యాడు. ఆస్ట్రేలియాతో నాలుగో టెస్ట్ సందర్భంగా అయ్యర్‌కు వెన్ను నొప్పి తిరగబెట్టింది. ఈనెల 31న ఆరంభంకానున్న ఐపీఎల్ టోర్నీలో కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు అయ్యర్ సారథ్యం వహించాల్సి ఉంది. ఐపీఎల్ టోర్నీ ఆరంభ మ్యాచ్‌లకు కూడా అయ్యర్ అందుబాటులో ఉండటం సందేహంగా మారింది.



నేటి నుంచి 'పంచ్' సమరం

- మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు రంగం సిద్ధం
- నేడు ప్రారంభోత్సవం
- రేపటి నుంచి బౌట్‌లు
- స్వర్ణ పతక విజేతకు రూ. 82 లక్షలు ప్రైజ్‌మనీ

న్యూఢిల్లీ: మూడోసారి ప్రపంచ మహిళల సీనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల నిర్వహణకు భారత్ సిద్ధమైంది. న్యూఢిల్లీలోని కేడీ జాదవ్ ఇండోర్ స్టేడియంలో ఈ మెగా ఈవెంట్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేడు సాయంత్రం జరిగే ప్రారంభోత్సవానికి కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా విచ్చేస్తారు. గురువారం నుంచి బౌట్‌లు మొదలవుతాయి. 23న సెమీఫైనల్స్ జరుగుతాయి. 24న విశ్రాంతి దినం. 25, 26వ తేదీల్లో జరిగే ఫైనల్స్‌తో టోర్నీ ముగుస్తుంది. గతంలో 2006, 2018లలో భారత్ ప్రపంచ మహిళల బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఆతిథ్యమిచ్చింది. మూడోసారీ న్యూఢిల్లీ వేదికగానే ఈ మెగా ఈవెంట్‌ను నిర్వహిస్తుండటం విశేషం. మొత్తం 12 వెయిట్ కేటగిరీల్లో (48 కేజీలు, 50, 52, 54, 57, 60, 63, 66, 70, 75, 81, ప్లస్ 81 కేజీలు) బౌట్‌లు ఉంటాయి. 65 దేశాల నుంచి 300కుపైగా బాక్సర్లు పతకాల కోసం బరిలోకి దిగనున్నారు. పతక విజేతలకు భారీ మొత్తంలో ప్రైజ్‌మనీ ఇవ్వనున్నారు. స్వర్ణ పతక విజేతకు లక్ష డాలర్లు (రూ. 82 లక్షలు).... రజత పతక విజేతకు 50 వేల డాలర్లు (రూ. 41 లక్షలు), కాంస్య పతక విజేతలకు (ఇద్దరికి) 25 వేల డాలర్ల (రూ. 20 లక్షలు) చొప్పున ప్రైజ్‌మనీ అందజేస్తారు. గత ఏడాది టర్కీలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్ ఒక స్వర్ణం (నిఖత్ జరీన్), రెండు కాంస్య పతకాలు (మనీషా మౌన్, పర్వీన్ హుడా) సాధించింది.

భారత బాక్సింగ్ జట్టు: నీతూ ఘంఘాస్ (48 కేజీలు), నిఖత్ జరీన్ (50 కేజీలు), సాక్షి చౌదరీ (52 కేజీలు), ప్రీతి (54 కేజీలు), మనీషా మౌన్ (57 కేజీలు), జాస్మిన్ (60 కేజీలు), శశి చోప్రా (63 కేజీలు), మంజు బంబోరియా (66 కేజీలు), సనామాచ చాను (70 కేజీలు), లవ్లీనా బొర్గొహైన్ (75 కేజీలు), స్వీటీ బూరా (81 కేజీలు), నుపుర్ షెరాన్ (ప్లస్ 81 కేజీలు).

ప్లే ఆఫ్స్‌కు ముంబై

- డబ్ల్యూపీఎల్‌లో వరుసగా ఐదో విజయం
- మెరిసిన హర్మన్‌ప్రీత్
- రాణించిన సీవర్, హేలీ
- 55 పరుగులతో ఓడిన గుజరాత్



హర్మన్‌ప్రీత్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ఓటమెరుగని ముంబై ఇండియన్స్ జట్టు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. మంగళవారం జరిగిన పోరులో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం 55 పరుగుల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై ఘనవిజయం సాధించింది. ముంబైకిది వరుసగా ఐదో విజయం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (30 బంతుల్లో 51; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధనాధన్ అర్ధసెంచరీ బాదింది. ఓపెనర్ యస్తిక భాటియా (37 బంతుల్లో 44; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించగా, గుజరాత్ బౌలర్లలో ఆష్లే గార్డ్‌నెర్ 3 వికెట్లు పడగొట్టింది. అనంతరం గుజరాత్ 20 ఓవర్లు ముగిసేసరికి 9 వికెట్లు కోల్పోయి 107 పరుగులే చేయగలిగింది. హర్లీన్ డియోల్ (23 బంతుల్లో 22; 3 ఫోర్లు), కెప్టెన్ స్నేహ్ రాణా (19 బంతుల్లో 20; 3 ఫోర్లు) కష్టంగా రెండు పదుల స్కోరు దాటారు. మిగతావారంతా చేతులెత్తేశారు. నట్ సీవర్ బ్రంట్, హేలీ మాథ్యూస్ చెరో 3 వికెట్లు తీయగా, అమెలియా కెర్‌కు 2 వికెట్లు దక్కాయి. నేడు జరిగే మ్యాచ్‌లో యూపీ వారియర్స్‌తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తలపడుతుంది.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: యస్తిక (రనౌట్) 44; హేలీ (సి) డన్‌క్లే (బి) గార్డ్‌నెర్ 0; నట్ సీవర్ (ఎల్బీ) (బి) గార్త్ 36; హర్మన్‌ప్రీత్ (సి) హర్లీన్ (బి) గార్డ్‌నెర్ 51; అమెలియా (సి) గార్త్ (బి) కన్వార్ 19; ఇసి వాంగ్ (సి అండ్ బి) స్నేహ్ రాణా 0; హుమైరా (రనౌట్) 2; ధార (నాటౌట్) 1; అమన్‌జోత్ (సి) డన్‌క్లే (బి) గార్డ్‌నెర్ 0; కలిత (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 7, **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 151. వికెట్ల పతనం:** 1-1, 2-75, 3-84, 4-135, 5-136, 6-145. **బౌలింగ్:** గార్డ్‌నెర్ 4-0-34-3, కిమ్ గార్త్ 4-0-31-1, స్నేహ్ రాణా 4-0-17-1, తనూజ 4-0-32-1, అనాబెల్ 4-0-42-0.

గుజరాత్ జెయింట్స్ ఇన్నింగ్స్: సోఫియా (ఎల్బీ) (బి) నట్ సీవర్ 0; మేఘన (సి) నట్ సీవర్ (బి) హేలీ 16; హర్లీన్ (ఎల్బీ) (బి) వాంగ్ 22; అనాబెల్ (ఎల్బీ) (బి) హేలీ 0; గార్డ్‌నెర్ (సి) కలిత (బి) అమెలియా 8; స్నేహ (ఎల్బీ) (బి) నట్ సీవర్ 20; హేమలత (సి) వాంగ్ (బి) అమెలియా 6; సుష్మ (నాటౌట్) 18; గార్త్ (సి) హర్మన్ (బి) నట్ సీవర్ 8; తనూజ (సి) యస్తిక (బి) హేలీ 0; మాన్సి (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 107. వికెట్ల పతనం:** 1-0, 2-34, 3-34, 4-48, 5-48, 6-57, 7-85, 8-95, 9-96. **బౌలింగ్:** నట్ సీవర్ 4-0-21-3, సయిక 4-0-20-0, ఇసి వాంగ్ 3-0-19-1, హేలీ మాథ్యూస్ 4-0-23-3, అమెలియా కెర్ 4-0-18-2, అమన్‌జోత్ 1-0-6-0.

లక్ష్య సేన్ శుభారంభం

తొలి రౌండ్‌లో ఐదో ర్యాంకర్ చౌ తియెన్ చెన్‌పై విజయం



బర్మింగ్‌హామ్: ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్స్ లక్ష్య సేన్, హెచ్‌ఎస్ ప్రణయ్ శుభారంభం చేశారు. మంగళవారం మొదలైన ఈ ప్రతిష్టాత్మక టోర్నీలో పురుషుల సింగిల్స్ విభాగంలో గత ఏడాది రన్నరప్ లక్ష్య సేన్ తొలి రౌండ్‌లో సంచలన విజయం సాధించాడు. ప్రపంచ ఐదో ర్యాంకర్ చౌ తియెన్ చెన్ (చైనీస్ తైపీ)తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ 19వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21-18, 21-19తో గెలుపొంది ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. గతంలో చౌ తియెన్ చెన్‌తో ఆడిన రెండుసార్లూ ఓడిపోయిన లక్ష్య సేన్ మూడో ప్రయత్నంలో మాత్రం పైచేయి సాధించాడు. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్, భారత నంబర్‌వన్ హెచ్‌ఎస్ ప్రణయ్ 21-19, 22-20తో జు వె వాంగ్ (చైనీస్ తైపీ)పై విజయం సాధించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు.

వన్డే సిరీస్‌లోనూ స్మిత్ సారథ్యంలో...



అహ్మదాబాద్: భారత జట్టుతో ఈనెల 17న మొదలయ్యే వన్డే సిరీస్‌కు కూడా సీనియర్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ సారథ్యం వహిస్తాడు. రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ తన తల్లి మరణం కారణంగా ఆస్ట్రేలియాలోనే ఉండిపోయాడు. అతని తల్లి మరియా రొమ్ము క్యాన్సర్‌తో చివరిదశలో ఉండటంతో రెండో టెస్టు ముగిసిన వెంటనే కమిన్స్ ఆసీస్‌కు బయల్దేరాడు. గత శుక్రవారం ఆమె తుదిశ్వాస విడువడంతో కమిన్స్ కుటుంబంతోనే ఉండిపోవాల్సి వచ్చిందని వన్డే సిరీస్‌కూ అతను గైర్హాజరీ కానున్నాడని ఆస్ట్రేలియా హెడ్ కోచ్ ఆండ్రూ మెక్‌డొనాల్డ్ తెలిపారు. మరోవైపు డాషింగ్ ఓపెనర్ డేవిడ్ వార్నర్ వన్డే సిరీస్‌లో పాల్గొనేందుకు మళ్లీ భారత్ వస్తున్నాడు. మోచేతి గాయంతో రెండో టెస్టు తర్వాత స్వదేశానికి వెళ్లిపోయాడు.



బంగ్లాదేశ్ క్లీన్‌స్వీప్

మూడో టి20లోనూ ఇంగ్లండ్ ఓటమి

మిర్పూర్: ప్రపంచ చాంపియన్ ఇంగ్లండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను బంగ్లాదేశ్ క్లీన్‌స్వీప్ చేసింది. మంగళవారం జరిగిన చివరిదైన మూడో టి20 మ్యాచ్‌లో షకీబ్ అల్ హసన్ కెప్టెన్సీలోని బంగ్లాదేశ్ 16 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించి సిరీస్‌ను 3-0తో సొంతం చేసుకుంది. మూడు మ్యాచ్‌ల ద్వైపాక్షిక టి20 సిరీస్‌ను బంగ్లాదేశ్ క్లీన్‌స్వీప్ చేయడం ఇది రెండోసారి మాత్రమే. 2012లో ఐర్లాండ్‌పై బంగ్లాదేశ్ తొలిసారి ఈ ఘనత సాధించింది. బంగ్లాదేశ్-ఇంగ్లండ్ మధ్య ద్వైపాక్షిక టి20 సిరీస్ జరగడం కూడా ఇదే ప్రథమం. మూడో టి20 మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 2 వికెట్లకు 158 పరుగులు సాధించింది. ఓపెనర్ లిటన్ దాస్ (57 బంతుల్లో 73; 10 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేయగా... నజ్ముల్ (36 బంతుల్లో 47 నాటౌట్; 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించాడు. అనంతరం 159 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 142 పరుగులు చేసి ఓడిపోయింది. డేవిడ్ మలాన్ (47 బంతుల్లో 53; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), జోస్ బట్లర్ (31 బంతుల్లో 40; 4 ఫోర్లు, 1 సిక్స్) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. లిటన్ దాస్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'... నజ్ముల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు లభించాయి.

2 ఇంగ్లండ్ జట్టు మూడు మ్యాచ్‌ల ద్వైపాక్షిక టి20 సిరీస్‌ను 0-3తో కోల్పోవడం ఇది రెండోసారి మాత్రమే. 2014లో ఆస్ట్రేలియా చేతిలో తొలిసారి ఇంగ్లండ్ 0-3తో చేజార్చుకుంది.

ఐపీఎల్ కోసం విలియమ్సన్, సౌతీలకు ఊరట

న్యూజిలాండ్ వన్డే జట్టు నుంచి విడుదల

వెల్లింగ్టన్: న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు (ఎన్‌జడ్‌సీ) తమ ప్రధాన క్రికెటర్లు ఐపీఎల్‌లో ఆడేందుకు మార్గం సుగమం చేసింది. శ్రీలంకతో రెండో టెస్టు తదుపరి వన్డే సిరీస్ నుంచి లీగ్ కాంట్రాక్టు దక్కించుకున్న తమ కీలక ఆటగాళ్లను విడుదల చేయనుంది. కేన్ విలియమ్సన్ (గుజరాత్ టైటాన్స్), టిమ్ సౌతీ (కోల్‌కతా నైట్‌రైడర్స్), డెవాన్ కాన్వే, సాన్‌ట్నర్ (చెన్నై సూపర్ కింగ్స్)లు ఆయా ఫ్రాంచైజీలతో జట్టు కట్టేందుకు రిలీజ్ చేయాలని ఎన్‌జడ్‌సీ నిర్ణయించింది. లంకతో ఆఖరి టెస్టు ఆడిన వెంటనే వీళ్లంతా భారత్‌కు బయల్దేరతారు. మరో ముగ్గురు క్రికెటర్లు ఫిన్ అలెన్ (రాయల్ చాలెంజర్స్ బెంగళూరు), ఫెర్గూసన్ (కోల్‌కతా), గ్లెన్ ఫిలిప్స్ (సన్‌రైజర్స్ హైదరాబాద్‌లు)లకు 25న ఆక్లాండ్‌లో జరిగే తొలి వన్డే అనంతరం లీగ్‌లో ఆడేందుకు అనుమతించింది. ఈ సీజన్ ఐపీఎల్ పోటీలు మార్చి 31 నుంచి జరుగనున్నాయి. ఈ లీగ్‌కు ముందు న్యూజిలాండ్-శ్రీలంక జట్ల మధ్య 17 నుంచి 21 వరకు చివరిదైన రెండో టెస్ట్ జరుగుతుంది. ఇది ముగియగానే ఈనెల 25, 28, 31 తేదీల్లో మూడు వన్డేల సిరీస్... ఏప్రిల్ 2, 5, 8 తేదీల్లో మూడు టి20ల సిరీస్ జరగనుంది.




సినిమా



ఆస్కార్ వీక్షకుల సంఖ్య పెరిగింది

95వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం (భారతీయ కాలమానం ప్రకారం సోమవారం) ముగిసిన విషయం తెలిసిందే. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆస్కార్ వేడుకను ఎక్కువమంది వీక్షించారు. 2021లో తక్కువగా దాదాపు 10 మిలియన్ (కోటి మంది) వ్యూయర్‌షిప్, 2022లో 16.6 మిలియన్ల వ్యూయర్‌షిప్ నమోదు కాగా ఈ ఏడాది వేడుకను 18.7 (కోటీ 87 లక్షలు) మిలియన్ల మంది వీక్షించారు. గత ఏడాదితో పోల్చితే 12 శాతం ఎక్కువ వ్యూయర్‌షిప్ నమోదైంది. అయితే ఆస్కార్ వ్యూయర్‌షిప్ విషయంలో ఇదేం పెద్ద విషయం కాదు. ఎందుకంటే 1998లో జరిగిన ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవాన్ని 57 (5 కోట్ల 70 లక్షలు) మిలియన్ల మంది వీక్షించారు. ఈసారి సోషల్ మీడియాలో కూడా ఆస్కార్ వేడుక టాప్ ట్రెండింగ్‌లోకి వచ్చింది. ఈ వేడుకకు 27.4 (27 కోట్ల 4 లక్షలు) మిలియన్ల ఇంట్రాక్షన్స్ సోషల్ మీడియాలో నమోదయ్యాయని హాలీవుడ్ గణాంకాలు చెబుతున్నాయి. ఇటు టెలివిజన్ వ్యూయర్‌షిప్ రేటింగ్స్ కూడా స్వల్పంగా పెరిగింది. కాగా ఆస్కార్ అవార్డు వేడుక అనంతరం కమిటీ గ్రాండ్‌గా 'ఆఫ్టర్' పార్టీ నిర్వహించింది. ఈ పార్టీలో ఎన్టీఆర్, రామ్‌చరణ్, ఉపాసన, దీపికా తదితరులు పాల్గొన్నారు.



రాజమౌళి

రాజమౌళి ఇంట్లో పార్టీ

''మేం కచ్చితంగా ఆస్కార్ గెలుస్తామని ముందు నుంచి యూనిట్ అంతా నమ్మకంగా ఉన్నాం. ఆస్కార్ అందుకోవడమా? లేదా ఆస్కార్ వేదికపై 'నాటు నాటు'ను ప్రదర్శించడమా.. ఈ రెండింటిలో ఏ క్షణాలు అపూర్వమైనవి అని నన్ను అడిగితే... ఎంచుకోవడం నాకు చాలా కష్టం. 'నాటు నాటు' పాటను వేదికపై ప్రదర్శిస్తున్నంతసేపు వీక్షకులు క్లాప్ కొడుతూ, సాంగ్ పూర్తయ్యాక స్టాండింగ్ ఒవేషన్ ఇవ్వడం అనేది నన్ను ప్రపంచంలోనే అత్యున్నత శిఖరంపై నిలబెట్టినట్లయింది. అలాగే ఆస్కార్ అవార్డు ఆయన్ను (కీరవాణిని ఉద్దేశిస్తూ..) కూడా ఆ శిఖరాగ్రాన నిలబెట్టింది'' అని పేర్కొన్న రాజమౌళి ఫుల్ జోష్‌లో ఉన్నారు. ఆ ఆనందంలో లాస్ ఏంజిల్స్‌లోని తన ఇంట్లో 'ఆర్ఆర్ఆర్' టీమ్‌కు గ్రాండ్ పార్టీ ఇచ్చారు రాజమౌళి. ఈ పార్టీని రాజమౌళి భార్య రమ, ఆయన తనయుడు కార్తికేయ హోస్ట్ చేశారు. ఈ పార్టీలో కీరవాణి పియానో ప్లే చేయగా, అక్కడ ఉన్నవారు పాట పాడారు. ఈ సెలబ్రేషన్స్‌ను రామ్ చరణ్ వీడియో తీశారు. ఈ ఫోటోలను ఉపాసన షేర్ చేయగా వైరల్ అవుతున్నాయి.



రాజమౌళి స్వగృహంలో ఆఫ్టర్ పార్టీలో...



టాప్‌ప్లేస్‌లో తెలుగు హీరోలు

సోషల్ మీడియా అండ్ న్యూస్ మీడియా ట్రెండ్స్‌ను విశ్లేషించే అమెరికాకి చెందిన నెట్‌బేస్ క్విడ్ కొన్ని గణాంకాలను వెల్లడించింది. ఆ లెక్కల ప్రకారం (వేడుక జరిగిన సమయంలో..) టాప్ మెన్షన్డ్ యాక్టర్స్ జాబితా తొలి స్థానంలో ఎన్టీఆర్ నిలిచారు. ఆ తర్వాతి స్థానాలు వరుసగా రామ్‌చరణ్, కి హుయ్ క్వాన్ (ఉత్తమ సహాయనటుడు), బ్రెండెన్ ఫ్రాసెర్ (ఉత్తమ నటుడు), పెడ్రోపాస్కల్ నిలిచారు. ఇక నటీమణుల విషయానికొస్తే.. మిషెల్ యో (ఉత్తమ నటి) అగ్రస్థానంలో నిలవగా, ఆ తర్వాతి నాలుగు స్థానాల్లో వరుసగా మిచెల్ యో, లేడీ గగా, ఏంజెలా బాసెట్, ఎలిజబెత్ ఒల్సెన్, జామిలీ కర్టిస్ (ఉత్తమ సహాయ నటి) నిలిచారు. కాగా సినిమాల పరంగా తొలి రెండు స్థానాల్లో భారతీయ చిత్రాలు 'రౌద్రం.. రణం.. రుధిరం' (ఆర్ఆర్ఆర్ - ఫీచర్ ఫిల్మ్), 'ది ఎలిఫెంట్ విస్పరర్స్' (బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ సబ్జెక్ట్) నిలిచాయి. ఆ తర్వాతి మూడు స్థానాల్లో వరుసగా 'ఎవ్రీథింగ్ ఎవ్రీవేర్ ఆల్ ఎట్ వన్స్', 'ఆల్ క్వైట్ ఆన్ ది వెస్ట్రన్ ఫ్రంట్', 'అర్జెంటీనా 1985' చిత్రాలు నిలిచాయి.



ఎన్టీఆర్



రామ్‌చరణ్



ది ఎలిఫెంట్ విస్పరర్స్

భారతీయుల మనసు గెలిచిన లేడీ గగా

'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ వచ్చిందని ప్రకటించగానే.. రాజమౌళి ఆనందంతో చప్పట్లు కొట్టి, తన భార్య రమను హత్తుకున్నారు. ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లు ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. ఆ సినిమాకి సంబంధించినవారిగా ఆ విధంగా ఆనందపడటం సహజం. అయితే అమెరికన్ సింగర్, సాంగ్ రైటర్, యాక్ట్రస్ లేడీ గగా చప్పట్లు కొడుతూ తన ఆనందాన్ని వ్యక్తం చేయడం విశేషం. 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో పోటీలో ఉన్న 'నాటు..'తో పాటు 'టాప్‌గన్: మ్యావరిక్' చిత్రం కోసం పాడిన 'హోల్డ్ మై హ్యాండ్' పాటకు లేడీ గగా నామినేషన్ దక్కించుకున్నారు. తన పాటకు కాకుండా 'నాటు..'కు వచ్చినప్పటికీ చప్పట్లతో అభినందించడం ఆమె సంస్కారానికి నిదర్శనం అని నెటిజన్లు అభినందిస్తున్నారు.



లేడీ గగా



నాని

బతుకమ్మ పాట వినిపించిన తర్వాత 'వెన్నెలొచ్చిందిరా' అన్న నాని డైలాగ్‌తో మొదలైంది 'దసరా' మూవీ ట్రైలర్. నాని హీరోగా నూతన దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన చిత్రం 'దసరా'. సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. 'తాగిమర్చిపోవుడు తప్పు కాదు.. తప్పుచేసి మర్చిపోవుడు తప్పు', 'ఎట్లయితే గట్లాయే సూస్కుందాం' అన్న డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ఇందులో ధరణిగా నాని, వెన్నెల పాత్రలో కీర్తి సురేశ్ నటించారు.

కథ బాగుంటే పిల్లల చిత్రాలనూ ఆదరిస్తారు
- 'దిల్' రాజు



'దిల్' రాజు, శివమ్

''లిటిల్ సోల్జర్స్, అంజలి' వంటి పిల్లల సినిమాలంటే నాకు చాలా ఇష్టం. మంచి కథ ఉంటే చిన్న పిల్లలపై సినిమాలు తీస్తే ప్రేక్షకులు ఆదరిస్తారు. 'లిల్లీ' ట్రైలర్ బాగుంది.. సినిమా హిట్ కావాలి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. మాస్టర్ వేదాంత్ వర్మ, మాస్టర్ ప్రణీతా రెడ్డి లీడ్ రోల్స్‌లో రాజ్‌వీర్, నేహా ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'లిల్లీ'. శివమ్ దర్శకత్వంలో కె.బాబురెడ్డి, జి.సతీష్ కుమార్ నిర్మించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్‌ను 'దిల్' రాజు విడుదల చేశారు. కె.బాబురెడ్డి, జి.సతీష్ కుమార్ మాట్లాడుతూ– ''మేం తీసిన తొలి చిత్రం 'లిల్లీ'. తమిళ్‌లో 'రంగోలి' సినిమా చేస్తున్నాం. 'లిల్లీ'ని త్వరలో రిలీజ్ చేస్తాం'' అన్నారు. ''తల్లితండ్రులు తప్పకుండా తమ పిల్లలకు మా 'లిల్లీ' సినిమా చూపించాలి'' అన్నారు శివమ్. నటుడు శివకృష్ణ తదితరులు మాట్లాడారు.



అదే నాకు పెద్ద ప్రశంస
- ప్రియదర్శి

''నా కెరీర్‌లో 'బలగం' ఓ మైలురాయి. నేను నటించిన సినిమాలు చూసిన మా నాన్నగారు(సుబ్బాచారి) ఎప్పుడూ నన్ను అభినందించలేదు. కానీ, 'బలగం' చూసి నా భుజంపై చేయి వేసి, 'చాలా బాగా చేశావురా' అన్నారు.. అదే నాకు పెద్ద ప్రశంస'' అని నటుడు ప్రియదర్శి అన్నారు. వేణు ఎల్దండి దర్శకత్వంలో ప్రియదర్శి, కావ్యా కల్యాణ్ రామ్, సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'బలగం'. 'దిల్' రాజు ప్రొడక్షన్స్, శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మించిన ఈ మూవీ ఈ నెల 3న విడుదలైంది. ప్రియదర్శి మాట్లాడుతూ– ''బలగం' కి అందరూ కనెక్ట్ అవుతున్నారు. 'చిన్న మనస్పర్థల వల్ల మా అన్న, నేను రెండేళ్లుగా మాట్లాడుకోలేదు.. 'బలగం' చూశాక మా అన్నకి నేనే ఫోన్ చేశాను.. ఇద్దరం మాట్లాడుకున్నాం' అని ఒకతను ఫోన్ చేసి చెప్పడంతో ఎంతో ఆనందం వేసింది. ప్రస్తుతం రెండు మూడు సినిమాల్లో హీరోగా, వేరే హీరోల చిత్రాల్లో ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్నాను'' అన్నారు.

కథ డిమాండ్ మేరకే ఆ సీన్ చేశా
- మాళవికా నాయర్

''ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి' చిత్రంలో అనుపమ పాత్ర చేశాను. నా గత సినిమాలతో పోలిస్తే ఈ పాత్రలో నటనకి ఎంతో ప్రాధాన్యం ఉంది.. నాకు సంతృప్తి ఇచ్చిన పాత్ర ఇది'' అని హీరోయిన్ మాళవికా నాయర్ అన్నారు. నాగశౌర్య హీరోగా శ్రీనివాస్ అవసరాల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. టీజీ విశ్వ ప్రసాద్, పద్మజ దాసరి నిర్మించారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. ఈ సినిమా ఈ నెల 17న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కథానాయిక మాళవికా నాయర్ మాట్లాడుతూ– ''మామూలుగా ప్రేమకథలు రెండు మూడేళ్ల వ్యవధిలో జరిగినట్లు చూపిస్తుంటారు. అయితే 'ఫలానా అబ్బాయి..'లో 18 నుంచి 28 ఏళ్ల ప్రయాణం చూపిస్తారు. ఇది రెగ్యులర్ సినిమా కాదు.. ప్రయోగమే.సహజమైన సన్నివేశాలు, సంభాషణలతో స్వచ్ఛమైన వినోదాన్ని పంచబోతున్నాం. కథ డిమాండ్ మేరకే ఈ సినిమాలో ముద్దు సీన్ చేశాను. అవసరాల చాలా సరదాగా ఉంటారు. ఆయన వల్లే నా తెలుగు మెరుగుపడింది. ప్రస్తుతం 'అన్నీ మంచి శకునములే, డెవిల్' సినిమాల్లో నటిస్తున్నాను'' అన్నారు.



నా నుంచి ఉపేంద్రలాంటి సినిమా ఆశిస్తున్నారు
- ఉపేంద్ర



శ్రియ, ఉపేంద్ర

''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'కబ్జ'. సెంటిమెంట్ కూడా ఉంది. విజువల్ గ్రాండియర్‌గా రూపొందిన ఈ సినిమా ప్రేక్షకులను అలరిస్తుంది'' అని హీరో ఉపేంద్ర అన్నారు. ఆర్.చంద్రు స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కబ్జ'. ఉపేంద్ర నటించిన తొలి పాన్ ఇండియా మూవీ ఇది. శ్రియా శరణ్ హీరోయిన్. పునీత్ రాజ్‌కుమార్ జయంతి సందర్భంగా ఈ నెల 17న తెలుగు, కన్నడ, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో విడుదలవుతోంది. నిర్మాత ఎన్. సుధాకర్ రెడ్డి సమర్పణలో లక్ష్మీకాంత్ రెడ్డి తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ వేడుకలో ఉపేంద్ర మాట్లాడుతూ– ''నా నుంచి 'ఉపేంద్ర' లాంటి సినిమా రావాలని అందరూ ఎదురు చూస్తున్నారు. నేను హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న 'యుఐ' సినిమా 'ఉపేంద్ర' లాగే ఉంటుంది'' అన్నారు. ''కబ్జ' నా మనసుకి ఎంతో దగ్గరైన చిత్రం'' అన్నారు శ్రియ. ''ఉపేంద్రగారి 'బుద్ధిమంతుడు' చిత్రాన్ని తెలుగులో నేనే విడుదల చేశాను. ఇప్పుడు మళ్లీ 'కబ్జ' తో రీ ఎంట్రీ ఇస్తున్నాం'' అన్నారు లక్ష్మీకాంత్ రెడ్డి. చిత్ర సహనిర్మాత 'ఆర్కా' సాయికృష్ణ పాల్గొన్నారు.

వాస్తవ సంఘటనలతో...



ఆదర్శ్, చిత్రా శుక్లా

ఆదర్శ్, చిత్రా శుక్లా జంటగా ఆంథోని మట్టిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గీత సాక్షిగా'. చేతన్ రాజ్ కథ అందించి, నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ మూవీ ట్రైలర్‌ని దర్శకుడు విజయ్ కనకమేడల, నిర్మాత సతీష్ వేగేశ్న విడుదల చేశారు. ''ఈ మధ్య తెలుగు ప్రేక్షక దేవుళ్లు కంటెంట్ ఉన్న సినిమాలనే ఆదరిస్తున్నారు. అలాంటి వారికి మా 'గీత సాక్షిగా' నచ్చుతుంది'' అన్నారు ఆదర్శ్. ''మహిళా సమస్యలపై రూపొందిన చిత్రం ఇది'' అన్నారు చిత్రా శుక్లా. ''మన దేశంలో మహిళలను అమ్మగా పూజిస్తాం. అలాంటి వారిపై సమాజంలో జరుగుతున్న దురాగతాల నేపథ్యంలో ఈ సినిమా తీశాం'' అన్నారు చేతన్ రాజ్. ''వాస్తవ ఘటనలతో రూపొందిన 'గీత సాక్షిగా' అందరికీ నచ్చుతుంది'' అన్నారు ఆంథోని మట్టిపల్లి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▼	338	57,900
నిఫ్టీ ▼	111	17,043

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (బుధవారం రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	11,375	▲	185
డోజోన్స్	31,958	▲	139
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,637	▲	88
డాక్స్	15,233	▲	273
షాంఘై	3,245	▼	23
నికాయ్	27,222	▼	610

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

జియో పోస్ట్‌పెయిడ్ ఫ్యామిలీ ప్లాన్స్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: టెలికం రంగ సంస్థ రిలయన్స్ జియో కొత్త పోస్ట్‌పెయిడ్ ఫ్యామిలీ ప్లాన్స్‌ను పరిచయం చేసింది. కస్టమర్లు ఒక నెలపాటు ఉచితంగా ట్రయల్ చేయవచ్చు. ప్లాన్స్ రూ.399 నుంచి ప్రారంభం. అదనంగా మూడు సిమ్‌లను తీసుకోవచ్చు. ఒక్కొక్క సిమ్‌కు నెలకు రూ.99 చార్జీ చేస్తారు. అపరిమిత కాల్స్, ఎస్ఎంఎస్ చేసుకోవచ్చు. రూ.399 ప్యాక్‌లో నలుగురు సభ్యుల కుటుంబానికి మొత్తం చార్జీ రూ.696 ఉంటుంది. నలుగురు సభ్యులు ఒక నెలలో మొత్తం 75 జీబీ డేటాను వినియోగించుకోవచ్చు. రూ.699 ప్లాన్‌లో 100 జీబీ డేటా అందుకోవచ్చు. అలాగే నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్, జియోటీవీ, జియో సినిమాస్ యాప్స్‌ను ఆస్వాదించవచ్చు. ఇండివిడ్యువల్ ప్లాన్స్‌లో రూ.299 ప్యాక్‌కు 30 జీబీ, రూ.599 ప్యాక్ అయితే అపరిమిత డేటా ఆఫర్ చేస్తోంది. సెక్యూరిటీ డిపాజిట్ ప్లాన్‌నుబట్టి రూ.375–875 ఉంది. జియోఫైబర్, కార్పొరేట్ ఉద్యోగులు, జియోయేతర పోస్ట్‌పెయిడ్ యూజర్స్, క్రెడిట్ కార్డ్ కస్టమర్లు, మంచి క్రెడిట్ స్కోర్ ఉన్నవారికి ఈ సెక్యూరిటీ డిపాజిట్ లేదు.

భారీగా తగ్గిన టోకు ధరలు

- ఫిబ్రవరిలో 3.85%, రెండేళ్ల కనిష్టం
- తయారీ, ఇంధనం, విద్యుత్ రంగాల్లో తగ్గిన ధరల తీవ్రత
- ఆహార ధరలు మాత్రం భారమే

న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో 3.85 శాతంగా నమోదయ్యింది. అంటే 2022 ఫిబ్రవరితో పోల్చితే 2023 ఫిబ్రవరిలో డబ్ల్యూపీఐ ఆధారిత బాస్కెట్ మొత్తంగా ధర 3.85 శాతమే పెరిగిందన్నమాట. గడచిన రెండేళ్లలో ఇంత తక్కువ స్థాయిలో ధరల స్పీడ్ నమోదుకావడం ఇదే తొలిసారి. సూచీలో మెజారిటీ వెయిటేజ్ ఉన్న తయారీసహా, ఇంధనం, విద్యుత్ రంగాల్లో ధరల్లో తగ్గుదల దీనికి కారణం. అయితే సూచీలో భాగమైన ఫుడ్ బాస్కెట్ ద్రవ్యోల్బణం మాత్రం పెరిగింది. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ తాజా గణాంకాలను విడుదల చేసింది. కొన్ని ముఖ్యాంశాలను పరిశీలిస్తే..

- గడచిన 9 నెలలుగా టోకు ద్రవ్యోల్బణం దిగువ ముఖంగా పయనిస్తోంది. 2023 జనవరిలో టోకు



ద్రవ్యోల్బణం 4.73 శాతం ఉంటే, 2022 ఫిబ్రవరిలో 13.43 శాతంగా ఉంది.

- జనవరిలో 2.38 శాతంగా ఉన్న ఫుడ్ ఆర్టికల్స్ ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో 3.81 శాతానికి పెరిగింది. కూరగాయల ధరలు మాత్రం 21.53 శాతం తగ్గాయి. ఆయిల్ సీడ్స్ విషయంలో ధర తగ్గుదల 7.38 శాతంగా ఉంది. పప్పు ధాన్యాల ధరలు మాత్రం 2.59 శాతం పెరిగాయి.
- జనవరిలో 15.15 శాతంగా ఉన్న పవర్ బాస్కెట్ ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో 14.82%కి తగ్గింది.
- తయారీ రంగ ద్రవ్యోల్బణం జనవరిలో 2.99%. ఫిబ్రవరిలో 1.94%కి తగ్గింది.

'ఎపాక్' ఆర్థిక సంస్థలపై ప్రభావం తక్కువే

- వాటి దగ్గర పుష్కలంగా నిధులు ఉన్నాయి
- అమెరికన్ బ్యాంకుల మూసివేతపై మూడీస్ విశ్లేషణ

న్యూఢిల్లీ: ఆసియా పసిఫిక్ ప్రాంత దేశాలకు చెందిన (ఎపాక్) చాలా మటుకు ఆర్థిక సంస్థలకు మూతబడిన అమెరికన్ బ్యాంకుల్లో పెట్టుబడులు పెద్దగా లేవని మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ తెలిపింది. ఈ నేపథ్యంలో ఆయా బ్యాంకుల మూసివేత ప్రభావం వాటిపై అంతగా ఉండబోదని పేర్కొంది. డిపాజిటర్లు విత్‌డ్రాయల్స్‌కు ఎగబడటంతో అమెరికాలో రెండు రోజుల వ్యవధిలోనే సిలికాన్ వ్యాలీ బ్యాంక్ (ఎస్‌వీబీ), సిగ్నేచర్ బ్యాంకు మూతబడిన నేపథ్యంలో మూడీస్ విశ్లేషణ ప్రాధాన్యం సంతరించుకుంది. 'మూసేసిన అమెరికా బ్యాంకుల్లో చాలా మటుకు ఎపాక్ సంస్థల నిధులు ఏమీ లేవు. ఏవో అరకొర సంస్థలకు ఉన్నా అవి భారీ స్థాయిలో లేవు. మొత్తం మీద చాలా మటుకు సంస్థలకు ఎస్‌వీబీ పరంగా భారీ నష్టాలేమీ వాటిల్లే అవకాశం లేదు'



అని మూడీస్ పేర్కొంది. ఎపాక్‌లోని రేటెడ్ బ్యాంకుల ఆర్థిక పరిస్థితి పటిష్టంగానే ఉందని, వాటి దగ్గర తగినంత స్థాయిలో నగదు లభ్యత ఉందని తెలిపింది. కేవలం టెక్నాలజీ రంగానికే పరిమితం కాకుండా వాటి దగ్గర వివిధ రంగాల డిపాజిట్లు ఉన్నాయని పేర్కొంది.

ఆర్థిక శాఖ దృష్టికి స్టార్టప్‌ల కష్టాలు..

ఎస్‌వీబీ ప్రభావిత దేశీ స్టార్టప్‌ల సమస్యలను ఆర్థిక శాఖ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. సంక్షోభం నుంచి బైటపడేందుకు వాటికి కావాల్సిన సహాయం అందించాలని కోరనున్నట్లు వివరించారు. మంగళవారం అంకుర సంస్థలతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ విషయాలు చెప్పారు. డిపాజిట్లు మొత్తం తిరిగి వస్తాయంటూ స్టార్టప్‌లు, వెంచర్ క్యాపిటలిస్టులకు అమెరికా ప్రభుత్వ వర్గాలు హామీ ఇస్తున్నప్పటికీ ఇందుకోసం ఎంత సమయం పడుతుందనే అంశంపై ఇంకా స్పష్టత లేదని మంత్రి తెలిపారు.

ఎస్‌వీబీ మాతృసంస్థపై షేర్‌హోల్డర్ల దావా

మూతబడిన సిలికాన్ వ్యాలీ బ్యాంక్ (ఎస్‌వీబీ)పై షేర్‌హోల్డర్లు కోర్టును ఆశ్రయించారు. ఎస్‌వీబీ మాతృ సంస్థ ఎస్‌వీబీ ఫైనాన్షియల్ గ్రూప్, సీఈవో గ్రెగ్ బెకర్, సీఎఫ్‌వో డేనియల్ బెక్‌పై కాలిఫోర్నియాలోని న్యాయస్థానంలో క్లాస్ యాక్షన్ దావా వేశారు. వడ్డీ రేట్ల పెరుగుదల వల్ల వ్యాపారానికి పొంచి ఉన్న రిస్కులను వెల్లడించడంలో కంపెనీ విఫలమైందని పిటీషన్‌లో పేర్కొన్నారు. 2021 జూన్ 16–2023 మార్చి 10 మధ్య ఇన్వెస్ట్ చేసిన వారికి పరిహారం ఇప్పించాలని కోరారు.

జోయాలుక్కాస్ ఆభరణాల వీఏపై 50% తగ్గింపు

హైదరాబాద్: ప్రముఖ బంగారు ఆభరణాల సంస్థ జోయాలుక్కాస్ 'సంవత్సరపు సాటిలేని జ్యువెలరీ సేల్' నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆభరణాల ముజూరీ చార్జీల(వీఏ)పై 50 శాతం తగ్గింపు ఇవ్వనున్నట్లు తెలిపింది. ''ఈ మార్చి 26 వరకు అందుబాటులో ఉండే ఈ గొప్ప ఆఫర్‌తో ఇంతకు ముందు లేని విధంగా సాటిలేని జ్యువెలరీ అనుభవాన్ని ఆనందించవచ్చు'' అని జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ జాయ్ అలూక్కాస్ పేర్కొన్నారు. కొనుగోలు చేసిన అన్ని ఆభరణాలపై ఒక సంవత్సరం ఉచిత బీమా, జీవిత కాల ఉచిత నిర్వహణ, బై బ్యాక్ ఆఫర్లను పొందొచ్చని జోయాలుక్కాస్ తెలిపింది.

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	57,605	▲ 637
బంగారం (99.5 స్వచ్ఛత)	57,374	▲ 634
వెండి (కిలో)	66,176	▲ 2,510

నాలుగో రోజూ నష్టాలే

- కొనసాగిన అమెరికా బ్యాంకింగ్ సంక్షోభ ప్రభావం
- ఆటో, ఐటీ, ఫైనాన్స్ షేర్లలో అమ్మకాలు
- అయిదు నెలల కనిష్టానికి నిఫ్టీ
- 58వేల దిగువకు సెన్సెక్స్

ముంబై: అమెరికా బ్యాంకింగ్ సంక్షోభ ప్రభావం దేశీయ స్టాక్ మార్కెట్లను వెంటాడుతోంది. ప్రపంచ వ్యాప్తంగా వడ్డీ రేట్ల పెంపు అంచనాలు, కొనసాగుతున్న విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ ఇన్వెస్టర్లను మరింత కలవరపెట్టాయి. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు కొద్దిసేపటికి నష్టాల్లోకి మళ్లాయి. ప్రధానంగా బ్యాంకింగ్, ఐటీ, ఆటో, మెటల్ షేర్ల అమ్మకాలు వెల్లువెత్తాయి. ఇంట్రాడేలో 571 పాయింట్లు క్షీణించిన సెన్సెక్స్ చివరికి 338 పాయింట్ల పతనంతో 57,900 వద్ద స్థిరపడింది. ఒక దశలో నిఫ్టీ 17వేల స్థాయిని కోల్పోయింది. ఆఖరికి 111 పాయింట్లు నష్టపోయి 17,043 వద్ద నిలిచింది. ఈ ముగింపు స్థాయిలు అయిదు నెలల కనిష్ట స్థాయి కావడం గమనార్హం. ఫార్మా, ఎఫ్ఎంసీజీ షేర్లకు మాత్రమే స్వల్పంగా కొనుగోళ్ల మద్దతు



లభించింది. బీఎస్ఈ మిడ్ క్యాప్ ఇండెక్స్ అరశాతం, స్మాల్ క్యాప్ సూచీ ఒకశాతం చొప్పున నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.3087 కోట్ల షేర్లను అమ్మేయగా.., సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2122 కోట్ల షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ 14 పైసలు క్షీణించి రూ.82.37 వద్ద స్థిరపడింది. యూఎస్ సూచీల భారీ పతనం నేపథ్యంలో ఆసియా–పసిఫిక్ మార్కెట్లు నష్టాల్లో, యూరప్ మార్కెట్లు మిశ్రమంగా ముగిశాయి. ''బేర్స్ ఆధిపత్యం నాలుగోరోజూ కొనసాగింది. కేంద్ర బ్యాంకుల కఠిన ద్రవ్య విధాన వైఖరి, ద్రవ్యోల్బణం కారణంగా బాండ్లపై దిగుమతులు తగ్గేందుకు మరింత సమయం పడుతుంది. ఒక దశలో నిఫ్టీ ఆరంభ నష్టాలను భర్తీ చేసుకునేందుకు యత్నించింది. అయితే ఐటీ, బ్యాంకింగ్, ఇంధన షేర్లలో తలెత్తిన అమ్మకాలతో తేరుకోలేకపోయింది. యూఎస్ ద్రవ్యోల్బణ డేటా (మంగళవారం వెల్లడి) నేటి ట్రేడింగ్‌పై ప్రభావాన్ని చూపనుంది. ట్రేడర్లు రిస్క్ మేనేజ్‌మెంట్‌పై మరింత దృష్టి సారించాలి'' జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు...

- ఆటో ఉపకరణాల తయారీ సంస్థ దివ్‌గీ టార్క్ ట్రాన్స్‌ఫర్ సిస్టమ్స్ లిస్టింగ్ మెప్పించింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.590)తో పోలిస్తే ఐదుశాతం ప్రీమియంతో రూ.620 వద్ద లిస్టయ్యింది. లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో చివరికి రెండున్నరశాతం లాభంతో రూ.605 వద్ద స్థిరపడింది. ఎక్స్చేంజీలో మొత్తం 34.14 లక్షల ఈక్విటీ షేర్లు చేతులు మారాయి. మార్కెట్ ముగిసే సరికి కంపెనీ మార్కెట్ విలువ రూ.1,851 కోట్లుగా నమోదైంది.
- హిందుస్థాన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ(హెచ్‌సీసీ) షేరు 4% లాభపడి రూ.15 వద్ద స్థిరపడింది. మేఘా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో ఏర్పాటు చేసిన జాయింట్ వెంచర్.. నేషనల్ హై–స్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ నుండి భారీ ఆర్డర్ దక్కించుకుంది.

మరో 10,000 మందికి మెటా ఉద్వాసన



న్యూయార్క్: ఫేస్‌బుక్ పేరెంట్ కంపెనీ మెటా మరో 10,000 మందికి ఉద్వాసన పలకనున్నట్టు మంగళవారం ప్రకటించింది. అలాగే కొత్తగా 5,000 మందిని విధుల్లోకి తీసుకోవాలనుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్టు స్పష్టం చేసింది. నాలుగు నెలల్లోనే రెండవ పర్యాయం ఉద్యోగుల కోతకు నిర్ణయం తీసుకోవడం గమనార్హం. సంస్థ చరిత్రలో అత్యధికంగా 2022 నవంబర్‌లో 13 శాతం (11,000) మంది ఉద్యోగులను మెటా తొలగించిన సంగతి తెలిసిందే. ఉద్యోగాల కోత రాబోయే రెండు నెలల్లో జరుగుతుందని సంస్థ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ ఫేస్‌బుక్ వేదికగా వెల్లడించారు. 'పునర్నిర్మాణాలు, తొలగింపులను మా సాంకేతిక సమూహాలలో ఏప్రిల్ చివరలో, వ్యాపార సమూహాలలో మే నెలాఖరులో ప్రకటించాలని భావిస్తున్నాము' అని తెలిపారు. ఉద్యోగుల కోత పూర్తి అయితే మొత్తం సిబ్బంది సంఖ్య సుమారు 66,000లకు వచ్చి చేరనుంది. 2022 సెప్టెంబర్ చివరినాటికి 87,314 మంది సంస్థలో పనిచేస్తున్నారు.

హెచ్‌సీసీ, మేఘా బుల్లెట్ ట్రెయిన్ స్టేషన్ ప్రాజెక్ట్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హిందుస్తాన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ (హెచ్‌సీసీ), మేఘా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (ఎంఈఐఎల్) సంయుక్తంగా బుల్లెట్ ట్రెయిన్ స్టేషన్ ప్రాజెక్టును చేజిక్కించుకున్నాయి. ప్రాజెక్ట్ విలువ రూ.3,681 కోట్లు. నేషనల్ హై–స్పీడ్ రైల్ కార్పొరేషన్ నుంచి ఈ కాంట్రాక్టును దక్కించుకున్నాయి. 508.17 కిలోమీటర్ల ముంబై–అహ్మదాబాద్ హై–స్పీడ్ రైల్‌లో భాగంగా బాంద్రా కుర్లా కాంప్లెక్స్ స్టేషన్‌ను హెచ్‌సీసీ, ఎంఈఐఎల్ నిర్మిస్తాయి. ఆరు ప్లాట్‌ఫామ్స్‌ను ఏర్పాటు చేస్తారు.



16 కోచ్‌లు ఉన్న బుల్లెట్ ట్రెయిన్ నడవడానికి వీలుగా ఒక్కొక్కటి 414 మీటర్ల పొడవులో ప్లాట్‌ఫామ్‌ను నిర్మిస్తారు. మెట్రో, రోడ్డు మార్గాలకు అనుసంధానంగా బాంద్రా కుర్లా కాంప్లెక్స్ స్టేషన్ ఉంటుందని హెచ్‌సీసీ తెలిపింది. ముంబై–అహ్మదాబాద్ హై–స్పీడ్ రైల్ మార్గంలో భూగర్భంలో ఉండే ఏకైక స్టేషన్ ఇదే. నేల నుంచి 24 మీటర్ల లోపల ఏర్పాటు చేస్తారు. మూడు అంతస్తుల్లో స్టేషన్ ఉంటుంది.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఎస్పీడీసీఎల్‌లో 1553 జేఎల్ఎం కొలువులు

ఎలక్ట్రికల్ ట్రేడ్‌లో ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థుల కోసం తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థ నుంచి ఉద్యోగ ప్రకటన వచ్చింది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ (ఎస్పీడీసీఎల్) 1553 జూనియర్ లైన్‌మెన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాత పరీక్ష, పోల్ క్లైంబింగ్ టెస్ట్‌ల ద్వారా ఎంపిక చేస్తారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

» మొత్తం జేఎల్ఎం పోస్టుల సంఖ్య: 1553
» మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూలు, జోగులాంబ గద్వాల, నారాయణపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ – మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాల్లో ఈ పోస్టులను భర్తీ చేస్తారు.

అర్హతలు

» పదో తరగతితోపాటు ఐటీఐ(ఎలక్ట్రికల్ ట్రేడ్/వైర్‌మ్యాన్) లేదా ఇంటర్మీడియట్ వొకేషనల్ కోర్సు(ఎలక్ట్రికల్ ట్రేడ్) ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 01.01.2023 నాటికి 18–35 ఏళ్ల మధ్య వయసు వారై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితిలో ఐదేళ్ల సడలింపు లభిస్తుంది.
» వేతనాలు: ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారికి ప్రతి నెల రూ.24,340 –రూ.39,405 వరకు మూలవేతనంగా లభిస్తుంది.

ఎంపిక ఇలా

దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రాత పరీక్ష, పోల్ క్లైంబింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ రెండు పరీక్షల్లో అర్హత సాధించిన వారిని రూల్ ఆఫ్ రిజర్వేషన్లకు అనుగుణంగా తుది ఎంపిక చేసి ఉద్యోగాల్లోకి తీసుకుంటారు.

రాత పరీక్ష

ఈ పరీక్ష మొత్తం 80 ప్రశ్నలకు ఉంటుంది. ఇందులో 65 ప్రశ్నలు సంబంధిత ఐటీఐ విభాగం నుంచి అడుగుతారు. మిగతా 15 ప్రశ్నలు జనరల్ నాలెడ్జ్ విభాగానికి సంబంధించి ఇస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. పరీక్ష సమయం 2 గంటలు. పరీక్ష తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో ఉంటుంది.

సిలబస్ అంశాలు

» ఐటీఐ(ఎలక్ట్రికల్ ట్రేడ్): ఈ విభాగానికి సంబంధించి 65 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో ఫండమెంటల్స్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ, బ్యాటరీస్, మ్యాగ్నటిజం, ఫండమెంటల్స్ ఆఫ్ ఏసీ, బేసిక్ ఎలక్ట్రానిక్స్, డీసీ మెషిన్స్, ట్రాన్స్‌ఫార్మర్లు, ఏసీ మెషిన్స్, ఎలక్ట్రికల్ మెజర్‌మెంట్స్, ఎలక్ట్రికల్ పవర్ జనరేషన్ అంశాలు ఉంటాయి.
» జనరల్ నాలెడ్జ్: అనలిటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, కరెంట్ అఫైర్స్, కన్జ్యూమర్ రిలేషన్స్, దైనందిన జీవితంలో జనరల్ సైన్స్, హిస్టరీ, జాగ్రఫీ, ఎకానమీ ఆఫ్ ఇండియా అండ్ తెలంగాణ, హిస్టరీ ఆఫ్ తెలంగాణ, తెలంగాణ మూవ్‌మెంట్, సొసైటీ, కల్చర్, హెరిటేజ్, ఆర్ట్స్ అండ్ లిటరేచర్ ఆఫ్ తెలంగాణ.
» పోల్ క్లైంబింగ్: రాత పరీక్షలో అర్హత సాధించిన వారికి మాత్రమే రిజర్వేషన్‌ను అనుసరించి 1:2 నిష్పత్తిలో పోల్ క్లైంబింగ్ టెస్ట్‌కు షార్ట్‌లిస్ట్ చేస్తారు. పోల్ క్లైంబింగ్‌లో అర్హత సాధించిన వారిని తుదిగా ఎంపికచేసి ఉద్యోగాల్లోకి తీసుకుంటారు.
» కళాకారులకు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి 20 మార్కుల వరకు వెయిటేజీ లభిస్తుంది.
» క్వాలిఫయింగ్ మార్కులు: ఓసీ/ఈడబ్ల్యూఎస్–40%, బీసీ–35%, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులు 30% క్వాలిఫయింగ్ మార్కులు సాధించాలి.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 28,2023
» హాల్‌టికెట్స్: ఏప్రిల్ 24, 2023 నుంచి
» పరీక్ష తేదీ: ఏప్రిల్ 30, 2023
» వెబ్‌సైట్: https://tssouthernpower.cgg.gov.in

ఎన్ఐసీ, న్యూఢిల్లీలో 598 సైంటిఫిక్, టెక్నికల్ పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐసీ) నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్.. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన సైంటిఫిక్, టెక్నికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 598
» పోస్టుల వివరాలు: సైంటిస్ట్ బి–71, సైంటిఫిక్ ఆఫీసర్/ఇంజనీర్–196, సైంటిఫిక్ టెక్నికల్ అసిస్టెంట్–331.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్, ఎంఎస్సీ, ఎంసీఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. » వయసు: 30 ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 04.04.2023.
» వెబ్‌సైట్: www.calicut.nielit.in

ఏపీఎస్, గోల్కొండలో 12 ఉద్యోగాలు

గోల్కొండలోని ఆర్మీ పబ్లిక్ స్కూల్(ఏపీఎస్).. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 12
» పోస్టుల వివరాలు: అడ్మిన్ సూపర్‌వైజర్, ఎల్‌డీసీ, కంప్యూటర్ ల్యాబ్ అసిస్టెంట్, సైన్స్ ల్యాబ్ అసిస్టెంట్, డ్రైవర్, గార్డెనర్ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి మెట్రిక్యులేషన్/10+2/గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఆర్మీ పబ్లిక్ స్కూల్, గోల్కొండ, ఇబ్రహీంబాగ్ పోస్ట్ ఆఫీస్, సన్ సిటీ దగ్గర, హైదరాబాద్–500031 చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 20.03.2023.
» వెబ్‌సైట్: www.apsgolconda.edu.in

బెల్ బెంగళూరులో 12 ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్).. ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 12
» అర్హత: కనీసం 55 శాతం మార్కులతో బీఈ/బీటెక్(ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)ఉత్తీర్ణులవ్వాలి. కనీసం రెండేళ్ల పని అనుభవం ఉండాలి. వయసు: 32ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు రూ.40,000 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్(హెచ్ఆర్/మిలిటరీ కమ్యూనికేషన్స్–ఎంఆర్), భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, జలహళ్లి పోస్ట్, బెంగళూరు–560013 చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 25.03.2023.
» వెబ్‌సైట్: www.bel-india.in

బెల్ బెంగళూరులో ట్రెయినీ ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బెల్).. ట్రెయినీ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 08
» అర్హత: బీఈ/బీటెక్/బీఎస్సీ ఇంజనీరింగ్(కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 28 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు రూ.30,000 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును మేనేజర్ హెచ్ఆర్(ఎంఎస్/హెచ్ఎల్ఎస్–ఎస్‌సీబీ), భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, జలహళ్లి పోస్ట్, బెంగళూరు–560013 చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 22.03.2023.
» వెబ్‌సైట్: www.bel-india.in

మ్యాథ్స్ కోర్సుల్లో మేటి.. సీఎంఐ!

దేశంలో కొన్ని విద్యా సంస్థలు వినూత్న కోర్సులు అందిస్తుంటాయి. కొన్ని సబ్జెక్టుల కోసమే పలు ప్రత్యేక విద్యాసంస్థలు ఏర్పాటయ్యాయి. అలాంటి వాటిల్లో ఒకటి చెన్నై మ్యాథమెటికల్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఐ). ఈ సంస్థ మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్‌లో.. బీఎస్సీ, ఎమ్మెస్సీ, పీహెచ్‌డీలతోపాటు ఎమ్మెస్సీ డేటాసైన్స్ కోర్సులను కూడా అందిస్తోంది. వీటిలో ప్రవేశానికి ప్రస్తుతం ప్రకటన వెలువడింది. రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ కల్పిస్తారు. పేద విద్యార్థులు ఫీజులో మినహాయింపుతోపాటు ప్రతిభావంతులైన విద్యార్థులు స్టైపెండ్ రూపంలో ఆర్థిక ప్రయోజనం కూడా పొందవచ్చు.



» చెన్నై మ్యాథమెటికల్ ఇన్‌స్టిట్యూట్ అడ్మిషన్ నోటిఫికేషన్
» మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్‌లో బీఎస్సీ,ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ
» రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా ప్రవేశం

సీఎంఐ

మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్‌లో.. యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులను పూర్తిచేయాలి, పరిశోధనల దిశగా అడుగులు వేయాలి అని భావించే వారికి చక్కటి వేదిక.. చెన్నై మ్యాథమెటికల్ ఇన్‌స్టిట్యూట్(సీఎంఐ). కేంద్ర ప్రభుత్వానికి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీతోపాటు మరికొన్ని సంస్థలు దీనికి నిధులు అందిస్తున్నాయి. యూజీసీ 2006లో దీనికి యూనివర్సిటీ హోదాను కూడా కల్పించింది. దేశంలో ప్రసిద్ధ సంస్థలతోపాటు విదేశాల నుంచి సైతం నిపుణులు వచ్చి సీఎంఐ విద్యార్థులకు బోధిస్తారు. ఈ సంస్థలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు మెరుగైన పరిశోధన వనరులతో, ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యను అభ్యసించే అవకాశం లభిస్తుంది.

ప్రవేశాలు ఇలా

రాత పరీక్షలో చూపించిన ప్రతిభ ఆధారంగా సీఎంఐలో ప్రవేశాలు కల్పిస్తారు. నేషనల్ ఒలింపియాడ్‌ల్లో ప్రతిభ చూపినవారికి నేరుగా యూజీ కోర్సుల్లో అడ్మిషన్ లభిస్తుంది. పీజీ, పీహెచ్‌డీలకు ప్రవేశ పరీక్షలతోపాటు ఇంటర్వ్యూలు ఉంటాయి. ఫిజిక్స్‌లో పీహెచ్‌డీకి ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించరు. జాయింట్ ఎంట్రన్స్ స్క్రీనింగ్ టెస్ట్(జెస్ట్) స్కోరుతో నేరుగా ఇంటర్వ్యూకి అవకాశం కల్పిస్తారు. అలాగే మ్యాథ్స్‌లో పీహెచ్‌డీ చేయాలనుకున్నవారు నేషనల్ బోర్డు ఫర్ హయ్యర్ మ్యాథమెటిక్స్ (ఎన్‌బీహెచ్ఎం) ఫెలోషిప్పునకు ఎంపికైతే.. పరీక్ష రాయకుండానే నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావచ్చు. ఇదే మాదిరిగా జస్ట్‌తో కంప్యూటర్ సైన్స్‌లో రీసెర్చ్ అర్హత పొందినవారు సైతం నేరుగా ఇంటర్వ్యూతో ప్రవేశం పొందవచ్చు.

కోర్సులు-అర్హతలు

- కోర్సు–బీఎస్సీ ఆనర్స్: మ్యాథ్స్ అండ్ కంప్యూటర్ సైన్స్; మ్యాథ్స్ అండ్ ఫిజిక్స్.
- అర్హత: ఇంటర్ ఉత్తీర్ణులు, సెకండ్ ఇయర్ చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- కోర్సు: ఎమ్మెస్సీ: మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్.
- అర్హత: డిగ్రీలో మ్యాథ్స్ లేదా బీస్టాట్ లేదా బీటెక్ చదువుకున్నవారు ఎమ్మెస్సీ మ్యాథ్స్‌కు అర్హులు. కంప్యూటర్ సైన్స్ బ్యాక్‌గ్రౌండ్‌తో బీఎస్సీ, బీటెక్ కోర్సులు ఉత్తీర్ణులైన వారు ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. మ్యాథ్స్, స్టాటిస్టిక్స్ లేదా కంప్యూటర్ సైన్స్ నేపథ్యంతో అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులు చదివిన వారు ఎమ్మెస్సీ డేటాసైన్స్‌కు అర్హులు. సంబంధిత సబ్జెక్టుల్లో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు కూడా అర్హులే.
- కోర్సు– పీహెచ్‌డీ: మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్.
- అర్హత: సంబంధిత విభాగాల్లో పీజీ/ బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. ఫైనల్ ఇయర్ వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రవేశ పరీక్ష విధానం

- రెండు బీఎస్సీ కోర్సులకు కలిపి ఉమ్మడి పరీక్ష 100 పాయింట్లకు నిర్వహిస్తారు. పార్ట్ ఏ–40 పాయింట్లు, పార్ట్ బీ–60 పాయింట్లు. పరీక్ష వ్యవధి 3 గంటలు. పార్ట్ ఏ స్క్రీనింగ్ పరీక్ష. ఇందులో కనీస పాయింట్లు సాధిస్తే పార్ట్ బీ మూల్యాంకనం చేస్తారు. రెండు విభాగాల్లో సాధించిన పాయింట్లతో తుది ఎంపిక చేస్తారు. పార్ట్ ఏలో 10ప్రశ్నలు వస్తాయి. ఒక్కో దానికి 4పాయింట్లు. పార్ట్ బీలో 6ప్రశ్నలుంటాయి. వీటికి 60 పాయింట్లు కేటాయిస్తారు. ప్రశ్నలన్నీ ఇంటర్ స్థాయిలోని మ్యాథ్స్‌లో ఆల్జీబ్రా, జామెట్రీ, ట్రిగనోమెట్రీ, కాలిక్యులస్ విభాగాల నుంచి అడుగుతారు.
- ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ పరీక్షల్లోనూ రెండు పార్టులుంటాయి. పార్ట్ ఏలో కనీస మార్కులు సాధిస్తే, పార్ట్ బీ మూల్యాంకనం చేస్తారు. రెండు విభాగాల్లో సాధించిన మార్కులతో ప్రవేశం కల్పిస్తారు. ప్రశ్నలన్నీ సంబంధిత సబ్జెక్టుల్లో అండర్ గ్రాడ్యుయేషన్ పాఠ్యాంశాల నుంచి వస్తాయి. ఎమ్మెస్సీ డేటాసైన్స్ ప్రశ్నలు మ్యాథ్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్ నుంచి అడుగుతారు. పాత ప్రశ్నపత్రాలు, సొల్యూషన్లు సీఎంఐ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. వాటిని పరిశీలిస్తే ప్రశ్నల స్థాయి, చదవాల్సిన అంశాలపై అవగాహన పొందవచ్చు.

ఫీజులు-ఫెలోషిప్

సీఎంఐ అందించే అన్ని కోర్సులు రెసిడెన్షియల్ విధానంలో ఉంటాయి. ఇక్కడ అందించే కోర్సులకు ప్రతి సెమిస్టర్‌కు ట్యూషన్ ఫీజు చెల్లించాలి. విద్యార్థులు ఎంపిక చేసుకునే కోర్సును బట్టి అన్ని కోర్సుల్లోనూ పూర్తిగా లేదా పాక్షికంగా ఫీజు మినహాయింపు లభిస్తుంది. అలాగే ప్రతిభావంతులకు యూజీ కోర్సులైతే ప్రతి నెల రూ.5000 ఫెలోషిప్ కింద చెల్లిస్తారు. ఎమ్మెస్సీ కోర్సులో చేరినవారికి నెలకు రూ.6000 అందిస్తారు. పీహెచ్‌డీ కోర్సులకు ఎంపికైన వారికి మొదటి రెండేళ్లు నెలకు రూ.31,000, ఆ తర్వాత మూడేళ్లు నెలకు రూ.35,000 చెల్లిస్తారు. పీహెచ్‌డీలో చేరి, క్యాంపస్‌లో వసతి సౌకర్యం పొందని వారు స్టైపెండ్‌లో 24శాతం హెచ్ఆర్ఏ పొందవచ్చు. వీరికి ఏటా బుక్ గ్రాంట్ రూ.10,000 ఇస్తారు.

ముఖ్యసమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- దరఖాస్తులకు చివరి తేదీ: ఏప్రిల్ 09, 2023
- అడ్మిట్ కార్డుల అందుబాటు: ఏప్రిల్ 30, 2023 నుంచి
- పరీక్ష తేదీ: మే 07, 2023
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, విశాఖపట్నం
- వెబ్‌సైట్: www.cmi.ac.in/admissions

క్లుప్తంగా...

కారల్‌మార్క్స్ రచనలు అధ్యయనం చేయాలి

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు



సాక్షి, హైదరాబాద్: ప్రపంచ వ్యాప్తంగా సంక్షోభాలు, వర్గ సంఘర్షణలు తీవ్రతరం అయ్యాయని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. మంగళవారం సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జ్యోతి అధ్యక్షతన కారల్‌మార్క్స్ 140వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మార్క్స్ రచనలు మరింత అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఊహాజనిత వ్యాపారం నీటిబుడగ లాంటిదని, అది ఎప్పుడైనా పగిలిపోవచ్చుననేదానికి అదానీ, యూఎస్‌లో రెండు బ్యాంకులు దివాలా తీసిన తీరేనని చెప్పారు.

'పాదయాత్ర ఎందుకు ఆపారు?

మాణిక్‌రావు ఠాక్రేకు ఏలేటి లేఖ



నిర్మల్: 'నమ్మకమైన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా ఇంత బాధాకరమైన లేఖ రాయాల్సి వస్తుందని నేనెప్పుడూ ఊహించలేదు. రెండేళ్లుగా పార్టీ హైకమాండ్ చెప్పిన అన్ని కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసేందుకు కృషిచేస్తున్నాను. అలాంటి నేను విజయవంతంగా ప్రారంభించిన తెలంగాణ పోరుయాత్రను మీరు ఎందుకు ఆపేశారు, నన్నెందుకు అవమానపర్చారో సమాధానం చెప్పండి' అంటూ ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ రాష్ట్ర చైర్మన్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేకు లేఖ రాయడం కాంగ్రెస్‌లో మరో లొల్లికి దారితీసింది. ఈ నెల 3న పార్టీ అగ్రనేతల ఆధ్వర్యంలో భైంసా నుంచి మహేశ్వర్‌రెడ్డి తెలంగాణ పోరుయాత్ర ప్రారంభించారు. నిర్మల్, లక్ష్మణచాంద, మామడల్లో కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. నిర్మల్‌లో నిర్వహించిన భారీ సభలో మాణిక్‌ఠాక్రే కూడా పాల్గొన్నారు. ఆ తర్వాత ఏమైందో తెలియదు కానీ.. హోలీ తర్వాత పోరుయాత్ర ముందుకు సాగలేదు. దీనిపై మహేశ్వర్‌రెడ్డి ఠాక్రేకు అంతర్గతంగా రాసిన లేఖ బయటకు వచ్చింది. తాను లేఖ రాసింది వాస్తవమేనని, పార్టీలో ఉన్న అంతర్గత ప్రజా స్వామ్యం ప్రకారమే తాను లేఖ రాశానని, ఠాక్రే సమాధానమిస్తారని ఆశిస్తున్నానని ఏలేటి తెలిపారు.

ప్రగతిభవన్‌లో నీటిపారుదల శాఖ బందీ: పొంగులేటి



బోనకల్: నీటిపారుదల శాఖ ప్రగతిభవన్‌లో బందీగా మారిందని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి విమర్శించారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం ఆళ్లపాడులో బోనకల్ బ్రాంచ్ కెనాల్ (బీబీసీ) కింద సాగర్ జలాలు అందక ఎండిపోతున్న మొక్కజొన్న, మిర్చి, వరి పంటలను ఆయన మంగళవారం పరిశీలించారు. వర్షాలు పుష్కలంగా కురిసి సాగర్ నిండా నీరున్నా అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల వైఫల్యంతో రైతుల పంటలు ఎండిపోతున్నాయని పొంగులేటి అన్నారు. బోనకల్ మండలంలోనే 500 ఎకరాల మేర పంటలు ఎండిపోయాయని చెప్పారు. ఆరుతడి పంటలకు కూడా నీరు ఇవ్వలేనందుకు రాష్ట్రప్రభుత్వం సిగ్గుపడాలని దుయ్యబట్టారు. ఆళ్లపాడులో సర్పంచ్ మర్రి తిరుపతిరావు ఇరిగేషన్ కార్యాలయం ఎదుట దీక్ష చేసినా పట్టించుకోకపోవడం అధికారులు, ప్రజాప్రతినిధుల వైఫల్యానికి నిదర్శనమని పొంగులేటి విమర్శించారు. ప్రజల్లో తిరిగే వారికి ఇరిగేషన్ శాఖ మంత్రి పదవి ఇచ్చి ఉంటే రైతులు తమ గోడును చెప్పుకునేవారని అభిప్రాయపడ్డారు.


ఎమ్మెల్యే లింగయ్యపై చర్యకు వినతి

సాక్షి, హైదరాబాద్: మహిళలను కించపరిచేలా మాట్లాడిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యపై చర్య తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డికి బీజేపీ మహిళా మోర్చా విజ్ఞప్తి చేసింది. బీజేపీ నాయకుల భార్యలను బీఆర్‌ఎస్ నేతలు ముద్దు పెట్టుకుంటారని వ్యాఖ్యానించిన ఎమ్మెల్యే లింగయ్యపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం కమిషన్ చైర్‌పర్సన్‌కు మహిళా మోర్చా అధ్యక్షురాలు గీతా మూర్తి ఆధ్వర్యంలో కల్యాణం గీతారాణి, శ్యామల, డాక్టర్ మాలతీలత ఫిర్యాదు చేశారు.

ఎమ్మెల్యేకు బెదిరింపు కాల్స్



రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌కు వెంటనే క్షమాపణ చెప్పకపోతే అంతు చూస్తామని 3 రోజులుగా ఫోన్‌లో వరస బెదిరింపులు వస్తున్నాయని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తెలిపారు. 11న నకిరేకల్ ధర్నాలో లింగయ్య సంజయ్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఇదే విషయమై 'సంజయ్‌కు క్షమాపణ చెప్పు.. లేదంటే.. నీ అంతు చూస్తాం'.. అంటూ భారీగా కాల్స్ వస్తున్నాయి. ఇప్పటికే ఈ ఫోన్ నంబర్ల వివరాలను సిద్ధం చేసిన ఎమ్మెల్యే పోలీసులకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. మరోవైపు.. మంగళవారం మహిళా కమిషన్ అధికారులు లింగయ్యకు ఫోన్ చేసి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఆ వ్యాఖ్యలపై వివరణ కోరారు.





సంప్రదాయం నుంచి.. స్వచ్ఛత వైపు

దేశంలో వేగంగా మారుతున్న విద్యుత్ రంగ ముఖచిత్రం

సాక్షి ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్

రాష్ట్ర, దేశ ప్రగతికి కీలకమైనది విద్యుత్ రంగం. కాగా ఒకప్పుడు బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పాదనకే ప్రాధాన్యత ఎక్కువగా ఉండేది. దశాబ్దన్నర కిందటి వరకు విద్యుత్ ఉత్పత్తి ప్రధానంగా బొగ్గుపైనే ఆధారపడి ఉండేది. కానీ ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తి ప్రాధాన్యతలు మారుతున్నాయి. కర్బన ఉద్గారాలు, వాతావరణంలో మార్పులు నేపథ్యంలో విద్యుదుత్పాదన సంప్రదాయ విధానం నుంచి సంప్రదాయేతర విధానం వైపు మారుతోంది. బొగ్గుతో పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం, కర్బన ఉద్గారాల విడుదల విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రభుత్వాలు సంప్రదాయేతర ఇంధన ఉత్పత్తిపై ఎక్కువగా దృష్టి పెడుతున్నాయి. కర్బన ఉద్గారాల తగ్గింపునకు కట్టుబడి ఉన్నామని చెబుతున్న భారత్ పుష్కరకాలంగా సంప్రదాయేతర విద్యుత్ ఉత్పాదనకే మొగ్గు చూపుతోంది.

- సంప్రదాయేతర విద్యుత్ ఉత్పాదన వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మొగ్గు
- కర్బన ఉద్గారాల విడుదల, వాతావరణంలో మార్పులే కారణం
- బొగ్గు కొరత కూడా సమస్యే
- మొత్తం స్థాపిత విద్యుత్ సామర్థ్యంలో 29.5 శాతానికి చేరిన సౌర, పవన విద్యుత్ వాటా
- మొత్తం సంప్రదాయేతర సామర్థ్యం 42 శాతానికి పైనే..

2029-30 నాటికి లక్ష్యం 64%

విద్యుత్ ఉత్పత్తిని ప్రధానంగా రెండు రకాలుగా విభజించవచ్చు. ఒకటి సంప్రదాయ (బొగ్గు, లిగ్నైట్, గ్యాస్, డీజిల్ ఆధారిత) అయితే, మరొకటి సంప్రదాయేతర (జల, పవన, సౌర, బయోమాస్, అణు) విద్యుత్. సంప్రదాయ విద్యుత్‌లో కూడా..దేశంలో బొగ్గు నిల్వలు విస్తారంగా ఉన్న నేపథ్యంలో అత్యధికంగా బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలే ఉండేవి. గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు అయినా.. వాటికి సరిపడా గ్యాస్ లభ్యత లేని కారణంగా నామమాత్రంగా తయారయ్యాయి.

థర్మల్ విద్యుత్ కేంద్రాలే ఎక్కువ

ఇక సంప్రదాయేతర ఇంధనంలో ఒకప్పుడు ప్రధానంగా జల ఆధారిత, స్వల్పంగా బయోమాస్‌తో విద్యుదుత్పాదన జరిగేది. డ్యామ్‌లు, రిజర్వాయర్లు ఉన్నచోట మాత్రమే జల విద్యుత్ ఉత్పత్తి జరిగేది. ఇది కూడా వర్షాలపై ఆధార పడి ఉండడంతో.. రిజర్వాయర్లలో నీటి లభ్యత తక్కువైన సమయంలో విద్యుత్ ఉత్పాదన సాధ్యం కాదు. ఈ నేపథ్యంలోనే పవన, సౌర విద్యుత్ తెరపైకి వచ్చాయి. కాగా ప్రస్తుత పరిస్థితుల్లో సంప్రదాయేతర విద్యుత్ ఉత్పాదన స్థాపిత సామర్థ్యం గణనీయంగా పెరుగుతోంది. సంప్రదాయ ఇంధనాల కంటే సుస్థిర, పర్యావరణ హితమైన సంప్రదాయేతర ఇంధనాలతో విద్యుత్ ఉత్పత్తి చేయడమే సరైనదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయి ఆ దిశగా ముందుకెళ్తున్నాయి.

దేశంలో ప్రస్తుతం ఉన్న ప్లాంట్లకు మొత్తం 3,79,515 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం ఉంది. వీటిలో బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాల సామర్థ్యం 2,04,435 మెగావాట్లు (49.7%) కాగా, పవన, సౌర విద్యుత్ కేంద్రాల సామర్థ్యం 1,21,550 మెగావాట్లు (29.5%). అయితే ఈ సౌర, పవన విద్యుత్ కేంద్రాలు గత దశాబ్దన్నర

సంప్రదాయేతర విద్యుత్‌కే మొగ్గు

కాలంగా వచ్చినవే కావడం గమనార్హం కాగా.. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ) కూడా తన ప్రధాన ఉత్పాదన అయిన థర్మల్ నుంచి సోలార్ వైపు అడుగులేస్తుండటం కీలక పరిణామం. ప్రస్తుతం సంప్రదాయేతర విద్యుదుత్పాదన మొత్తం 42.5 శాతం కాగా, దీనిని 2029–30 నాటికి ఏకంగా 64 శాతానికి తీసుకెళ్లడానికి కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది.

పడిపోతున్న థర్మల్ ఉత్పాదన సామర్థ్యం..

థర్మల్ విద్యుత్ కేంద్రాల విద్యుదుత్పాదన సామర్థ్యంలో తగ్గుదల నమోదు అవుతోంది, ఇందుకు ప్రధాన కారణాల్లో బొగ్గు కొరత ఒకటైతే, స్టేషన్ల బ్యాక్‌డౌన్ (వినియోగం తక్కువగా ఉన్న ప్పుడు లేదా సంప్రదాయేతర ఇంధన విద్యుదుత్పాదన అధికంగా ఉన్నప్పుడు, థర్మల్ కేంద్రాల ఉత్పత్తి నిలిపివేయడం/ తగ్గించడం) మరొకటి. యంత్రాల కాలపరిమితి ముగిసినా అలాగే ఉత్పత్తి చేయడం, బొగ్గులో నాణ్యత లోపించడం వంటి అంశాలతో ఉత్పాదన ఈ సామర్థ్యం తగ్గుతోంది. తాజాగా కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ ప్రకటించిన లెక్కల ప్రకారం 57.69 శాతం విద్యుత్ ప్లాంట్లు మాత్రమే తమ స్థాపిత సామర్థ్యంలో 35 శాతం కంటే ఎక్కువ ఉత్పత్తి చేస్తున్నాయని, మిగిలిన 42.31 శాతం విద్యుత్ ప్లాంట్లు 35 శాతం కంటే తక్కువ పీఎల్‌ఎఫ్ (ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్)తో నడుస్తున్నాయి. అయితే కొన్ని రాష్ట్రాల, ప్రభుత్వ రంగ సంస్థల్లోని థర్మల్ కేంద్రాలు మాత్రం ఏకంగా 90% పీఎల్‌ఎఫ్‌తో పనిచేస్తున్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో వేగంగా..

సంప్రదాయేతర విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటులో తెలంగాణ, ఏపీ వేగంగా పురోగతి సాధిస్తున్నాయి. కేంద్ర గణాంకాల ప్రకారం ఏపీలో పవన విద్యుత్ 4,096.95 మెగావాట్లు, సౌర విద్యుత్ 4,390.48 మెగావాట్లు, భారీ జల విద్యుత్ ప్రాజెక్టులు1,610 మెగావాట్లు, బయోమాస్ 566 మెగావాట్లు, స్మాల్‌హైడ్రో 162 మెగావాట్లుగా ఉంది. కాగా తెలంగాణలో 5748 మెగావాట్ల సౌర విద్యుత్, 128 మెగవాట్ల పవన విద్యుత్ , 287 మెగావాట్ల రూఫ్‌టాప్, 2381.76 మెగావాట్ల జల విద్యుత్ ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

పారిశ్రామిక రంగ అభివృద్ధి ముఖ్యంగా విద్యుత్ రంగంపైనే ఆధార పడి ఉంది. దేశంలో విద్యుత్ వినియోగంలో సింహభాగం పరిశ్రమల రంగానిదే. అయితే ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే మన దేశంలో పారిశ్రామిక విద్యుత్ వినియోగం తక్కువే. అధికార

పరిశ్రమలదే సింహభాగం..

గణాంకాల ప్రకారం ఉత్పత్తి అయ్యే విద్యుత్‌లో పరిశ్రమల రంగానికి 41.36%, గృహావసరాలకు 26.89% , వ్యవసాయానికి 17.99 శాతం, వాణిజ్య అవసరాలకు 7.07% వినియోగిస్తున్నట్లు కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. తలసరి విద్యుత్ వినియోగం దాదాపు 1,255 యూనిట్లుగా ఉంది.


కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ గణాంకాల ఆధారంగా.. దేశంలో గడిచిన 5 సంవత్సరాల్లో పెరిగిన సంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం వివరాలు.. (మెగావాట్లలో)

	2017-18	2018-19	2019-20	2020-21	2021-22
స్మాల్ హైడ్రో	4485.81	4593.15	4683.16	4786.81	4848.90
పవన	34046.0	35626	37693.7	39247.1	40357.6
బయోమాస్	8700.8	9103.5	9875.3	10145.9	10205.6
వ్యర్థాల నుంచి..	138.30	138.30	147.64	168.64	476.75
సౌర	21651.4	28180.7	34627.8	40085.4	53996.5

నోట్ల రద్దు అట్టర్ ఫ్లాప్

దేశానికి రూ. 5 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది

- ఆ నిర్ణయంపై మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- నోట్ల రద్దు తరువాత నకిలీ కరెన్సీ, నల్లధనం పెరిగాయి
- ప్రధానిపై నమ్మకంతోనే గతంలో నోట్ల రద్దును సమర్థించాం
- కానీ చెప్పిన లక్ష్యాలలో ఏ ఒక్కటీ నెరవేరలేదు
- ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ధ్వజం



సాక్షి, హైదరాబాద్: పెద్ద నోట్ల రద్దు అట్టర్ ఫ్లాప్ అయిందని... ఈ నిర్ణయం వల్ల దేశానికి రూ. 5 లక్షల కోట్ల నష్టం వాటిల్లిందని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. నోట్ల రద్దుతో నకిలీ కరెన్సీ తగ్గకపోగా 54 శాతం పెరిగినట్లు ఆర్‌బీఐ గణాంకాలు చెబుతున్నాయన్నారు.

పెద్ద నోట్ల రద్దు, దాని పర్యవసానాలపై ప్రధాని మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా శ్వేతపత్రం విడుదల చేయాలని చెప్పారు. బీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో మంగళవారం ఆయన ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, కృష్ణమోహన్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, ఎమ్మెల్సీలు దండే విఠల్, దేశపతి శ్రీనివాస్‌లతో కలసి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. పెద్ద నోట్ల రద్దు విఫలమని కేంద్రమే అంగీకరించిందన్నారు. బీజేపీ చెప్పేదొకటి.. చేసేదొకటి అనేందుకు పెద్దనోట్ల రద్దు నిర్ణయమే ఉదాహరణని ఎద్దేవా చేశారు. ప్రధానిపై నమ్మకంతో అప్పట్లో నోట్ల రద్దు నిర్ణయాన్ని తాము సమర్థించామని, అయితే చెప్పిన లక్ష్యం ఒక్కటి కూడా నెరవేరలేదన్నారు. ఏ ప్రణాళిక, ఆలోచన లేకుండా ప్రధాని పెద్ద నోట్లను రద్దు చేశారని... ఈ నిర్ణయం దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపిందని హరీశ్‌రావు పేర్కొన్నారు.

నగదు చెలామణి పెరిగింది..

పెద్ద నోట్ల రద్దు అట్టర్ ఫ్లాప్ కాబట్టే దీనిపై బీజేపీ నేతలు మాట్లాడటం లేదని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. చెలామణిలో ఉన్న నగదుపై కేంద్రం చెప్పేవన్నీ అబద్ధాలేనని ఆయన విమర్శించారు. 2014కు ముందు దేశ జీడీపీలో 11 శాతం నగదు ఉండేదని, అదిప్పుడు 13 శాతానికి పెరిగిందన్నారు. అలాగే గతంతో పోలిస్తే పెద్ద నోట్ల వాడకం రెట్టింపయ్యిందని చెప్పారు. రూ. 500, రూ. 1000 నోట్లను రద్దు చేసి తెచ్చిన రూ. 2 వేల నోటు వల్ల పెద్ద నోట్ల వాడకం విపరీతంగా పెరిగిందన్నారు. కొత్త నోట్ల ముద్రణకు మోదీ ప్రభుత్వం రూ. 21 వేల కోట్లు ఖర్చు పెట్టిందని... ఈ మొత్తంతో ఒక ప్రాజెక్టు పూర్తయి ఉండేదని హరీశ్‌రావు పేర్కొన్నారు.

పట్టుకున్న నల్లధనమే రూ. 40 వేల కోట్లు..

పెద్ద నోట్ల రద్దుతో నల్లధనం ఉండదని చెప్పిన ప్రధాని మాటలు అపహాస్యమయ్యాయని హరీశ్‌రావు విమర్శించారు. 592 కేసుల్లో రూ. 40 వేల కోట్ల నల్లధనం పట్టుకున్నారని చెప్పారు. బీజేపీ వేసే ప్రతి అడుగు పేదలపై పిడుగులా మారిందని, నీతి ఆయోగ్ నేతి బీరకాయలో నెయ్యి చందంగా మారిందని ఎద్దేవా చేశారు. అప్పులు చేయడం.. తప్పులు చేయడం బీజేపీ విధానంగా మారిందని, కేంద్రం ప్రతిరోజూ చేస్తున్న అప్పు రూ. 4,618 కోట్లని ఆయన పేర్కొన్నారు. మోదీ హయాంలో రూ. కోటీ ఏడు లక్షల కోట్ల అప్పు తెచ్చారని వివరించారు. పెద్ద నోట్ల మార్పు కోసం క్యూలలో నిలబడి 108 మంది మరణించారని, నోట్ల రద్దు కారణంగా 62 లక్షల మంది ఉపాధి కోల్పోయారన్నారు. బీజేపీ తొమ్మిదేళ్ల పాలనలో రూ. 100 లక్షల కోట్లు అప్పు చేసిందని, దేశంలో అవినీతి, ఆకలి పెరిగిపోతోందని పేర్కొన్నారు. నోట్ల రద్దుతో 50 రోజుల్లో అంతా బాగుంటుందని భరోసా ఇచ్చిన పెద్దలు... ఇప్పుడు 2 వేల రోజులైనా ఏం మార్పు తెచ్చారని హరీశ్ ప్రశ్నించారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ధరలు మూడింతలు పెరిగాయని ధ్వజమెత్తారు. బీజేపీ పాలనలో మాదకద్రవ్యాల రవాణా, ఉగ్రవాదం పెరిగాయని ఆరోపించారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

- కమిషన్ చైర్మన్, సభ్యులను తొలగించాలని డిమాండ్
- దీనిపై గవర్నర్ జోక్యం చేసుకొని నిరుద్యోగులకు న్యాయం చేయాలని వినతి



సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ ఉదంతంపై వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ డిమాండ్ చేశారు. కమిషన్ నియామకాల్లోనూ చైర్మన్, కార్యదర్శులతోపాటు సీఎం కేసీఆర్ కుటుంబం పాత్ర ఉందని ఆయన ఆరోపించారు. లీకేజీపై విచారణతోపాటు చైర్మన్, సభ్యులను వెంటనే తొలగించాలని ఒక ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై గవర్నర్ తమిళిసై జోక్యం చేసుకొని నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.

కేసీఆర్ టీమ్‌కు ప్రశ్నపత్రాలు లీక్...

కేసీఆర్ పాలనలో నిర్వహించిన టీఎస్‌పీఎస్సీ పరీక్షల పేపర్లన్నీ లీక్ అయ్యాయనే అనుమానం కలుగుతోందని బండి సంజయ్ ఆరోపించారు. రాబోయే రెండు నెలల్లో జరగబోయే పరీక్షల ప్రశ్నపత్రాలు కూడా కేసీఆర్ టీమ్‌కు లీకయ్యాయని... దీనికి సంబంధించిన సమాచారం తమ వద్ద ఉందన్నారు. గతేడాది నిర్వహించిన గ్రూప్–1 పరీక్ష ప్రశ్నపత్రం సైతం లీక్ అయ్యిందని సంజయ్ ఆరోపించారు. అందుకే ప్రస్తుత పేపర్ లీకేజీ ప్రధాన నిందితుడు, కమిషన్ సెక్రటరీ పీఏ ప్రవీణ్‌కు గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో అత్యధికంగా 103 మార్కులు వచ్చాయంటూ అతని ఓఎంఆర్ షీట్‌ను సోషల్ మీడియాలో బండి సంజయ్ పోస్టు చేశారు. అందరికీ గ్రూప్–1 పరీక్ష ఉదయం జరిగితే ప్రవీణ్ కోసం ఆయన పరీక్ష రాసే కాలేజీలో ప్రత్యేకంగా మధ్యాహ్నం పరీక్ష నిర్వహించడం వెనక మతలబు ఏమిటని నిలదీశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌కు తెలియకుండా పేపర్ లీక్ కావడం అసాధ్యమని... దీనివెనుక పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. ఈ అంశాన్ని కేసీఆర్ ప్రభుత్వం తేలికగా కొట్టిపారేసేందుకు ప్రయత్నిస్తోందని... కింది స్థాయి ఉద్యోగులనే ఈ కుట్రకు బాధ్యులను చేసి తప్పులను కప్పిపుచ్చుకునేందుకు పెద్ద స్కెచ్ వేసినట్లు అర్థమవుతోందని వ్యాఖ్యానించారు.

కాలయాపన కోసమే...

'తెలంగాణలో ఉద్యోగాల భర్తీ సీఎంకు ఇష్టం లేదు. రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించిన కేసీఆర్... కొత్త ఉద్యోగాలను భర్తీ చేయలేని స్థితిలో ఉన్నారు. లక్ష ఉద్యోగాలను భర్తీ చేస్తామని అసెంబ్లీలో ఇచ్చిన హామీని అమలు చేయడం అసాధ్యమని తెలిసి... నోటిఫికేషన్లు, ప్రశ్నపత్రాల లీకేజీ పేరుతో కాలయాపన చేస్తూ నిరుద్యోగుల నోట్లో మట్టికొడుతున్నారు. అందులో భాగంగానే గ్రూప్–1 సహా ఇతర పరీక్షా పత్రాలన్నీ లీకేజీ చేస్తున్నట్లు అర్థమవుతోంది' అని సంజయ్ ఆరోపించారు. ఇది లీకేజీ, ప్యాకేజీ, నిరుద్యోగుల డ్యామేజీ సర్కార్ అని సంజయ్ ధ్వజమెత్తారు.

కమిషన్ ఎదుట హాజరుకాలేను

మహిళా కమిషన్‌కు సంజయ్ లేఖ

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నందున బుధవారం కమిషన్ ఎదుట హాజరుకాలేనని రాష్ట్ర మహిళా కమిషన్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తెలిపారు. తనకు సమయమిస్తే ఈనెల 18న (శనివారం) విచారణకు హాజరవుతానని కమిషన్ కార్యదర్శికి రాసిన లేఖలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు కమిషన్ ఎదుట హాజరుకావాలంటూ తనకు ఈ–మెయిల్ ద్వారా లేఖ అందిందని తెలిపారు. ఓ ఎంపీగా తాను ఢిల్లీలో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలకు హాజరు కావాల్సి ఉన్నందున బుధవారం హాజరుకాలేనని స్పష్టంచేశారు. శనివారం కమిషన్‌కు అనువైన సమ యంలో హాజరయ్యేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. తాను కమిషన్ ఎదుట ఎందుకు హాజరుకావాలని అనుకుంటున్నారో దానికి సంబంధించిన సమాచారాన్ని ముందుగా తనకు పంపించాలని సంజయ్ కోరారు. దాని ఆధారంగా తాను మరింత మెరుగైన విధంగా వివరణ ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు.

'కాళేశ్వరం' అవినీతిపై విచారణ జరపాలి

- కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన వైఎస్ షర్మిల
- పార్లమెంట్ ముట్టడికి యత్నం.. అడ్డుకున్న పోలీసులు
- పలువురి అరెస్టు.. పోలీస్ స్టేషన్‌కు తరలింపు



ఢిల్లీలో వైఎస్ షర్మిలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ తరలిస్తున్న దృశ్యం

సాక్షి, న్యూఢిల్లీ: గతంలో బయటపడ్డ 2 జీ, బొగ్గు కుంభకోణాల కంటే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో భారీగా అవినీతి జరిగిందని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. కాళేశ్వరం కోసం రూ.1.20 లక్షల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారని...అందులో వేలాది కోట్ల రూపాయలను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు దోచుకున్నారని షర్మిల మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ అవినీతిపై విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా వైఎస్సార్‌టీపీ మంగళవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో షర్మిల పాల్గొన్నారు. పార్టీ కార్యకర్తలతో కలిసి పార్లమెంట్ ముట్టడికి బయల్దేరే ప్రయత్నం చేయగా జంతర్ మంతర్ వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు షర్మిలతో పాటు పార్టీ కార్యకర్తలను అడ్డుకున్నారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. అనంతరం వైఎస్ షర్మిలతో పాటు పలువురు పార్టీ కార్యకర్తలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకుని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు తరలించి ఒక గంట తర్వాత విడుదల చేశారు.

రేవంత్‌ది కాంగ్రెస్‌కు పాడెకట్టే యాత్ర: గ్యాదరి కిశోర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేస్తున్నది కాంగ్రెస్‌కు పాడె కట్టే యాత్ర తప్ప పాదయాత్ర కాదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్ ఎద్దేవాచేశారు. చంద్రబాబు సంకలో చేరి తెలంగాణకు అన్యాయం చేయడానికి కారణమైన రేవంత్ అమరవీరుల గురించి మాట్లాడటం సిగ్గుచేటని దుయ్యబట్టారు. మంగళవారం ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, నిజామాబాద్ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌లతో కలిసి బీఆర్‌ఎస్‌ఎల్‌పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం కేసీఆర్‌పై తప్పుడు, నిరాధార ఆరోపణలు చేస్తే ప్రజలే రేవంత్‌రెడ్డిని బట్టలూడదీసి కొడతారని హెచ్చరించారు. సచివాలయం, అమరవీరుల స్మారక కేంద్రం, బీఆర్ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణంలో అవినీతి అంటూ ఆధారాలు లేకుండా మాట్లాడారని, తప్పుడు ఆరోపణలు, నిరాధార ఆరోపణలు చేస్తే తెలంగాణ సమాజం సహించదని కిశోర్ పేర్కొన్నారు.

రూ.300 కోట్ల ప్రాజెక్టుకు.. రూ.3,500 కోట్లు

- కమీషన్ల కోసమే మంచిప్ప ప్రాజెక్టుకు రీడిజైన్లు
- పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



మంచిప్ప వద్ద కాళేశ్వరం 21 ప్యాకేజీ పనులను పరిశీలిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సీతక్క, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జలయజ్ఞంలో భాగంగా నాడు చేపట్టిన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును కేవలం కమీషన్ల కోసమే కేసీఆర్ ప్రభుత్వం రీడిజైన్లు చేసిందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా 20, 21, 22 ప్యాకేజీల కింద చేపట్టిన మంచిప్ప జలాశయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో 0.84 టీఎంసీల సామర్థ్యం కలిగిన కొండెం చెరువు పనులను రూ.900 కోట్లతో 75 శాతం పూర్తి చేయడం జరిగిందన్నారు. తక్కువ ముంపుతోనే 1.84 లక్షల ఎకరాలకు సాగునీరందించేందుకు డిజైన్ చేశారని గుర్తు చేశారు. ఇంకా రూ.300 కోట్లు ఖర్చు చేస్తే జలాశయం పనులు పూర్తయి పొలాలకు నీరందుతుందని చెప్పారు. అయితే కేవలం కమీషన్లు దండుకునేందుకే సీఎం కేసీఆర్ 3.5 టీఎంసీలకు సామర్థ్యం పెంచి 10 గ్రామాలను, 10 వేల ఎకరాలను ముంచుతున్నారని నిందించారు. రూ.3,500 కోట్లు వెచ్చించి దోపిడీ చేసేందుకే డిజైన్లు మార్చారని విమర్శించారు. భూములు కోల్పోతున్న రైతులు ప్రశ్నిస్తే, 17 మందిపై హత్యాయత్నం కేసులు నమోదు చేయించారన్నారు. రైతులపై కేసులు బనాయించిన ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ గ్రామాల్లోకి రావద్దని బోర్డులు పెట్టాలని, అయినా వస్తే కళ్లల్లో కారం కొట్టి, కర్రు కాల్చి వాతలు పెట్టాలన్నారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభు త్వం రాగానే పాత డిజైన్ ప్రకారమే మంచిప్ప రిజర్వాయర్ నిర్మాణం చేస్తామన్నారు. డిచ్‌పల్లి కార్నర్ మీటింగ్‌లో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ లిక్కర్ కుంభకోణంలో ప్రధాన పాత్ర పోషించిన కవిత నిజామాబాద్ కోడలిగా ఉండి జిల్లా పరువు తీసిందని అన్నారు.

పేపర్ లీకేజీలో కేసీఆర్ ఫ్యామిలీ పాత్ర


సిట్టింగ్‌జడ్జితో విచారణ చేయించాలి: రేవంత్ రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను కేసీఆర్ ప్రభుత్వం రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చిందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విమర్శించారు. నిజామాబాద్ జిల్లా మోపాల్‌లో రేవంత్‌రెడ్డి మంగళవారం మీడియాతో మాట్లాడారు. టౌన్‌ప్లానింగ్ అధికారి పోస్టుల పరీక్ష పేపర్ల లీకేజీలో కేసీఆర్ కుటుంబ సభ్యులు, కొందరు ఎమ్మెల్యేల పాత్ర ఉందని ఆరోపించారు. పేపర్ లీక్ అని, సైట్ హ్యాక్ అయిందని, హనీట్రాప్ అని మూడు రకాలుగా చెప్పడంలో ఆంతర్యమేమిటని నిలదీశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్, కార్యదర్శికి మాత్రమే తెలియాల్సిన పాస్‌వర్డ్ ఒక అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి ఎలా తెలిసిందని ప్రశ్నించారు. ప్రశ్నపత్రం స్ట్రాంగ్ రూమ్‌లోకి చైర్మన్, కార్యదర్శికి మాత్రమే అనుమతి ఉన్నప్పటికీ ప్రవీణ్ అనే అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఎలా ప్రవేశించాడని, అతనికి పాస్‌వర్డ్ ఎలా తెలిసిందని రేవంత్ నిలదీశారు. కేసీఆర్ హయాంలో జరిగిన ప్రతి పోటీ పరీక్షపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని రేవంత్ డిమాండ్ చేశారు.

బహిరంగ సభలకు అధిష్టానం పెద్దలు హాజరయ్యేలా చూడండి

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేను కోరిన సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

- 91 రోజుల పాదయాత్రలో మూడు బహిరంగ సభలకు అధిష్టాన పెద్దలకు ఆహ్వానం
- రాష్ట్రంలోని పార్టీ వ్యవహారాలపైనా చర్చ



సాక్షి, న్యూఢిల్లీ : తెలంగాణ సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయ్యారు. మంగళవారం ఢిల్లీలో ఖర్గేను ఆయన నివాసంలో కలిసిన భట్టి, ఈ నెల 16న బోథ్ నియోజకవర్గం బజార్ హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో ప్రారంభం కానున్న 'హాథ్ సే హాథ్ జోడో' పాదయాత్రకు అధిష్టానం అనుమతి కోరారు. పాదయాత్రకు సంబంధించి ఢిల్లీ నుంచి ఒక ప్రకటన విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతోపాటు రాష్ట్రంలో పార్టీకి సంబంధించిన తాజా వ్యవహారాలను, పార్టీ సీనియర్ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్ రావు ఠాక్రేకు రాసిన ఫిర్యాదు లేఖ అంశాన్ని ఖర్గేకు వివరించారు.

16 నుంచి 1,365 కిలోమీటర్ల పాదయాత్ర

భట్టి చేపట్టనున్న పాదయాత్ర మార్చి 16వ తేదీ సాయంత్రం 4 గంటలకు ప్రారంభమై జూన్ 15 వరకు మొత్తం 91 రోజుల పాటు 39 నియోజకవర్గాల మీదుగా మొత్తం 1,365 కి.మీ. కొనసాగనుంది. పాదయాత్ర ఏప్రిల్ మొదటివారానికి మంచిర్యాలకు చేరనుండగా..అక్కడ నిర్వహించనున్న బహిరంగ సభకు కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గేతో పాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలకు చెందిన ఒక సీఎం హాజరుకావాలని అధిష్టానానికి భట్టి విజ్ఞప్తి చేశారు. శేర్ లింగంపల్లి నియోజకవర్గంలో నిర్వహించే సభకు ఏఐసీసీ ముఖ్యనేతలు, యాత్ర ముగింపు సందర్భంగా జూన్ 15న ఖమ్మంలోజరిగే బహిరంగ సభకు కాంగ్రెస్ పాలిత రాష్ట్ర సీఎంతోపాటు ప్రియాంక లేదా రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యేలా చూడాలని భట్టి కోరారు.

క్లుప్తంగా...

'జూబ్లీహిల్స్' స్థలంపై స్టేటస్ కో హైకోర్టు ఉత్తర్వులు



సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ స్థల విక్రయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన కేసులో హైకోర్టు స్టేటస్ కో ఆదేశాలిచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఏప్రిల్ 25కు వాయిదా వేసింది. జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీ పరిధిలో ఖాళీగా ఉన్న 595 గజాల స్థలాన్ని సినీ నటుడు చిరంజీవికి విక్రయించడాన్ని సవాల్ చేస్తూ జూబ్లీహిల్స్‌కు చెందిన జంపాల శ్రీకాంత్‌బాబుతో పాటు మరో ఇద్దరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాస్తవంగా ఈ భూమిని జీహెచ్ఎంసీకి కేటాయించాల్సి ఉందని.. ఆ మేరకు ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున రోహిత్ పోగుల వాదనలు వినిపించారు. జీహెచ్ఎంసీకి కేటాయించాల్సిన భూమిని మేనేజింగ్ కమిటీ ఇతరులకు విక్రయించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ఆ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా, ఇతరులకు విక్రయించకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. స్టేటస్ కో ఉత్తర్వులు ఇస్తూ, విచారణను వాయిదా వేశారు.

బీజేపీ కో హఠావో.. దేశ్ కో బచావో: కూనంనేని

వచ్చేనెల 14 నుంచి పాదయాత్ర




న్యూశాయంపేట: బీజేపీ కో హఠావో.. దేశ్ కో బచావో నినాదంతో వచ్చేనెల 14 నుంచి మే 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపడతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. మంగళవారం హనుమకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో అవినీతిపరులకు కొమ్ముకాస్తున్న ప్రధాని మోదీ ఏదో ఒక రోజు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. దేశంలో అత్యంత అవినీతి మతతత్వ పార్టీ బీజేపీయేనని, రాబోయే ఎన్నికల్లో సింగిల్ డిజిట్‌కే బీజేపీని పరిమితం చేస్తామని కూనంనేని అన్నారు. జూన్ 1 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర చేపట్టి జూలై మొదటి వారంలో హైదరాబాద్‌లో బహిరంగ సభ నిర్వహిస్తామని వెల్లడించారు.

మోదీ పాలనలో అందరికీ అన్యాయం: తమ్మినేని

మాడుగులపల్లి: మోదీ పాలనలో దేశంలో అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతోందని, కేంద్ర ప్రభుత్వం పేదల పొట్టకొట్టి కార్పొరేట్ శక్తులను పెంచి పోషిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ధ్వజమెత్తారు. నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండల కేంద్రంలో సీపీఎం కార్యాలయాన్ని పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డితో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో తమ్మినేని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటోందని మండిపడ్డారు. మోదీ నియంతృత్వ విధానాలతో దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తంచేశారు.. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్, సహాయ కార్యదర్శి పుల్లెంల శ్రీకర్, మల్లారెడ్డి, సర్పంచ్ కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

15,254 మెగావాట్ల గరిష్ట డిమాండ్

- విద్యుత్ పీక్ డిమాండ్‌లో రాష్ట్రం కొత్త రికార్డు
- 14,750 మెగావాట్ల పాత రికార్డును అధిగమించిన రాష్ట్రం
- 16 వేల మెగావాట్లకు పీక్ డిమాండ్ పెరిగే అవకాశం



సాక్షి, హైదరాబాద్: గరిష్ట విద్యుత్ డిమాండ్‌లో రాష్ట్రం కొత్త చరిత్ర సృష్టించింది. మంగళవారం ఉదయం 10:03 గంటలకు రాష్ట్రంలో విద్యుత్ పీక్ డిమాండ్ 15,254 మెగావాట్లుగా నమోదైంది. విద్యుత్ డిమాండ్ 15 వేల మెగావాట్లకు మించడం ఇదే తొలిసారి. ఈ నెలలోనే నమోదైన 14,750 మెగావాట్ల పీక్ డిమాండ్‌ను మంగళవారం రాష్ట్రం అధిగమించింది. గతేడాది మార్చిలో 14,160 మెగావాట్లుగా పీక్ డిమాండ్ నమోదైంది. వేసవి మొదలవడంతో వ్యవసాయ, గృహ అవసరాల విద్యుత్ వినియోగం భారీగా పెరిగిపోయింది. ఇళ్లు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, వాణిజ్య సంస్థల్లో ఏసీలు, ఇతర ఉపకరణాల వాడకం పెరిగింది. రాష్ట్రంలోని 30 లక్షల వ్యవసాయ బోరుబావుల కింద సాగు చేస్తున్న పంటలకు నీటి సరఫరా కోసం రైతులు భారీగా విద్యుత్ వినియోగిస్తున్నారు. దీనికి తోడు సాగు విస్తీర్ణం పెరగడం కూడా విద్యుత్ వినియోగాన్ని పెంచింది. పారిశ్రామిక విద్యుత్ డిమాండ్ సైతం గణనీయంగా పెరిగిపోయింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని రెండు పంప్‌హౌస్‌ల ద్వారా నీటిని ఎత్తిపోయడానికి 600 మెగావాట్ల విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. దీంతో రోజువారీ విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరిగిపోయిందని విద్యుత్ సంస్థల వర్గాలు పేర్కొంటున్నాయి. మార్చి చివరి వరకు పీక్ విద్యుత్ డిమాండ్ 16,000 మెగావాట్లకు పెరిగే అవకాశముందని అంచనా వేస్తున్నారు. ఆ మేరకు విద్యుత్ సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ట్రాన్స్‌కో తెలిపింది.

13 రోజుల్లో రూ.600 కోట్ల విద్యుత్ కొనుగోళ్లు

వేసవిలో విద్యుత్ డిమాండ్ పెరగడంతో నిరంతర విద్యుత్ సరఫరాకు వీలుగా విద్యుత్ సంస్థలు ఎక్స్చేంజీల నుంచి భారీ స్థాయిలో విద్యుత్ కొనుగోళ్లు చేస్తున్నాయి. ఈ నెలలో గత 13 రోజుల్లో రూ. 600 కోట్ల వ్యయంతో 930 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను కొనుగోలు చేశాయి. రోజుకు సగటున రూ. 45 కోట్ల వ్యయంతో 72 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను కొన్నాయి. నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు రూ. 4 వేల కోట్ల రుణాలను ప్రభుత్వ పూచికత్తుతో తీసుకోవడానికి అనుమతిస్తూ గత నెలలో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్ఈసీ, పీఎఫ్‌సీల నుంచి రూ. 3 వేల కోట్ల రుణం కోసం రాష్ట్ర విద్యుత్ సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయి. త్వరలో ఈ మేరకు రుణం విడుదల కానుంది.

విజయరామారావుకు సీఎం కేసీఆర్ నివాళి



విజయరామారావు పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న కేసీఆర్. చిత్రంలో దానం, మధుసూదనాచారి, కడియం తదితరులు

బంజారాహిల్స్(హైదరాబాద్): దివంగత మాజీ మంత్రి, మాజీ సీబీఐ డైరెక్టర్ కె.విజయరామారావుకు మంగళవారం సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఘనంగా నివాళులర్పించారు. విజయరామారావు నివాసానికి చేరుకుని, ఆయన పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించారు. కుమారుడు, కూతురు, అల్లుడు, ఇతర కుటుంబ సభ్యులను కేసీఆర్ పరామర్శించారు. విజయరామారావు భౌతిక కాయానికి నివాళులర్పించిన వారిలో మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, హరీశ్‌రావు, మల్లారెడ్డి, మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, మాగంటి గోపీనాథ్, జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ డీజీపీలు మహేందర్‌రెడ్డి, హెచ్‌జే దొర, మాజీ మంత్రులు సమరసింహారెడ్డి, మైసూరారెడ్డి, మేయర్ విజయలక్ష్మి, డీజీపీ అంజనీ కుమార్, సీపీ సి.వి. ఆనంద్ తదితరులు ఉన్నారు.అంత్యక్రియలు బుధవారం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అధికారిక లాంఛనాలతో జరగనున్నాయి.

ఇంటి పంటలను పెద్దఎత్తున ప్రోత్సహించాలి

'మేనేజ్'లో రెండ్రోజుల అంతర్జాతీయ సదస్సులో వక్తలు



జ్యోతి వెలిగించి సదస్సు ప్రారంభిస్తున్న నీరజా ప్రభాకర్. చిత్రంలో పి.చంద్రశేఖర తదితరులు

సాక్షి సాగుబడి, హైదరాబాద్: పట్టణీకరణ విస్తృతం అవుతున్న కొద్దీ అర్బన్ అగ్రికల్చర్ ప్రాధాన్యం ప్రపంచ వ్యాప్తంగా ద్విగుణీకృతం అవుతోందని, మన దేశంలో కూడా సేంద్రియ ఇంటిపంటలు/మిద్దె తోటల సాగును పెద్దఎత్తున ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందని పలువురు వక్తలు అన్నారు. రాజేంద్రనగర్‌లోని జాతీయ వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ (మేనేజ్)లో 'అర్బన్–పెరి–అర్బన్ అగ్రికల్చర్‌లో మంచి పద్ధతులు–ఆవిష్కరణలు' అనే అంశంపై రెండ్రోజుల అంతర్జాతీయ సదస్సు మంగళవారం ప్రారంభమైంది. హైబ్రిడ్ మోడ్‌లో జరుగుతున్న ఈ సదస్సులో 24 దేశాలకు చెందిన 600 మంది పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా మేనేజ్ డైరెక్టర్ జనరల్ పి.చంద్రశేఖర మాట్లాడుతూ గ్రామీణ పొలాల్లో జరిగే వ్యవసాయానికి అర్బన్ అగ్రికల్చర్ పోటీ కాదన్నారు. గ్రామాల నుంచి నగరాలకు వలస పెరుగుతున్న కారణంగా ముమ్ముందు పట్టణ ప్రాంతాల్లో, నగరాల పరిసర ప్రాంతాల్లో ఆహారం పండించుకోవాల్సిన అవసరాలు పెరుగుతున్నాయని తెలిపారు. ఇందుకోసం వినూత్న విస్తరణ వ్యూహాలను అనుసరించాల్సి వుందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీ కొండాలక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ బి.నీరజా ప్రభాకర్ మాట్లాడుతూ అధిక పోషకాలతో కూడిన సేంద్రియ కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల సాగుకు మిద్దె తోటలు ఎంతో అనుకూలమని చెప్పారు. కార్బన్ ఉద్గారాలను తగ్గించటంలో, పోషకాహార భద్రతను కల్పించటంలో, పట్టణ పేదల జీవనోపాధిని మెరుగుపరచడంలో ఇంటిపంటలు ప్రయోజనకరంగా వుంటాయని ఆమె నొక్కిచెప్పారు. వరల్డ్ రిసోర్స్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి రుచిక సింగ్ మాట్లాడుతూ జాతీయ, రాష్ట్ర స్థాయిలో అర్బన్ అగ్రికల్చర్‌పై సమగ్ర విధాన నిర్ణయాలు తీసుకుని అమలు చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజ్ డిప్యూటీ డైరెక్టర్ (జెండర్ స్టడీస్) డాక్టర్ వినీతాకుమారి తదితరులు ప్రసంగించారు.

ముగ్గురు లైన్‌మన్‌లకు సీఈఏ పురస్కారాలు

సాక్షి, హైదరాబాద్: లైన్‌మన్ దినోత్సవం సందర్భంగా దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీఎస్ఎస్పీడీసీఎల్)కు చెందిన ముగ్గురు లైన్‌మన్‌లకు సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) ఉత్తమ సేవా పురస్కారాలను ప్రదానం చేసింది. న్యూఢిల్లీలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో సిద్దిపేట, హబ్సిగూడ, సరూర్‌నగర్ సర్కిళ్ల లైన్‌మన్లు కె.ఈశ్వర్ రెడ్డి, డి.మల్లారెడ్డి, కొండూరు యాదయ్యకు పతకం, ప్రశంస పత్రాన్ని అందజేసింది. పురస్కారాలు అందుకున్న లైన్‌మన్‌లు మంగళవారం టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డి, డైరెక్టర్ జె.శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు.



హైదరాబాద్‌లో అమెరికన్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, పబ్లిక్ ఎఫైర్స్ ఆఫీసర్ డేవిడ్ మోయెర్ మంగళవారం సాక్షి కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సాక్షి గ్రూప్ ఎడిటర్ వర్ధెల్లి మురళితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు.

తెలంగాణ గవర్నర్‌పై పిటిషన్‌ను విచారిస్తాం

ఈనెల 20న చేపడతామని సీజేఐ స్పష్టీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ గవర్నర్‌పై రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను విచారిస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది. కొంత కాలంగా పది బిల్లుల ఆమోదానికి సంబంధించి ఎలాంటి నిర్ణయం వెలువరించకుండా గవర్నర్ తన వద్దే ఉంచుకున్నారంటూ తెలంగాణ ప్రభుత్వం ఇటీవల సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే మంగళవారం సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం ముందు ప్రస్తావించారు. గవర్నర్ వల్ల పలు బిల్లులు నిలిచిపోయాయని దవే పేర్కొన్నారు. అనంతరం ఈ పిటిషన్‌ను ఈనెల 20న జాబితాలో చేర్చాలని రిజిస్ట్రీని సీజేఐ ఆదేశించారు.

'కృష్ణా జలాల'పై సుప్రీంలో విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: కృష్ణా జలాల పంపకానికి సంబంధించి ట్రిబ్యునల్ ఇచ్చిన అవార్డుపై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఏపీ, కర్ణాటక దాఖలుచేసిన పిటిషన్లు మంగళవారం జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం ముందుకొచ్చాయి. స్పెషల్ బెంచ్ ముందు ఈ పిటిషన్లు విచారణకు రావాల్సి ఉండగా ఆ బెంచ్ కూర్చోని కారణంగా కేసును ఈ బెంచ్ వద్ద ప్రస్తావిస్తున్నట్లు న్యాయవాదులు తెలిపారు. గతంలో ఈ పిటిషన్‌ను జస్టిస్ వి.రామసుబ్రమణియన్‌తో కూడిన ధర్మాసనం విచారించిందని... నేడు ఆ ధర్మాసనం కూర్చొలేదని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. సీజేఐతో చర్చించి తదుపరి విచారణ తేదీని నిర్ణయిస్తామని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు.

'బ్రిటీష్ రెసిడెన్సీ' పరిస్థితి ఏంటి?: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: కోఠిలోని బ్రిటీష్ రెసిడెన్సీ కాంప్లెక్స్(కోఠి ఉమెన్స్ కాలేజీ) భవనం ప్రస్తుత పరిస్థితిపై ఫొటోలతో కూడిన స్టేటస్ రిపోర్టును తమకు అందజేయాలని హైకోర్టు పురావస్తు శాఖ అధికారులను ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను జూన్ 8వ తేదీకి వాయిదా వేసింది. సర్వే ఆఫ్ ఇండియా, పురావస్తు శాఖలకు కూడా నోటీసులు జారీ చేసింది. శిథిలావస్థకు చేరుకున్న బ్రిటీష్ రెసిడెన్సీ భవనం పునరుద్ధరణ, మరమ్మతు చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన ఆర్కిటెక్ట్ టి.వసంత శోభ రాసిన లేఖను హైకోర్టు టేకెన్ అప్ పిల్‌గా విచారణకు స్వీకరించింది.

అదానీ వ్యవహారంపై బీఆర్ఎస్ ఆందోళన



పార్లమెంట్‌లోని గాంధీ విగ్రహం ముందు ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: అదానీ సంస్థలపై హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదికపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)తో విచారణ జరిపించాలంటూ బీఆర్ఎస్ ఆందోళన కొనసాగించింది. నివేదికపై దర్యాప్తు చేపట్టాలనే డిమాండ్‌తో ఉభయసభలను స్తంభింపజేసింది. మంగళవారం ఉదయం ఉభయసభల ప్రారంభానికి ముందే బీఆర్ఎస్ ఉభయసభా పక్షనేతలు కె.కేశవరావు, నామా నాగేశ్వరరావుల నేతృత్వంలో ఎంపీలు పార్లమెంట్‌లోని గాంధీవిగ్రహం ముందు నిరసనకు దిగారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఇదే అంశంపై ఉభయసభల్లోనూ వాయిదా తీర్మానాలిచ్చారు. దీనిపై చర్చించాలంటూ విపక్ష ఎంపీలతో కలిసి సభను స్తంభింపజేశారు. లోక్‌సభలో నామా నాగేశ్వరరావు నేతృత్వంలో పార్టీ ఎంపీలు విపక్షాలతో కలసి స్పీకర్ పోడియం ముందుకు దూసుకెళ్లి నినాదాలు చేస్తూ, నిరసన వ్యక్తం చేశారు. దీంతో సభ మధ్యాహ్నం 2 గంటల అనంతరం మరోసారి బుధవారానికి వాయిదా పడింది. రాజ్యసభలో నూ విపక్ష ఎంపీలతో సహా బీఆర్ఎస్ ఎంపీల ఆందోళనతో సభ బుధవారానికి వాయిదా పడింది.

అంతర్జాతీయ ప్రదర్శనలో తాండూరు కందిపప్పు

ఆహార ఉత్పత్తుల ప్రదర్శనలో స్టాల్ ఏర్పాటు



తాండూరు: ఢిల్లీలో మంగళవారం నుంచి 18వ తేదీ వరకు కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న అంతర్జాతీయ ఆహార ఉత్పత్తుల ప్రదర్శనకు వికారాబాద్ జిల్లా తాండూరు కందిపప్పు ఎంపికైంది. ఈ మేరకు ఆహ్వానం అందడంతో తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఇద్దరు రైతులను ఎంపిక చేసి ఢిల్లీకి పంపించారు. యాలాల మండల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, షేర్ ఎన్‌జీవో వ్యవస్థాపకుడు మరాఠి నర్సింహులు ప్రదర్శనలో స్టాల్ ఏర్పాటు చేశారు. ఆర్గానిక్ కందిపప్పుతో పాటు భౌగోళిక గుర్తింపు పొందిన ధ్రువపత్రాన్ని కూడా స్టాల్‌లో ప్రదర్శించారు. అంతర్జాతీయ స్థాయిలో 2వేల మంది ప్రతినిధులు పాల్గొన్న ప్రదర్శనలో తాండూరు కందిపప్పు ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి, శాస్త్రవేత్త సుధాకర్ ఆనందం వ్యక్తం చేశారు.

ముక్కలు చేసి.. చెత్తడంప్‌లో కాల్చి..

జగిత్యాల జిల్లాలో వ్యక్తి దారుణ హత్య

జగిత్యాల క్రైం: ఒక వ్యక్తిని హత్య చేసి.. ముక్కలు చేసి.. చెత్త డంప్‌లో కాల్చివేసిన ఘటన జగిత్యాల జిల్లాలో వెలుగు చూసింది. మల్యాల మండలం ముత్యంపేట శివారు దిగువ కొండగట్టు ప్రాంతంలోని చెత్తడంప్‌లో మంగళవారం ఓ వ్యక్తి శరీరభాగాలు లభ్యమయ్యాయి. ఇది కరీంనగర్ – జగిత్యాల హైవేకి కేవలం వంద మీటర్ల దూరంలో ఉంది. సుమారు రెండ్రోజుల క్రితం కొందరు వ్యక్తులు ఓ వ్యక్తిని హత్యచేసి ఇక్కడకు తీసుకొచ్చి నిప్పంటించారని పోలీసులు భావిస్తున్నారు. శరీర భాగాలు పూర్తిగా కాలకపోవడంతో వాటిని కుక్కలు ఈడ్చుకెళ్లి పీక్కుతిన్నాయి. మంగళవారం ఉదయం అటు వెళ్లిన రైతులకు మనిషి శరీర భాగాలు కనిపించడంతో.. వెంటనే మల్యాల పోలీసులకు సమాచారం అందించాడు. సీఐ రమణమూర్తి, ఎస్ఐ వెంకట్రావ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం వైద్యాధికారులను అక్కడికే రప్పించి.. శరీర భాగాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించారు. ఘటనా స్థలంలోనే హత్యచేసి పక్కనే ఉన్న చెత్తడంప్‌లో వేసి శరీర భాగాలను కాల్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. శరీరం పూర్తిగా కాలకపోవడంతో కుక్కలు ఈడ్చుకెళ్లి పీక్కుతిన్నాయా, లేక హంతకులే మృతదేహాన్ని ముక్కలుగా నరికి కాల్చివేశారా? అనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు.

తోరణాలైనా వాడకముందే కడతేర్చాడు

- అనుమానంతో భార్య, అత్తను హత్య చేసిన యువకుడు
- అడ్డుకోబోయిన మామపై దాడి.. కర్నూలులో ఘటన



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లు. (ఇన్‌సెట్) రుక్మిణి (ఫైల్)

వనపర్తి: పెళ్లిచేసుకున్న రెండు వారాలకే అనుమానంతో భార్యను, అత్తను కడతేర్చాడు ఓ యువకుడు. వనపర్తి జిల్లాకేంద్రంలో సంచలనం రేకెత్తించిన ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. వనపర్తి జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో నివాసం ఉండే వెంకటేశ్వర్లు, రమాదేవి అలియాస్ జ్యోతి(45)ల కుమార్తె రుక్మిణి(21), ఏపీలోని కర్నూలుకు చెందిన శ్రావణ్ వివాహం ఈ నెల 1వ తేదీన వనపర్తిలో జరిగింది. పెళ్లి అయిన 13 రోజుల వ్యవధిలోనే భార్యభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. ఈ క్రమంలో భార్యను కాపురానికి తీసుకెళ్లడానికి శ్రావణ్ వనపర్తికి వచ్చాడు. రుక్మిణితోపాటు అత్త రమాదేవి, మామ వెంకటేశ్వర్లును కూడా మంగళవారం కర్నూలు నగరంలోని చింతలమునినగర్‌లో ఉన్న తమ ఇంటికి తీసుకువెళ్లాడు. అక్కడికి వెళ్లిన కొద్దిసేపటికే తల్లీకూతుళ్లపై కూరగాయలు కోసే కత్తితో శ్రావణ్ దాడికి తెగబడ్డాడు. తీవ్రంగా గాయపడిన జ్యోతి, రుక్మిణి అక్కడికక్కడే మృతిచెందగా, అడ్డుకోబోయిన వెంకటేశ్వర్లుకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో స్థానికులు స్పందించి వెంకటేశ్వర్లును ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పెళ్లి చేసుకున్న రెండు వారాలకే భార్యపై అనుమానంతో ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది.

ప్రేమపేరుతో బాలికపై లైంగికదాడి

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రేమ పేరుతో మైనర్ బాలికను (16) మోసం చేసి పలుమార్లు అత్యాచారం చేసిన కేసులో పెండ్లి ప్రశాంత్ అనే యువకుడిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వివరాలిలా.. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన పెండ్లి ప్రశాంత్(22) అదే గ్రామానికి చెందిన ఓ బాలికను ప్రేమిస్తున్నానని ఏడాదిగా నమ్మించాడు. బాలిక మొబైల్ నంబర్ తీసుకుని తరచూ మెస్సేజీలు చేస్తూ ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి బాలికపై పలుమార్లు అత్యాచారం చేశాడు. ఈ విషయం ఎవరితోనైనా చెబితే కలిసి ఇద్దరం కలిసి దిగిన ఫొటోలు, వీడియోలు అందరికీ పంపిస్తానని బెదిరించాడు. అయితే విషయం తెలుసుకున్న బాధిత బాలిక తల్లి ఈనెల 12న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు గతంలో ఓ బాలికను కిడ్నాప్ చేసిన కేసులో అరెస్టయినట్లు పోలీసులు తెలిపారు.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.